
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 31
బుధవారం 23-4-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



సెలబ్రిటీ రైటర్స్
మూవీ సెలబ్రిటీలు రాసిన పుస్తకాల్లో విలువైన విషయాలెన్నో. - 15లో


ఢిల్లీ మళ్లీ...
లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘనవిజయం. రాణించిన రాహుల్, ముకేశ్ - 17లో


విశ్వసనీయ మిత్రదేశం
భారత్–సౌదీ అరేబియా మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి తన పర్యటన దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. - 6లో


వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్
ఇండియా–అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో తుది ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధమైందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రకటించారు. - 6లో


శనివారం పోప్ అంత్యక్రియలు
సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో మూడు రోజులపాటు ప్రజల సందర్శనలు, నివాళుల తర్వాత శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలను నిర్వహించనున్నారు. - 6లో


'స్థానిక' ఎమ్మెల్సీకి నేడే పోలింగ్
హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. - 14లో

నెత్తురోడిన కశ్మీరం

పర్యాటకులపై ఉగ్ర దాడి.. కాల్పులకు 26 మంది బలి

20 మందికి పైగా గాయాలు.. మృతుల్లో ఇద్దరు విదేశీయులు



- రక్తసిక్తమైన 'మినీ స్విట్జర్లాండ్'..
- పహల్గాం సమీపంలో ఘటన
- మా పనే: లష్కరే ముసుగు సంస్థ టీఆర్‌ఎఫ్
- ముష్కరులను వదలబోం: మోదీ
- సౌదీ నుంచి అర్ధాంతరంగా వెనక్కి
- హుటాహుటిన కశ్మీర్‌కు అమిత్ షా..
- వాన్స్ పర్యటిస్తుండగానే ఘటన
- తీవ్రంగా ఖండించిన ట్రంప్, పుతిన్..

పహల్గాం/శ్రీనగర్/న్యూఢిల్లీ: అందాల కశ్మీరం ఎరుపెక్కింది. ఉగ్ర ఉన్మాదం మరోసారి ఒళ్లువిరుచుకుంది. పర్యాటకులపై తూటాల వర్షం కురిసింది. వారిపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ దారుణానికి 26 మంది పర్యాటకులు బలయ్యారు. 20 మందికి పైగా మిగతా 6వ పేజీలో ▶


కాల్పుల్లో చనిపోయిన హైదరాబాద్ వాసి మనీశ్

నిస్సహాయులను చుట్టుముట్టి.. కాల్చేశారు! 6లో

పెళ్లయిన 6 రోజులకే నూరేళ్లు నిండాయి

కాల్పుల్లో భర్తను కోల్పోయిన నవవధువు

పహల్గాం: పెళ్లయి కాళ్లకు పారాణి ఆరకముందే ఆ నవవధువు జీవితం తలకిందులైంది. భర్తను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడంతో ఆ నవవధువు తన భర్త మృతదేహాన్ని పట్టుకుని దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చింది. ఈ యువజంట ఏ రాష్ట్రానికి చెందిన వాళ్లు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ''మాకు పెళ్లయి కేవలం ఆరు రోజులే అవుతోంది. ఘటన జరిగినప్పుడు మేమిద్దరం పానీపూరీని ఆస్వాదిస్తున్నాం. హఠాత్తుగా ఒక ఉగ్రవాది మా వద్దకు వచ్చాడు. వెంటనే మా ఆయన తలకు తుపాకీ గురిపెట్టి కాల్చి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న నా భర్తను ఎవరైనా కాపాడండి''అంటూ ఆ మహిళ ఏడుస్తున్న హృదయ విదారక వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.



- బీఆర్‌ఎస్ సహా ప్రాంతీయ పార్టీలు మరింత బలంగా ఎదుగుతాయి
- మాకు ఎదురైంది తాత్కాలిక ఎదురుదెబ్బ మాత్రమే.. తిరిగి ప్రజాదరణ పొందుతాం
- కేసీఆర్ తిరిగి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు..
- తెలంగాణలో బీజేపీ, టీడీపీ, పవన్ కల్యాణ్ కలిసి వచ్చినా బీఆర్‌ఎస్‌దే గెలుపు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దెబ్బతిన్నా తిరిగి లేస్తాం

- రాబోయే రోజుల్లో కేంద్రంలో సొంతంగా ఏ జాతీయ పార్టీ అధికారంలోకి రాదు
- కేంద్రంలో బీజేపీ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోంది..
- కులాలు, మతాల ప్రాతిపదికగా పుట్టే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవు
- మరో 50 ఏళ్ల పాటు పార్టీ నిలిచేలా చేసే అద్భుతమైన నాయకత్వం మా సొంతం
- పదేళ్లలో కేసీఆర్ సమగ్ర, సమతుల్య, సమీకృత అభివృద్ధి నమూనాను ఆవిష్కరించారు
- మేం బ్యాగులు, చెప్పులు మోసే వాళ్లం కాదు.. రేవంత్ వర్క్ ఫ్రమ్ హోమ్ సీఎం..

8లో

"శూన్యం నుంచి సునామీని సృష్టించి లక్ష్యాన్ని చేరుకున్న అసాధారణ నేత కేసీఆర్. ఆయన మార్గదర్శకత్వంలో పని చేయడం పూర్వజన్మ సుకృతం. బీఆర్‌ఎస్ మాత్రమే రాజీ పడకుండా కొట్లాడి తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుంది కాబట్టి పార్టీ తిరిగి అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో బలంగా ఉంది..

ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..

ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణతలో బాలురపై పైచేయి

- ఫస్టియర్ బాలురు 57.83%.. బాలికలు 73.83%..
- సెకండియర్ బాలురు 57.31%.. బాలికలు 74.21% ఉత్తీర్ణత
- మొత్తంగా రెండేళ్లూ కలిపి 65.81 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఫలితాలు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలురు 57.83 శాతం పాసయితే, బాలికలు ఏకంగా 73.83 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 57.31 ఉంటే, బాలికల ఉత్తీర్ణత శాతం దాదాపుగా ఫస్టియర్ మాదిరే 74.21 శాతం నమోదైంది. మొత్తంగా (రెండేళ్ళు కలిపి) ఈ ఏడాది ఇంటర్ ఉత్తీర్ణత 65.81గా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు 5%ఎక్కువ.


ఫలితాలను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు

ఆసిఫాబాద్‌లో అత్యధిక శాతం ఉత్తీర్ణత
మార్చి 5 నుంచి 25వ తేదీల మధ్య ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ఫలితాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా 7వ పేజీలో ▶

- టాప్-5లో ముగ్గురు అమ్మాయిలే
- హర్షితా గోయల్‌కు రెండో ర్యాంక్, షా మార్గీకి నాలుగో ర్యాంక్
- టాప్-25లో ఇద్దరు మనోళ్లే
- తెలుగు రాష్ట్రాల్లో టాపర్‌గా సాయిశివాని.. 11వ ర్యాంకు
- బన్న వెంకటేశ్‌కు 15వ ర్యాంకు
- సివిల్స్-2024 ఫలితాల విడుదల


శక్తి దూబే (1) హర్షిత (2) అర్చిత్ (3)

సివిల్స్ టాపర్ శక్తి

న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2024 ఫలితాల్లో అమ్మాయిలు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతోపాటు తొలి ఐదు ర్యాంకుల్లో ఏకంగా మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబే ఫస్ట్ ర్యాంకు సాధించగా హర్షితా గోయల్ రెండో ర్యాంకు, షా మార్గీ చిరాగ్ నాలుగో ర్యాంకు సాధించారు. అబ్బాయిల్లో డోంగ్రే అర్చిత్ పరాగ్ మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్ ఐదో ర్యాంకు సాధించారు. తొలి 25 ర్యాంకుల్లోనూ 11 ర్యాంకులను అతివలు సాధించి తమ సత్తా చాటారు. అలాగే టాప్–25లో ఇద్దరు తెలుగువాళ్లు ర్యాంకులు సాధించారు. తొలి 1,009 ర్యాంకుల్లో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. పరీక్షల్లో విజయం మిగతా 7వ పేజీలో ▶


శివానీ (11)


వెంకటేశ్ (15)

కొనుడే 'బంగార'మాయే!

10 గ్రాముల బంగారం రూ.లక్ష దాటడంతో ప్రజల బెంబేలు

- రాష్ట్రవ్యాప్తంగా 50 శాతానికి పైగా తగ్గిన కొనుగోళ్లు..
- పెట్టుబడి కోసం నాణేలు, బిస్కెట్లు కొంటున్న జనం
- దుకాణాలు వెలవెల.. వ్యాపారుల్లో ఆందోళన

5లో



పసిడి.. లక్ష కాంతులు ఈసారి 'లక్ష'య తృతీయ! 16లో

ఎంపీసీలో టాప్ 996

- అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు
- బైపీసీలో కరీంనగర్ అమ్మాయికి వేయికి 997 మార్కులు
- మొదటి సంవత్సరం ఎంపీసీలో ముగ్గురికి 469 మార్కులు

7లో

సివిల్స్‌లో 'ఆమె' టాప్

- 2024 సంవత్సరానికి సివిల్స్‌లో 1,009 మంది నియామకాలు పొందారు. వీరిలో 725 మంది పురుషులైతే.. 284 మంది స్త్రీలు. విశేషమేమిటంటే టాప్–10 ర్యాంకుల్లో ఐదుగురు మహిళలే. అందులోనూ మొదటి ర్యాంకర్ మహిళే. ఇది అన్ని విధాలా స్త్రీలకు స్ఫూర్తినిచ్చే అంశం. వీరిలో టాప్–10లో నిలిచిన మహిళా ర్యాంకర్ల వివరాలు.. - 15లో

ఇదండీ సంగతి


హారన్ కొడుతుంటే భారతీయ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నాడ్సార్!



సమష్టితత్వంతో ఏదైనా సాధ్యం..

- హిరోషిమా నగరం మాదిరే పోరాట చిహ్నం తెలంగాణ: సీఎం రేవంత్
- అక్కడి పీస్ మెమోరియల్ పార్క్ వద్ద నివాళి
- ముగిసిన సీఎం బృందం జపాన్ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు..

14లో

సిట్ రిమాండ్ నివేదిక సాక్షిగా బాబు భేతాళ కుట్ర బట్టబయలు

- టీడీపీ దుష్ప్రచారమే నివేదికగా సిట్ కనికట్టు
- అబద్ధపు వాంగ్మూలాలు, అభూత కల్పనలతోనే కుట్ర
- దోపిడీ జరిగినట్టు రాజ్ కేసిరెడ్డి వాంగ్మూలం ఇచ్చారన్న సిట్
- కానీ వాంగ్మూలంపై కేసిరెడ్డి సంతకం చేయటానికి నిరాకరించారని సిట్ నివేదిక
- అంటే ఆయన పేరిట అబద్ధపు వాంగ్మూలం నమోదు చేసినట్లు వెల్లడి
- బాబు హయాంలోనే డిస్టిలరీల నుంచి మద్యం కొనుగోళ్లలో అక్రమాలు
- నాలుగు డిస్టిలరీల నుంచి 53.21 శాతం కొనుగోళ్లని వెల్లడించిన సిట్
- కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో కుంభకోణం జరిగినట్లు అభియోగం
- నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు వసూలు చేసి ఇచ్చారని ఒకచోట.. వాటిని వివిధ రకాలుగా పెట్టుబడి పెట్టారని మరోచోట పరస్పర విరుద్ధంగా ఆరోపణలు
- టీడీపీ అసత్య ఆరోపణలనే నివేదికగా సమర్పించిన సిట్
- రిమాండ్ నివేదిక సాక్షిగా వెల్లడైన కుట్ర.. అంతా కారుకూతలు, కాకి లెక్కలే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మద్యం విధానంపై పెట్టింది అక్రమ కేసేనన్నది సుస్పష్టం

8లో



ALPHORES 35 YEARS EMPOWERMENT
The Pride of TELANGANA
ALPHORES JUNIOR COLLEGES
An ISO 9001 : 2008 & 2015 Certified Institution
PROVES THE LEAD AGAIN WITH THE STATE BEST MARKS IN IPE 1st & 2nd YEAR RESULTS-2025
Superb Greetings! Best Scorers
988 V. RISHITHA MEC-2533200111 MNCL C. Code 33214
987 B.GREESHMA CEC-2535202204 KNR C. Code 35239
997 J. ANJANA BiPC-2535210413 KNR C. Code 35259
996 K.RUTWIK MPC-2535200737 KNR C. Code 35231
988 V. AKSHAY VARDHAN MEC-2535201906 KNR C. Code 35230
MPC 995 M. RUTHWIKA
MPC 995 A. LAXMI PRASANNA
MPC 995 P. SRINITHYA REDDY
BiPC 995 S. KAVAL PREETH KOUR
MPC 994 V. PRASEEDHA
MPC 994 K.VARSHINI
MPC 994 M. KEERTHI
MPC 994 G. LAXMI PRASANNA
MPC 994 S. SEVITHA
MPC 994 S. KEERTHANA
MPC 994 T. KEERTHANA
MPC 994 V. HRUSHIKESH
MPC 994 M. AKSHITHA
MPC 994 S. KARTHIKEYA
MPC 994 V. SAHITHI
BiPC 994 SUMAYA KHANAM
MPC 993 JADHAV NAVYA SRI
MPC 993 P. VARNITH
MPC 993 E. PRASANNA
MPC 993 G. SRINIDHI
MPC 993 S. SRIVARSHINI
MPC 993 T. AKSHARA
MPC 993 T. SHARON RODHA
MPC 993 P. SAI SREE
MPC 993 G. VARSHINI
MPC 993 D. PRAGNA SRI
MPC 993 S. SRINIDHI REDDY
MPC 993 C. RUCHITHA REDDY
MPC 993 C. SANNITH
MPC 993 ABDUL ZEESHAN
MPC 993 V. AKSHAY
BiPC 993 M. SRI VIDHYA
BiPC 993 K. AKSHAYA
BiPC 993 S. SATHWIKA
ALPHORESIANS for SENSATION
STAFF for DEDICATION
PARENTS for COOPERATION
MPC 468 S. LAXMI PRIYA
MPC 468 N. KRUSHNA VENI
MPC 468 L. HASINI
MPC 468 S. LAHARI
MPC 468 G. TARUN
MPC 468 M. SWETHA
MPC 468 HAFSAH HASNAIN
MPC 468 THAHURA NOOR
MPC 468 A. SHASHIVARDHAN
MPC 468 A. NICHITHA
MPC 468 K. ANUPAMA
BiPC 438 A. SATYA BRAHMANI
MPC 468 T. ANWITA REDDY
MPC 468 D. NAGA SAGAR
BiPC 438 NABEELA TAHREEM
MPC 468 P. KEERTHI SREE
MPC 468 K. PALLAVI
BiPC 438 ZOHA MAHAVISH
MPC 468 J. PRASOONA SRI
MPC 468 J. PRANAV TEJA
BiPC 438 SAMA FIRDOUS
MPC 468 CH. AMITAVRAJ
MPC 468 G. SURYAPRAKASH
CEC 493 P. BHAVAGNYA
MEC 491 R. CHIDVILASA
MPC 468 G. HYANDAVI
The Eminent Academician Dr.V.NARENDER REDDY garu, Chairman, heartily congratulating the IPE 1st Year SUPERB SCORERS
Hearty Congratulations
HYDERABAD: SUCHITRA ALWAL 91608 61444 | GHATKESAR 91601 28444 | KARMANGHAT 92468 34441
NEW NALLAKUNTA 91608 67444 | HASTINAPURAM 91339 73444
KARIMNAGAR 91335 88857, 91602 94441 | JAGTIAL 92470 66444 | HANAMKONDA 91333 12830
MANCHERIAL 9160264443 | NIRMAL 91602 94446 | ARMOOR 91604 63444 | NIZAMABAD 91604 15444
Fabulous Record !
ALPHORESIANS
127 with >= 990 in II Year
25 with >= 436 in I Year BiPC
77 with >= 467 in I Year MPC

అద్దె బస్సులూ సై అంటేనే సమ్మె సక్సెస్

ప్రస్తుతం ఆర్టీసీలో 3,200 అద్దె బస్సులు

- ఈ బస్సుల డ్రైవర్లంతా ప్రైవేటువారే
- ఔట్‌సోర్సింగ్ విధానంలో మరో 1,500 మంది డ్రైవర్లు
- వీరంతా సమ్మెలో పాల్గొనకుంటే ప్రభావం అంతంతే
- దీంతో వారినీ కలుపుకొనే దిశగా కార్మిక సంఘాల కసరత్తు



సాక్షి, హైదరాబాద్: టీజీఆర్టీసీలో సమ్మె అనివార్యమైతే అద్దె బస్సులు, గ్రాస్‌కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లను కూడా సమ్మెలో భాగం చేసేలా కార్మిక సంఘాలు కసరత్తు ప్రారంభించాయి. వచ్చేనెల 7వ తేదీ నుంచి సమ్మె ఉంటుందని ఆర్టీసీలోని ఒక జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఆర్టీసీలో ప్రస్తుతం అద్దె బస్సుల సంఖ్య పెరిగింది. ఆర్టీసీ డ్రైవర్లు సమ్మెలో పాల్గొని బస్సులను బయటకు తీయకున్నా, అద్దె బస్సులు రోడ్డెక్కితే ప్రయాణికులకు కొంతవరకు రవాణా కష్టాలు దూరమవుతాయి. దీంతో సమ్మె ప్రభావం పూర్తిస్థాయిలో ఉండదన్నది కార్మికసంఘాల ఆందోళన. ప్రస్తుతం ఆర్టీసీలో 9,400 బస్సులున్నాయి. వీటిల్లో ఆర్టీసీ సొంత బస్సులు 6,200 మాత్రమే. మిగతావాటిలో 2,800 అద్దె బస్సులు, 400 ఎలక్ట్రిక్ బస్సులున్నాయి. వీటికి డ్రైవర్లుగా ఆర్టీసీ సొంత ఉద్యోగులు ఉండరు. ఆ బస్సుల యజమానులే డ్రైవర్లను ఏర్పాటు చేసుకుంటారు. సమ్మె ప్రారంభమైతే అద్దె బస్సుల యజమానులు తమ డ్రైవర్లతో 3,200 బస్సులను నడుపుతారు.

34 శాతం అద్దె బస్సులే

2019లో 53 రోజుల పాటు సమ్మె జరిగిన సమయంలో ఆర్టీసీలో 11 వేల వరకు బస్సులుంటే, అద్దె బస్సులు 1,800 మాత్రమే ఉన్నాయి. సమ్మె ముగిసిన వెంటనే 2 వేల బస్సులు తొలగించాలని నాటి సీఎం కేసీఆర్ ఆదేశించటంతో అంతమేర బస్సులను ఆర్టీసీ ఉపసంహరించింది. ఆ తర్వాత కూడా సొంత బస్సుల సంఖ్య భారీగా తగ్గుతూ వచ్చింది. వాటి స్థానంలో అద్దె బస్సుల సంఖ్యను సంస్థ పెంచింది. ఫలితంగా ఇప్పుడు అద్దె బస్సులు 34 శాతానికి చేరాయి. ప్రస్తుతం ఆర్టీసీలో 2 వేల వరకు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో 1,500 మంది ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లతో బస్సులు నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే కొంతమంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. సమ్మె నాటికి మిగతా ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు కూడా విధుల్లోకి వస్తారు. వీరు కూడా సమ్మె సమయంలో బస్సులను తిప్పేందుకు అందుబాటులో ఉంటారు. వెరసి సగం బస్సులు రోడ్డెక్కటం ఖాయంగా ఉంది. ఈ పరిస్థితి సమ్మెకు అడ్డంకిగా మారుతుందని సంఘాలు భావిస్తున్నాయి. అద్దె బస్సుల నిర్వాహకులతో చర్చించి వారు కూడా సమ్మెకు మద్దతిచ్చేలా చూడాలని కొన్ని సంఘాలు ప్రతిపాదిస్తున్నాయి. డ్రైవర్, కండక్టర్లతో పాటు సూపర్‌వైజర్ల సంఘం కూడా సమ్మెకు మద్దతిచ్చేలా చూడాలని పేర్కొంటున్నాయి.

రెండు జేఏసీల మధ్య కొనసాగుతున్న విభేదాలు

ఆర్టీసీలో ఒక జేఏసీ ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చింది. మరో జేఏసీ దీనికి దూరంగా ఉంది. మొదటి జేఏసీ మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి రెండో జేఏసీని, జేఏసీల్లో భాగం కాని ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) నేతలను ఆహ్వానించింది. అయితే, ఆహ్వానించిన తీరు సరిగా లేదని రెండో జేఏసీ సమావేశంలో పాల్గొనలేదు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు సమావేశంలో పాల్గొన్నా.. మొదటి జేఏసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌డబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి హాజరైనా, రెండో జేఏసీ సహా ఎస్‌డబ్ల్యూఎఫ్‌లు సమ్మెకు సిద్ధమైతేనే తాము సమ్మెకు మద్దతిస్తామని ప్రకటించారు. మరోవైపు ఐక్య కార్యాచరణను సాధించేందుకు రెండో జేఏసీ ఈ నెల 28న సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది.

ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద ఈ శిక్షణ ఇవ్వనున్నారు. మూడున్నర నెలల కాల వ్యవధి కల్గిన అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియెట్, ఆటోమొబైల్ టూ వీలర్ కోర్సుకు పదోతరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని అన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని, శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మే 5న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'మత్తు'కు యువకుడి బలి

- టాపెంటడాల్ మాత్రలు వాడటంతో తీవ్ర అస్వస్థత
- ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 19న మృతి
- బాలాపూర్‌లో ఘటన.. మాత్రలు విక్రయించిన ఇద్దరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: మత్తు కోసం తీసుకున్న నిషేధిత డ్రగ్స్ (టాపెంటడాల్ హైడ్రోక్లోరైడ్ ట్యాబ్లెట్లు) ఓవర్‌డోస్ కావడంతో 17 ఏళ్ల యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్‌లో జరిగింది. ఈ ఘటనపై యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న రాత్రి షాహీన్‌నగర్‌లో అబ్దుల్ నజీర్ (ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి), హసన్ ఉస్మాన్‌ఖాన్ (వెల్డింగ్ వర్కర్), మహ్మద్ షాబాజ్ (జొమాటో డెలివరీబాయ్)లు సయ్యద్ సాహిల్ (21) అనే వ్యక్తి నుంచి టాపెంటడాల్ ట్యాబ్లెట్లను కొనుగోలు చేశారు. వాటిని పొడిచేసి సెలైన్ వాటర్‌తో కలిపి సిరంజీలతో శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నారు. ఆ తర్వాత ఇళ్లకు చేరుకున్న వీరంతా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అబ్దుల్ నజీర్‌ను కుటుంబసభ్యులు ఈ నెల 18న ఆస్రా ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించటంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, 19న సాయంత్రం 8 గంటలకు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు నొవైసీ, ఆస్రా ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై టీజీఏఎన్‌బీ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌కు ఒక ఇన్‌స్టాగామ్ పోస్ట్ (https:// www. instagram. com/ reel/ DIqhwLDpECK/) ద్వారా సమాచారం అందింది. దాని ఆధారంగా టీజీఏఎన్‌బీ అధికారులు, స్థానిక పోలీసులు రంగంలోకి దిగి మాత్రలు విక్రయించిన సయ్యద్ సాహిల్‌ను అరెస్ట్ చేశారు. అతడు శంషాబాద్‌లోని శ్రీనివాస్ మెడికల్ స్టోర్ నుంచి ఈ ట్యాబ్లెట్లను కొనుగోలుచేసి యువకులకు విక్రయిస్తున్నట్టు తెలిపాడు. దీంతో శ్రీనివాస్ మెడికల్ స్టోర్ యజమాని శిరోమణి జగన్నాథన్ ప్రవీణ్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి దుకాణంలో ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

శానిటరీ ప్యాడ్ల ఫ్యాక్టరీపై బీఐఎస్ దాడులు

- ఐఎస్ఐ ముద్రలేని 30 వేల ప్యాడ్లు జప్తు

సాక్షి, హైదరాబాద్: ఐఎస్ఐ మార్కు లేని శానిటరీ ప్యాడ్లు సరఫరా చేస్తున్న ఓ కేంద్రంపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కుషాయిగూడలోని ఓ కేంద్రంలో జరిగిన సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 30 వేల ప్యాడ్లు, 7 వేలకు పైగా లేబుల్ కవర్లకు ఐఎస్ఐ మార్కు లేనట్లు గుర్తించిన అధికారులు వాటన్నింటినీ జప్తు చేశారు. శానిటరీ ప్యాడ్లకు భారత ప్రభుత్వం బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. ఈ ధ్రువీకరణ పొందకుండా అమ్మినా, తయారు చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించింది. అయితే, ఈ కేంద్రంలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండా పెద్ద ఎత్తున శానిటరీ న్యాప్కిన్లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో సోదాలు నిర్వహించినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి, సంచాలకులు పీవీ శ్రీకాంత్ తెలిపారు. బీఐఎస్ చట్టం 2016లోని సెక్షన్ 17 ప్రకారం బీఐఎస్ అనుమతి పొందకుండా వస్తువులు తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా రెండేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా మొదటిసారి, ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షల వరకూ జరిమానా రెండోసారి, తదుపరి దీనికి పదిరెట్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉందని పీవీ శ్రీకాంత్ వెల్లడించారు.

సివిల్స్ అభయ హస్తం లబ్ధిదారులకు ర్యాంకులు

- సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన ఏడుగురు అభ్యర్థులు
- అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద లబ్ధిపొందిన వారిలో ఏడుగురు అభ్యర్థులు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారు. మంగళవారం యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో సాయిశివాని 11వ ర్యాంకు, హరిప్రసాద్ పోతరాజు 255వ ర్యాంకు, ప్రీతి రావర్తి 451వ ర్యాంకు, నాగరాజ నాయక్ బానోత్ 697వ ర్యాంకు, తొగరు సూర్యతేజ 799వ ర్యాంకు, ఆంజనేయులు గోకమల్ల 934వ ర్యాంకు, రామటెంకి సుధాకర్ 949వ ర్యాంకు సాధించారు. వీరిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. ప్రభుత్వం ఇచ్చిన చిరు ప్రోత్సాహం అద్భుత ఫలితాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది యువతను సివిల్స్ వైపు అడుగులు వేయించేలా ఈ పథకం దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సివిల్స్ విజేతలకు సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ అభినందనలు తెలిపారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన 140 మందికి, ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మందికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించామని గుర్తుచేశారు.

దొంగే.... దొంగా దొంగా అని అరిచినట్టుంది

కేటీఆర్‌పై పరిగి ఎమ్మెల్యే టీఆర్ఆర్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: లగచర్ల బాధితుల గురించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతుంటే దొంగే..'దొంగా దొంగా' అని అరిచినట్టు ఉందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని మంగళవారం మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. పదేళ్ల పాటు అరాచక పాలన చేసిన బీఆర్ఎస్ తమ ప్రాంతానికి పరిశ్రమలు తేకుండా అన్యాయం చేసిందని, ఇప్పుడు తమ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటోందని, ఏకంగా ఒక వ్యక్తిని అడ్డం పెట్టుకుని కలెక్టర్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారని టీఆర్ఆర్ ఆరోపించారు. లగచర్ల విషయంలో మానవహక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తమ ప్రభుత్వం పాటిస్తుందని చెప్పారు.

మహేశ్‌బాబుకు ఈడీ సమన్లు

- సాయిసూర్య డెవలపర్స్ కేసులో నోటీసులు
- 28న విచారణకు రావాలని ఆదేశం
- ఈ సంస్థకు ప్రచారకర్తగా పనిచేసిన మహేశ్‌బాబు
- ఆయనకు రూ.5.9 కోట్లు చెల్లించినట్లు గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: సాయిసూర్య డెవలపర్స్, సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీల మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సంస్థలకు ప్రచారకర్తగా పనిచేసిన ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీచేసింది. సాయిసూర్య డెవలపర్స్ కంపెనీ నుంచి మహేశ్‌బాబుకు రూ.5.9 కోట్లు చెల్లించినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. దీంతో ఈ నెల 28న బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీసులో హాజరుకావాలని సోమవారం సమన్లు జారీచేశారు. సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీలైన సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థల్లో ఈ నెల 16న ఈడీ సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.100 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను ఈడీ గుర్తించింది. రూ.74.5 లక్షలు నగదు సీజ్ చేసింది. మహేశ్‌బాబుకు చెక్కుల రూపంలో రూ.3.4 కోట్లు, నగదు రూపంలో రూ.2.5 కోట్లు చెల్లించినట్లు ఈ సోదాల్లో ఆధారాలు లభించాయి. దీంతో ఆయనకు ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. విచారణకు వచ్చే సమయంలో పాన్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన పాస్‌బుక్స్‌ను తీసుకురావాలని సూచించారు.

ఇదీ కేసు నేపథ్యం

సాయితులసి ఎన్‌క్లేవ్, షణ్ముఖ నివాస్‌లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు నవంబర్‌లో ఈ సంస్థలపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 11 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ కె. సతీష్‌చంద్ర గుప్తా, భాగ్యనగర్ ప్రాపర్టీస్ ప్రమోటర్ నరేంద్ర సురానాను నవంబర్‌లోనే అరెస్ట్ చేశారు. గ్రీన్ మెడోస్ ప్రాజెక్ట్ పేరుతో మోసాలకు పాల్పడినట్లు సతీష్‌చంద్ర గుప్తాపై సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లోనూ గతేడాది కేసు నమోదైంది. ఈ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో ఈసీఐఆర్ నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థలు రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో సాయితులసి ఎన్‌క్లేవ్, షణ్ముఖ నివాస్ పేరుతో వెంచర్లు వేశాయి. సాయిసూర్య డెవలపర్స్ ఒక్కో ప్లాట్‌కు రూ.3.25 కోట్ల చొప్పున కొనుగోలుదారులతో ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌గా రూ.1.45 కోట్ల చొప్పున వసూలు చేసింది. అయితే, ఒకరికి విక్రయించిన ప్లాట్‌ను మరికొందరి పేర్లపై రిజిస్టర్ చేసి వందల కోట్ల రూపాయల మోసానికి పాల్పడిందని ఆరోపణలు ఉన్నాయి. ఇలా సంపాదించిన డబ్బును ఇతర సంస్థలకు మళ్లించింది. ఈ క్రమంలోనే నటుడు మహేశ్‌బాబుకు రూ.5.9 కోట్లు సాయిసూర్య డెవలపర్స్ నుంచి చెల్లించినట్లు ఈడీ గుర్తించింది. దీనిపై మరింత సమాచారం సేకరించేందుకు ఆయనకు సమన్లు జారీచేశారు.

క్లుప్తంగా...

లెక్కల కోసమే సీసీ కెమెరాలా?

- బాలుడి అదృశ్యం కేసులో పోలీసుల తీరుపై జస్టిస్ వినోద్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కెమెరాలు ఏర్పాటు చేశామంటూ గణాంకాలు చెప్పడం కాదని, అవి శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగపడనప్పుడు ఎన్ని ఏర్పాటు చేసినా ఏం లాభమని పోలీసులపై హైకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ బాలుడి అదృశ్యం కేసు విచారణ సందర్భంగా తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిర్వహణ లేకుండా తూతూమంత్రంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజాధనం ఎందుకు వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అదృశ్యం కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇది నిండు ప్రాణాలు పోయేందుకు కారణమవుతోందని వ్యాఖ్యానించింది. తన కుమారుడు లచ్చన్న అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ హైదరాబాద్ మణికొండకు చెందిన పోలవరపు రాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏడాదిగా బాలుడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. బాలుడి వివరాలను, ఫొటోలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపామని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. బాలుడు ఇంటి నుంచి బయటికి వెళితే సీసీ కెమెరాల్లో తెలుస్తుంది కదా అని పోలీసులను ప్రశ్నించారు. బాలుడి అదృశ్యంపై పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేశారు.

ఆస్తులు అక్రమం కాదని నిరూపించుకోవాల్సిందే!

- ఎన్డీపీఎస్ యాక్ట్‌లో పిటిషనర్‌కు స్పష్టం చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్ట ప్రకారం కేసు నమోదై ఆస్తులు సీజ్ చేసినప్పుడు.. అవి అక్రమ మార్గంలో సంపాదించినవి కావని నిరూపించుకోవలసిన బాధ్యత నిందితుడిదేనని హైకోర్టు స్పష్టం చేసింది. డ్రగ్స్ ద్వారా సంపాదించిన ఆస్తులను సీజ్ చేయడం సబబేనని వ్యాఖ్యానించింది. అయితే, నిందితుడికి జీవించే హక్కు ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో తన బ్యాంక్ ఖాతా నుంచి కుటుంబ పోషణకయ్యే ఖర్చులను అందించాలని కోరుతూ ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. నిషేధిత అల్ప్రాజోలం దొరకడంతో షాద్‌నగర్‌కు చెందిన వెంకటయ్యపై కేసు నమోదు చేసిన పోలీసులు.. అతని స్థిర, చర ఆస్తులను సీజ్ చేశారు. దీన్ని చెన్నైలోని కాంపిటెంట్ అథారిటీ ధ్రువీకరించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అధికారులు సీజ్ చేసిన ఆస్తులు అక్రమ మార్గంలో సంపాదించలేదని నిరూపించుకోవలసిన బాధ్యత నిందితులపైనే ఉంటుందని పేర్కొన్నారు. ఇతర ఆదాయ వనరులకు సంబంధించిన సాక్ష్యాలను సమర్పించాలని స్పష్టం చేశారు. చట్టప్రకారం ఇతర ఆదాయ మార్గాలు చూపించనప్పుడు ఆస్తులు సీజ్ చేయడం సమర్థనీయమేనన్నారు.

పని దినాలు కుదించి గుండె కోత విధిస్తారా?

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాల్లో కోత విధించి కేంద్రం కూలీ పనులు చేసే వారిని గుండె కోతకు గురిచేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని, ఉపాధి హామీ పనుల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నోరు విప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 12 కోట్ల పని దినాలు కల్పించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా.. కేవలం 6.5 కోట్ల కొన్ని దినాలు మాత్రమే మంజూరు చేసి అన్యాయం చేసిందని చిన్నారెడ్డి ఆరోపించారు. 2004 లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తెచ్చిందని, ఉమ్మడి ఏపీలోని అనంతపురం జిల్లాలో అప్పట్లో ఉపాధి హామీ పనులకు తాను మంత్రిగా ఉన్న సమయంలో వైఎస్సార్ ప్రభుత్వం ఈ పథకా నికి శ్రీకారం చుట్టిందని చిన్నారెడ్డి గుర్తు చేశారు.

'సింగరేణి' ఉపకార వేతనాల పెంపు

- అత్యుత్తమ ర్యాంకర్లకు రూ.10 వేల నుంచి రూ.16 వేలకు..

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లలకు ఇప్పటివరకు ఇస్తున్న వార్షిక ఉపకార వేతనాల మొత్తాన్ని రూ.10 వేల నుండి రూ.16 వేలకు పెంచుతూ సంస్థ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. కనీస ర్యాంక్ 2000 లోపు నుండి 8000 లోపు వరకు పెంచినట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు వర్తిస్తాయని, జూన్ 15 లోపు దరఖాస్తులు పంపించాలని కోరింది.

సాక్షి
బుధవారం, 23 ఏప్రిల్ 2025

ఊరిస్తున్న వాన్స్ టూర్

అమెరికా విధించబోయే సుంకాల గురించి మనతో సహా ప్రపంచమంతా బెంబేలు పడుతున్న వేళ, అక్కడ చదివే మన విద్యార్థులు, వృత్తిగత నిపుణులు వీసా సమస్యలతో సతమతమవుతున్న వేళ నాలుగు రోజుల వ్యక్తిగత పర్యటన కోసం ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా సోమవారం మన గడ్డపై అడుగుపెట్టారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఎంతో ఇష్టుడైన నేత కనుక ఆయన ద్వారా కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయన్న విశ్వాసం మన దేశానికున్నట్టుంది. అందుకే కావొచ్చు... ప్రోటోకాల్స్ పక్కనబెట్టి మరీ ఆయనకు ఘనస్వాగతమిచ్చారు. మారిన పరిస్థితుల రీత్యా అమెరికాతో కొత్తగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మన దేశానికి తప్పనిసరి. ఇప్పటికే ఆ విషయంలో ఇరు దేశాల మధ్యా సంప్రదింపులు సాగుతున్నాయి. ఒప్పందాలకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన తర్వాత వాన్స్ ప్రకటించారు. దాదాపు 60 దేశాలపై సుంకాలను భారీ యెత్తున పెంచుతూ ఈ నెల 2 నుంచి అమల్లోకొస్తాయని ప్రకటించిన ట్రంప్, ఆ తర్వాత 90 రోజుల పాటు నిలిపివేశారు. కేవలం చైనాపై మాత్రమే అవి కొనసాగుతున్నాయి. పాత ఒప్పందాల స్థానంలో కొత్తవి కుదుర్చుకోవటం, తమకు మరింత మేలు కలిగేలా చేసుకోవటం ట్రంప్ ధ్యేయం. అందుకోసమే మూడు నెలల కొత్త గడువు విధించారు.

నాలుగేళ్ల క్రితం రిపబ్లికన్ పార్టీకీ, ప్రత్యేకించి ట్రంప్‌కూ తీవ్ర వ్యతిరేకి అయిన జేడీ వాన్స్ ట్రంప్ తొలి దశ పాలనలోనే ఆయనకు మద్దతుదారుగా మారారు. గడచిన వంద రోజులుగా ఉపాధ్యక్షుడిగా ఆయన వ్యవహార శైలి గమనిస్తే రిపబ్లికన్ పార్టీలో ఆయన ముమ్ముందు కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయని సులభంగానే చెప్పొచ్చు. ఆ మితవాద పక్షానికి ఆయన సరికొత్త స్వరంగా మారారు. ట్రంప్‌ను ఏయే అంశాల్లో ఇంతవరకూ వాన్స్ ఒప్పించారన్నది ఎవరికీ తెలియదుగానీ... ఆయన విజన్‌ను తు.చ. తప్పకుండా పాటిస్తున్న నేతగా ఇప్పటికే నిరూపించుకున్నారు. మ్యూనిక్ భద్రతా సదస్సు సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మారిన అమెరికా వైఖరిని నిక్కచ్చిగా చెప్పటంలో వాన్స్ విజయం సాధించారు. యూరప్ దేశాలు నొచ్చుకున్నా ఆయన ఖాతరు చేయలేదు. బ్రిటన్ విధానాలను దుయ్యబట్టారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని మందలిస్తున్న ట్రంప్‌తో గొంతు కలిపారు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనితీరాలన్న ట్రంప్ అభిమతానికి అనుగుణంగా చెప్పాపెట్టకుండా కుటుంబ సమేతంగా వాన్స్ అక్కడికెళ్లారు. ప్రస్తుతం రక్షణ, విదేశీ వ్యవహారాలు డెన్మార్క్‌కు అప్పగించటం మినహా ఇతరత్రా స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తున్న గ్రీన్‌ల్యాండ్‌కుగానీ, డెన్మార్క్‌కుగానీ ఈ ప్రతిపాదన ఇష్టం లేదు. ట్రంప్ మాదిరే స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ఉదారవాద ఆర్థికవిధానాలనూ, భారీ వలసలనూ వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

వాన్స్ అంటే వల్లమాలిన అభిమానం ఏర్పడటానికి ట్రంప్‌కు చాలా కారణాలున్నాయి. వాన్స్‌లోని రచనా శక్తి అందులో ఒకటి. ఒకప్పుడు తనను 'అమెరికన్ హిట్లర్' అన్నా దాన్నంతటినీ మరిచిపోయే స్థాయిలో వాన్స్ ఆత్మకథాత్మక నవల 'హిల్‌బిల్లీ ఎలిజీ' ట్రంప్‌ను కట్టిపడేసింది. 2022లో ఆయనను ఒహాయో సెనెటర్‌ను చేయటమేగాక, అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఉపాధ్యక్ష అభ్యర్థిగా నిర్ణయించటానికి కూడా ఆ నవల ఉపకరించింది. శ్వేతజాతి అమెరికన్ జనాన్ని కూడగట్టడంలో, డెమాక్రాట్ల ఏలుబడిలో జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టడంలో ట్రంప్‌కు వాన్స్ నవల తోడ్పడిందని చెప్పాలి. పర్వత ప్రాంతాలను ఆనుకుని వుండే మారుమూల ప్రాంతాల్లో అక్షరాస్యతకూ, అభివృద్ధికీ దూరంగా వుండే శ్వేతజాతి అట్టడుగు వర్గాల జీవితాన్ని ఆ నవలలో వాన్స్ చిత్రీకరించారు. అరకొర పనులతో, అర్ధాకలి బతుకులతో వెళ్లబుచ్చే జనాలను నేరుగా చూసిన ఆ ప్రాంతవాసిగా వాన్స్ దాన్ని ప్రభావవంతంగా చెప్పగలిగారు. ఆ అట్టడుగు జనం గురించి ట్రంప్ ఎంత మాట్లాడినా నవలలో వాన్స్ చిత్రించిన జీవితానుభవం ట్రంప్‌కు లేదు. అది తెలుసుకున్నాక ఆయన మరింతగా ఆ వర్గంలోకి చొచ్చుకుపోగలిగారు. అందుకే కావొచ్చు... ట్రంప్‌కు వాన్స్ అంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అలాగని ఆయనను తన వారసుడిగా ప్రకటించ దల్చుకోలేదు. మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయటాన్ని రాజ్యాంగం నిరాకరిస్తున్నా, దాన్ని ఎలాగోలా మార్చి మరోసారి ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ట్రంప్ కలలుగంటున్నారు. అదెంతవరకూ కుదురుతుందో భవిష్యత్తే తేల్చాలి. అసాధ్యమైతే మాత్రం ట్రంప్ మొదటి ఎంపిక వాన్సే కావొచ్చు.

గత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల వాణిజ్యం విలువ 12,920 కోట్ల డాలర్లు. మన నుంచి అమెరికా నిరుడు 8,740 కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంది. మూడు నెలల తర్వాత మనపై 26 శాతం సుంకాలు విధిస్తే అక్కడి మార్కెట్‌లో మన సరుకుల ధర పెరిగి డిమాండ్ పడిపోవచ్చు. అందుకే ద్వైపాక్షిక చర్చలు అత్యవసరమయ్యాయి. తమను నష్టపరిచే విధంగా అమెరికాతో ఎవరైనా ఒప్పందం చేసుకుంటే ప్రతిచర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైనా హెచ్చరించగా... ఆ దేశంతో పరిమిత వాణిజ్యమే నెరపాలని ప్రపంచ దేశాలకు ట్రంప్ చెబుతున్నారు. ఇది ముదిరితే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారొచ్చు. వర్తమాన అంతర్జాతీయ పరిస్థితుల్లో దౌత్యం తాడు మీది నడక లాంటిది. దాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయటం అంత సులభమేం కాదు. గట్టిగా మాట్లాడి, అనుకున్నది సాధించటంలో మోదీకి మరెవరూ సాటిరారని వాన్స్ కితాబిచ్చారు. కుదరబోయే ఒప్పందాలు దాన్ని నిరూపిస్తే అంతకన్నా కావాల్సిందేముంది?

సంక్షోభంలో విశ్వవిద్యాలయాలు

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

నేడు ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు సంక్షోభంలో వున్నాయి. నిజానికి ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన హార్వర్డ్, కొలంబియా యూనివర్సిటీలు కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధిపత్య, సామ్రాజ్యవాద చర్యలకు గురికావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కొలంబియా యూనివర్సిటీలో అంబేడ్కర్ ఎంతో స్వేచ్ఛను అనుభవించిన విషయం ఆయన జీవన గాథల్లో వ్యక్తం అవుతుంది. అమెరికాలోని హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాల్లో విద్యతో పాటు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసినట్లు మనకు చరిత్ర చెబుతున్న సత్యం. ఇక్కడ ప్రపంచంలోని ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు, జ్ఞానవంతులు, సాంకేతిక నిపుణులు తయారయ్యారు. అనేక దేశాల్లో అత్యున్నతంగా చదువుకున్న మేధావులు పెక్కుమంది ఇక్కడ తమ జ్ఞానానికి పదును పెట్టుకున్నారు.

ట్రంప్ వర్సెస్ హార్వర్డ్

ట్రంప్ ఆదేశాలను హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు అలెన్ ఎం. గార్బర్ ధిక్కరించడం పట్ల సామాజిక, రాజకీయ మేధావి వర్గం సానుకూలంగా స్పందించింది. ''హార్వర్డ్ విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాధీనం చేయబోదు. తన రాజ్యాంగ హక్కులను వదులుకోబోదు. ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఏ విద్యార్థులను చేర్చుకోవాలి, ఏ సిబ్బందిని నియమించుకోవాలి, ఏ పరిశోధనలు జరపాలి అనే విషయాలను ఆదేశించజాలదు'' అని గార్బర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయ వ్యవహారాల నిర్వహణలో పాలకుల జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఏ భారతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉంటారు? ఈ ధరిత్రిపై తన కంటే శక్తిమంతుడు మరొకరు లేరని విశ్వసిస్తున్న ట్రంప్ ఆదేశాలను గార్బర్ ధిక్కరించారు. అందుకు ఆగ్రహించిన ట్రంప్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధుల విడుదలను నిలిపివేశారు. అయినప్పటికీ శ్వేత సౌధ ఆదేశాలను పాటించేందుకు హార్వర్డ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

గత నెలలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలంబియాకు కూడా 400 మిలియన్ డాలర్లను మంజూరు చేసేందుకు ట్రంప్ నిరాకరించారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆయన షరతులకు కొలంబియా సమ్మతించింది. నిజానికి విశ్వవిద్యాలయాల అధిపతులు సామ్రాజ్యాధిపతుల కంటే గొప్పవారు. వారు ఎంతో జ్ఞానాన్ని ఉత్పత్తి చేస్తుంటేనే ప్రపంచం నడుస్తుంది. అమెరికా నేడు అనేక విషయాల్లో ప్రపంచంలో ముందు ఉందంటే అందులో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో ఉంది. నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని ప్రవచించిన, స్టాలిన్ నియంతృత్వాన్ని ఎదిరించి ప్రపంచానికి ప్రజాస్వామ్యాన్ని ప్రవచించిన జాన్ డ్యూయీ వంటి ఎందరో మేధావులు ఆవిర్భవించిన కొలంబియా విశ్వవిద్యాలయం నేడు ఆంక్షలను ఎదుర్కోవడం బాధాకరమైన విషయం. ''ప్రజాస్వామికం అనే భావాన్నీ, ప్రజాస్వామికం అర్థాన్నీ మనం ఎప్పటికప్పుడు కొత్తగా తరచి చూసుకుంటూ వుండాలి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంస్థలను కూడా దీనికి అనుకూలంగా మార్చుకోవాలి. ప్రజాస్వామికం నిత్యనూతనం అయి, ప్రజల అవసరాలతోపాటు మారుతూ వచ్చినపుడే అది ప్రజల జీవితాన్ని ప్రతిబింబించేదీ, ప్రజలకు సహాయం చెయ్యగలిగేదీ అవుతుంది. ఈనాటి మార్పులనూ, రాబోయే మార్పులనూ తెలుసుకోటానికి అది ముందుకు నడవాలి. అది కదలకుండా నిలబడటం ఆత్మహత్య చేసుకోవటమే అవుతుంది'' అని హెచ్చరించారు జాన్ డ్యూయీ. ఆయన విద్యకు ప్రధానమైన పాత్రను ఇచ్చారు. విద్య అంటే జ్ఞాన జ్యోతి, విద్య అంటే విప్లవ సంకేతం, విద్య అంటే మానవాభ్యుదయానికి మార్గం.



అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో నిరసన ప్రదర్శన

- 2.2 బిలియన్ డాలర్ల నిధులను స్తంభింపజేసినందుకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రభుత్వం మీద హార్వర్డ్ విశ్వవిద్యాలయం తాజాగా కేసు వేసింది.
- ఒకప్పుడు అమెరికాలోని హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాల్లో విద్యతో పాటు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసినట్లు చరిత్ర చెబుతోంది.
- ట్రంప్ సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తున్న భారత మేధావులు భారతీయ విశ్వవిద్యాలయాల మీద కేంద్ర ప్రభుత్వ చర్యలను సమర్థించడం ఆశ్చర్యం గొలుపుతోంది.

భారతదేశ పరిస్థితి

మన దేశంలో కూడా యూనివర్సిటీల మీద పెత్తనం అప్రజాస్వామికంగా, లౌకిక భావజాలానికి భిన్నంగానే జరుగుతోంది. విశ్వవిద్యాలయాల గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపాన్నే మార్చే పెద్ద ప్రయత్నం జరుగుతోంది. 2023 నాటికి మనకు 1,074 విశ్వవిద్యాలయాలున్నాయి. ఇందులో 128 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు. ఇక్కడ ఒకప్పుడు లౌకికవాద, ప్రజాస్వామ్య, ఆర్థిక, సామ్యవాద, సామాజిక పరిణామవాద భావజాలం అభివృద్ధి చెందింది. జీవశాస్త్రం, పదార్థ శాస్త్రం, రసాయన శాస్త్రంలో ప్రపంచానికే జ్ఞానసంపత్తిని అందించగల్గిన పరిశోధనలు వచ్చాయి. దళిత బహుజన విద్యార్థులకు మెరుగైన స్కాలర్‌షిప్‌లు లభించాయి. దళిత బహుజన మైనారిటీల నుండి కూడా ఎంతో నూత్న జ్ఞానం ఆవిర్భవించింది. జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జామియా మిలియా, ఏఎమ్‌యూ, జాదవపూర్, జమ్ము సెంట్రల్ వర్సిటీల్లో (వాటి అధ్యాపకులు, విద్యార్థులు) ఎంతో విలువైన పరిశోధనలు చేశారు. జేఎన్‌యూలో ఇమ్మానుయేల్ కాంట్, హెగెల్, కారల్ మార్క్స్ గురించిన విస్తృతమైన అధ్యయనాలు జరిగాయి. సబాల్టర్న్ స్టడీస్‌లో భాగంగా హిస్టరీలో అత్యంత విలువైన విషయాలను ముందుకు తెచ్చిన రొమిల్లా థాపర్ జేఎన్‌యూలో చరిత్ర బోధకురాలని మరువరాదు. కానీ నేడు దేశంలో మత గ్రంథాల్లోని పురాణ కథలను పాఠ్య గ్రంథాలుగా తెచ్చే పెద్ద ప్రయత్నం జరుగుతోంది. భారతీయ విశ్వ విద్యాలయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం చాలా తక్కువగా వుంది. ట్రంప్ సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తున్న భారత మేధావులు కేంద్ర ప్రభుత్వ చర్యలను సమర్థించడం ఆశ్చర్యాన్ని గొలుపుతోంది.

నిజానికి ప్రపంచ వ్యాప్తంగా విద్యా వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. భారతదేశంలో ఎక్కువ ధనం విద్యకే ఖర్చవుతోంది. అయినా ఉపాధి రంగాలు లేక ఇతర దేశాలకు వలస వెళ్ళిపోతున్నారు. ఇప్పుడు భారత పాలకులకు, రాష్ట్రాలను పాలించే ముఖ్యమంత్రులకు ఈ దేశంలో ఉన్న మానవ వనరులను, మానవ శక్తిని ఎలా సమన్వయించాలో తెలియక ఇతర దేశాలకు ఉపాధి రంగాల కోసం విద్యార్థులను వెళ్ళమని పురమాయిస్తున్నారు. ఇతర దేశాలకు వెళ్ళడం తప్పు కాదు. దేశంలో ఉన్న విద్యను, విద్యా మూలాలను దెబ్బతీసుకోవడం వలన వనరుల మీద ఆసక్తి తగ్గిపోతుందనేది మనం అర్థం చేసుకోవాల్సిన విషయం.

విద్యకు హద్దులా?

ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పాలకవర్గ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, మతోన్మాద భావజాలాల ఒత్తిడిలో వున్నాయి. సరైన గ్రాంట్స్, స్కాలర్‌షిప్‌లు లేక విలవిల్లాడుతున్నాయి. తెలంగాణలో సెంట్రల్ విశ్వవిద్యాలయ భూములను ఆక్రమిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు కులాధిపత్య భావాల మధ్య నలుగుతున్నాయి. భారతదేశంలో జీవించలేక, ఉపాధి లేక, స్వేచ్ఛ లేక ఇతర దేశాలకు వెళుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో అమెరికా విధిస్తున్న ఆంక్షలు గొడ్డలిపెట్టుగా ఉన్నాయి.

ఆసియా దేశాలు తమ స్వీయ విద్యోత్పత్తి, జ్ఞానోత్పత్తి విషయంలో స్వయంకృషికి పూనుకోవలసిన అవసరం వుంది. విద్య మానవుని వికాసానికి సోపానం. ఉన్నత విద్య ప్రపంచ జీవన వ్యవస్థలను పునరుజ్జీవింపజేయగల శక్తిని కలిగి వుంటుంది. హార్వర్డ్, కొలంబియా, భారతీయ విశ్వవిద్యాలయాల పునరుజ్జీవన ఉద్యమం అత్యవసరం. ప్రపంచంలో విశ్వ మానవులైన వారందరూ విద్య ద్వారా, జ్ఞానం ద్వారా మాత్రమే అయ్యారు. సామ్రాజ్యానికి ఎల్లలుంటాయి. పాలనకు హద్దులు వుంటాయి. కానీ విద్యకు హద్దులుండవు. విద్య గురించి అంబేడ్కర్ మాట్లాడుతూ, ''ఏ విద్య అయితే సమర్థతను సమున్నతంగా పెంచలేదో, సమానత్వాన్ని పెంపొందించుకోవడానికి బాధ్యత వహించదో, నీతికి భూమికగా నిలువదో అది విద్యకాదు. విద్య అనేది మానవ సంక్షేమానికి రక్షణగా, శక్తిమంతంగా, బహుళ ప్రయోజనకారిగా సమతానురాగాల మూలస్థానంగా ఉండాల''న్నారు. విద్యావంతమైన జాతి దానంతటదే అభివృద్ధిలోకి వస్తుంది. అంబేడ్కర్ ఆలోచనలే ప్రపంచ విశ్వవిద్యాలయాల వికాసానికి మార్గం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

మనమే కాపాడుకోవాలి!



తుదకు మనుషులం అందరం ప్రకృతి మీద ఆధారపడాల్సిందే. కాబట్టి దానితో మన సన్నిహిత సంబంధాలను కాపాడుకోవాలి. సాంకేతికత మన సమస్యలను పరిష్కరిస్తుందనీ, దానివల్ల మనం ఏది చేసినా చెల్లిపోతుందనీ కొన్నిసార్లు అనుకుంటాం. కానీ మనమే ఈ ప్రపంచాన్ని కాపాడుకోవాల్సి ఉంటుందన్న వాస్తవాన్ని ఈ ధరిత్రీ దినోత్సవం రోజున (ఏప్రిల్ 22) గుర్తిద్దాం.

– దలై లామా, బౌద్ధ గురువు

పాపం, మంచివాళ్లు!



ఇండియా వ్యాప్తంగా ఇది నాకు కనబడింది. ఉత్తర ప్రదేశ్, బిహార్ – ప్రత్యేకించి బిహార్ వారి పట్ల ఒక క్యాజువల్ వివక్ష ఉంటుంది. కానీ నా అనుభవంలో బిహారీలు అత్యంత తక్కువ జాత్యహంకారం ఉన్న మనుషులు. వారి ఇళ్లల్లో ఎప్పుడూ స్వాగత ధోరణే కనబడుతుంది. మనకు విలువ ఇచ్చిన భావన కలుగుతుంది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

సిక్సులే చాలవు!



క్రికెట్‌లో సిక్సులు కొట్టడం ముఖ్యమే. కానీ అవే మ్యాచుల్ని గెలిపించవని జీటీ–కేకేఆర్ ఐపీఎల్ మ్యాచ్ చూస్తే అర్థమవుతుంది. గుజరాత్ టైటాన్స్(జీటీ) లాగే, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా ఐదు సిక్సులు కొట్టింది. తేడా అల్లా జీటీ 31 మాత్రమే డాట్ బాల్స్(పరుగు రాని బంతులు) ఆడితే, కేకేఆర్ 47 ఆడింది. అలాగే జీటీ 24 ఫోర్లు కొడితే, కేకేఆర్ 14 మాత్రమే కొట్టింది.

– జాయ్ భట్టాచార్య, క్రీడా విశ్లేషకుడు

అంకె మాత్రమే?



మీరు ఒక అంకె మాత్రమే. పాకిస్తాన్ ప్రాయోజిత ఇస్లామిక్ తీవ్రవాదానికి కశ్మీర్‌లో బలైన ఇతరులతో మిమ్మల్నీ కలుపుతారు. దయచేసి మీ వేసవి విడిదికి హిమాచల్‌నో, ఉత్తరాఖండ్‌నో ఎంచుకోండి.

– శైలేష్ తివారీ, వ్యాఖ్యాత

స్వర్గమేనా?



కశ్మీర్‌ను ఇక ఎంతమాత్రమూ భూమ్మీది స్వర్గం అనలేము. సొంత జనాలే కశ్మీర్‌ను ఈ స్థితికి తెచ్చారు.

– సుతపా గుహా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సిబిల్‌ను సరిదిద్దాలి!

బ్యాంక్‌లో ఏ విధమైన అప్పు పొందాలన్నా కనీస సిబిల్ స్కోర్ 700 పాయింట్లు ఉండాలి. సిబిల్ అంటే 'క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా లిమిటెడ్'. దేశంలో ఉన్న అన్ని బ్యాంకుల రుణ సమాచారాన్ని అనుసంధానం చేసే సంస్థ ఇది. వివిధ బ్యాంకుల్లో అప్పులను తీసుకొని సమయానికి కట్టకుండా... ఒక్కోసారి మొత్తం అప్పును ఎగ్గొట్టే కస్టమర్లను గుర్తించడం కోసం ఈ సంస్థ ఆవిర్భవించింది. ఈ సంస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థ. దీనికి ఏ విధమైన చట్టబద్ధతా లేదు. బ్యాంకుల వద్ద మన ఋణ డేటాను తీసుకొని 300 పాయింట్ల నుండి 900 పాయింట్ల వరకు స్కోర్ ఇస్తోంది. బ్యాంకులు దీనినే ప్రామాణికంగా తీసుకోవటం జరుగుతుంది. ప్రతి బ్యాంకు ఋణ గ్రహీతలకు ఇచ్చిన అప్పు వివరాలన్నింటినీ సిబిల్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఒక బ్యాంకులో అప్పు తీసుకొని చెల్లించకుండా మరో బ్యాంక్‌కి అప్పు కోసం వెళితే... పాత బ్యాంక్‌లో తీసుకొన్న వివరాలు అన్నీ ఆ బ్యాంక్‌కి తెలుస్తాయి. అందువల్ల ఆ బ్యాంక్ అప్పు ఇవ్వదు. ఎందుచేతనంటే అప్పటికే అతని సిబిల్ స్కోర్ 700 పాయింట్ల కన్నా తక్కువకు పడిపోవడం వలన!

అప్పు తీసుకున్న కస్టమర్లు నిర్దీత గడువులో లోన్ కట్టినప్పటికీ కొందరు సిబిల్‌లో పనిచేసే అవినీతి అధికారులు క్రెడిట్ స్కోర్ పడిపోయినట్టుగా నమోదు చేస్తున్నారు. మంచి కస్టమర్ అయినప్పటికీ ఇలాంటి తప్పుల వలన కస్టమర్లు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. సిబిల్ సంస్థలో ఉన్న కొంతమంది అవినీతి అధికార్లు కస్టమర్లకు ఫోన్ చేసి 'మాకు డబ్బులు ఇస్తే మీ స్కోర్‌ని పెరిగేలా చేస్తా'మని అడిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. క్రెడిట్ కార్డ్ వాడుకోకపోయినా... వాడి డబ్బు కట్టనట్లు చూపించడం సిబిల్ లీలల్లో ఒకటి. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు బ్యాంక్‌లలో ఋణం తీసుకుని ఎగవేసినా బుక్స్ క్లీనింగ్ అని చెప్పి రద్దు చేసి మరలా రుణాలు ఇస్తున్నారు. చిన్న రైతులు, చిన్న వ్యాపారస్తులు వారికి నష్టాలు సంభవించినప్పుడు అప్పు నిర్దీత సమయంలో కట్టకపోతే ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. సిబిల్ స్కోర్ పేరుతో మళ్లీ రుణం ఇవ్వడం లేదు. అందుచేత నిజాయితీగా అప్పు చెల్లించే కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబిల్ సంస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలి.

– కొవ్వూరి త్రినాథరెడ్డి, ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ మాజీ రీసోర్స్ పర్సన్

బిహార్ ఎన్నికలు... ఎన్నెన్నో ప్రశ్నలు!

విశ్లేషణ




ఆర్. దిలీప్ రెడ్డి

బిహార్ రాష్ట్రం 13 కోట్ల జనాభాకు నెలవు! సుమారు 8 కోట్ల మంది ఓటర్లు ఉన్న ఆ రాష్ట్రంలో మరో 7 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బిహారీల్లో అభివృద్ధి, ఉపాధి కావాలనీ; వలసలు నియంత్రించాలనే డిమాండ్స్ పెరగడం, కొత్త పార్టీలు పుట్టుకురావడం నేపథ్యంలో పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ అధ్యయనంలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో బిహార్ రాష్ట్రానికి పెద్ద పీట వేసి అందరికంటే ముందుగానే బీజేపీ అక్కడ ప్రచారం మొదలుపెట్టింది. గత ఎన్నికల వరకు ఎన్డీయే కూటమిలో సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ)దే పైచేయిగా ఉండేది. కానీ, ఐదేళ్లలో రాజకీయ సమీకరణాలు మారాయి. బీజేపీ అగ్రవర్ణాలపై తన పట్టును కాపాడుకుంటూనే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రెండు దశాబ్దాలుగా జేడీ(యూ) ఓటు బ్యాంకుగా ఉన్న ఓబీసీలను, దళితులను తన వైపు తిప్పుకుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో, పరిపాలనా సంస్కరణలతో లబ్ధిపొందిన ఈ వర్గాలను ఆకర్షించడం ద్వారా... బీజేపీ తన 'సామాజిక' కూటమిని బలోపేతం చేసుకుంది. సామాజిక న్యాయ పోరాటంలో కీలక పాత్ర పోషించిన లోక్ జన్‌శక్తి పార్టీ (ఎల్జేపీ) వ్యవస్థాపకులు రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత ఆ పార్టీ తన బలాన్ని కోల్పోయింది. ఆ పార్టీ తమ గుర్తింపును కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడుతున్న క్రమంలో బీజేపీకి సానుకూలంగా మారింది. వివిధ కుల సమూహాలను తనవైపు తిప్పుకోవడానికి బీజేపీ అంతర్గతంగా ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తోంది. పలు సందర్భాల్లో జేడీ(యూ)తో విభేదాలొచ్చినా రాష్ట్రంలో దాదాపు రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉండటం వల్ల బీజేపీ తన హిందుత్వ భావజాలాన్ని బిహార్ మట్టిలో జాగ్రత్తగా నిక్షిప్తం చేయగలిగింది. హిందూ సంఘటితం చుట్టే రాజకీయాలు నడుపుతూ మొట్టమొదటిసారి ఈ ఎజెండాతోనే ఎన్నికలు నడిచేలా వ్యూహాలను రచిస్తోంది.

బడుగు, బలహీన వర్గాల ఐక్యతను కాపాడాలనే సిద్ధాంతంతో పని చేస్తున్న 'ఇండియా' కూటమికి ఇది అతిపెద్ద సవాలుగా మారబోతోంది. రాష్ట్రంలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉంది. అలాగే ఆ పార్టీ వ్యూహాత్మకంగా సృష్టిస్తున్న హిందూ కులాల ఐక్యత ఈసారి బిహార్ ఎన్నికలను రసవత్తరంగా మార్చనున్నది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారం, బీజేపీ, జేడీ(యూ), ఎల్జేపీ, హిందుస్తానీ అవామ్ మోర్చా పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమికి 43.17 శాతం ఓట్లు రాగా; ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులతో కూడిన మహాగట్‌బంధన్ (ఎంజీబీ) కూటమికి 38.75 శాతం ఓట్లు వచ్చాయి.



ఈ ఓట్ల వ్యత్యాసం ఇకముందు కూడా కొనసాగితే ఎన్డీఏ 2025లోనూ సునాయాసంగా విజయం సాధించే అవకాశాలున్నాయి. కానీ 2020 తర్వాత వికాసశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) మహాగట్‌బంధన్‌లో చేరడం, జేడీ(యూ)లో రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ విలీనం కావడంతో ఈసారి లెక్కలు మారవచ్చు.

బిహార్‌లో 18 శాతం ఉన్న ముస్లింలు కీలక పాత్ర పోషిస్తారు. 2020లో ఎంజీబీకి 76 శాతం ముస్లిం ఓట్లు రాగా, ఎన్డీఏకు కేవలం 5 శాతమే వచ్చాయి. యాదవ్–ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే బీజేపీ వైపు ఉన్న బీసీలను, దళితులను తనవైపు తిప్పుకోగలిగితే ఎంజీబీ గెలుపు అవకాశాలు పెరుగుతాయి. అయితే రాష్ట్రంలో పుట్టుకొచ్చిన కొత్త పార్టీలు ఎన్డీఏ–ఎంజీబీ కూటముల గెలుపోటములపై ప్రభావం చూపనున్నాయి.


ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) జన్ సూరజ్ పార్టీ నుంచి ఎంజీబీకి ముప్పు పొంచి ఉంది. 2024లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలతో పాటు ప్రస్తుతం ఉన్న ట్రెండ్స్ ప్రకారం ఆయన ఇటు ఎంజీబీ, అటు జేడీ(యూ) ఓట్లను గణనీయంగా చీల్చవచ్చు. ఆయన ఆర్జేడీ, జేడీ(యూ) పార్టీలపైనే విమర్శలతో విరుచుకుపడుతుండటంతో బీజేపీకి పరోక్షంగా మేలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుల ఆధారిత రాజకీయాలు కాకుండా అభివృద్ధి తరహా రాజకీయాలు చేస్తానని పీకే చెప్తున్నారు. లాలూ, నితీష్‌ల వృద్ధాప్యం, పాశ్వాన్ మరణంతో ఏర్పడిన ఖాళీని తాను భర్తీ చేయాలనుకుంటున్నారు. అయితే 243 నియోజకవర్గాల్లో నిలబెట్టడానికి బలమైన, నమ్మకమైన అభ్యర్థులు ఆయన పార్టీకి లేరు. కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత ఐ.పి. గుప్తా 'ఇండియన్ ఇంక్విలాబ్ పార్టీ' ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రెండు కులాలపై ఈ పార్టీ ప్రభావం ఉండే అవకాశాలున్నాయి. ఐపీఎస్ అధికారిగా బిహార్‌లో ప్రత్యేక పనితీరు కనబర్చిన మహారాష్ట్రకు చెందిన శివ్‌దీప్ లాండె 'హింద్ సేన' పార్టీ ఏర్పాటు చేశారు. ఒకప్పుడు నితీష్‌కు సన్నిహితునిగా ఉన్న ఆర్‌సీపీ సింగ్ ఆయనతో విభేదించి బీజేపీలో చేరారు. అయితే బీజేపీ – జేడీ(యూ) మళ్లీ పొత్తు పెట్టుకోవడంతో ఈయన 'ఆప్ సబ్‌కీ ఆవాజ్' పార్టీని నెలకొల్పారు. కుర్మీ సామాజిక నేత అయిన ఆర్పీ సింగ్ ఆ సామాజిక ఓట్లు చీల్చే అవకాశాలున్నాయి. ఈ చిన్న పార్టీలు చీల్చే ఓట్లు ఎన్డీఏ, మహాగట్‌బంధన్ అభ్యర్థుల గెలుపోటములను శాసించనున్నాయి.

ఆర్జేడీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. బీజేపీకి పెరుగుతున్న ఆకర్షణను అడ్డుకోవడానికి ఆర్జేడీ కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. ఓబీసీలను ఏకం చేయాలనీ, మైనారిటీ ఓట్లను కాపాడుకుంటూనే ఈబీసీలను, దళితులను ఎన్డీయే శిబిరం నుంచి తమ వైపు తిప్పుకోవాలనీ ఎంజీబీ లక్ష్యాలుగా పెట్టుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం ఇది. మరో ఏడు నెలల్లో ఎవరు గెలుస్తారో వేచిచూడాల్సిందే!

వ్యాసకర్త పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

వైరాగ్యంతోనే ముక్తి

దుఃఖానికి మూలకారణం ఏది? అని ఆలోచిస్తే సాంసారిక విషయాలపై స్నేహభావం, ఆసక్తి, మోహం కలిగి ఉండడం అని అర్థమవుతుంది. జీవకోటి మొత్తం ఈ ఆసక్తిని, మోహభావాన్ని ప్రదర్శించడం వలననే దుఃఖాన్ని పొందుతున్నది. కాల్చబడిన లోహపు ముద్దను ఒక కుండలోని చల్లని నీటిలో వేసినంతనే ఎలాగైతే ఆ చల్లని నీరు మొత్తం ఒక్కసారిగా వేడెక్కుతాయో అలా, మనస్సు దుఃఖంతో నిండి ఉన్నప్పుడు ఆ దుఃఖం ప్రభావం శరీరంపై కూడా పడి మనిషిని



జ్యోతిర్మయం

మొత్తంగా డీలా పడిపోయేలా చేస్తుంది. ధన పిపాసకు అంతం లేదు. ఆ కోరిక ఎన్నటికీ పూర్తిగా తీరేది కాదు. ఎల్లవేళలా సంతృప్తభావంతో సంతోషంగా ఉండడాన్ని మించిన సుఖవంతమైనది మరొకటి లేదు. ఆ కారణంగానే సంతోషాన్ని అన్నిటి కంటే ఉత్తమమైన గుణంగా విజ్ఞులు చెప్పారు.

జలంతో అగ్నిని శాంతపరిచినట్లుగా జ్ఞానజలంతో మనిషి తన మానసిక దుఃఖాలను శమింపజేసి శాంతపరచాలి. మనస్సులో దుఃఖం ఎప్పుడైతే మాయమైపోతుందో, అప్పుడే మనిషికి శారీరక అస్వస్థత కూడా తగ్గడం ఆరంభమై, కొంతకాలానికి పూర్తి స్వస్థత చేకూరుతుంది. ఎలాగైతే తనలోనే నిక్షిప్తమై ఉండే అగ్ని రాజుకోవడం వలన పుట్టిన మంటలో, కట్టె దహించుకుపోయి మండి బూడిదై మిగులుతుందో; ఆ విధంగానే, ఎవని ఆలోచనలు, మనసు అదుపులో ఉండవో ఆ వ్యక్తి తన శరీరం నుంచి ఉత్పన్నమయ్యే లోభత్వం, ఆకాంక్ష కారణంగా తన వినాశాన్ని తానే కొని తెచ్చుకుంటాడు.

విప్రయోగే న తు త్యాగీ దోషదర్శీ సమాగమే
విరాగం భజతే జన్తుర్నిర్వైరో నిరవగ్రహః

'కోరుకున్న విషయ సుఖాలు దక్కని కారణంగా ఆ సుఖాలను త్యాగం చేసేవాడు విరాగి కాలేడు. విషయ సుఖాలు దొరుకుతున్నవాటిని కూడా త్యాగం చేసేవాడే నిజమైన త్యాగి అవుతాడు. అతడికి మాత్రమే వైరాగ్యభావం దక్కుతుంది. మనసులో ద్వేషభావం లేని కారణంగా బంధన ముక్తుడై ఎవరితోనూ వైరం లేనివాడు అవుతాడు' అని వ్యాస మహర్షి విరచిత మహాభారతంలో ఉంది. శోకమగ్నుడై ఉన్న ధర్మరాజుకు శౌనకాది మహామునులకు మధ్య జరిగిన సంభాషణలోని పై శ్లోకం ఈ తత్త్వాన్ని బోధించింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.దశమి ప.11.51 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.7.41 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: ప.2.39 నుండి 4.12 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.35 నుండి 12.25 వరకు, అమృతఘడియలు: రా.11.56 నుండి 1.30 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.13.

క్లుప్తంగా...

నేడు రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

- ఈ నెలలోనే తుది విడత క్రాస్ ఎగ్జామినేషన్
- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటలను ప్రశ్నించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ కీలక దశకు చేరుకుంది. బుధవారం హైదరాబాద్‌కు రానున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఒకటి రెండు రోజుల్లో తుదివిడత క్రాస్ ఎగ్జామినేషన్ చేపట్టి విచారణ ప్రక్రియను ముగించే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తీసుకున్న నిర్ణయాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి ప్రశ్నించాల్సి ఉంది. ఈ దఫాలోనే వారికి సమన్లు పంపించి క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కమిషన్ కోరే అవకాశముంది. ఇప్పటికే పలు దఫాలుగా నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో బరాజ్‌ల నిర్మాణంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీర్లతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలు సేకరించిన విషయం తెలిసిందే. వీటిని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల ముందు ఉంచి ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

అమ్మానాన్నా క్షమించండి.. వెళ్లిపోతున్నా..

- కాంగ్రెస్ నేతల వేధింపులు భరించలేకపోతున్నానని మహిళా పంచాయతీ కార్యదర్శి అదృశ్యం



తంగళ్లపల్లి(సిరిసిల్ల): 'అమ్మానాన్నా.. నన్ను క్షమించండి. నేను ఇల్లు వదిలి వెళ్లిపోతున్నా'.. అంటూ ఒక మహిళా పంచాయతీ కార్యదర్శి లేఖ రాసి అదృశ్యమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. బద్దెనపల్లిలో రెండేళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రియాంక.. కాంగ్రెస్ నేతల వేధింపులు భరించలేకపోతున్నానంటూ.. లేఖ రాసి సోమవారం అదృశ్యమైంది. డీపీఓకు రాజీనామా లేఖ వాట్సాప్ ద్వారా పంపినట్లు తెలిసింది. కాంగ్రెస్ నేత శ్రీదాది మల్లేశ్‌బాబుతోపాటు మరికొందరు పెట్టే బాధల వల్ల మానసిక వేదన భరించలేకపోతున్నానని ఆమె లేఖలో పేర్కొంది. కాగా, తమ కూతురు కనిపించడం లేదని ప్రియాంక తల్లిదండ్రులు సిరిసిల్ల డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆమె తిరుపతిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కూతురి కోసం తల్లిదండ్రులు మంగళవారం తిరుపతికి బయలుదేరారు.

కొనుడే 'బంగారం'మాయే!

10 గ్రాముల బంగారం రూ.లక్ష దాటడంతో ప్రజల బెంబేలు

- రాష్ట్రవ్యాప్తంగా 50 శాతానికి పైగా తగ్గిన కొనుగోళ్లు
- పెట్టుబడి కోసం నాణేలు, బిస్కట్లు కొంటున్న జనం
- ఆభరణాల కోసం వాడే 22 క్యారట్ల బంగారానికి గిరాకీ కరువు.. వెలవెలబోతున్న దుకాణాలు.. వ్యాపారుల్లో ఆందోళన



50% తగ్గిన అమ్మకాలు

సాక్షి, హైదరాబాద్: ఏదైనా వస్తువు ధరలో హెచ్చు తగ్గులు వస్తే వినియోగదారుడు లేదా వ్యాపారిలో ఎవరో ఒకరికి లాభం చేకూరుతుంది. కానీ, బంగారం ధర రూ.లక్ష దాటడం వల్ల అటు కొనుగోలు దారుడు, ఇటు అమ్మకం దారుడు కూడా ఆనందంగా లేకపోవడం గమనార్హం. మంగళవారం 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.లక్షా 2 వేలకు చేరింది. గత సంవత్సరం ఇదే సమయంలో రూ.61,000 ఉంది. అంటే ఏడాది కాలంలోనే 62% పెరిగింది. మూడు నెలల క్రితం రూ.80 వేలకు చేరువలో ఉన్న 10 గ్రాముల బంగారం.. 90 రోజుల్లో 20 శాతం పెరిగి రూ.లక్షను దాటింది. దీంతో పెళ్లిళ్ల సీజన్ వచ్చినా బంగారం దుకాణాల వద్ద పెద్దగా జనం కనిపించక వెలవెలబోతున్నాయి.

హైదరాబాద్‌లో ధరలతో సంబంధం లేకుండా బంగారానికి ఎప్పుడూ డిమాండ్ ఉండేది. అయితే 10 గ్రాముల ధర రూ.80 వేలు దాటినప్పటి నుంచి కొనుగోళ్లు మందగించాయి. హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో బంగారం దుకాణాల్లో గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 30 నుంచి 50 శాతం వరకు అమ్మకాలు తగ్గినట్లు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ తగ్గుదల 35% దాటిందని జెమ్స్ అండ్ జువెల్లరీ అసోసియేషన్ ప్రకటించింది.

ఆభరణాల కన్నా 'ముద్ద'గానే..

బంగారాన్ని ఆభరణాలుగా ధరించడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు చాలా ఇష్టం. కానీ, ధర భారీగా పెరగటంతో బంగారాన్ని 22 క్యారట్ల ఆభరణంగా ధరించడం కన్నా భవిష్యత్ పెట్టుబడిగా 'నిల్వ'చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆభరణంగా చేయిస్తే తరువాత ఎప్పుడైనా విక్రయించేటప్పుడు తరుగు, నాణ్యత, వీఏ పేర్లతో దాని విలువను వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేస్తారు. అదే బిస్కట్, కడ్డీ రూపంలో ఉంటే విలువలో తేడా ఉండదు. బేగంబజార్‌లోని బంగారం దుకాణాల్లో గత కొద్ది రోజులుగా 24 క్యారట్ల 100 గ్రాముల బంగారం బిస్కట్‌లను ఎక్కువగా విక్రయిస్తున్నట్లు ఓ వ్యాపారి 'సాక్షి'కి తెలిపారు. 10, 20 గ్రాముల బంగారు బిల్లలకు కూడా డిమాండ్ ఉందని చెప్పారు. ధరలు అనూహ్యంగా పెరగటంతో ఇళ్లలో ఉన్న బంగారాన్ని కూడా విక్రయించి ఇతర మార్గాల్లో పెట్టుబడులు పెడుతున్న వారు కూడా ఉన్నట్లు బంగారం వ్యాపారులు చెబుతున్నారు.

వ్యాపారుల్లో ఆందోళన

వివాహాల సీజన్‌లోనూ ప్రజలు పెళ్లిళ్ల బడ్జెట్‌లో బంగారానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో బంగారం వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద పెద్ద ఆభరణాల దుకాణాలు ఈఎంఐ స్కీమ్‌లు, మేకింగ్ చార్జీలపై రాయితీలు, పాత బంగారం మార్పిడి మీద అదనపు బెనిఫిట్స్ వంటి ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి బంగారు ఆభరణాల దుకాణాలు తెరిస్తే ధరల పెరుగుదలతో ప్రజలు తమ దుకాణాల వైపే రావడం లేదని పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యాపారి కొమురవెల్లి వెంకటరమణా చారి ఆందోళన వ్యక్తం చేశారు.

కొనడానికి ఎవరూ రావడం లేదు



10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరడంతో బేగంబజార్‌తోపాటు రాష్ట్రమంతటా బంగారం వ్యాపారం పడిపోయింది. బంగారం కొనడానికి ఎవరూ రావడం లేదు. మూడు నెలల్లోనే దాదాపు 50 శాతం కన్నా ఎక్కువే అమ్మకాలు తగ్గాయి. అమ్మకాలు సాధారణ స్థితికి రావడం ఇప్పట్లో కష్టమే.
– కంకర్ల రాకేశ్, బంగారం వ్యాపారి, బేగంబజార్


ఖాళీగా కూర్చుంటున్నాం



బంగారం ధరలు పెరగడంతో గిరాకీ తగ్గింది. పెళ్లిళ్లు, శుభ కార్యాలయాలకు కూడా ఆభరణాలు చేయించుకోవడానికి జనం రావడం లేదు. కరీంనగర్‌లో ఎప్పుడూ కళకళలాడే ఆభరణాల దుకాణాలు ఇప్పుడు ఖాళీగా ఉన్నాయి. 22 క్యారట్ల ఆభరణాల కొనుగోళ్లు తగ్గడం బంగారు పరిశ్రమ మీద ఆధారపడ్డ వారిని అంధకారంలోకి నెడుతోంది.
– ఈశ్వరోజు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర జ్యువెల్లర్స్, కరీంనగర్

భద్రతా బలగాల చక్రవ్యూహంలో కర్రి గుట్టలు!

- మూడు వైపుల నుంచి ముట్టడించిన సాయుధ బలగాలు..
- తోడైన తెలంగాణ గ్రేహౌండ్స్ ఫోర్స్... సీజీ, టీజీ పోలీసుల జాయింట్ ఆపరేషన్
- వాజేడు, వెంకటాపూర్‌ల మీదుగా గుట్టల్లోకి 2 వేల మంది పోలీసులు
- మందుపాతరలు, క్లైమోర్ మైన్‌ల నిర్వీర్యం.. 10 రోజులపాటు కర్రిగుట్టల్లో సెర్చింగ్



ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని కర్రి గుట్టలు

సాక్షిప్రతినిధి, వరంగల్/భద్రాద్రికొత్తగూడెం : ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రి గుట్టలను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వాజేడు, వెంకటాపూర్‌ల మీదుగా గుట్టల్లోకి 2 వేల మంది సాయుధ భద్రతాదళాలు ప్రవేశించాయి. కర్రి గుట్టల్లో మందుపాతరలు అమర్చామని, గిరిజన, ఆదివాసీలు ఎవరూ రావొద్దని కూడా మావోయిస్టులు లేఖలో పేర్కొన్న విషయాన్ని భద్రతాదళాలు సీరియస్‌గా తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. గుట్టల్లోకి మావోయిస్టు నాయకులు, దళాలు ప్రవేశించాయన్న పక్కా సమాచారం మేరకు భారీ బలగాలను ప్రభుత్వాలు మోహరించాయన్న చర్చ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు.. తెలంగాణ వైపు నుంచి గ్రేహౌండ్స్ బృందాలు భారీగా ఇంకా తరలుతూనే ఉన్నాయి.

ముర్మూర్ ఏరియాలో హెలికాప్టర్లు...

పది రోజులకు సరిపడే వంట సామగ్రితో కర్రిగుట్టల్లోకి బలగాలు కూంబింగ్‌కు వెళ్లగా.. వాజేడు, వెంకటాపూర్‌ల సరిహద్దులో పోలీసు ఉన్నతాధికారులు మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కూంబింగ్‌లో ఉన్న బలగాలు ల్యాండ్, క్లైమోర్ మైన్‌లను నిర్వీర్యం చేసే క్రమంలో భారీ శబ్దాలు వచ్చినట్టు చుట్టుపక్కల గ్రామాల జనం చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం వాజేడు మండలం ముర్మూర్ సమీపంలో రెండు హెలికాప్టర్‌లు తిరిగినట్లు స్థానికులు చెప్పారు. మైన్, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, రెండు హెలికాప్టర్‌లను అధికారులు అందుబాటులో పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కర్రి గుట్టల సమీపంలోని ముకునూరు పాలెం, వీరభద్రవరం, అంకన్నగూడెం అటవీ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలు, రాత్రి 8 గంటల సమయంలో కాల్పుల శబ్దం వినిపించినట్లు ప్రజలు చెబుతున్నారు. చాలా రోజుల తర్వాత పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ చేస్తుండటంతో అటవీ గ్రామాల్లో మళ్లీ అలజడి మొదలైంది.

ఈసారి టార్గెట్ హిడ్మా : మావోయిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ–1కు నేతృత్వం వహిస్తున్న మడావి హిడ్మా లక్ష్యంగా ప్రభుత్వ భద్రతాదళాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయా ? అంటే అవుననే సమాధానం వస్తోంది. మావోయిస్టు కీలక నేతలు, కమిటీలు స్థావరంగా చేసుకున్న కర్రిగుట్టలకు రక్షణగా పీఎల్‌జీఏ కంపెనీ– 1 వ్యవహరిస్తోంది. 400 మంది సాయుధులతో కూడిన ఈ కంపెనీ.. ఆ పార్టీలో మెరుపు దాడులు చేయడంలో దిట్టగా పేరు తెచ్చుకుంది. ఈ కంపెనీ అడ్డాగా ఉన్న అడవిని టార్గెట్ చేసుకొని 'కర్రిగుట్టలు బచావ్'పేరుతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌తోపాటు కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి.

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో
నలుగురికి విముక్తి



సాక్షి, హైదరాబాద్: మయన్మార్ కేంద్రంగా సైబర్‌ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగా ఉన్న నలుగురు భారతీయులకు విముక్తి లభించింది. వీరిలో తెలంగాణకు చెందిన ముగ్గురు, ఏపీకి చెందిన ఒకరున్నారు. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపిన సైబర్ నేరగాళ్ల వలలో పడి బందీలుగా మారారు. ఇటీవల మయన్మార్ నుంచి వందలాది మంది తనలాంటి బాధితులను కేంద్రమంత్రి బండి సంజయ్ స్వదేశానికి రప్పించారని తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చానని రాకేశ్‌రెడ్డి తెలిపారు. దీంతో బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకొని తమని స్వదేశానికి రప్పించారన్నారు. రాకేశ్‌రెడ్డితోపాటు కోహెడకు చెందిన శివశంకర్, కరీంనగర్ జిల్లాకు చెందిన కసూరి గణేశ్‌తోపాటు ఏపీకి చెందిన ఆకుల గురు స్వదేశానికి చేరినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మయన్మార్‌లో తెలుగు రాష్ట్రాల యువతతోపాటు వందలాది మంది భారతీయులు సైబర్‌క్రైమ్ ముఠాలో వెట్టిచాకిరీ చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. త్వరలోనే వారందరినీ స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గలగం–నడుంపల్లి గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఆ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్ బలగాలు సోమవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టాయి. మంగళవారం తెల్లవారుజామున పోలీసులకు తారసపడిన మావోయిస్టులు.. బలగాల పైకి కాల్పులు జరపగా పోలీసులు కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎదురు కాల్పులు జరగగా ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. కాగా, ఆదే జిల్లాలోని బెద్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టును గుండిపూరి ఆర్‌పీసీ మెంబర్, మిలీషియా ప్లాటూన్ కమాండర్ వెల్లా వాచంగా గుర్తించారు. అతడిపై రూ.3 లక్షల రివార్డు ఉంది.

కర్రి గుట్టలపై కాల్పులు ఆపండి

ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని ఊసూర్ బ్లాక్‌లోని కర్రిగుట్టల సమీపంలో సాయుధ బలగాలు కాల్పుల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి భారీ స్థాయిలో సాయుధ బలగాలు కాల్పులు జరుపుతున్నట్లు, అదనపు బలగాల తరలింపు కూడా జరుగుతున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. శాంతి చర్చల ప్రతిపాదన చేస్తూనే , ఇటువంటి హత్యాకాండకు ప్రభుత్వాలు తెగబడటం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో సాధారణ ప్రజానీకం మరణించే ప్రమాదం ఉందని, వెంటనే సాయుధ చర్యలు నిలిపివేయాలని కోరుతున్నామన్నారు.

కుసుమ్‌కు ఈఆర్సీ ఆమోదం

- 4,000 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు అనుమతి
- యూనిట్‌కు రూ.3.13 ధరతో కొనేందుకు గ్రీన్ సిగ్నల్
- కుసుమ్ కింద రాష్ట్రానికి 1,000 మెగావాట్లకే అనుమతి
- మిగిలిన 3,000 మెగావాట్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: పీఎం-కుసుమ్ పథకం కాంపోనెంట్-ఏ కింద 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) అనుమతిచ్చింది. మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) నుంచి 1,000 మెగావాట్లు, రైతుల నుంచి 3,000 మెగావాట్లు కలిపి మొత్తం 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3.13 ధరతో 25 ఏళ్లపాటు కొనుగోలు చేసేందుకు అనుమతిస్తూ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుసుమ్ పథకం కాంపోనెంట్–ఏ కింద కేంద్రం గతంలో రాష్ట్రానికి 4,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతిచ్చి, ఆ తర్వాత 1,000 మెగావాట్లకు తగ్గించింది. రాష్ట్రప్రభుత్వం మాత్రం 4,000 మెగావాట్ల సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) ఆహ్వానించగా, పెద్ద సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. కేంద్రం 1,000 మెగావాట్లకే అనుమతివ్వగా, మిగిలిన 3,000 మెగావాట్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఏ విధంగా అనుమతులిస్తారని గతంలో ఈఆర్సీ నిర్వహించిన బహిరంగ విచారణలో కొందరు ప్రశ్నించారు. రద్దు చేసిన 3000 మెగావాట్ల అనుమతులను మళ్లీ పునరుద్ధరించాలని కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. ఒకవేళ కేంద్రం అనుమతివ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యామ్నాయ మార్గంలో ఈ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ పథకం కింద సౌరవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు గత నెలలో ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించిన తర్వాత, అందుకు అనుమతి కోరుతూ ఈఆర్సీకి దరఖాస్తు చేయగా.. ముందు తీసుకున్న చర్యలకు తర్వాత అనుమతులు ఇవ్వలేమని డిస్కంలకు ఈఆర్సీ స్పష్టం చేసింది. రైతులు–డెవలపర్ల మధ్య జరిగే భూముల లీజు ముసాయిదా ఒప్పందాన్ని సైతం ఆమోదించడానికి నిరాకరించింది. ముసాయిదా విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)కు మాత్రం ఆమోదం తెలిపింది.

28 వేల సౌర పంప్‌సెట్ల ఏర్పాటు

కుసుమ్–సీ కాంపోనెంట్ కింద రాష్ట్రానికి 28 వేల సోలార్ పంప్‌సెట్లను కేంద్రం మంజూరు చేసిందని డిస్కంలు ఈఆర్సీకి తెలిపాయి. కాంపోనెంట్–బీ కింద ఆఫ్ గ్రిడ్ సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటుకు సైతం అనుమతులు కోరుతున్నామని వివరించాయి.

న్యాయమూర్తుల బదిలీలు ఆపాలి

సుప్రీంకోర్టుకు హెచ్‌సీఏఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన న్యాయమూర్తుల బదిలీలు ఆపాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) తీర్మానం చేసింది. దీనికి సభ్యులంతా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. తెలంగాణకు చెందిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధను కర్ణాటకకు, జస్టిస్ కె.సురేందర్‌ను మద్రాస్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించి, ఆ మేరకు కేంద్రానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హెచ్‌సీఏఏ మంగళవారం అత్యవసరంగా సమావేశమైంది. ఎంపిక చేసుకుని బదిలీ చేయడం సరికాదని, పారదర్శకత పాటించాలని సుప్రీంకోర్టు కొలీజియంను విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు జి.రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయులను చుట్టుముట్టి కాల్చేశారు!



ఉగ్రమూకల కోసం గాలిస్తున్న ఆర్మీ జవాన్లు



పర్యాటకురాలిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తున్న జవాను

భార్యాపిల్లల ముందే పొట్టన పెట్టుకున్నారు

పాల్గొన్నది ఐదుగురు ముష్కరులు! ● దేశవ్యాప్తంగా పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాలు

పహల్గాం: బైసారన్. పహల్గాంకు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే రిసార్ట్ పట్టణం. సుదూరాల దాకా పరుచుకున్న అందమైన మైదానాలు, పైన్ అడవులు, మంచు కొండలతో పర్యాటకులకు స్వర్గధామంగా అలరారుతుంటుంది. దశాబ్దాలుగా సినిమా షూటింగులకు, ట్రెక్కర్లకు ఇది ఫేవరెట్ స్పాట్. ఇక్కడికి చేరుకోవాలంటే కాలినడక లేదా గుర్రాలే శరణ్యం. వేసవి కావడంతో కొద్ది రోజులుగా పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఉగ్రవాదులు అదను చూసి పంజా విసిరారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. భారీ ఆయుధాలతో సమీప అడవుల్లోంచి వచ్చిపడ్డారు. రకరకాల రైడ్‌లను, స్థానిక రుచులను ఆస్వాదిస్తూ, ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్న పర్యాటకులపై కాల్పులకు తెగబడ్డట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఊహించని దాడితో హాహాకారాలు చెలరేగాయి. పర్యాటకులంతా ప్రాణభయంతో తలో దిక్కు పరుగులు తీశారు. చుట్టూ మైదాన ప్రాంతం కావడంతో కనీసం దాక్కునే వీలు కూడా లేకుండా పోయింది. ఆ క్రమంలో రెండు పర్యాటకుల బస్సులను కూడా ఉగ్రవాదులు అడ్డుకున్నట్టు సాక్షులు తెలిపారు. వారిని ఒక్కొక్కరిగా పేర్లడుగుతూ బస్సుల్లోంచి కిందకు దించారు. హిందువులను మాత్రమే టార్గెట్ చేశారు. పేరు తప్పు చెప్పారని అనుమానం వస్తే ప్యాంట్లు విప్పించి నిర్ధారించుకున్నారు. తర్వాత పాయింట్ బ్లాంక్‌లో కాల్చేశారు. దాంతో 26 మంది పర్యాటకులు నిస్సహాయంగా నేలకొరిగారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఎటు చూసినా శవాలు, తూటా గాయాలకు కుప్పకూలి లేవలేక అల్లాడుతున్న వాళ్లతో పరిస్థితి భీతావహంగా మారింది. మృతదేహాల వద్ద మహిళలు గుండెలవిసేలా రోదిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ''తూటా నా భర్త తలలోంచి దూసుకెళ్లింది. నా కళ్లముందే కన్నుమూశాడు'' అంటూ ఓ మహిళ హృదయవిదారకంగా విలపించింది. తన పక్కనున్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డట్టు తెలిపింది. ముష్కరులు జమ్మూలోని కిష్త్వార్ గుండా పాక్ నుంచి చొరబడి కొకెర్‌నాగ్ మీదుగా వచ్చిపడ్డట్టు భావిస్తున్నారు.

మగవారే లక్ష్యంగా అంతులేని ఉన్మాదం

నరమేధంలోనూ ఉగ్రవాదులు అంతులేని ఉన్మాదం ప్రదర్శించారు. మగవారిని మాత్రమే లక్ష్యంగా ఎంచుకున్నారు. భార్యాపిల్లల కళ్లముందే వారిని కర్కశంగా కాల్చి చంపి వికృతానందం పొందారు. కాల్పులకు తెగబడింది ఐదుగురు ఉగ్రవాదులని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ''తమకు సమీపంగా ఉన్న 40 మంది పర్యాటకులను చుట్టుముట్టారు. కేవలం హిందువులను మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. ఒక్కో పర్యాటకున్నీ పేరడిగి మరీ కాల్చారు'' అని ఒక మహిళ చెప్పుకొచ్చింది.

పోయి మోదీకి చెప్పుకొమ్మన్నారు

అందుకే నన్ను ప్రాణాలతో వదిలేస్తున్నామన్నారు
నా భర్తను కళ్లముందే దారుణంగా కాల్చేశారు
కర్నాటకకు చెందిన పల్లవి ఆవేదన

బొమ్మనహళ్లి: భార్య, కుమారునితో కలిసి అప్పటిదాకా ప్రకృతిని ఆస్వాదించాడు. ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సరదాగా గడిపాడు. కాసేపటికే వాళ్ల కళ్లముందే ఉగ్ర కాల్పులకు బలయ్యాడు. కర్నాటకలోని శివమొగ్గకు చెందిన మంజునాథ్‌రావ్ అనే 47 ఏళ్ల రియల్టర్ విషాదాంతమిది. విహారయాత్ర కోసం భార్య పల్లవి, కుమారునితో కలిసి 19వ తేదీన ఆయన కశ్మీర్ వెళ్లారు. బైసారన్‌లో ఉండగా కాల్పులు చోటుచేసుకున్నాయి. మంజునాథ్ తూటాలకు బలవగా భార్య, కుమారుడు అభిజేయ సురక్షితంగా బయటపడ్డారు. ఉగ్రవాదులు తమను కావాలనే వదిలేశారని పల్లవి చెప్పారు. ''ఆ సమయంలో 500 మంది దాకా పర్యాటకులం ఉన్నాం. అప్పుడే గుర్రం దిగాం. నా కొడుకు తినేందుకు ఏమైనా దొరుకుతుందా అని నా భర్త దగ్గర్లోని హోటల్లో విచారిస్తున్నారు. అబ్బాయితో పాటు నేనక్కడికి వెళ్తుండగానే కాల్పుల శబ్దం వచ్చింది. ఆర్మీ జవాన్లు కాల్పులు జరుపుతున్నారనుకున్నాం. కానీ జనం పరుగులు చూసి నేను కూడా పరిగెత్తాను. అప్పటికే నా భర్త రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ముగ్గురు ఉగ్రవాదులు బిస్మిల్లా, బిస్మిల్లా అంటున్నారు. వాళ్లు హిందువులను మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. మగవారిని తీవ్రంగా కొడుతున్నారు. ''నా భర్తను ఎందుకింత దారుణంగా హత్య చేశారు, నన్నూ చంపెయ్యండి అన్నాను. 'మా అమ్మను, నన్ను కూడా చంపండిరా' అని నా కొడుకు కూడా గట్టిగా అరిచాడు. అయినా వాళ్ల గుండెలు కరగలేదు. 'మిమ్మల్ని చంపేది లేదు. ఇక్కడ జరిగింది పోయి మీ మోదీకి చెప్పుకొ'మ్మన్నారు. కశ్మీర్ చూడాలనేది నా భర్త కల. మా కర్మ కొద్దీ ఇక్కడికొచ్చాం'' అంటూ ఆమె గుండెలవిసేలా రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

కంటతడి పెట్టిస్తున్న సరదా వీడియో



మంజునాథ్ చివరి సెల్ఫీ

ఘటనకు కాస్త ముందు పల్లవి దంపతులు తీసుకున్న సరదా వీడియో వైరల్‌గా మారి అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ప్రకృతి సోయగాలను ఎంతగానో ఆస్వాదిస్తున్నామని, ముందు రోజే షికారా (బోట్) రైడింగ్ అద్భుతంగా సాగిందని మంజునాథ్ ఉత్సాహంగా చెబుతూ కన్పిస్తున్నాడు. భర్త మృతదేహాన్ని త్వరగా తరలించాలని అధికారులను పల్లవి వేడుకున్నారు. వాహనాలు వచ్చే వీల్లేనందున హెలికాప్టర్లో తరలించాలని కోరారు.

మృతుల్లో హైదరాబాద్ ఐబీ కార్యాలయ ఉద్యోగి

సాక్షి, సిటీ బ్యూరో: ఇంటెలిజెన్స్ బ్యూరో హైదరాబాద్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్ (ఎస్‌ఓ)గా పని చేస్తున్న మనీశ్ రంజన్ కశ్మీర్ ఉగ్ర దాడిలో మరణించారు. బిహార్‌కు చెందిన ఆయన 2022లో హైదరాబాద్ బదిలీ అయ్యారు. లీవ్ ట్రావెల్ కన్సెషన్ కింద మూడు రోజుల క్రితం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కశ్మీర్ వెళ్లారు. ఉగ్రవాదులు అడ్డుకున్న టూరిస్టు బస్సుల్లో ఒక దాంట్లో మనీశ్ కుటుంబం ఉంది. ఆయనను కుటుంబం నుంచి వేరు చేశారు. పేరు చెప్పగానే నేరుగా తలకు గురిపెట్టి పాయింట్ బ్లాంక్‌లో కాల్చారు. తల భాగం ఛిద్రమై భార్యాపిల్లల ఎదుటే కన్నుమూయడంతో వాళ్లు తీవ్ర షాక్‌కు లోనయ్యారు. మనీశ్ మృతి పట్ల హైదరాబాద్ ఐబీ కార్యాలయ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.



ఆస్పత్రిలో బాధితునికి వైద్య సాయం

గుర్రాలపైనే ఆస్పత్రికి

ఘటనా స్థలి హృదయ విదారక దృశ్యాలకు వేదికగా మారింది. ఎటు చూసినా రక్తం మరకలు, మృతదేహాలు, క్షతగాత్రులే. ఆదుకోవాలంటూ మిన్నంటిన రోదనలే. గాయపడ్డ వారిని కాపాడేందుకు స్థానికులు తక్షణం స్పందించారు. పర్యాటకులు అక్కడికి చేరుకోవడానికి ఉపయోగించిన పోనీల (పొట్టి గుర్రాల) మీదే క్షతగాత్రులను హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. కాసేపటికే స్థానిక అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. అంబులెన్సులు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో బాధితులను హెలికాప్టర్లలో తరలించారు. మిగతావారిని కట్టుదిట్టమైన భద్రత నడుమ పహల్గాం క్లబ్‌కు చేర్చారు.

పిరికిపంద చర్య: రాష్ట్రపతి ముర్ము

తీవ్రంగా ఖండించిన వైఎస్ జగన్

ఉగ్ర దాడిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని క్షమార్హం కాని పిరికిపంద చర్యగా ముర్ము అభివర్ణించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్‌మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తదితరులు దాడిని ఖండించారు. పర్యాటకుల మృతిపై వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ''ఈ ఘటన షాక్‌కు గురి చేసింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకొంటున్నా'' అంటూ ట్వీట్ చేశారు.



రోదిస్తున్న మృతుల బంధువులు

అప్పుడూ క్లింటన్ పర్యటిస్తుండగానే...

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులను లక్ష్యం చేసుకోవడం ఇది తొలిసారేమీ కాదు. 2000 మార్చి 21న అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటిస్తున్న వేళ అనంత్‌నాగ్ జిల్లా చట్టీసింగ్‌పురాలో టెర్రరిస్టులు చెలరేగిపోయారు. ఏకంగా 36 మంది సిక్కులను కాల్చి చంపారు.

- 2000లోనే అమర్‌నాథ్ యాత్రికులపై పహల్గాం బేస్ క్యాంప్ వద్ద జరిగిన ఉగ్ర దాడిలో 32 మంది మరణించారు. 60 మందికి పైగా గాయపడ్డారు.
- 2001లో 13 మంది, 2002లో 11 మంది అమర్‌నాథ్ యాత్రికులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు.
- 2001 అక్టోబర్ 1న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ప్రాంగణంపై జరిగిన ఆత్మాహుతి దాడికి 36 మంది బలయ్యారు.
- 2002లో జమ్మూ–శ్రీనగర్ హైవేపై ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు భద్రతా సిబ్బందితో పాటు 19 మంది మరణించారు.
- 2003లో పుల్వామా జిల్లా నందిమార్గ్‌లో 24 మంది కశ్మీరీ పండిట్లను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు.
- 2005లో పుల్వామాలో కిక్కిరిన మార్కెట్ ప్రాంతంలో కార్లో పేలుడు పదార్థాలు నింపి పేల్చేయడంతో 13 మంది పౌరులు, ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు.
- 2006లో 9 మంది నేపాలీ, బిహారీ కూలీలను కాల్చి చంపారు.
- 2017లో అమర్‌నాథ్ యాత్ర ముగించుకుని తిరిగొస్తున్న భక్తుల బృందంపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు 8 మంది బలయ్యారు.

100 రౌండ్ల కాల్పులు

బాణసంచా అనుకున్నా

ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుండగా ఒక పర్యాటకుడు మైదాన ప్రాంతాల్లో మిత్రునితో సరదాగా నడుస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ''తొలుత బాణసంచా కాలుస్తున్నారేమో అనుకుని అంతగా పట్టించుకోలేదు. కానీ కాల్పుల శబ్దం అంతకంతకూ పెరిగిపోయింది. అంతా హాహాకారాలు చేస్తూ పరుగులు తీస్తుండటంతో ఉగ్ర దాడి అని అర్థమై వెంటనే పరుగులు తీశాం. కనీసం 100 రౌండ్ల దాకా కాల్చారు'' అని చెప్పుకొచ్చాడు.

నెత్తురోడిన కశ్మీరం..

▶ మొదటి పేజీ తరువాయి

గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారు. వారిలో ఒకరు నేపాలీ కాగా మరొకరిది యూఏఈ. మరో ఇద్దరు స్థానికులు కాగా మిగతావారు కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు. 2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై టెర్రరిస్టులు కాల్పులకు దిగి 47 మందిని పొట్టన పెట్టుకున్న అనంతరం కశ్మీర్‌లో జరిగిన అతి పెద్ద దాడి ఇదే. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇది తమ పనేనని పాకిస్తాన్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా తాలూకు ముసుగు సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) ప్రకటించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీతో సహా పార్టీలకు అతీతంగా నేతలంతా దాడిని ముక్త కంఠంతో ఖండించారు. ఉగ్రవాదులది మతిలేని ఉన్మాదమంటూ మోదీ మండిపడ్డారు. ''ఈ హేయమైన దాడికి పాల్పడ్డ వారిని వదిలే ప్రసక్తే లేదు. వారందరినీ చట్టం ముందు నిలబెడతాం. ముష్కరుల కుటిల అజెండా ఫలించబోదు. ఉగ్రవాదంపై రాజీలేని పోరు జరపాలన్న మా సంకల్పం మరింత బలపడింది'' అని ప్రకటించారు. ''మృతుల కుటుంబీకులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడ్డవారు వెంటనే కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులందరికీ అన్నివిధాలా సాయం అందజేస్తున్నాం'' అని ప్రధాని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఉన్న ఆయన విషయం తెలియగానే పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని భారత్ తిరిగొచ్చారు. తన గౌరవార్థం సౌదీ యువరాజు ఏర్పాటు చేసిన విందును కూడా రద్దు చేసుకుని బయల్దేరారు. అంతకుముందు సౌదీ నుంచే కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అనంతరం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా తదితర ఉన్నతాధికారులు, ఢిల్లీలో ఉన్న జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తదితరులతో షా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ వెంటనే ప్రధాని సూచన మేరకు వారందరితో కలిసి మంగళవారం రాత్రే ప్రత్యేక విమానంలో హుటాహుటిన కశ్మీర్ చేరుకున్నారు. రాజ్‌భవన్‌లో పరిస్థితిని సమీక్షించారు. ''తాజా పరిస్థితిని మోదీకి నివేదించా. ఉగ్ర దాడి నన్ను తీవ్రంగా కలచివేసింది. దాడికి తెగబడ్డవారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వెనకున్న సూత్రధారులను కూడా ఉక్కుపాదంతో అణచివేస్తాం'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన బుధవారం ఘటనాస్థలిని సందర్శించనున్నారు. ఇది కనీవినీ ఎరగని పిరికిపంద చర్య అంటూ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. ఉగ్రవాదుల కోసం పహల్గాం, పరిసర ప్రాంతాలన్నింటినీ భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. జమ్మూ కశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు కుటుంబసమేతంగా భారత్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా ఖండించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరులో భారత్‌కు పూర్తిగా వెన్నుదన్నుగా నిలుస్తామని నేతలిద్దరూ పునరుద్ఘాటించారు. ''కశ్మీర్ దారుణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ విషయంలో ప్రధాని మోదీకి, భారత పౌరులకు అన్నివిధాలా మద్దతుగా ఉంటాం'' అని ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌సోషల్‌లో పేర్కొన్నారు. ఈ దాడిని దారుణ నేరంగా పుతిన్ అభివర్ణించారు.

వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం

- విధివిధానాలు అధికారికంగా ఖరారు
- ప్రధాని మోదీ అప్రూవల్ రేటింగ్స్ చూస్తే నాకు అసూయగా ఉంది
- అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్



జైపూర్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరుగుతోందని, ఆయనను చూస్తే అసూయగా ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని కొందరు విమర్శిస్తున్నప్పటికీ ఆయన పేరు ప్రతిష్టలు మరింత ఇనుమడిస్తున్నాయే తప్ప ఎక్కడా తగ్గడం లేదన్నారు. అంతర్జాతీయంగా మోదీకి లభిస్తున్న అప్రూవల్ రేటింగ్స్ తనకు అసూయ కలిగిస్తున్నాయని, ఈ విషయం సోమవారం నేరుగా మోదీకే చెప్పానని వెల్లడించారు. 'మోదీ స్పెషల్ పర్సన్' అని ప్రశంసించారు. మంగళవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓ సదస్సులో వాన్స్ ప్రసంగించారు. ప్రధానంగా ఇండియా–అమెరికా సంబంధాలపై మాట్లాడారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం విషయంలో తుది ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధమైందని ప్రకటించారు. రోడ్‌మ్యాప్‌పై విధివిధానాలను ఇరు దేశాలు అధికారికంగా ఖరారు చేశాయని వెల్లడించారు. భారతదేశ ఉత్పత్తులపై విధించిన 26 శాతం ప్రతీకార సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 90 రోజులపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం కావడం డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల విజన్ వాస్తవరూపం దాల్చే విషయంలో ఒక కీలకమైన ముందడుగు అని వాన్స్ అభివర్ణించారు. భారత్–అమెరికా సంయుక్తంగా ప్రగతి సాధించాలని ట్రంప్ కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ 'కొరుకుడుపడని కఠినమైన సంధానకర్త' అని అభివర్ణించారు. ఆయనతో బేరం తేల్చడం అంత సులభం కాదన్నారు. అందుకే అమెరికా ఆయనను గౌరవిస్తోందని వ్యాఖ్యానించారు.

మిత్రుడిగా వచ్చా..

తాను ఇండియాకు నీతిబోధలు చేయడానికి రాలేదని, ఒక భాగస్వామిగా, మిత్రుడిగానే వచ్చానని జె.డి.వాన్స్ అన్నారు. ఏ పని ఎలా చేయాలో ఇండియాకు నేర్పే ఉద్దేశం తనకు లేదన్నారు. గతంలో అమెరికా ప్రభుత్వాలు భారత్‌కు నీతి పాఠాలు బోధించేందుకు ప్రయత్నించేవని, భారత్‌ను చౌకగా కార్మిక శక్తి లభించే దేశంగానే చూసేవారని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని పేర్కొన్నారు. అమెరికా ఉత్పత్తులను మరింత అధికంగా కొనుగోలు చేయాలని భారత్‌కు విజ్ఞప్తిచేశారు. అమెరికా ఇంధన, రక్షణ ఉత్పత్తులు, పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేయాలన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. టెక్నాలజీ, రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి వేర్వేరు కీలక రంగాల్లో భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం'పై ఇరుదేశాలు చర్చలు కొనసాగిస్తున్నాయని తెలిపారు.

ఇవాన్ ఇండియాలోనే ఉంటానన్నాడు

ప్రధాని మోదీ తమకు చక్కటి ఆతిథ్యం ఇచ్చారని జె.డి.వాన్స్ ఆనందం వ్యక్తంచేశారు. మోదీ ప్రేమానురాగాలు తమ కుటుంబాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా తమ ముగ్గురు పిల్లలకు మోదీ ఎంతో ఆత్మీయులయ్యారని తెలిపారు. మోదీ ఇచ్చిన విందు తన కుమారుడు ఇవాన్‌కు ఎంతోగానో నచ్చిందని, ఇండియాలోనే ఉండిపోవాలని కోరుకుంటున్నట్లు ఇవాన్ తనతో చెప్పాడని అన్నారు. తన పిల్లలకు డొనాల్డ్ ట్రంప్‌తో ఏర్పడిన అనుబంధం ఇప్పుడు మోదీతోనూ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఇండియాలో తన కంటే తన భార్య ఉషా చిలుకూరికే గొప్ప ఆదరణ లభిస్తోందని వాన్స్ చమత్కరించారు.

అంబర్ కోట సందర్శన

వాన్స్ తన భార్య ఉషా చిలుకూరి, ముగ్గురు పిల్లలతో కలిసి మంగళవారం ఉదయం రాజస్తాన్‌లోని చరిత్రాత్మక అంబర్ కోటను సందర్శించారు. వాన్స్ కుటుంబానికి రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఉప ముఖ్యమంత్రి దియా కుమారీతోపాటు అధికారులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. చక్కగా అలంకరించిన ఏనుగులు, తీర్చిదిద్దిన రంగవల్లులు, జానపద నృత్యాలతో అమెరికా ఉపాధ్యక్షుడికి ఆత్మీయ స్వాగతం లభించింది. చందా, మాలా అనే రెండు ఏనుగులు తొండాలు ఎత్తి వాన్స్ కుటుంబానికి స్వాగతం పలికాయి. రాజస్తానీ సంప్రదాయ జానపద నృత్యాలు అలరించాయి.

విశ్వసనీయ మిత్రదేశం

సౌదీ అరేబియాపై మోదీ ప్రశంసలు

జెద్దా: ''భారత్–సౌదీ అరేబియా స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలి. అందుకు నా పర్యటన దోహదపడుతుంది'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం సౌదీలో పర్యటించారు. మోదీ విమానం సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఆరు ఎఫ్–15 ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా నిలవడం విశేషం. సంబంధిత వీడియోను భారత విదేశాంగ శాఖ విడుదల చేసింది. మోదీకి లభించిన అపూర్వ ఆహ్వానం భారత్–సౌదీ అరేబియా మధ్య బలపడుతున్న రక్షణ సహకారానికి ప్రతీక అని పేర్కొంది. ఎయిర్‌పోర్టు నుంచి బస చేసే హోటల్‌కు చేరుకున్న మోదీకి సంప్రదాయ స్వాగతం లభించింది. సౌదీ గాయకుడు హాషీం అబ్బాస్ 'ఆయే వతన్ మేరే ఆబాద్ రాహే తూ' హిందీ పాటను చక్కగా ఆలపించారు. మోదీ చప్పట్లతో ఆ గాయకుడిని అభినందించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రవాస భారతీయులతో ఆప్యాయంగా మాట్లాడారు.



సౌదీ యువరాజు నా సహోదరుడు

భారత్‌కు సౌదీ అత్యంత విలువైన, విశ్వసనీయమైన మిత్రదేశమని మోదీ ఉద్ఘాటించారు. ఆయన మంగళవారం 'అరబ్ న్యూస్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆసియాలో శాంతి, స్థిరత్వాన్ని రెండు దేశాలు ప్రగాఢంగా కోరుకుంటున్నాయని మోదీ తెలిపారు.

శనివారం పోప్ అంత్యక్రియలు

- పార్థివదేహాన్ని దర్శించుకునేందుకు బుధవారం నుంచి అనుమతి
- పోప్ కోరిక మేరకు నిరాడంబరంగా సాగనున్న అంత్యక్రియలు

వాటికన్ సిటీ: వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో మూడు రోజులపాటు ప్రజల సందర్శనలు, నివాళుల తర్వాత శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలను నిర్వహించనున్నారు. కోట్లాది మంది క్యాథలిక్‌ల అత్యున్నత మతాధికారి అయినప్పటికీ అత్యంత సాధారణ వ్యక్తిలా ఖనన క్రతువును పూర్తిచేయాలని పోప్ కోరుకున్నారని, అదేరీతిలో అంత్యక్రియలను పూర్తిచేస్తామని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ మరణంతో ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తుతున్న వేళ పోప్ అంత్యక్రియల షెడ్యూల్ వివరాలను వాటికన్ అధికార వర్గాలు మంగళవారం వెల్లడించాయి. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియల కార్యక్రమాన్ని మొదలపెట్టనున్నారు. కార్డినళ్ల కాలేజీ డీన్ అయిన 91 ఏళ్ల కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించను న్నా రు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు, అర్జెంటీనా అధ్యక్షుడు జేవి యర్ మిలేయీ తదిత రులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా కోమాలోకి వెళ్లి, తర్వాత గుండె వైఫల్యం కారణంగా కన్ను మూసిన విషయం విదితమే.



తొలిసారిగా పార్థివదేహం ఫొటో విడుదల

అధికారిక నివాసంలోకాకుండా పోప్ పార్థివదేహాన్ని పోప్‌గా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆయన నివసిస్తున్న డోమస్ శాంటా మార్టా గెస్ట్‌హౌస్ హోటల్ చాపెల్‌లోనే ఉంచారు. వాటికన్ విదేశాంగ మంత్రి కార్డినల్ పెట్రో పరోలిన్ పోప్‌కు నివాళులర్పిస్తున్న ఫొటోలను అధికారికంగా మంగళవారం విడుదలచేశారు. ఎర్రని వస్త్రంతో కప్పిన కలపతో చేసిన శవపేటికలో పోప్ పార్థివదేహాన్ని ఉంచారు. పోప్ నచ్చిన శ్వేత వర్ణ 'మిటర్' టోపీని ఆయనకు పెట్టారు.

సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో ఖననం

ఆయన ఎక్కువగా సందర్శించి, ప్రార్థించే సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చి ప్రాంగణంలోనే పోప్‌ను ఖననం చేయనున్నారు. అక్కడే తనను ఖననం చేయాలని పోప్ గతంలోనే సూచించారు. ఆ మేరకే ఖనన క్రతువును పూర్తిచేయనున్నారు.

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించి, శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ప్రారంభమైన ఈ మూడేళ్లలో ద్వైపాక్షిక చర్చలపై ఆయన స్పందించడం ఇదే తొలిసారి. ''ఎలాంటి శాంతి చర్యలకైనా సిద్ధంగా ఉన్నాం. ఉక్రెయిన్ నుంచీ అదే ఆశిస్తున్నాం'' అని రష్యా ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ స్పష్టం చేశారు. కాల్పుల విరమణను కొనసాగించడానికి కూడా సుముఖత వ్యక్తం చేశారు. శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తుండటం తెలిసిందే. కానీ రష్యా, ఉక్రెయిన్ పరస్పర దాడులు మాత్రం ఆగడం లేదు. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామన్న ప్రకటనను కూడా రష్యా ఉల్లంఘించింది. ఆదివారం కీవ్‌పై డ్రోన్, బాంబు దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది.

సివిల్స్ టాపర్ శక్తి

▶ మొదటి పేజీ తరువాయి

సాధించిన వారిలో జనరల్ కేటగిరీ నుంచి 335 మంది ఎంపికవగా ఆర్థికంగా వెనకబడిన వర్గాల నుంచి 109 మంది ఎంపికయ్యారు. ర్యాంకర్లలో 318 మంది బీసీలు, 160 మంది ఎస్సీలు, 87 మంది ఎస్టీలు ఉన్నారని యూపీఎస్సీ తెలిపింది. మొత్తంగా 1,129 ఖాళీలు ఉన్నట్లు కమిషన్ గతంలో పేర్కొంది. వాటిలో 180 ఐఏఎస్, 55 ఐఎఫ్ఎస్, 147 ఐపీఎస్, 605 గ్రూప్-ఏ పోస్టులు, 142 గ్రూప్-బీ పోస్టులు ఉన్నాయి.

భిన్న నేపథ్యాలు..

ఆలిండియా టాపర్‌గా నిలిచిన శక్తి దూబే ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే ఐదో ప్రయత్నంలో ర్యాంక్ సాధించగా రెండో ర్యాంకర్ హర్షితా గోయల్ మూడో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికైంది. ఆమె ప్రస్తుతం చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఇక మూడో ర్యాంక్ సాధించిన 26 ఏళ్ల డోంగ్రే అర్చిత్ పరాగ్ స్వస్థలం మహారాష్ట్రలోని పుణే. అతను తమిళనాడులోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. గతంలో ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. 2023లో సివిల్స్ పరీక్షల్లో 153వ ర్యాంక్ సాధించినా మెరుగైన ర్యాంక్ కోసం ఈసారి ప్రయత్నించి అందులో సఫలీకృతమయ్యాడు. కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివిన గుజరాత్ వాసి, నాలుగో ర్యాంకర్ మార్గి చిరాగ్ షా ఐదో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికైంది. రెండో ప్రయత్నంలో ఐదో ర్యాంక్ సాధించి సివిల్స్‌కు ఎంపికైన 24 ఏళ్ల ఆకాశ్ గార్గ్ ఢిల్లీ గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ వర్సిటీలో బీటెక్ చదివాడు.

230 మందితో రిజర్వ్ జాబితా

యూపీఎస్సీ నిబంధనల ప్రకారం మరో 230 మందిని సంస్థ రిజర్వ్ జాబితాలోకి చేర్చింది. అందులో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ కేటగిరీలతోపాటు సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్-ఏ, గ్రూప్-బీ కేటగిరీల్లో ఈ అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన యూపీఎస్సీ.. ఇందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. మెయిన్స్‌లో మెరుగైన ఫలితాలు సొంతం చేసుకున్న వారికి ఈ ఏడాది జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.

కేటగిరీలవారీగా ఎంపికైన అభ్యర్థుల సంఖ్య..

కేటగిరీ	ఎంపికైన అభ్యర్థులు
జనరల్	335
ఈడబ్ల్యూఎస్	109
ఓబీసీ	318
ఎస్సీ	160
ఎస్టీ	87
మొత్తం	1,009

టాప్-25 ర్యాంకర్లు

శక్తి దూబే (1), హర్షితా గోయల్ (2), డోంగ్రే అర్చిత్ పరాగ్ (3), షా మార్గీ చిరాగ్ (4), ఆకాశ్ గార్గ్ (5), కోమల్ పునియా (6), ఆయుషీ బన్సాల్ (7), రాజ్‌కృష్ణ ఝూ (8), ఆదిత్య విక్రమ్ అగర్వాల్ (9), మయాంక్ త్రిపాఠి (10), సాయి శివాని (11), ఆశీ శర్మ (12), హేమంత్ (13), అభిషేక్ వశిష్ట (14), బన్నా వెంకటేశ్ (15), మాధవ్ అగర్వాల్ (16), సంస్కృతి త్రివేది (17), సౌమ్యా మిశ్రా (18), విభోర్ భరద్వాజ్ (19), త్రిలోక్ సింగ్ (20), దివ్యాంక్ గుప్తా (21), రియా సైనీ (22), బి.శివచంద్రన్ (23), ఆర్. రంగ మంజు (24), ఝీ ఝీ ఏఎస్ (25).

మొత్తం 50 మందికిపైగా తెలుగు అభ్యర్థుల ఎంపిక!

సివిల్ సర్వీసెస్-2024 పరీక్షల ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు సత్తా చాటారు. మొత్తంగా 50 మందికిపైగా ర్యాంకులు సాధించారు. వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన ఎట్టబోయిన సాయి శివాని అఖిల ఆలిండియా 11వ ర్యాంకు సాధించి తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. యూపీఎస్సీ ప్రకటించిన 1,009 మంది ర్యాంకర్లలో దాదాపు 50 మందికిపైగా తెలుగు రాష్ట్రాల అభ్యర్థులున్నట్లు సమాచారం. వారిలో టాప్-20లో బన్న వెంకటేష్ 15వ ర్యాంకు సాధించగా 100 లోపు ర్యాంకులు సాధించిన వారిలో రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంక్, చింతకింది శ్రవణ్ కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, సాయి చైతన్య జాదవ్ 68వ ర్యాంకు ఉన్నారు. అలాగే ఎన్.చేతనరెడ్డి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి 119వ ర్యాంకు, నేలటూరు శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు సాధించారు. నెల్లూరు సాయితేజ 154వ ర్యాంకు, కొలిపాక శ్రీకృష్ణ సాయి 190వ ర్యాంకు సొంతం చేసుకున్నారు.

సర్వీసులవారీగా ఖాళీలు ఇలా..

సర్వీసు	జనరల్	ఈడబ్ల్యూఎస్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
ఐఏఎస్	73	18	53	24	13
ఐఎఫ్ఎస్	23	05	13	09	05
ఐపీఎస్	60	14	41	22	10
గ్రూప్-ఏ	244	57	168	90	46
గ్రూప్-బీ	55	15	44	15	13
మొత్తం	455	109	318	160	87

దేశ సేవ చేయాలని ఐఏఎస్‌కు ప్రిపేర్



దేశ ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. బాంబే ఐఐటీలో బీటెక్, ఎంటెక్ చేశా. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ ఉద్యోగంతో పాటు ఎన్నో ప్రైవేటు ఉద్యోగాలు వచ్చినా ఐఏఎస్ లక్ష్యంతో వాటిని కాదనుకున్నా. పట్టుదలతో ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యా. ఐదుసార్లు ర్యాంక్ రాకపోయినా నిరాశ చెందలేదు. ఐదోసారి 426వ ర్యాంక్ వచ్చింది. ఒకవైపు ఐఆర్ఎంఎస్‌లో ఉద్యోగం చేస్తూనే ఆరోసారి సివిల్స్ రాసి విజయం సాధించా.

- చింతకుంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి
సివిల్స్ ఆలిండియా 62వ ర్యాంకర్

ఐఎఫ్ఎస్ నుంచి ఐఏఎస్ వైపు..



మాది ఆదిలాబాద్ జిల్లా పల్సా తండా. మా నాన్న పోలీస్ కానిస్టేబుల్ గోవింద్ రావ్. అమ్మ ప్రభుత్వ టీచర్ కవిత. తమిళనాడులోని తిరుచిరాపల్లి ట్రిపుల్ ఐటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ చేశా. గతంలో ఐదో ప్రయత్నంలో 131వ ర్యాంక్ రావడంతో ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యా. ఆ తర్వాత ఏడాదిపాటు సెలవుపెట్టి ఆరోసారి సివిల్స్‌కు ప్రిపేరయ్యా. ప్రజలకు సేవ చేసేందుకు ఈసారి ఇంత మంచి ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది.

- సాయి చైతన్య జాదవ్
ఆలిండియా 68వ ర్యాంకర్

ఐపీఎస్ వచ్చినా..

మాది హనుమకొండ. సివిల్స్ ఫలితాల్లో మా అబ్బాయి రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసిన మా అబ్బాయి గతంలో మూడో ప్రయత్నంలో 217వ ర్యాంకు, నాలుగో ప్రయత్నంలో 104వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం శిక్షణలో ఉన్నాడు. ఐదో ప్రయత్నంలో ఎలాంటి శిక్షణ లేకుండానే ఈ ర్యాంకు సాధించాడు. మావాడి కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నాం.

- ఆలిండియా 46వ ర్యాంకర్ రావుల జయసింహారెడ్డి
తల్లిదండ్రులు రావుల ఉమారెడ్డి, తల్లి లక్ష్మి



జయసింహారెడ్డి

నలుగురు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

పాలకుర్తి (రామగుండం)/ బంజారాహిల్స్/ నాగోలు (హైదరాబాద్)/భువనగిరి: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలయ్యామన్న మనస్తాపంతో మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నలుగురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘనశ్యాందాస్‌నగర్ (జీడీనగర్) గ్రామానికి చెందిన సాపల్ల ఎల్లయ్య- గంగమ్మ దంపతుల కుమార్తె శిరేఖ (17), బంజారాహిల్స్ రోడ్డునంబర్-2 ఇందిరానగర్‌కు చెందిన నిష్ఠ (16), తట్టిఅన్నారం, వైఎస్ఆర్ కాలనీకి చెందిన సుక్కా రవికుమార్ కూతురు అరుంధతి (17), భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన రాసాల మల్లేశ్, సునీత దంపతుల చిన్నకుమారుడు అఖిలేష్ యాదవ్ (17) ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఎంపీసీ టాప్ మార్కులు 996

టాప్ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు
- బైపీసీలో కరీంనగర్ అమ్మాయికి వేయికి 997 మార్కులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఈ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో నలుగురు విద్యార్థులు 1,000కి 996 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు ముగ్గురు విద్యార్థులు 469 మార్కులు సాధించారు. ఫస్టియర్ బైపీసీలోనూ 440 మార్కులకు నలుగురు 339 మార్కులు సాధించారు. ఈ సంవత్సరం బైపీసీలో టాప్ మార్కులు 997గా నమోదయ్యాయి. ఇంటర్‌బోర్డ్ మంగళవారం వెల్లడించిన ఫలితాల్లో వివిధ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

టాపర్ల వివరాలు ఇలా..

మొదటి సంవత్సరం (ఎంపీసీ): సి.అక్షయ, పుప్పాలగూడ, హైదరాబాద్ 469/470; పుట్టపోగుల వర్షిణి, బాచుపల్లి, హైదరాబాద్469/470; మామిడి సంహిత, వనస్థలిపురం, హైదరాబాద్469/470.

బైపీసీ: బి. లావణ్య, టీఎస్ఆర్‌జేసీ, మహబూబ్‌నగర్ 439/440; సయ్యద్ అర్షియా సమ్రీన్, మలక్‌పేట్, హైదరాబాద్ 439/440; హస్బాబేగం, టోలీచౌక్, హైదరాబాద్ 439/440 ; వాదుల వైష్ణవి, బాలానగర్, మహబూబ్‌నగర్ 439/440.

సీఈసీ: ఎండీ ఫర్హాన్, గుర్రంగూడ, రంగారెడ్డి జిల్లా 495/500; మునీబ్ అహ్మద్ ఖాన్, కార్వాన్, హైదరాబాద్ 494/500.

హెచ్ఈసీ: తంగోరు వెన్నెల, సుదిమళ్ల ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ 494/500; జంగం గ్లోరీ, సికింద్రాబాద్ 493/500.

మొత్తంగా ఇంటర్ టాపర్స్

ఎంపీసీ: ఇందూరి రష్మిత, రోటరీనగర్, ఖమ్మం 996/1,000 ; వారణాసి మనస్వి, జీడిమెట్ల, రంగారెడ్డి 996/1,000; కూనా రుత్విక్, కొత్తపల్లి, కరీంనగర్ 996/1,000; పల్లెపంగ వసంత్‌కుమార్, సూర్యాపేట 996/1,000.

బైపీసీ: జక్కు అంజన, కొత్తపల్లి, కరీంనగర్ 997/1,000; కేతావత్ అఖిల, పెంచికల్‌పాడ్, దేవరకొండ 996/1,000; డి జ్యోత్స్నశ్రీ, కరీంనగర్ 996/1,000.

సీఈసీ: ఎనుబారి కెవిక్ జోష్, మేడ్చల్ 988/1,000; భక్త గ్రీష్మ, భగత్‌నగర్, కరీంనగర్ 987/1,000.

హెచ్ఈసీ: గుండెబోయిన ధనప్రియ, మదీనాగూడ, రంగారెడ్డి 983/1,000; ఓపీ అభినాష్, శేరిలింగంపల్లి, రంగారెడ్డి 982/1,000.

కాగా, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

గ్రూప్స్ సాధించడమే లక్ష్యం

పల్లెపంగు వసంత్ కుమార్, (996) ఎంపీసీ, ప్రతిభ జూనియర్ కళాశాల, సూర్యాపేట



సూర్యాపేట: స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో గ్రూప్- వన్ ఆఫీసర్ కావాలన్నదే నా కల. నాన్న కానిస్టేబుల్ శీనయ్య, అమ్మ జానకమ్మల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించగలిగాను. ప్రతిభ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

నా లక్ష్యం డాక్టర్



నేను చదివిన కాలేజీ యాజమాన్యం అందించిన ప్రణాళికాబద్ధమైన బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి రాష్ట్రంలో టాపర్‌గా నిలవడం గర్వంగా ఉంది. నీట్ పరీక్షలో సత్తాచాటి సీటు సాధించడంతో పాటు వైద్య విద్య అభ్యసించడమే నా లక్ష్యం.

- జె.అంజనా, కొత్తపల్లి, కరీంనగర్
(బైపీసీ 997/1000)

సివిల్ సర్వెంట్‌గా..



ఇంటర్ సెకండియర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. పటిష్ట ప్రణాళికతో చదివి రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిచినందుకు సంతోషిస్తున్నా. రాబోయే కాలంలో ఉన్నత విద్యనభ్యసించి యూపీఎస్సీ సాధించి సివిల్ సర్వెంట్‌గా సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తా.

- కె.రుత్విక్, కొత్తపల్లి, కరీంనగర్ (ఎంపీసీ996/1000)

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన గురుకులాలు

ప్రైవేటు కాలేజీలకు మించి ఉత్తీర్ణత నమోదు
- నగటున 80% ఫలితాలు సాధించిన సంస్థలు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల వెనకడుగు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ గురుకులాలు మంచి ఫలితాలు కనబరిచాయి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాయి. సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీలు, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీల్లో సగటున 80 శాతం ఫలితాలు నమోదయ్యాయి. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాత్రం ఈసారి ఫలితాలు నిరాశే మిగిల్చాయి. ఫస్టియర్‌లో 42 శాతం, సెకండియర్‌లో 53 శాతానికి మాత్రమే రిజల్ట్ పరిమితమైంది. ఇక రూ.లక్షల్లో ఫీజులు తీసుకునే, గంటల కొద్దీ బోధన చేసే ప్రైవేటు కాలేజీల్లో 69.8 శాతం (ఫస్టియర్), 65.83 శాతానికే (సెకండియర్) రిజల్ట్స్ పరిమితం కావడం గమనార్హం.

గురుకులాలు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు సంబంధించిన ఫలితాలు ఇలా..

	ఫస్టియర్			సెకండియర్		
యాజమాన్యం	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
ప్రైవేటు	3,33,808	2,32,998	69.8	3,46,697	2,28,246	65.83
ప్రభుత్వ	68,100	28,937	42.49	74,161	39,630	53.44
మోడల్ స్కూల్స్	17,749	9,213	51.91	19,056	11,914	62.52
సోషల్ వెల్ఫేర్	15,664	12,165	77.66	15,900	13,416	84.38
కేజీబీవీ	14,271	10,418	73	12,419	9,824	79.1
బీసీ వెల్ఫేర్	13,105	10,274	78.4	13,279	10,886	81.98
టీఎంఆర్‌జేసీ	9,370	7,289	77.79	9,467	7,782	82.2
ట్రైబల్ వెల్ఫేర్	7,882	5,515	69.97	8,052	6,565	81.53
ఎయిడెడ్	5,670	2,817	49.68	6,850	3,162	46.16
టీఎస్ఆర్‌జేసీ	2,560	2,374	92.73	2,465	2,290	92.9
కేంద్ర ప్రభుత్వ	158	115	72.78	169	138	81.66
టీజీ ఆర్టీసీ	68	56	82.35	29	25	86.21
రాష్ట్ర స్పోర్ట్స్	25	20	80	39	30	76.92

ఇంటర్ ఫలితాల్లో నారాయణ జయభేరి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇంటర్-2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఇంటర్ బోర్డు చరిత్రలోనే అత్యధికంగా 470 మార్కులకు 469 మార్కులతో నారాయణ విద్యార్థి పి.వర్షిణి చరిత్ర సృష్టించిందని ఆ సంస్థ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు 995 మార్కులను 13 మంది నారాయణ విద్యార్థులు సాధించినట్లు జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు 438 మార్కులను ఏకంగా 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 1000 మార్కులకు 995 మార్కులను ఇద్దరు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే జూనియర్ ఇంటర్ హెచ్‌పీజీలోనూ నారాయణ హవా కొనసాగిందన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల తరఫున అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య సంచలనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇంటర్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య సంచలనం సృష్టించింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్కు 468తో 103 మంది, 467 ఆపైన 462 మంది, 466 ఆపైన 1,073 మంది, 460 ఆపైన 4,490 మంది, 450 ఆపైన 8,479 మంది తమ విద్యార్థులేనని శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకు శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 438తో 26 మంది, 437 ఆపైన 136 మంది, 436 ఆపైన 304 మంది, 435 ఆపైన 459 మంది, 430 ఆపైన 1,495 మంది తమ విద్యార్థులు సాధించారని వెల్లడించారు. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు 996 స్టేట్ టాప్ మార్క్‌తో పాటు 995 ఆపైన ఏడుగురు, 994 మార్కులు ఆపైన 46 మంది, 990 మార్కులు ఆపైన 610 మంది, 985 మార్కులు ఆపైన 1,776 మంది, 980 మార్కులు ఆపైన 3,050 మంది, 950 మార్కులు ఆపైన 9,697 మంది తమ విద్యార్థులు సాధించారని వెల్లడించారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభను చాటారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో బండి ప్రతిష్ఠకు 470 మార్కులకుగాను 468, వైశాలికి 468, ఆకోజు హాసిని 468, బాసుపెల్లి పశాంతిక రమ్య 468, బైపీసీ విభాగంలో రాగి శివప్రియ 440 మార్కులకుగాను 438, ఎ.శ్రీనిత 438, ఎంఈసీ విభాగంలో ఎం.ఉమామహేశ్వర్ 500 మార్కులకుగాను 495, ఆయుష్మతి నయినా 495 మార్కులు సాధించినట్లు వారు వెల్లడించారు. ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో ఇందూరి రష్మితకు 1000 మార్కులకుగాను 996, కందుకూరి అనూహ్య 995, ఆర్.రామచరణ్ 995, వి.వెంకటలక్ష్మి తేజస్విని 995 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఎంపీసీ విభాగంలో 990 మార్కులకుపైగా 14 మంది సాధించినట్లు పేర్కొన్నారు. బైపీసీ విభాగంలో ఎ.వైశాలి 1000 మార్కులకుగాను 994, టి.కార్తీక 994, ఎంఈసీ విభాగంలో డి.సుమతి 1000 మార్కులకుగాను 988, సీఈసీ విభాగంలో టి.స్పందన 1000 మార్కులకుగాను 986 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం

కొత్తపల్లి (కరీంనగర్): ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో జె.అంజనా 997/1000, ఎంపీసీలో కె.రుత్విక్ 996/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను సత్కరించారు. 11 మంది 990 ఆపై మార్కులు సాధించారని తెలిపారు. పి.శ్రీనిత్యరెడ్డి 995, ఎం.రుత్విక 995, ఎ.లక్ష్మీప్రసన్న 995, ఎస్.సేవిత 994, వి.రుషికేశ్ 994, ఎం.అక్షత 994, వి.సాహితి 994, ఎస్.కార్తికేయ 994, జి.లక్ష్మీప్రసన్న 994. కె.వర్షిణి 994, ఎం.కీర్తి 994 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో వి.అక్షయ్‌వర్ధన్, వి.రిషీత 988/1000, సీఈసీలో బి.గ్రీష్మా 987/1000 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో ఎస్.లహరి, హప్సహస్నాన్, తహూరా నూర్, టి.అన్విత రెడ్డి, సీహెచ్ అమతొరాజ్, పి.కీర్తిశ్రీ, జె.ప్రసూనాశ్రీ, ఎన్.కృష్ణవేణి, జి.తరుణ్, డి.నాగసాగర్, జె.ప్రణవ్ తేజ, జి.సూర్యప్రకాశ్, ఎ.శశివర్ధన్‌రెడ్డి, ఎల్.హాసిని, ఎం.శ్వేత, కె.పల్లవి, కె.అనుపమ, ఎ.నిచిత, జి.తరుణ్, జి.లక్ష్మీప్రియ 468/470 మార్కులు సాధించారని పేర్కొన్నారు. బైపీసీలో నభి లాతరీమ్, జోహ మహవీష్, సామాపిరదోష్ 438/440 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో ఆర్.చిద్విలాస 491/500 మార్కులు, సీఈసీలో పి.భవజ్ఞ 493/500 మార్కులు సాధించారని తెలిపారు.

నిజాయితీగా ప్రజాసేవ చేయాలి

సివిల్స్‌కు ఎంపికైన వారికి నా సూచన ఇదే
- ఇంటర్వ్యూ కోసం నా దగ్గర శిక్షణ పొందిన వారిలో 100 లోపు ర్యాంకులు 18కి పైగా ఉన్నాయి
- 'సాక్షి'తో శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్



ఎంపికైన అభ్యర్థులతో అడిషనల్ డీజీ మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: 'ప్రజాసేవే లక్ష్యంగా నిజాయితీగా తమ వృత్తిగత జీవితంలో పనిచేయాలి. సివిల్ సర్వీసెస్ పదంలోనే సేవ అన్నది ఉందన్న విషయం అఖిల భారత సర్వీసులకు ఎంపికైన వారు మరవొద్దు. యూపీఎస్సీ ఫలితాల్లో పలు సర్వీస్‌లకు ఎంపికైన వారికి తాను ఇచ్చే సూచన ఇదే'అని శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అన్నారు. తన వద్ద ఇంటర్వ్యూ కోసం శిక్షణ పొందిన వారిలో మొదటి 10 ర్యాంకుల్లో హర్షిత గోయల్ (2వ ర్యాంకు) ఆకాశ్‌గార్గ్ (5వ ర్యాంకు), ఆయుషీ బన్సల్ (7వ ర్యాంకు) సహా మొదటి వంద ర్యాంకుల్లో 18 మంది ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2024 సివిల్స్ ఫలితాల అనంతరం మహేశ్ భగవత్ 'సాక్షి'తో మాట్లాడారు. 'సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు నేను ఇంటర్వ్యూకు సన్నద్ధమవడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాను. పదేళ్లలో మాదిరిగానే ఈసారి కూడా డిసెంబర్ నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు 450 మంది అభ్యర్థులకు కొందరికి ప్రత్యక్షంగా, మరికొందరికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చాను. ఈసారి శిక్షణ పొందిన వారిలో 2, 7, 18, 21, 26, 40, 44, 46, 47, 49, 57, 59, 62, 63, 68, 69, 99తోపాటు 119 ,225, 350 సహా పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషాన్నిచ్చింది. ఇందులో మా పోలీస్ శాఖలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోవింద్ కుమారుడు సాయిచైతన్య జాదవ్ 68వ ర్యాంకు, ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో స్టోర్స్ డీఎస్పీగా పనిచేస్తున్న వేణుగోపాల్ కుమారుడు అన్నూ కౌశిక్ నర్సింహ 225వ ర్యాంకు సాధించడం మరింత సంతోషాన్నిస్తోంది. నేను ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేసినప్పుడు 2000 నుంచి 2004 వరకు సాయి చైతన్య తండ్రి నా దగ్గర కానిస్టేబుల్‌గా పనిచేశారు. పదేళ్లలో నేను ఇంటర్వ్యూల కోసం 2,300 మందికిపైగా శిక్షణ ఇవ్వడం ఎంతో సంతృప్తినిస్తోంది'అని మహేశ్ భగవత్ పేర్కొన్నారు.

సివిల్స్ విజేతలకు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో రాణించిన తెలుగువారికి ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'భవిష్యత్‌లో మీరు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. మన రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా మారాలని ఆశిస్తున్నాను' అని వైఎస్‌జగన్ పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలకు రెండు సంవత్సరాలకు కలిపి 9,97,012 మంది హాజరయ్యారని, వీరిలో 6,56,099 మంది పాసయ్యారని భట్టి తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు చేసిందని తెలిపారు. కాగా ఫస్టియర్‌లో మహబూబాబాద్, సెకండియర్‌లో కామారెడ్డి అతితక్కువ ఉత్తీర్ణత నమోదు చేశాయని ఆయన వివరించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సీజీజీ డీజీ రాజేంద్ర నిమ్జే, ప్రత్యేక కార్యదర్శి హరిత, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరీక్ష విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ పాల్గొన్నారు.

మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ: ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. జూన్ 3 నుంచి ఆరు వరకూ ప్రాక్టికల్స్ ఉంటాయని చెప్పారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొదటి, రెండో సంవత్సరం ఉత్తీర్ణులు ఇలా... (జనరల్, ఒకేషనల్ కలిపి)

సంవత్సరం	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
మొదటి	4,88,430	3,22,191	65.96
రెండో	5,08,582	3,33,908	65.65
మొత్తం	9,97,012	6,56,099	65.81

బాలికల ఉత్తీర్ణత

ఫస్టియర్	సెకండియర్
1,83,294 (73.83%)	1,86,385 (74.21%)

బాలుర ఉత్తీర్ణత

ఫస్టియర్	సెకండియర్
1,38,897 (57.83%)	1,47,523 (57.31%)

గ్రూపుల వారీగా ఉత్తీర్ణత శాతం

గ్రూపు	ఫస్టియర్	సెకండియర్
ఎంపీసీ	76.65	72.23
బైపీసీ	67.88	71.93
సీఈసీ	45.56	46.92
హెచ్ఈసీ	34.51	46.26
ఎంఈసీ	65.53	56.96

2023-25 వరకూ ఉత్తీర్ణత ఇలా.. (ఇంటర్ జనరల్)

	ఫస్టియర్			సెకండియర్		
సంవత్సరం	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
2023	4,33,082	2,72,208	62.85	3,80,920	2,56,243	67.27
2024	4,30,413	2,62,829	61.06	4,01,445	2,78,856	69.46
2025	4,39,302	2,93,852	66.89	3,99,943	2,85,435	71.37

మా నమ్మకాన్ని నిలబెట్టాడు

ఆలిండియా 225 ర్యాంకర్ అన్ను కౌశిక్ నరసింహ తండ్రి, డీఎస్పీ వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: సివిల్స్ ఫలితాల్లో తన కుమారుడు అన్ను కౌశిక్ నరసింహ 225వ ర్యాంకు సాధించడంపై డీజీపీ కార్యాలయంలో డీఎస్పీ (స్టోర్స్)గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 'నా కంటే గొప్పస్థాయిలో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం నా కుమారుడికి లభించడం సంతోషంగా ఉంది. ఐఐటీ రూర్కీ నుంచి బీటెక్ పూర్తి చేసిన నా కుమారుడు 2024లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా సెలక్ట్ కాలేదు. రెండో ప్రయత్నంలో విజయం సాధించాడు' అని వేణుగోపాల్ పేర్కొన్నారు. కాగా, వేణుగోపాల్‌ను డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ ప్రత్యేకంగా అభినందించారు.

దెబ్బతిన్నా తిరిగి లేస్తాం

'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కల్వల మల్లికార్జున్‌రెడ్డి

రాబోయే రోజుల్లో కేంద్రంలో సొంత బలంతో ఏ జాతీయ పార్టీ అధికారంలోకి రాదని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. బీఆర్ఎస్‌తో పాటు దెబ్బతిన్న ప్రాంతీయ పార్టీలు తమ సొంత రాష్ట్రాల్లో పుంజుకుని మరింత బలంగా ఎదుగుతాయని అన్నారు. దెబ్బతిన్నా తిరిగి నిల్చుంటామని స్పష్టం చేశారు. తమకు ఎదురైంది తాత్కాలిక ఎదురుదెబ్బ మాత్రమేనని, తిరిగి ప్రజాదరణ పొందుతామని చెప్పారు. కేంద్రంలో బీజేపీ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోందని, తెలంగాణలో బీజేపీతో కలిసి టీడీపీ, పవన్ కల్యాణ్ వచ్చినా బీఆర్ఎస్ అఖండ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ''కుల, మతాలు అనే తాత్కాలిక భావోద్వేగాలపై ఆధారపడే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీయే రక్షణ కవచం. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా. బీఆర్ఎస్ ఎంత బలంగా ఉంటే తెలంగాణకు అంత లాభం.''ఇక్కడి ప్రజలపై మాకు ఉన్న ప్రేమలో అణువంత కూడా ఢిల్లీ పార్టీలకు ఉండదు. అందుకే 25 ఏళ్లుగా తెలంగాణ ఇంటి పార్టీగా ఉన్న బీఆర్ఎస్‌ను మరో 50 ఏళ్ల పాటు చెక్కు చెదరకుండా ప్రజలు కాపాడుకోవాలి..'అని కేటీఆర్ అన్నారు. **ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.** టీఆర్ఎస్ పార్టీగా అవతరించి బీఆర్ఎస్‌గా కొనసాగుతున్న పార్టీ 25 ఏళ్ల ప్రస్థానం, పదేళ్ల పాలన, రజతోత్సవాలు, వర్తమాన రాజకీయాలు, తదితర అంశాలపై ఆయన స్పందించారు.



సాక్షి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ 25 ఏళ్ల ప్రస్థానాన్ని ఎలా చూస్తున్నారు?

కేటీఆర్: స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రాంతీయ పార్టీలు రజతోత్సవాలు నిర్వహించుకోవడం ఆషామాషీ కాదు. అధికారం కోసం కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చెప్పినట్లు చాలా పార్టీలు ఒక లక్ష్యం కోసం ప్రారంభమై గమ్యాన్ని చేరుకోక మునుపే మూత పడతాయి. ''టీఆర్ఎస్ పిడికెడు మందితో ప్రారంభమై 60 లక్షల మంది సభ్యులు ఉన్న బీఆర్ఎస్‌గా ఎదిగింది. ఉద్యమం, అధికారం, ప్రతిపక్షం..ఇలా ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా వారి గొంతుకగా నిలుస్తున్నాం. మరో 50 ఏళ్ల పాటు పార్టీ నిలిచేలా చేసే అద్భుతమైన నాయకత్వం మా పార్టీ సొంతం. 25 ఏళ్ల ప్రస్థానంలో పార్టీ పేరు మాత్రమే మారింది. మా జెండా, ఎజెండా, గుర్తు, నాయకుడు, సిద్ధాంతం మారలేదు..''ప్రజల బాగోగులు ఎజెండాగా పని చేయడమే మా పార్టీ భావజాలం

సాక్షి: ఉద్యమ సమయంలో సవాళ్ల నడుమ సాగిన ప్రయాణం ఎలా అనిపించింది?

కేటీఆర్: మొండితనం, పట్టుదల, నమ్మిన సిద్ధాంతంపై రాజీ పడకపోవడం, నిజాయితీ.. ఇవే కేసీఆర్ ఆస్తులు. ధన, కుల, మీడియా బలం లేకున్నా పార్టీని ప్రారంభించి తెలంగాణ అస్తిత్వాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లారు. అపజయాలు, ఎదురుదెబ్బలు, అవమానాలతో రాటుదేలిన కేసీఆర్‌కు ప్రతికూలతలను కూడా అనుకూలంగా మార్చుకునే శక్తి ఉంది. పార్టీని ప్రారంభించింది మొదలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను తన చుట్టూ తిప్పుకుంటూ చరిత్ర మార్చిన నాయకుడు ఆయన. కేసీఆర్ ఆమరణ దీక్ష వల్లే తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ సాధించిన అనుభూతి మాటల్లో చెప్పలేనిది. పదేళ్లు అధికారంలో ఉన్నదాని కంటే ఎక్కువ సంతృప్తినిచ్చింది.

కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనంపై ఎందుకు వెనక్కి తగ్గారు?

పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత సోనియా ఇంటికి వెళ్లి పార్టీని విలీనం చేస్తానని కేసీఆర్ చెప్పారు. సోనియా సూచన మేరకు దిగ్విజయ్ సింగ్‌తో విలీనంపై జరిపిన సంప్రదింపుల్లో కాంగ్రెస్ నిజాయితీగా స్పందించలేదు. తనను నమ్ముకున్న వందలాది మంది నాయకులు, వేలాది మంది కార్యకర్తల రాజకీయ భవిష్యత్తుపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వకపోవడంతో విలీనం ప్రతిపాదనను కేసీఆర్ విరమించుకున్నారు. తమిళనాడులో డీఎంకే తరహాలో తెలంగాణకు ఒక గొంతు ఉండాలని పౌర సమాజం నుంచి ఒత్తిడి కూడా రావడంతో స్వతంత్రంగా ఉండేందుకే కేసీఆర్ ఇష్టపడ్డారు.

సాక్షి: కొత్త రాష్ట్రంలో ప్రజలు ఐదేళ్లు అధికారం ఇస్తే ముందస్తు ఎన్నికలకు ఎందుకు వెళ్లారు?

కేటీఆర్: జమిలి ఎన్నికల పేరిట రెండు జాతీయ పార్టీలు నాటకం ఆడుతున్న సమయంలో తెలంగాణను దేశం ముందు ఆవిష్కరించేందుకు 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లాం. ఆరు నెలల పదవీ కాలాన్ని పక్కన పెట్టి ఎన్నికలకు వెళితే 88 సీట్లతో అసాధారణ గెలుపు నమోదు చేశాం. ఇది కేసీఆర్ సమర్థతకు ప్రజలు ఇచ్చిన సర్టిఫికెట్. రెండో టర్మ్‌లో పెద్ద నోట్ల రద్దు, కరోనాతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయినా సమర్థవంతమైన నాయకత్వం అందించాం. మూడోసారి కాంగ్రెస్ హామీలు, గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అయినా మేము తుడిచి పెట్టుకుపోలేదు. కేవలం 1.8 శాతం ఓట్ల తేడాతోనే ఓటమి పాలయ్యాం. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ తిరిగి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పదేళ్ల పాలనలో కేసీఆర్ మోడల్ సాధించిందేమిటి?

2014లో తెలంగాణలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను అధిగమించి విద్యుత్, సాగునీరు, తాగునీరు సహా అనేక అంశాల్లో తన దూరదృష్టితో కేసీఆర్ సమగ్ర, సమతుల్య, సమీకృత అభివృద్ధి నమూనాను ఆవిష్కరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు అనుసరించాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వినతులు మేరకే తెలంగాణ రాష్ట్ర సమితిని భారత్ రాష్ట్ర సమితిగా విస్తరించాలనే ఆలోచన వచ్చింది. భవిష్యత్తులోనూ జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ తన వంతు పాత్ర పోషిస్తుంది.

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటమిని సమీక్షించుకున్నారా?

పదేళ్ల పాలనలో మేము చేసిన మంచి పనులను సరిగా ప్రచారం చేసుకోలేక పోయాం. విప్లవాత్మక పథకాలు అమలు చేసినా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయాం. నాతో పాటు ద్వితీయశ్రేణి నాయకులు కూడా ఓటమికి కారణం. మరోవైపు కాంగ్రెస్ ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడంతో ప్రజలు మోసపోయారు. మైనారిటీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం తదితరాలు ప్రభావం చూపాయి. రాజకీయ పునరేకీకరణతో బహుళ నాయకత్వ సమస్యతో ఓటమి చెందామనే వాదన కూడా సరికాదు. ఇది తాత్కాలికమైన చిన్న ఎదురు దెబ్బ మాత్రమే. శాశ్వతంగా ఇదే పరిస్థితి కొనసాగదు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజాదరణ రుజువు చేసుకుంటాం.

ఫామ్‌హౌస్ పార్టీ, కుటుంబ పార్టీ అనే విమర్శలను ఎలా చూస్తారు?

అధికారం చేతిలో పెట్టినా రాష్ట్రాన్ని నడపలేక చేసే విమర్శలు అవి. కేసీఆర్ ఆయన నియోజకవర్గంలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆయన ఎక్కడ ఉన్నా మమ్మల్ని నడిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హ్యాండిల్‌లో ఇటీవల ఫామ్‌హౌస్ పాలన కావాలా, కాంగ్రెస్ పాలన కావాలా అని పోల్ పెడితే ప్రజలు ఫామ్‌హౌస్ వైపు మొగ్గు చూపారు. ఇక సీఎం రేవంత్ కూడా ఇంటి నుంచే పనిచేస్తున్నారు. ఆయన వర్క్ ఫ్రమ్ హోమ్ సీఎం.

పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ అవసరం ఎందుకు వచ్చింది?

తెలంగాణ బిడ్డగా కేసీఆర్ స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చా. ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్‌పై పనిభారం తగ్గించేందుకు 2018 డిసెంబర్‌లో నన్ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఆరున్నరేళ్లలో 32 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణం, 60 లక్షల సభ్యత్వం, అనేక ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచాం. అధికారం కోల్పోయినా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నా. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, కేసీఆర్‌కు అనారోగ్యం వంటి సమస్యలు ఎదురైనా కేడర్‌లో విశ్వాసం కల్పించాం. పార్టీ మళ్లీ పూర్వ వైభవం సాధించేలా పనిచేస్తా.

బీజేపీ నుంచి కొత్త పోటీ ఎదురవుతోందా?

కేసీఆర్ స్థాయి రాష్ట్ర రాజకీయాల్లో ఏ ఇతర నేతకూ లేదు. మేం బ్యాగులు, చెప్పులు మోసే నాయకులం కాదు. ఎవరికీ తలవంచకుండా చావు నోట్లో తలపెట్టి తెలంగాణ దశాబ్దాల కల నెరవేర్చిన నాయకుడు కేసీఆర్. తెలంగాణలో జరిగిన మూడు ఎన్నికల్లో బీజేపీ సింగిల్ డిజిట్ దాటలేదు. మోదీకి ఆదరణ క్రమంగా తగ్గుతున్న తరుణంలో ఆ పార్టీని పోటీగా భావించడం లేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ అఖండ మెజారిటీ సాధిస్తుంది. మరోవైపు రేవంత్.. సొంతూరుకు చెందిన మాజీ సర్పంచ్ మొదలుకుని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిపైనా ఆరోపణలతో అక్రమ కేసులు పెడుతూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. ప్రజల దృష్టిలో కాంగ్రెస్, బీజేపీ పలుచన అవుతున్నాయి.

పార్టీ రజతోత్సవం సందర్భంగా మీ సందేశం

తెలంగాణ ఇంటి పార్టీ మాది. రాబోయే రోజుల్లో విద్యార్థి, యువజన, మహిళా విభాగాలను బలోపేతం చేసి సంస్థాగతంగా బలోపేతం చేస్తాం. కేసీఆర్‌ను తిరిగి సీఎం చేసేంత వరకు ఒక కార్యకర్తగా పనిచేస్తా. నాతో కలిసి వచ్చే పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటా.

వ్యవస్థల విధ్వంసం

- రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వం.. తద్వారా అక్రమాలు, అవినీతి ప్రజల్లోకి వెళ్లకుండా డైవర్షన్

పీఏసీ సమావేశంలో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

- నాడు లిక్కర్ విధానం విప్లవాత్మకం.. నేడు నేరుగా దోపిడీకి మార్గం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించి.. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్రలో కూటమి ప్రభుత్వం నిత్యం మునిగి తేలుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వ్యవస్థలన్నీ దిగజారిపోయేలా చేస్తూ.. వాటి విధ్వంసానికి పాల్పడుతోందని, రాష్ట్రంలో మొదటిసారిగా ఇలాంటి దుర్మార్గాలు చూస్తున్నామని నిప్పులు చెరిగారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో అరాచకం తప్ప ఏమీ కనిపించదన్నారు. చరిత్రలో తొలిసారిగా ఒక మనిషిని ఇబ్బంది పెట్టడానికి ప్రలోభపెట్టి, భయపెట్టి, తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ పరిణామాలతో రాష్ట్రం ఎటువైపు వెళ్తోందో అర్థం కావడం లేదని, దుర్మార్గపు సంప్రదాయాలకు తెర లేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయడం దారుణమని, ఇదే కేసులో మరో ఇద్దరు పోలీసు అధికారుల పట్ల ప్రభుత్వ తీరును కోర్టు తప్పు పట్టినా పద్ధతి మార్చుకోలేదన్నారు. మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అసలు లిక్కర్ స్కాం ఎవరిది?

- లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డిని టార్గెట్ చేసి, ఎలాగైనా ఇరికించాలని చూస్తున్నారు. తన కాలేజీ రోజుల్లో చంద్రబాబును.. పెద్దిరెడ్డి ఎదిరించారు కాబట్టి.. ఆయన పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష పెట్టుకున్నాడు. లేని ఆరోపణలు సృష్టించి, తప్పుడు సాక్ష్యాలతో వారిని ఇబ్బంది పెడుతున్నారు. వాస్తవానికి చంద్రబాబు హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై సీఐడీ గతంలో కేసు కూడా పెట్టింది.
- లిక్కర్ అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? లేక అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారా? మద్యం అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే లంచారు ఇస్తారా? లేక ప్రభుత్వం ద్వారా మాత్రమే అమ్మితే లంచాలు ఇస్తారా? మద్యం దుకాణాలను పెంచితే లంచాలు ఇస్తారా? దుకాణాలను తగ్గిస్తే లంచాలు ఇస్తారా? దుకాణాలకు తోడు పర్మిట్ రూములు, బెల్టుషాపులు పెడితే లంచాలు ఇస్తారా? లేక బెల్టు షాపులు తీసేసి, పర్మిట్ రూములు రద్దు చేస్తే లంచాలు ఇస్తారా?
- 2014–19 మధ్య చంద్రబాబు నిర్ణయించిన బేసిక్ రేట్లను పెంచి డిస్టిలరీల నుంచి కొనుగోళ్లు చేస్తే లంచాలు వస్తాయా? లేక పాత రేట్లు కొనసాగిస్తే లంచాలు వస్తాయా? ఇప్పుడున్న డిస్టిలరీల్లో అధిక భాగం అనుమతులు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్న వారికి లంచాలు వస్తాయా? లేక ఏ ఒక్క డిస్టిలరీకీ అనుమతివ్వని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న వారికి లంచాలు వస్తాయా? ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

'లగచర్ల'పై సీఎం క్షమాపణ చెప్పాలి

- బాధ్యులైన పోలీసులను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలి: కేటీఆర్
- బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం లగచర్ల బాధితుల రూ. లక్ష విరాళం



కేటీఆర్‌కు చెక్కును అందజేస్తున్న లగచర్ల వాసులు

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) నివేదిక సీఎం రేవంత్‌రెడ్డి చెంపపై కొట్టినట్టుగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. లగచర్ల ఆడబిడ్డలపై లైంగిక వేధింపులు జరిగాయని.. అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ ఎన్‌హెచ్ఆర్‌సీ నివేదిక నిగ్గుతేల్చిన నేపథ్యంలో ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గు తెచ్చుకొని ముక్కు నేలకు రాయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎంకు సిగ్గు, శరం ఉంటే దళిత, గిరిజనులపై జరిగిన అరాచకాలు, లైంగిక వేధింపులకు బాధ్యత వహించి రాజీనామా చేసి క్షమాపణ కోరాలన్నారు. లగచర్ల ఆడబిడ్డలను లైంగికంగా హింసించిన పోలీసులను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర పోలీసులకు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో హైదరాబాద్ నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను లగచర్ల భూ బాధిత బంజారా మహిళలు కలిశారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ తాము కష్టంలో ఉన్నప్పుడు అండగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఉడతాభక్తిగా సాయం చేస్తామని లగచర్ల గిరిజనులు చెప్పారన్నారు. లగచర్లలో పోలీసుల దాష్టీకాలను ప్రశ్నించిన తమ పార్టీ నేత నరేందర్‌రెడ్డిని రేవంత్ సర్కారు 37 రోజులు అక్రమంగా జైల్లో పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ దమనకాండకు బలైన లగచర్ల రైతులు తెలంగాణ భవన్‌కు వస్తే న్యాయం దక్కేలా చూస్తామని గతంలో వాళ్లకు తమ పార్టీ తరపున మాటిచ్చినట్లు కేటీఆర్ చెప్పారు. లగచర్ల బాధితులను ఢిల్లీకి తీసుకెళ్లి ఎన్‌హెచ్ఆర్‌సీ, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్లను తమ పార్టీ నేతలు కలిశారని గుర్తుచేశారు.

శంభీపూర్ రాజు రూ. 6 లక్షల విరాళం

బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభ కోసం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రూ. 6 లక్షలు విరాళం ఇచ్చారు. మంగళవారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు విరాళం అందించారు. వన్ సాఫ్ట్ సిస్టమ్ అధినేత సుభాష్ లక్ష విరాళం అందజేశారు. అనంతరం చలో వరంగల్ పోస్టర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శంభీపూర్ రాజుతోపాటు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై ప్రముఖుల దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో పర్యాటకులు మృతి చెందిన ఘటనపై పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాద మూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ దాడి ఉగ్రవాదుల పిరికిపంద చర్య అని అభివర్ణించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ సీఎం కేసీఆర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

రాజ్ కేసిరెడ్డికి రిమాండ్

- రిమాండ్ రిపోర్ట్‌పై ఏసీబీ కోర్టులో వాడివేడిగా వాదనలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మద్యం అక్రమ కేసులో అరెస్ట్ అయిన రాజ్ కేసిరెడ్డికి ఏసీబీ న్యాయస్థానం 14 రోజులపాటు రిమాండ్ విధించింది. ఆయన్ను విజయవాడ జైలుకు తరలించారు. అంతకు ముందు రిమాండ్ రిపోర్ట్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం రాత్రి వాడివేడిగా వాదనలు జరిగాయి. అరెస్ట్‌లో సాంకేతిక తప్పిదాల గురించి నిందితుడి తరుపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రస్తావించారు. ప్రభుత్వ సలహాదారు పబ్లిక్ సర్వెంట్ ఎలా అవుతారని ప్రశ్నించారు. పీసీ (ప్రీవెన్షన్ ఆఫ్ కరప్షన్) యాక్ట్ అమలు విషయంలో నిందితుడు రాజ్ కేసిరెడ్డి పబ్లిక్ సర్వెంట్ అని నిరూపించేందుకు పీపీ కల్యాణి ప్రయత్నించారు. ఐటీ సలహాదారుగా పని చేసి ప్రభుత్వం నుంచి రెమ్యూనరేషన్ తీసుకుంటున్న నేపథ్యంలో కేరళ కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉటంకించారు. అయితే రాజ్ పబ్లిక్ సర్వెంట్ కాదని, అతనికి 17(ఎ) వర్తించదన్న డిఫెన్స్ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. ఈ విషయంలో న్యాయస్థానానికి మరింత స్పష్టత ఇవ్వాలని ప్రాసిక్యూషన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఎంత మొత్తంలో అవినీతి జరిగింది.. ఇప్పటి వరకు ఎంత నగదు, ఆస్తులు, ఇతర సామగ్రి సీజ్ చేశారని న్యాయమూర్తి ప్రశ్నించారు. రూ.3,200 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. నగదు, ఆస్తులు వంటివి ఏమీ సీజ్ చేయలేదని చెప్పారు. ఈ సమాధానం విన్న న్యాయమూర్తి విస్మయం వ్యక్తం చేశారు. గత ఏడాది సెప్టెంబర్‌లో నమోదు చేసిన కేసుకు సంబంధించి.. సిట్ ఏర్పాటై, ఇన్ని నెలల దర్యాప్తు చేశాక.. ఎలాంటి నగదు, ఆస్తులు, వస్తువులు సీజ్ చేయనపుడు.. అవినీతి చేశాడంటూ అభియోగం ఎలా మోపుతారని న్యాయమూర్తి ప్రశ్నించారు. కేవలం రూ.3,200 కోట్లు అవినీతి జరిగిందని ఊహించుకుని అరెస్ట్ చేసి, రిమాండ్ కోసం కోర్టుకు తీసుకొచ్చారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హవాలా రూపంలో సెల్ కంపెనీల ద్వారా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చేశారని, దర్యాప్తు కొనసాగుతోందని, నిందితుడు దర్యాప్తునకు సహకరించడం లేదని, అందుకే రిమాండ్ అడుగుతున్నామని ప్రభుత్వ న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో విచారణకు స్వచ్ఛందంగానే హాజరవుతానని, సిట్ అధికారులు నోటీసులో ఇచ్చిన తేదీనే విచారణకు వస్తానని చెప్పినా పోలీసులు తనను అరెస్ట్ చేశారంటూ నిందితుడు రాజ్ కేసిరెడ్డి కోర్టుకు వివరించారు. మంగళవారం కేసు విచారణకు హాజరయ్యే నిమిత్తం సోమవారం మధ్యాహ్నం గోవా నుంచి బయలుదేరి సాయంత్రానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నానని, అక్కడి నుంచి విజయవాడ సిట్ కార్యాలయానికి వచ్చేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు అత్యుత్సాహంతో అరెస్ట్ చేశారని చెప్పారు.

సిట్ రిమాండ్ నివేదిక సాక్షిగా బాబు భేతాళ కుట్ర బట్టబయలు

టీడీపీ దుష్ప్రచారమే సిట్ నివేదికగా కనికట్టు

- అబద్ధపు వాంగ్మూలాలు, అభూత కల్పనలతోనే కుట్ర
- దోపిడీ జరిగినట్టు రాజ్ కేసిరెడ్డి వాంగ్మూలం ఇచ్చారన్న సిట్
- కానీ వాంగ్మూలంపై రాజ్ కేసిరెడ్డి సంతకం చేయటానికి నిరాకరించారని సిట్ నివేదిక

సాక్షి, అమరావతి: చంద్రబాబు భేతాళ కుట్ర బట్టబయలైంది. టీడీపీ వీరవిధేయ పోలీసు అధికారులతో కూడిన సిట్ నివేదిక సాక్షిగా రెడ్‌బుక్ కుతంత్రం బెడిసికొట్టింది. తద్వారా చంద్రబాబు తాను తీసిన గోతిలో తానే పడ్డారు! వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసులో రాజ్ కేసిరెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదిక ఆ విషయాన్ని బట్టబయలు చేసింది. కానీ ఆయన ఇచ్చినట్లుగా చెబుతున్న వాంగ్మూలంపై సంతకం చేసేందుకు నిరాకరించారని సిట్ వెల్లడించడం అసలు కుట్రను వెల్లడించింది. అంటే రాజ్ కేసిరెడ్డి చెప్పకుండానే.. తాను అబద్ధపు వాంగ్మూలం నమోదు చేసినట్లు సిట్ అంగీకరించింది. ఇక మద్యం డిస్టిలరీలకు ఆర్డర్లలో వివక్షకు పాల్పడి అవినీతి చేశారని సిట్ పేర్కొంది. కానీ అదే నివేదికలో నాడు చంద్రబాబు ప్రభుత్వంలో కేవలం నాలుగు కంపెనీల నుంచే ఏకంగా 53.21 శాతం మద్యం కొనుగోళ్లు చేశారని వెల్లడించింది. ఇక టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సి–టెల్ సాఫ్ట్‌వేర్‌ను తొలగించడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం ఆర్డర్లు జారీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించింది. మరి సి–టెల్ సాఫ్ట్‌వేర్ ఉన్నప్పుడు కేవలం నాలుగు కంపెనీల నుంచి ఏకంగా 53.21 శాతం మద్యం కొనుగోళ్లు ఎందుకు చేశారనే దానిపై సిట్ మౌనం వహించింది. తద్వారా టీడీపీ హయాంలోనే మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని అసలు గుట్టు విప్పింది. ఇక నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు చొప్పున రాజ్ కసిరెడ్డి వసూలు చేసి వైఎస్సార్ సీపీలోని ముఖ్యులకు ఇచ్చారని ఒకచోట... రాజ్ కేసిరెడ్డే ఆ నిధులను దేశంలో వివిధ చోట్ల పెట్టుబడి పెట్టారని మరోచోట పరస్పర విరుద్ధంగా పేర్కొనడం ద్వారా తన దర్యాప్తులో డొల్లతనాన్ని బయటపెట్టింది. తాము బెదిరించి వేధించిన వాసుదేవరెడ్డి, సత్య ప్రసాద్ తదితరులతో ఇప్పించిన అబద్ధపు వాంగ్మూలాల ఆధారంగానే దర్యాప్తు పేరిట కనికట్టు చేసినట్టు అంగీకరించింది. అంతిమంగా టీడీపీ గత ఐదేళ్లలో చేసిన అవాస్తవ ఆరోపణలు, అభూత కల్పనలనే గుదిగుచ్చి దర్యాప్తు నివేదికగా ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు బరితెగించిందన్నది స్పష్టమైంది. దర్యాప్తు పేరిట తాము సాధించింది శూన్యమని గ్రహించిన సిట్ ఏమీ చేయలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును నివేదికలో ప్రస్తావించడం ద్వారా ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. సిట్ నివేదిక సాక్షిగా వెల్లడైన చంద్రబాబు ప్రభుత్వ కుట్ర ఇదిగో ఇలా ఉంది...

mediators. However, the accused refused to sign on the above confessional statement. The mediators endorsed the same.

వాంగ్మూలంపై సంతకం చేసేందుకు రాజ్ కేసిరెడ్డి నిరాకరించినట్లు వెల్లడించిన సిట్

రాజ్ కసిరెడ్డి వాంగ్మూలం పేరిట కుట్ర..

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విధానంలో భారీ కుంభకోణం జరిగినట్టుగా దుష్ప్రచారాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే రీతిలో కుట్రకు తెగించింది. అందుకోసమే రాజ్ కసిరెడ్డి విచారణ ప్రక్రియను అడ్డంపెట్టుకుని పన్నాగం రచించింది. ఆయన్ను సోమవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసిన సిట్ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు విచారణ పేరుతో తతంగం నడిపించారు. అనంతరం ఆయన వాంగ్మూలంగా పేర్కొన్నారంటూ ఓ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అందులో మద్యం కుంభకోణం కుట్ర అంటూ కట్టుకథ అల్లారు. ఏకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ప్రస్తావించడం చంద్రబాబు కుట్రలకు పరాకాష్ట. సంక్షేమ పథకాలను అమలు చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చేలా... మరోవైపు వైఎస్సార్‌సీపీకి ఫండింగ్ వచ్చేలా మద్యం విధానాన్ని రూపొందించమని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనతో చెప్పినట్టుగా రాజ్ కసిరెడ్డి తెలిపారని ఆ నివేదికలో పేర్కొంది. కానీ వాస్తవం ఏమిటంటే... రాజ్ కేసిరెడ్డి వాంగ్మూలం అంటూ సమర్పించిన నివేదికపై ఆయన సంతకం చేయడానికి పూర్తిగా నిరాకరించారని సిట్ నివేదిక వెల్లడించింది. మరి అలాంటప్పుడు ఇక కుంభకోణం ఎక్కడ...? రిమాండ్ నివేదికలో పేర్కొన్న అభియోగాలన్నీ కట్టుకథలేనని సిట్ స్వయంగా అంగీకరించినట్టైంది. సంతకం చేసేందుకు రాజ్ కేసిరెడ్డి నిరాకరించిన విషయాన్ని కూడా ఎందుకు పేర్కొన్నారంటే.. న్యాయస్థానంలో హాజరు పరిచేటప్పుడు 'మీరే చెప్పారా...? సంతకం చేశారా' అని ఆయన్ను న్యాయమూర్తి ప్రశ్నించే అవకాశం ఉంది. అప్పుడు తమ బండారం బయటపడుతుందని ముందు జాగ్రత్తగా ఆయన సంతకం చేయలేదని వెల్లడించక సిట్ అధికారులకు తప్ప లేదు. కుట్రకు అనుకూలంగా సిట్ అధికారులు ఓ రిమాండ్ నివేదికను సృష్టించి కనికట్టు చేసేందుకు యత్నించారన్నది దీంతో బట్టబయలైంది. ఆ విషయాలను రాజ్ కేసిరెడ్డే వెల్లడించి ఉంటే...ఆయన ఆ వాంగ్మూలం కాపీపై సంతకం చేసేందుకు ఎందుకు నిరాకరిస్తారు?.. అంటే రిమాండ్ నివేదిక పేరిట సిట్ కుట్రకు పాల్పడిందన్నది స్పష్టమైంది. సిట్ అధికారులే న్యాయస్థానానికి సమర్పించిన నివేదిక దీనికి సాక్ష్యం.

నాడు టీడీపీ దుష్ప్రచారమే.. నేడు సిట్ రిమాండ్ నివేదిక

చంద్రబాబు, లోకేశ్, టీడీపీ అధికార ప్రతినిధులు టీడీపీ కార్యాలయంలో మాట్లాడిన మాటల్నే సిట్ తన రిమాండ్ నివేదికగా న్యాయస్థానానికి సమర్పించడం విడ్డూరంగా ఉంది. అందులో పేర్కొన్నవన్నీ అసత్య ఆరోపణలేననడానికి ఇవిగో తార్కాణాలు..

డిస్టిలరీలూ బాబు దందానే

వైఎస్సార్‌సీపీ హయాంలో కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా వ్యవహరించారని, వాటికే అత్యధిక మద్యం ఆర్డర్లు ఇచ్చారని సిట్ ఆరోపించింది. తద్వారా కొన్ని డిస్టిలరీలకు అడ్డగోలుగా లబ్ధి చేకూర్చి కమీషన్లు తీసుకున్నారని అవాస్తవ అభియోగాలు మోపింది. కానీ స్వామి భక్తి చాటుకునే హడావుడిలో అసలు చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే డిస్టిలరీల నుంచి మద్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారనే వాస్తవాన్ని బయటపెట్టేయడం గమనార్హం. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018–19లో కేవలం నాలుగు కంపెనీల నుంచి ఏకంగా 53.21 శాతం మద్యం కొనుగోళ్లు చేశారని సిట్ నివేదికలో తెలిపింది. అంటే చంద్రబాబు హయాంలోమద్యం కొనుగోలు ఆర్డర్లలో ఏకంగా 53.21 శాతం కేవలం నాలుగు డిస్టిలరీలకే ఇవ్వడం అంటే అక్రమాలకు పాల్పడినట్టే కదా? తద్వారా మద్యం ఆర్డర్లలో కుంభకోణానికి పాల్పడింది చంద్రబాబు ప్రభుత్వమేనని రూఢీ అయింది. సి–టెల్ సాఫ్ట్‌వేర్ ద్వారా కేవలం నాలుగు కంపెనీల నుంచి ఏకంగా 53.21 శాతం మద్యం కొనుగోళ్లు చేశారని, దాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలగించిందని సిట్ పేర్కొంది. లోపభూయిష్టమైన ఆ సాఫ్ట్‌వేర్‌ను తొలగించడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరైన నిర్ణయమే తీసుకున్నట్లే కదా!

అబద్ధపు వాంగ్మూలాలే కుట్రకు ప్రాతిపదిక

సిట్ అధికారులు బెదిరించి వేధించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాలే ప్రాతిపదికగా రిమాండ్ నివేదిక రూపొందించినట్టు వెల్లడైంది. వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితోపాటు అప్పటి ఉన్నతాధికారులను ఈ అక్రమ కేసులో ఇరికించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కా పన్నాగానికి తెగబడింది. తాము భయభ్రాంతులకు గురిచేసి బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగి సత్య ప్రసాద్‌తో ఇప్పించిన అబద్ధపు వాంగ్మూలాలనే ప్రస్తావించింది. డిస్టిలరీల ఏర్పాటు కోసం విజయసాయిరెడ్డి నివాసంలో ఎంపీ మిథున్ రెడ్డి, బెవరేజస్ కార్పొరేషన్ ఎంపీ వాసుదేవరెడ్డి, అప్పటి ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి తదితరులు సమావేశమై చర్చించినట్టు సిట్ పేర్కొంది.

కారు కూతలు... కాకి లెక్కలు

టీడీపీ కార్యాలయం చెప్పిన కాకి లెక్కలు, చెప్పిన కాకి లెక్కలతో సిట్ అధికారులు తమ రిమాండ్ నివేదికను రూపొందించడం పోలీసు వ్యవస్థ సర్వభ్రష్టత్వాన్ని వెల్లడిస్తోంది. ఏకంగా నెలకు రూ.50కోట్ల నుంచి రూ.60 కోట్ల చొప్పున చొప్పున వసూలు చేసి ఇచ్చారని దుష్ప్రచారానికి తెగబడింది. మళ్లీ అదే నివేదికలో ఆ నిధులను రాజ్ కేసిరెడ్డి దేశంలోనే బంగారం, భూములు, ముడి సరుకు తదితర కొనుగోళ్ల రూపంలో పెట్టుబడి పెట్టారని చెప్పారు. నిధులు వేరే వారికి ఇచ్చారని ఓ చోట... కాదు వివిధ వివిధ స్థిర, చరాస్తులుగా పెట్టుబడి పెట్టారని పరస్పర విరుద్ధంగా పేర్కొనడం సిట్ కుట్రకు నిదర్శనం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



.. నిలువెల్లా నిర్లక్ష్యమే!

సంపన్నుల ఇళ్లల్లో పనివాళ్లుగా కుదిరి చోరీలకు పాల్పడుతున్న ఉదంతాలు జరుగుతూనే ఉన్నాయి. ఇళ్ల యజమానుల నిర్లక్ష్యమే దొంగతనాలకు కారణమవుతోంది. -10లో



కాన్సర్ట్ హాట్ స్పాట్..

భాగ్యనగరం తన గొప్ప సాంస్కృతిక వైభవంతో లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లకు హాట్‌స్పాట్‌గా మారింది. లైవ్ కాన్సర్ట్‌లు నగరాన్ని సంగీత సాగరంలో ముంచెత్తుతున్నాయి. - సిటీప్లస్‌లో



వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 40, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

అశోక్ నగర్‌లో కోలాహలం

సివిల్స్ ర్యాంకర్ల సంబరాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సివిల్ సర్వీసు ఫలితాల విడుదల నేపథ్యంలో మంగళవారం నగరంలోని వివిధ కోచింగ్ సెంటర్ల పరిసరాలు కోలాహలంగా మారాయి. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అశోక్ నగర్‌లోని లా ఎక్స్‌లెన్స్ ఐఏఎస్ అకాడమీ, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ అకాడమీల వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలను ఇలా పంచుకున్నారు.

నాలుగో ప్రయత్నంలో సాధించాను

సంగవరపు సాయి భార్గవ్ (798వ ర్యాంక్)



మాది ఏపీలోని ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఆకుల అల్లూరు గ్రామం. నాన్న ప్రసాద రావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కరోనా సమయంలో మృతి చెందారు. అమ్మ శోభారాణి గృహిణి. ఎంతో కష్టపడి నన్ను చదివించింది. మద్రాసులో ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. గతంలో సివిల్స్ ఇంటర్వ్యూ దాకా వెళ్లి వచ్చాను. ప్రస్తుతం నాలుగో ప్రయత్నంలో 798వ ర్యాంక్ సాధించాను. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఈ ర్యాంక్ సాధించాను.

అప్పుడు గ్రూప్-1.. ఇప్పుడు సివిల్స్‌లో

బానోతు శ్రీనికేష్ నాయక్ (938వ ర్యాంక్)



మాది వరంగల్ జిల్లా నర్సంపేట. నాన్న హెడ్ కానిస్టేబుల్ సక్రమ్. అమ్మ పద్మ. ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. నేను హన్మకొండలోని జులైవాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాను. ఐఐటీ ఢిల్లీలో చదివాను. గ్రూప్-1లో 117వ ర్యాంక్ వచ్చింది. ఇప్పుడు సివిల్ సర్వీసులో 5వ ప్రయత్నంలో భాగంగా 938వ ర్యాంక్ వచ్చింది.



ఉప్పల్ స్టేడియంలో చీర్ గర్ల్స్ ముందస్తు సందడి



సూర్యకుమార్



తిలక్ వర్మ

ఉప్పల్‌లో 'స్టార్' ఫీవర్

నేడు సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్ పోరు

ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మరో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. బుధవారం జరిగే మ్యాచ్‌లో అయిదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఈ సీజన్‌లో ఉప్పల్‌లో ఆడిన 4 మ్యాచ్‌ల్లో రెండింట గెలిచిన సన్‌రైజర్స్ మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. గెలిచిన రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లతో రెచ్చిపోయిన కమిన్స్ బృందం... మరోసారి పరుగుల వరద పారించి గెలుపుబాట పట్టేందుకు సిద్ధమైంది. ఇదే మైదానంలో రాజస్తాన్ రాయల్స్‌పై 286 పరుగులు చేసిన సన్‌రైజర్స్... చివరగా పంజాబ్ కింగ్స్‌తో పోరులో 246 పరుగుల లక్ష్యాన్ని మరో 9 బంతులు మిగిలుండగానే ఛేదించింది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా వంటి భారత స్టార్ ఆటగాళ్లు ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో.. ఈ మ్యాచ్‌పై అభిమానులు అమితాసక్తి కనబరుస్తున్నారు. మంగళవారం ముంబై ప్లేయర్లతో పాటు సన్‌రైజర్స్ ప్లేయర్లు అభిషేక్ శర్మ, హెడ్, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, కమిన్స్, ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. ఇప్పటికే టికెట్లన్నీ అమ్ముడుపోగా... మ్యాచ్ సమయంలో సందడి చేయనున్న చీర్ గర్ల్స్ కూడా మైదానానికి చేరుకున్నారు. - సాక్షి, హైదరాబాద్

బాలికా.. భళా

- గ్రేటర్ పరిధిలో ఇంటర్ మొత్తం ఉత్తీర్ణత 73 శాతం
- ఫస్టియర్‌లో మొదటి, రెండో స్థానాల్లో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు
- సెకండియర్‌లోనూ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో
- ఎప్పటి మాదిరిగా వెనుకబడిన హైదరాబాద్ జిల్లా

ఈసారి కూడా అమ్మాయిలదే హవా



గ్రేటర్ పరిధిలో ఇంటర్మీడియట్ (జనరల్, వృత్తివిద్యా కోర్సులు కలిపి) ఫలితాల సరళి ఇలా..

	ప్రథమ సంవత్సరం		ద్వితీయ సంవత్సరం	
జిల్లా	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు
హైదరాబాద్	85,772	57,197	74,781	50,659
రంగారెడ్డి	89,412	61,406	70,581	54,721
మేడ్చల్-మల్కాజిగిరి	68,650	53,003	62,539	48,726

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మళ్లీ అమ్మాయిల హవానే కొనసాగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మరోసారి సత్తా చాటారు. కాగా.. రాష్ట్ర స్థాయిలోనే ఫస్టియర్‌లో మేడ్చల్- మల్కాజిగిరి ప్రథమ స్థానంలో నిలవగా, రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. సెకండియర్‌లోనూ ఈ రెండు జిల్లాలు మూడు, నాలుగో స్థానాలను కైవసం చేసుకున్నాయి. హైదరాబాద్ జిల్లా మరోసారి చతికిలపడి నిరాశే మిగిల్చింది. మొత్తమ్మీద ఇంటర్మీడియట్ ఫలితాల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు 73 శాతం ఉత్తీర్ణత లభించింది. గత ఏడాది కంటే 3 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

ఉత్తీర్ణత ఇలా..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కలిపి ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, వృత్తి విద్యా కోర్సులతో కలిపి 73.41 శాతం, ద్వితీయ సంవత్సరంలో 73.39 శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ప్రథమ సంవత్సరంలో హైదరాబాద్‌లో 66.68 శాతం, రంగారెడ్డి జిల్లాలో 76.36, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 77.21 శాతం, ద్వితీయ సంవత్సరంలో మేడ్చల్ జిల్లా 77.91, రంగారెడ్డి 77.53, హైదరాబాద్ 67.74 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

మరోసారి.. సత్తా చాటి..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది సైతం బాలికల హవానే కొనసాగింది. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల్లో ఫలితాలు పరిశీలిస్తే.. మేడ్చల్- మల్కాజిగిరిలో బాలికలు 82.40 శాతం, బాలురు 73.54, రంగారెడ్డి జిల్లాలో 81.92 బాలికలు, 72.24 బాలురు, హైదరాబాద్ జిల్లాలో 74.65 బాలికలు, 60.47 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో.. మేడ్చల్‌లో 82.21 బాలికలు, 74.56 బాలురు, రంగారెడి జిల్లాలో 82 శాతం బాలికలు, 73.70 బాలురు, హైదరాబాద్ జిల్లాలో బాలికలు 74.81, బాలురు 59.50 శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు.

విద్యుదాఘాత మరణాలపై నివేదిక ఇవ్వండి

'సాక్షి' కథనానికి స్పందించిన హెచ్చార్సీ

- సుమోటోగా కేసు తీసుకున్న మానవ హక్కుల సంఘం
- తదుపరి విచారణ జూన్ 4కు వాయిదా

సాక్షి ఎఫెక్ట్..



సిటీ కోర్టులు: వరుసగా జరుగుతున్న విద్యుత్ షాక్ మరణాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ టీజీఎస్‌పీడీసీఎల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'మృత్యుపాశాలు' కథనాన్ని సుమోటోగా స్వీకరించింది. దీనిపై మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో విద్యుత్‌శాఖ కారణంగా సంభవించిన మరణాలపై సమాగ్ర విచారణ జరిపి పూర్తి నివేదికను జూన్ 4లోపు సమర్పించాలని టీజీఎస్‌పీడీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను ఆ రోజుకు వాయిదా వేసింది. శంషాబాద్ కొందుర్గు మండలాలలో ఇటీవల జరిగిన ఘటనలతో పాటు గత ఏడాది కాలంలో 69 మంది విద్యుదాఘాతానికి గురై మరణించడం ఆందోళన కలిగించిందని పేర్కొంది. దీనికి కారణం ప్రమాదకరమైన వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్ సరిగా లేకపోవడం, మెయింటెనెన్స్ సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలు మృత్యువాత పడుతున్నారని కమిషన్ పేర్కొంది. జూన్ 2025 మొదటి వారంలోగా ఈ మరణాలకు సంబంధించి వివరణాత్మక నివేదికలను సమర్పించాలని సీఎండీ టీజీఎస్‌పీడీసీఎల్‌ను, తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టర్లను కమిషన్ ఆదేశించింది. గత ఏడాది విద్యుత్ షాక్‌తో వర్షాకాలంలోనే ఎక్కువ మరణాలు సంభవించాయి. ఇప్పటి వరకు మరణించిన బాధిత కుటుంబాలకు సరైన పరిహారం అందకపోవడం సంబంధిత అధికారులు కూడా సరైన చర్యలు తీసుకోకపోవడమేమిటని ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్టికల్ 21 ప్రకారం.... ప్రజలకు జీవించే హక్కుతో పాటు తమ భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతోందని కమిషన్ పేర్కొంది. ఇప్పటి వరకు సంబంధింత మరణాల్లో ఎక్కువగా కార్మికులు ఉండడం, వారి మృతదేహాలను సబ్‌స్టేషన్ల ముందు పెట్టి ఆందోళన చేస్తున్నా ఫలితం లేకపోవడమేంటని ప్రశ్నించింది. తదుపరి విచారణలోపు నివేదిక సమర్పించకపోతే నేరుగా కమిషన్ చర్యలు తీసుకుంటుందని సంబంధిత అధికారులను హెచ్చరించింది.

1 సీటు.. 112 ఓట్లు

వీటిలో పోలయ్యేవి ఎన్నో..

- నేడే 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నిక
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: ఒక్క ఎమ్మెల్సీ సీటు. ఓటర్లు 112 మంది. మరి పోలింగ్ ఎలా జరగనుంది.. ఎంత మంది ఓట్లు వేస్తారు? అనేదానిపై ఆసక్తి నెలకొంది. బుధవారం జరగనున్న హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌పై అంతటా ఉత్కంఠ నెలకొంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. అసలు పోలింగే జరగదు.. ఎప్పటి మాదిరిగానే ఏకగ్రీవం అవుతుందన్నవారి అభిప్రాయాలకు భిన్నంగా పోలింగ్ జరగనుంది. అందుకు కారణం ఈ సీటును గెలిచేందుకు పార్టీకి తగిన బలం లేదని తెలిసినా బీజేపీ తన అభ్యర్థిని బరిలో దింపింది. ప్రత్యేక దృష్టి సారించి ఇద్దరు కేంద్ర మంత్రులు సహా కాషాయ నేతలు తమ పార్టీ ఓటర్లయిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియోలకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్‌లో ఎలా వ్యవహరించాలో తెలుపుతూ మాక్ పోలింగ్ కూడా నిర్వహించారు. అంతటితో ఆగకుండా ఎలాగైనా ఎంఐఎంను గెలవకుండా చేయాలనే తలంపుతో బీజేపీ శ్రేణులు చేసిన ప్రచార సరళి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా వెళ్లింది. రాష్ట్రంలో ఒక ప్రతిపక్షమైన బీజేపీ తీరు ఇలా ఉండగా, మరో ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసలు పోలింగ్‌నే బహిష్కరిస్తామని ప్రకటించింది. అంతేకాదు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోలింగ్‌కు వెళ్లే వారిపై చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు.

- తాము గెలవలేమని తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీ తమ వాళ్లు బరాబర్ పోలింగ్‌కు హాజరవుతారని, ఓటు హక్కు వినియోగించుకుంటారని పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. నైతికత లేకుండా మతం పేరిట ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలపై ఎన్నికల కమిషన్‌ కు ఫిర్యాదు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అసలు ఓటే వేయొద్దని పిలుపునిచ్చిందన్నారు. ఇలా ఉన్న ఒక్క సీటు ఎన్నిక కోసం వివిధ పార్టీలు వివిధ వైఖరులు ప్రదర్శించిన నేపథ్యంలో.. నేడు ఏం జరగనుందో? అనే ఆసక్తి రాజకీయ నేతలతోపాటు సాధారణ ప్రజల్లోనూ నెలకొంది.
- బీజేపీ అభ్యర్థిగా ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ పోటీ చేస్తుండటం, సంఖ్యాపరంగా ఎంఐఎంకే గెలిచే అవకాశాలుండటం తెలిసిందే. అయినా.. అనేక పరిణామాలతో పార్టీలకతీతంగా ఓటర్లు(కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు) తమ ఓట్లు వేస్తారా.. పార్టీ విప్‌ను ధిక్కరించి బీఆర్ఎస్ వారెవరైనా ఓట్లు వేస్తారా? అనే ప్రశ్నలు పలువురిలో ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఎంఐఎం తప్ప వేరే పార్టీలు గెలవలేవని పొన్నం ప్రభాకర్ చెప్పినా, ఏం జరుగుతుందో.. బీజేపీకి అవకాశం ఉంటుందేమోనని అనుకుంటున్న వారు సైతం ఉండటంతో బహుశా ఏ ఎన్నికలోనూ లేనంత చర్చ ప్రస్తుతం జరుగుతోంది.



బంగ్లాదేశ్ యువకుడికి బర్త్ సర్టిఫికెట్

నార్సింగి మున్సిపాలిటీ నుంచి జారీ

- దీని ఆధారంగా పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు
- విచారణలో వెలుగు చూసిన వ్యవహారం
- సిటీ టాస్క్‌ఫోర్స్ అదుపులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో సుధీర్

మణికొండ: బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన ఓ యువకుడికి నార్సింగి మున్సిపాలిటీ నుంచి బర్త్ సర్టిఫికెట్ జారీ అయింది. దీని ఆధారంగా అతడు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వెరిఫికేషన్ నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. నార్సింగి మున్సిపాలిటీలో పని చేస్తున్న ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు సదరు బంగ్లాదేశీయుడినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరు ఉన్నారనేదానిపై ఆరా తీస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో సుధీర్ అనే వ్యక్తి ఆరేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నాడు. దీనికి ముందు అతడు జీహెచ్ఎంసీ కార్యాలయంలో పని చేశాడు. అధికారులు ఇతడికి జనన, మరణ ధ్రువీకరణ జారీ చేసే బాధ్యతలను అప్పగించారు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న సుధీర్.. బంగ్లాదేశీయుడికి నార్సింగిలో జన్మించిన వ్యక్తిగా జనన ధ్రువీకరణ పత్రం జారీ చేశాడు. దాదాపు రెండేళ్ల క్రితం ఈ పత్రం తీసుకున్న బంగ్లాదేశ్ యువకుడు ఇటీవల పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జరిగిన పోలీసు వెరిఫికేషన్‌లో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుధీర్‌తో పాటు సదరు బంగ్లాదేశీని అదుపులోకి తీసుకున్నారు.



మరింత లోతుగా విచారణ

మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న సుధీర్ రెండు సంవత్సరాల క్రితం ఒకరికి అప్పటి కమిషనర్ సత్యబాబు డిజిటల్ సంతకంతో జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్టు తెలిసింది. అది నకిలీదని, దానిపై విచారణ చేస్తున్నామని, అతన్ని అదుపులోకి తీసుకుంటున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. అతను చేసిన అక్రమాలన్నింటినీ వెలుగులోకి తేవాలని, విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని వారికి చెప్పాను. అవసరమైతే మరింత లోతుగా విచారణ చేయాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసే విషయాన్ని పరిశీలిస్తాం.

– టి. కృష్ణమోహన్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

హెచ్‌ఎండీఏలోనూ బిల్డ్ నౌ సేవలు

భారీగా తగ్గనున్న కాల పరిమితి

- మరో ఆరు నెలల పాటు సమాంతరంగా టీజీబీపాస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)లో బిల్డ్‌నౌ సేవలు ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణాలు, లే అవుట్‌ల అనుమతిలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా పారదర్శకంగా అనుమతులిచ్చేందుకు ఈ సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటికే జీహెచ్ఎంసీలో బిల్డ్ నౌ అమల్లోకి వచ్చింది. తాజాగా హెచ్‌ఎండీఏలోనూ విస్తరించారు. దీంతో రీజినల్ రింగ్‌రోడ్డు వరకు భవన నిర్మాణాలు, లే అవుట్‌లు తదితర అనుమతుల కోసం బిల్డ్ నౌ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రిపుల్ ఆర్ వరకు అన్ని రకాల అనుమతులు హెచ్‌ఎండీఏ నుంచి లభించనున్నాయి. రీజినల్ రింగ్‌రోడ్డు వెలుపల మిగిలి ఉన్న ప్రాంతాల్లో మాత్రం డీటీసీపీ అనుమతులను అందజేస్తుంది. ప్రస్తుతం బిల్డ్ నౌ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ టీజీబీపాస్ (తెలంగాణ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్) ద్వారానూ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరో 6 నెలల పాటు టీజీబీపాస్ సదుపాయాన్ని కొనసాగించనున్నారు.

దరఖాస్తుదారుల నిరీక్షణకు తెర పడేనా?

డీపీఎంఎస్ స్థానంలో టీజీబీపాస్‌ను ప్రవేశపెట్టినప్పుడు కూడా దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో పారదర్శకత ఉంటుందని భావించారు. కానీ.. దరఖాస్తుదారులు నెలల తరబడి నిరీక్షించక తప్పడం లేదు. పైగా భవన నిర్మాణాలు, లే అవుట్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు, ఎల్‌ఆర్‌ఎస్‌లు తదితర సేవలకు వివిధ దశల్లో పెద్ద మొత్తంలో చేతులు మారితే తప్పా పనులు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కన్సల్టెంట్లు, మధ్యవర్తుల ద్వారా వచ్చే దరఖాస్తులను మాత్రం వేగంగా పరిష్కరిస్తున్నారనే విమర్శలున్నాయి. కేవలం 21 రోజుల్లోనే ఫైళ్లను పరిష్కరించాల్సి ఉండగా.. షార్ట్‌ఫాల్స్‌ను సాకుగా చూపి అయిదారు నెలల పాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బిల్డ్‌నౌ ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ వ్యవస్థ వల్ల ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఏజెంట్‌లు, కన్సల్టెంట్లు, దళారుల మధ్యవర్తిత్వాన్ని అరికట్టేందుకు బిల్డ్‌నౌ ఏ మేరకు దోహదపడనుందనేది సందేహాస్పదమే. ప్రస్తుతం హెచ్‌ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, మేడ్చల్-1.మేడ్చల్-2జోన్‌లలో బిల్డ్‌నౌ సదుపాయం అమల్లోకి వచ్చినప్పటికీ ఇంకా కొన్ని జోన్‌లలో అధికారులు టీజీబీపాస్ సేవలనే వినియోగిస్తున్నారు. కాగా.. హైదరాబాద్ చుట్టూ 354 కిలోమీటర్ల పరిధిలో నిర్మించనున్న రీజినల్ రింగ్‌రోడ్డు పరిధి వరకు మహా నగర విస్తరణలో, నిర్మాణ రంగ అభివృద్ధిలో హెచ్‌ఎండీఏ కార్యకలాపాలు కీలకం కానున్నాయి.



రక్తదానంపై అవగాహన పెంచాలి


సాక్షి, సిటీబ్యూరో: రక్తదానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందేందుకు కృషి చేయాలని విద్యావేత్తలు సూచించారు. పీవీ నరసింహారావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన విద్యాసంస్థ కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎల్ఈఎఫ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ హవిష్, ట్రస్ట్ సీఈఓ డాక్టర్ ఎన్.వి.సుధాకిరణ్ మాట్లాడుతూ సమాజానికి, మానవాళికి సేవ చేయడానికి రక్తదానం అత్యుత్తమ మార్గమన్నారు. ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

పెనమలూరు: ఏపీలోని కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు..బీటెక్ (సివిల్) మూడో సంవత్సరం చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన యార్లగడ్డ ఖ్యాతి(21) హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. మంగళవారం మధ్యాహ్నం హాస్టల్‌లో భోజనం చేసిన తర్వాత తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఖ్యాతి ఎంతకీ బయటకు రాకపోవటంతో సహచర విద్యార్థులు గది కిటికీ నుంచి చూడగా ఆమె చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. తలుపులు తెరిచి కొన ఊపిరితో ఉన్న ఆమెను పోరంకిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో ఖ్యాతి మృతి చెందింది. మృతదేహాన్ని విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల రాక కోసం పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.

పని వారి విషయంలో నిలువెల్లా నిర్లక్ష్యమే!

- కాచిగూడలో భారీ చోరీ ఉదంతమే తాజా ఉదాహరణ
- యజమానుల వద్ద లేని పని వారి ఫొటోలు, వివరాలు
- వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్న ఈస్ట్‌జోన్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే కేడియా ఆయిల్స్ కంపెనీ యజమాని రోహిత్ కేడియా ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరి 11న భారీ చోరీ జరిగింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌లకు చెందిన ముగ్గురు నిందితులు దాదాపు రూ.40 కోట్ల విలువైన సొత్తు దోచుకుపోయారు. వీరిని అరెస్టు చేసిన సందర్భంలో పోలీసులు పని వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పదేపదే సూచించారు. ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోని కాచిగూడ వాసి, పారిశ్రామిక వేత్త హేమ్ రాజ్ కుటుంబం నేపాలీలను ఎలాంటి ఆధారాలు లేకుండా పనిలో పెట్టుకుంది. ఫలితం... ఆదివారం రాత్రి రూ.2 కోట్ల సొత్తుతో ఆ నేపాలీలు ఉడాయించారు. ఈ కేసును ఈస్ట్‌జోన్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలో దింపిన డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

పథకం ప్రకారం పనిలో చేరిన నేపాలీలు...

కాచిగూడ లింగంపల్లి అమ్మవారి దేవాలయం సమీపంలో హేమ్ రాజ్ తన భార్య మీనా దుగ్గర్, కుమారుడు, కోడలు, మనుమళ్లతో కలిసి ఉంటున్నారు. కొన్నాళ్లుగా వీరి వద్ద నేపాల్‌కు చెందిన ఓ మహిళ పని చేస్తోంది. ఆ ఇంటి వ్యవహారాలు పూర్తిగా తెలిసిన ఆమె అదును చూసుకుని కొల్లగొట్టాలని పథకం వేసింది. త్వరలో తాను పని మానేసి తన స్వదేశానికి వెళ్లిపోతానంటూ ఇటీవల ఆ మహిళ చెప్పింది. తన స్థానంలో పని చేయడానికి తమ దేశం నుంచే వచ్చిన మరో మహిళ సిద్ధంగా ఉందని దాదాపు నెల రోజుల క్రితం చేర్పించింది. హేమ్‌రాజ్ ఇంట్లో ప్రస్తుతం రెన్నోవేషన్ పని నడుస్తోంది. దీంతో ఆ పనిలో సహకరించడానికి, ఇంటిని శుభ్రం చేయడానికి మరో మనిషి కావాలంటూ పది రోజుల క్రితం కొత్త పని మనిషికి చెప్పారు. ఆ పని చేయడానికి తన పరిచయస్తుడు ఉన్నాడని చెప్పిన ఈ కొత్త పనిమనిషి మరో నేపాలీని ఆ ఇంటికి తీసుకువచ్చింది.

నేపాలీలు అంతా కలిసి అదును చూసుకుని...

ఇలా కొత్తగా పనిలో చేరిన ఇద్దరి ఫొటోలు, వివరాలను హేమ్ రాజ్ కుటుంబం తీసుకోలేదు. కనీసం వాళ్లు చెప్పిన పేర్లు నిజమా? కాదా? అనేది పరిశీలించలేదు. వేసవి సెలవుల నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం హేమ్‌రాజ్ కుమారుడి కుటుంబం విదేశాలకు వెళ్లింది. వృద్ధ దంపతులే ఇంట్లో ఉండటంతో ఆ ఇంటిని కొల్లగొట్టడానికి ఇదే సరైన సమయమని ఇరువురు నేపాలీలు నిర్ణయించుకున్నారు. ఆదివారం రాత్రి వృద్ధ దంపతుల ఆహారంలో మత్తుమందు కలిపారు. వీళ్లు మత్తులో ఉండగా... అల్మారాలు, లాకర్లు పగులకొట్టిన నేపాలీ ద్వయం బంగారం, వజ్రాభరణాలు, నగదుతో సహా మొత్తం రూ.2 కోట్ల విలువైన సొత్తు కాజేశారు. ఇంటిని బయట నుంచి తాళం వేసి యజమాని కారులోనే సంతోష్‌నగర్ వరకు వెళ్లిన ఇరువురూ వాహనం అక్కడ వదిలేశారు. ఆపై ఆటోలో శంషాబాద్ వైపు ఉడాయించారు. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వచ్చిన ఫాల్స్ సీలింగ్ వర్కర్లు ఎంత పిలిచినా యజమానుల నుంచి స్పందన లేకపోవడంతో సమీపంలో ఉండే బంధువులకు సమాచారం ఇచ్చారు.

వివిధ రాష్ట్రాలకు వెళ్లిన ప్రత్యేక బృందాలు...

ఈ నేరంపై పోలీసులకు సోమవారం మధ్యాహ్నం సమాచారం అందింది. ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. యజమానుల దగ్గర నేపాలీల పేర్లు తప్ప వారి వివరాలు, చిరునామాలు, ఫొటోలు లేకపోవడం దర్యాప్తును సంక్లిష్టం చేసింది. పాత పనిమనిషితో పాటు కొత్త పని వాళ్లు ఇద్దరి ఆచూకీ కోసం రాష్ట్రం చుట్టుపక్కల ఉన్న సాధారణ, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు ప్రత్యేక బృందాలు ఉత్తరాదిలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లాయి. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టునూ అప్రమత్తం చేశారు. శంషాబాద్ నుంచి నేపాలీలు ఎటు వెళ్లారనేది గుర్తించడానికి వివిధ సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. అఫ్జల్‌గంజ్ ఫైరింగ్ కేసు అనుభవం నేపథ్యంలో ఈ నేరగాళ్లు దేశం దాటకముందే పట్టుకోవాలనే లక్ష్యంతో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ యువత చేతుల్లోనే..

మంత్రి కొండా సురేఖ



సాక్షి సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో యువత, విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ ఏడాది ఎర్త్ డే సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్మెంట్ కన్జర్వేషన్ అండ్ అడ్వకసీ (ఐఈసీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన ' క్లైమేట్ స్మార్ట్ హరిత్ క్యాంపస్' ప్రచారాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన, పచ్చని గ్రహాన్ని నిర్మించడంలో తెలంగాణ విద్యా రంగం నిబద్ధతను ప్రదర్శించే పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఐఈసీఏ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఐఈసీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సుమాలిని తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కోసం వెళ్లి మృత్యువాత...

- స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- కుమార్తె కళ్లముందే తల్లి మృతి

అబిడ్స్: షాపింగ్ కోసం స్కూటీపై బయలుదేరిన తల్లీ కూతుళ్లను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కుమార్తె కళ్లముందే తల్లి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేపాక్షి ప్రధాన రోడ్డుపై చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా భైంసా ప్రాంతానికి చెందిన బీబీ జహినాబ్(45), తన కుమార్తె జుమేరా(20)తో కలిసి ఖైరతాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బీబీ జహినాబ్ మెహిదీపట్నంలో టీచర్‌గా ఉద్యోగం చేస్తుంది. మంగళవారం రాత్రి కోఠిలో షాపింగ్ చేసేందుకు వీరు హోండా యాక్టివా వాహనంపై బషీర్‌బాగ్ మీదుగా కోఠికి బయలుదేరారు. నిజాం కాలేజీ దాటి గోల్కొండ హ్యాండీక్రాఫ్ట్స్ వద్దకు రాగానే హెచ్‌సీయూ డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో బీబీ జహినాబ్ బస్సు వెనక చక్రాల క్రింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న జుమేరా తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. సమాచారం అందుకున్న అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్, ఎస్ఐ.సుమన్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం నుంచి బయట పడ్డ జుమేరా షాక్‌లో ఉండిపోవడంతో ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకొని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీటీఐఎన్ మొబైల్ అప్‌డేషన్

- ఆన్‌లైన్ ద్వారా చేసుకునే సదుపాయం
- అందుబాటులోకి తెచ్చిన జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: మొబైల్ ఫోన్ నంబర్ మారిన వారు, పాత నంబర్ పని చేయకుండా పోయిన వారు జీహెచ్ఎంసీలో తమ ఆస్తిపన్ను ఖాతాలో నమోదైన ఫోన్ నంబర్ స్థానే కొత్త నంబర్‌ను మార్చుకునేందుకు జీహెచ్ఎంసీ కార్యాలయాల దాకా వెళ్లకుండా ఆన్‌లైన్ నుంచి చేసుకునే సదుపాయాన్ని జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఫోన్ నంబర్ మార్చుకోవాలనుకునే వారు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో 'ఆన్‌లైన్ పేమెంట్, ప్రాపర్టీ ట్యాక్స్'లోకి వెళ్లి లేదా https://onlinepayments.ghmc.gov.in/PTax/PT&MobileUpdate అని టైప్ చేసి ఎంటర్ చేస్తే ఓపెన్ అయ్యే పేజీలో తమ సర్కిల్‌ను ఎంపిక చేసుకుని మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే ఆ నంబర్‌తో ఉన్న పీటీఐఎన్ (ఆస్తిపన్ను గుర్తింపు నంబర్లు) కనిపిస్తాయి. పీటీఐఎన్‌కు ఎదురుగా ఉన్న అప్‌డేట్ బటన్‌పై ఎంటర్ చేయాలి. ఫోన్ నంబర్‌లోని చివరి నాలుగు అంకెలు కనిపిస్తాయి. ఆ ఫోన్ పని చేస్తున్నట్లయితే కొత్త మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. పాత నంబరుకు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తే ఆటోమేటిక్‌గా కొత్త నంబర్‌కు అప్‌డేట్ అవుతుందని అధికారులు తెలిపారు. ఒకవేళ పాత ఫోన్ పని చేయకపోతే కొత్త మొబైల్ నంబర్ ఎంటర్ చేశాక కొత్త నంబరుకు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేస్తే తమ అప్లికేషన్ సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వెళ్తుంది. పని చేస్తున్న మొబైల్ నంబర్లన్నీ సంబంధిత డిప్యూటీ కమిషనర్ ప్రాపర్టీ ట్యాక్స్ లాగిన్‌లోకి వెళ్తాయి. డిప్యూటీ కమిషనర్ సిటిజన్‌తో ధ్రువీకరించుకొని అప్రూవ్ చేస్తారు. మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేస్తారు. అప్‌డేట్ అయిన నంబరుకు జీహెచ్ఎంసీ ఆస్తిపన్నుకు సంబంధించిన సమాచారం, ఇతరత్రా సమాచారం వస్తుంది. ప్రస్తుతం వివిధ ఆన్‌లైన్ సేవలకు ఫోన్ నంబర్, ఓటీపీలు వినియోగిస్తుండటం తెలిసిందే. జీహెచ్ఎంసీకి సంబంధించి ఆస్తిపన్ను వివరాలు తెలుసుకోవాలనుకున్నా, ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించాలన్నా ఓటీపీ ఆధారంగానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఫోన్ నంబర్ మార్చుకోవాలనుకునేవారి సదుపాయార్థం ఈ సదుపాయం అందుబాటులోకి తెచ్చినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్ మార్క్ సర్టిఫికెట్



ఓయూ వీసీకి సర్టిఫికెట్ అందిస్తున్న సుభజిత్ సాహా

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీ భవనానికి లభించిన ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను పూర్వవిద్యార్థి సుభజిత్ సాహా మంగళవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు అందచేశారు. నిజాం హయాంలో 1939లో నిర్మించిన ఆర్ట్స్ కాలేజీ భవనం ప్రతిష్ఠను పెంచేందుకు ఓయూ న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి జాతీయ స్థాయి మేథోసంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో గత ఏడాది అక్టోబరులో దరఖాస్తు చేయగా ట్రేడ్ మార్క్ గుర్తింపు లభించింది.

బతుకమ్మ కుంట చెరువే

కీలక తీర్పు వెలువరించిన సిటీ సివిల్ కోర్టు



లీగల్ టీంను అభినందిస్తున్న హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వివాదంపై సిటీ సివిల్ కోర్టు మంగళవారం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. బతుకమ్మ కుంట చెరువు కాదని, అది తమ స్థలమే అంటూ యెడ్ల సుధాకర్ రెడ్డి వేసిన సివిల్ సూట్‌ను డిస్మిస్ చేసింది. రెవెన్యూ రికార్డులు, విలేజ్ మ్యాప్‌లు, శాటిలైట్ ఇమేజ్‌లు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ఆధారంగా హైడ్రా తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం అది చెరువేనని స్పష్టం చేసింది. దాదాపు నెల రోజుల పాటు ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి ఎం.వెంకటేశ్వర రావు ఈ మేరకు తీర్పు వెలువరించారు. దీంతో బతుకమ్మ కుంట అభివృద్ధికి ఆటంకాలు తొలిగాయని హైడ్రా అధికారులు ప్రకటించారు. ఈ తీర్పును స్వాగతించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తమ తరఫున వాదనలు వినిపించిన స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్లు కె.అనిల్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, బి.అజయ్, ప్రభుత్వ తరఫు న్యాయవాది బి.జనార్దన్, హైడ్రా న్యాయ సలహాదారు శ్రీనివాస్‌లను అభినందించారు. నగరంలో పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయదలచిన ఆరు చెరువుల్లో బతుకమ్మ కుంట కూడా ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 18న దీని అభివృద్ధి పనుల్ని ప్రారంభించిన హైడ్రా మోకాలు లోతు మట్టి తీయగానే నీళ్లు ఉబికి వచ్చాయి. 1962–63 లెక్కల ప్రకారం అంబర్‌పేట మండలం బాగ్‌అంబర్‌పేట్‌లోని సర్వే నం.563లో బతుకమ్మ కుంట 14.06 ఎకరాలు కాగా..బఫర్ జోన్‌తో కలిపి ఇది 16.13 ఎకరాలు. ప్రస్తుతం ఇది కేవలం 5.15 ఎకరాలుగా మిగిలింది. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయాలంటూ స్థానికులు హైడ్రాను కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ జనావాసాల జోలికి వెళ్లకుండా ఉన్న చెరువునే అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో అప్పట్లో స్థానికుల నుంచి హైడ్రాకు పూర్తి మద్దతు లభించింది. మంగళవారం కోర్టు తీర్పుతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు.

భర్తకు కరెంటు షాకిచ్చి హత్య చేసిన కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కేపీహెచ్‌బీ కాలనీ: కూతురు పెళ్లి విషయంలో తలదూర్చవద్దని, ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించిన భర్తను కరెంటు షాక్ పెట్టి హత్య చేసిన కేసులో భార్యతో పాటు సహకరించిన మరో ఇద్దరిని కేపీహెచ్‌బీ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డిలు హత్య కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా లింగాయపల్లికి చెందిన సాయిలును భార్య కవిత గత శుక్రవారం రాత్రి పథకం ప్రకారం విద్యుత్ షాక్ ఇచ్చి హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసులో కవితకు సహకరించిన సోదరి జ్యోతి, ఆమె భర్త మల్లేష్‌లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా నిందితులు మృతదేహాన్ని గుర్తు పట్టకుండా కవర్‌లో చుట్టి ఆటోలో తరలించి జోగిపేట వద్ద పూడ్చిపెట్టేందుకు యత్నించగా ఆటో డ్రైవర్ నిలదీయడంతో తిరిగి వారు నివాసం ఉంటున్న మిత్రహిల్స్‌కు చేరుకొని అక్కడి నిర్మానుష్య ప్రాంతంలో పూడ్చి పెట్టారు. అనంతరం ఆటో డ్రైవర్ ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుట్టు రట్టు చేసిన ఆటో డ్రైవర్...

కవర్‌లో మూటకట్టిన మృతదేహాన్ని చెత్త కుప్పగా నమ్మించి సంగారెడ్డి చెరువులో పడవేసేందుకు ఆటోను మాట్లాడుకొని శనివారం రాత్రి బయలుదేరి వెళ్లగా నిర్మానుష్య ప్రాంతంలో పూడ్చిపెట్టేందుకు యత్నిస్తున్న విషయాన్ని ఆటోడ్రైవర్ వలీనాయక్ కనిపెట్టాడు. అనుమానం వచ్చి కవితను గట్టిగా నిలదీశాడు. దీంతో ఆమె తిరిగి తమను ఎక్కడ ఎక్కించుకున్నావో అక్కడే దించాలని చెప్పడంతో మిత్రహిల్స్ వద్ద దించాడు. అప్పటికే కవర్‌లో మూటగట్టిన మృతదేహం వాసన రావడంతో అనుమానం వచ్చిన ఆటోడ్రైవర్ వలీనాయక్ మరుసటి రోజు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డిని కలిసి విషయం చెప్పాడు. దీంతో హత్య కేసు గుట్టు రట్టయింది. ధైర్యంగా ముందుకు వచ్చి జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పిన వలీనాయక్‌ను పోలీస్ అధికారులు అభినందించారు.

ఆన్‌లైన్ కేంద్రంగా నకిలీ ఉత్పత్తుల విక్రయం

- డాక్టర్ ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు
- ముగ్గురు ఢిల్లీ వాసులను అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వైద్యుడి సంస్థలో ఉత్పత్తి అయ్యే సౌందర్య సాధనాల మాదిరిగా నకిలీ ఉత్పత్తులు తయారు చేసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఢిల్లీ ముఠా గుట్టును సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. మొత్తం ఐదుగురిలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత మంగళవారం ప్రకటించారు. సిటీ వైద్యుడు చర్మ, కేశ సౌందర్యానికి సంబంధించిన సబ్బులు, ఇతర ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తుంటారు. వీటిని ఈ-కామర్స్ వెబ్‌సైట్స్, యాప్స్‌లో మంచి డిమాండ్ ఉంది. ఢిల్లీకి చెందిన దినేష్ నేగి, పంకజ్, నిఖిల్, మోహిత్ శర్మ, సోను కుమార్ ఈ-కామర్స్ ద్వారా వివిధ రకాలైన ఉత్పత్తులు విక్రయిస్తుంటారు. నగర వైద్యుడి ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించిన వీళ్లు నకిలీవి తయారు చేయాలని పథకం వేశారు. అవే ఉత్పత్తుల్ని పోలినవి తయారు చేసి, డాక్టర్ కంపెనీ ప్రొడక్ట్స్ పేరు, లేబుళ్లతో విక్రయిస్తున్నారు. మొత్తం 19 వెబ్‌సైట్ల కేంద్రంగా వీటిని అమ్ముతున్నారు. నెల రోజుల క్రితం ఈ విషయం గుర్తించిన వైద్యుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేసి నిందితుల్ని గుర్తించారు. దినేష్, పంకజ్ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్టు చేసి తీసుకువచ్చారు.

తెలంగాణ భవన్ నుంచి తప్పించుకుంది ఇతడే?

ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీ నుంచి ఆదివారం తప్పించుకుపారిపోయింది ఈ కేసులో కీలక నిందితుడు దినేష్ నేగి అని తెలుస్తోంది. సిటీ సైబర్ క్రైమ్ ఠాణాకు చెందిన ఓ ప్రత్యేక బృందం ఇటీవల సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి ఢిల్లీ వెళ్లి అక్కడి తెలంగాణ భవన్‌లో బస చేసింది. దినేష్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌లోని తమ రూమ్ నెం.403లో తమతో పాటు ఉంచింది. సోమవారం తెల్లవారు జామున 1:45 గంటలకు దినేష్ పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అక్కడ నుంచి తప్పించుకుపోయిన దినేష్ ఈ నకిలీ ఉత్పత్తుల కేసులో నిందితుడిగా ఉన్న దినేష్ నేగి అని తెలుస్తోంది. ఇతడి కోసం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులతో పాటు ఢిల్లీ పోలీసులూ గాలిస్తున్నారు.

కరెంట్ కట్ అంటూ భారీ మొత్తం స్వాహా...

నగరానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగిని (78) టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు కరెంట్ బిల్లు పెండింగ్, కనెక్షన్ కట్ అంటూ భయపెట్టి రూ.3.99 లక్షలు స్వాహా చేశారు. బాధితుడిని వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశంలో కరెంటు బిల్లు బకాయి ఉందని, చెల్లించకపోతే రెండు గంటల్లో విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని ఉంది. తాను అప్పటికే బిల్లు చెల్లించానంటూ బాధితుడు జవాబు ఇచ్చారు. దీంతో వీడియో కాల్ చేసిన నేరగాడు సిస్టమ్‌లో చెల్లింపులు కనిపించట్లేదని పేర్కొన్నాడు. ధ్రువీకరణ కోసమంటూ ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. అందులో బాధితుడి పేరు, విద్యుత్ సర్వీస్ నంబర్‌తో పాటు వ్యక్తిగత వివరాలను నమోదు చేయించాడు. కొద్దిసేపటికే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.49,999 చొప్పున ఎనిమిది లావాదేవీల్లో రూ.3,99,992 స్వాహా చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జిమిర్చి.23, క్యాప్సికం.50, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.09, క్యారెట్.21, దొండకాయ.23, గుండు బీన్నీస్.65, గింజచిక్కుడు.55, గోకరకాయ.35, కీర.16, దోసకాయ.18, బీట్‌రూట్.15, ఉల్లిగడ్డ.14, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.23, కందగడ్డ.85, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ.09, పొట్లకాయ.18, అరటికాయ.10, మునగకాయ.4, మామిడికాయ 49, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.28. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

25న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠా దినోత్సవం

బంజారాహిల్స్: సోమాజీగూడ రాజ్‌భవన్ రోడ్డులో కొలువుదీరిన శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 25న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీఅయ్యప్ప భక్త సమితి జనరల్ సెక్రటరీ జీఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అనంతరం మహాగణపతి హోమం, మృత్యుంజయ హోమం, సర్వాభిషేకం, ఉషా పూజ, కలశ పూజ, కలశాభిషేకం శబరిమల పూజారులచే నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం మహాదీపారాధన, ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. వేడుకల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన



బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఫిలింనగర్ గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో స్థానిక 10 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా సంక్షేమ అధికారులు గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. తమ ఇంట్లోనే వండుకునే పదార్థాల్లో పోషక విలువలు ఉన్న ఆహారాన్ని వివరించారు. ఫిలింనగర్ 18 బస్తీలకు చెందిన గర్భిణులతో పాటు తల్లులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

బంజారాహిల్స్: ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌కు చెందిన నిష్ఠ (16) ఇంటర్ చదువుతోంది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆమె ఓ సబ్జెక్టులో ఫెయిలైంది. దీంతో మనస్తాపానికి గురైన నిష్ఠ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది కొరతను పరిష్కరించాలి



హిమాయత్ నగర్ : వివిధ శాఖల్లో సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని మున్సిపల్, జలమండలి, యూసీడీ అధికారులు, ఇతర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్ట్రీట్ లైట్స్‌తో పాటు వాటర్ వర్క్స్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీసీఎం మారుతి దివాకర్, ఏఎంహెచ్‌ఓ హేమలత, యూసీడీ రజిత రెడ్డి, స్ట్రీట్ లైట్ డిపార్ట్‌మెంట్ అశోక్, రామ్‌కి అధికారి శ్రీకాంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, నాయకులు అశోక్, ఎతిరాజ్, వినోద్, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంజీ కామెట్ బ్లాక్ స్ట్రోమ్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఎంజీ హెక్టార్ షోరూంలో మంగళవారం సంస్థ ప్రిన్సిపల్ డీలర్ అభయ్ దుబే దేశంలోనే స్ట్రీట్ స్మార్ట్ కారుగా గుర్తింపు పొందిన ఎంజీ కామెట్ బ్లాక్ స్ట్రోమ్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఫీచర్లు కలిగిన ఈ కారు వినియోగదారులకు మంచి అనుభూతిని కలిగిస్తుందన్నారు. ప్రయాణికుడు కోరుకునే స్టైల్‌తో పాటు కారులో అత్యాధునిక ఫీచర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపాడు. ఎంజీ కామెట్ వాహనాల అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 29 శాతం వృద్ధిని సాధించినట్లు ఆయన పేర్కొన్నాడు.

మైనర్ డ్రైవింగ్‌పై కొరడా

- ఇప్పటి వరకు 228 కేసులు నమోదు
- ఓ బాలుడికి సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి ఆదేశం
- వాహనం ఇచ్చిన యజమానితో పాటు బాలుడికి కౌన్సెలింగ్..
- ప్రతిరోజూ కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు..



జూబ్లీహిల్స్‌లో మైనర్ డ్రైవింగ్ తనిఖీలను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బైక్ నడుపుతూ పట్టుబడిన బాలుడిని మంగళవారం నాంపల్లిలోని 5వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి సదరు బాలుడిని గాజులరామారంలోని జువైనల్ హోంకు తరలించాలని, అక్కడ ఏడు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత కొద్ది రోజులుగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటివరకు వాహనాలు నడుపుతున్న 228 మంది మైనర్లను పట్టుకున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 22 వరకు పట్టుబడిన 228 మందిలో 83పై చార్జిషీట్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన బాలుడిని జువైనల్ జైలుకు పంపించారు. అలాగే 82 మంది బలురను జువైనల్ కోర్టులో హాజరుపర్చగా వీరందరినీ జువైనల్ హోంకు తరలించడమే కాకుండా అక్కడ సామాజిక సేవ చేయాలని కోర్టు ఆదేశించింది. అలాగే మరో 55 మంది మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులకు జరిమానాలు విధించారు. 26 మంది వాహనదారుల వాహన రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయాలని ఆర్టీఏకు లేఖ రాశారు. ట్రాఫిక్ పోలీసులు గత కొంతకాలంగా వేర్వేరు చోట్ల ముమ్మరంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతూ వాహనాలను స్వాధీనం చేసుకుంటూనే తల్లిదండ్రులకు, మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

వెస్ట్ జోన్ పరిధిలో కేసులు ఇలా..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	పంజగుట్ట	ఎస్సార్‌నగర్	జూబ్లీహిల్స్	బంజారాహిల్స్
నమోదైన కేసులు	63	67	46	52
ఫైల్ చేసిన ఛార్జిషీట్లు	13	18	27	25
సామాజిక సేవ విధింపు	13	18	27	24
వాహన యజమానికి జరిమానాలు	0	11	27	17
ఆర్‌సీ రద్దు కోసం ఆర్టీఏకు లేఖ	0	6	14	6

వాహన యజమాని ఆర్‌సీ రద్దు



వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే సదరు వాహనం ఇచ్చిన యజమానికి 12 నెలల పాటు వాహన ఆర్‌సీ రద్దు చేస్తారు. మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. బండి నడుపుతూ చిక్కిన మైనర్లు కూడా 25 ఏళ్లు వచ్చేవరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందలేరు. ఈ నిబంధనల నేపథ్యంలో పిల్లలకు వాహనం ఇచ్చేముందు తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నగర ట్రాఫిక్ అదనపు సీపీ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పర్యవేక్షణలో వెస్ట్ జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు జరుగుతున్నాయి. సెలవుల నేపథ్యంలో తనిఖీలను మరింత ముమ్మరం చేస్తాం.

–కట్టా హరిప్రసాద్, ఏసీపీ వెస్ట్‌జోన్ ట్రాఫిక్

‘రోప్’తో ఫుట్‌పాత్ క్లీన్..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పాటు షాపుల ముందు, హోటళ్ల ముందు ఇష్టానుసారంగా డబ్బాలు, ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. షాపుల ముందు భాగాన్ని భవన యజమానులు ఆక్రమించడంతో రాకపోలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీనిపై ట్రాఫిక్ పోలీసులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12-ఆపరేషన్ రోప్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. అంతేగాక ప్రతిరోజూ ఈ రోడ్డును సెక్టార్ ట్రాఫిక్ ఎస్‌ఐతో పాటు ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెండు నెలల వ్యవధిలో ఈ రోడ్డులో మూడు సార్లు ఆపరేషన్ రోప్ నిర్వహించారు. ఆపరేషన్ రోప్ నిర్వహించిన వారం రోజులకు కొంతమంది తిరిగి రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలకు తెగించడంతో తాజాగా మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 308 పైగా ఆక్రమణలు తొలగించారు. దీంతో ఇప్పుడు అగ్రసేన్ చౌరస్తా నుంచి కమాన్ కంట్రోల్ సెంటర్, కమాన్ మీదుగా విరించి ఆస్పత్రి వరకు ఫుట్‌పాత్‌లు క్లీన్ అయ్యాయి. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచే పరిస్థితిని తీసుకువచ్చారు. ఆక్రమణల తొలగింపుతో రోడ్లు కూడా విశాలంగా కనిపిస్తున్నాయి. హోటళ్ల ముందు అక్రమ పార్కింగ్‌లపై కూడా కొరఢా ఝుళిపిస్తున్నారు. దీంతో రోడ్డునెంబర్-12 చాలావరకు ఆక్రమణలు లేని ఫుట్‌పాత్ స్థానికులకు అందుబాటులోకి వచ్చింది.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం



నీటి సమస్యపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని, అటు పథకాల అమలులో ఇటు మౌలిక వసతుల కల్పనలో ప్రజలకు మొండి చేయి చూపించిందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రెజర్ లేక తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఏర్పాటు చేసుకున్న వాటర్ మోటార్స్‌లను వాటర్‌వర్క్స్ అధికారులు తొలగించడం సమంజసం కాదన్నారు. అధికారుల వైఖరి మార్చుకోకపోతే తానే స్వయంగా రంగంలోకి దిగి మోటార్లను ఏర్పాటు చేయిస్తానని హెచ్చరించారు. నియోజకవర్గంలోని పలు బస్తీల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పేదల ఇళ్లపై దాడులు చేస్తున్నారని పలు బస్తీల ప్రజలు ఎమ్మెల్యే మాగంటికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ సరఫరా, నీటి సరఫరా సక్రమంగా అందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. తానే స్వయంగా బస్తీల్లో పర్యటించి అధికారులతో మాట్లాడి ప్రజలకు భరోసాగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, పలు డివిజన్ల అధ్యక్షులు, బస్తీనేతలు, మహిళలు పాల్గొన్నారు.

విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానం



అవార్డు గ్రహీతలతో గుత్తా సుఖేందర్ రెడ్డి

పంజగుట్ట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదిస్తూనే మాతృభాషను కాపాడుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సమీకృత (అంతర్జాతీయ) తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్‌క్లా) ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇట్‌క్లా-2025 విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇట్‌క్లా అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మృదంగ మాస్ట్రో పద్మశ్రీ గ్రహీత డాక్టర్ యెల్లా వెంకటేశ్వర రావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత లయన్ డాక్టర్ ఎ.నటరాజ్, ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచురణ కర్త చేబియ్యం రామకృష్ణ, సామాజిక సేవారత్న, డాక్టర్ భింగి నరేందర్ గౌడ్‌లను విశ్వ తెలుగు వెలుగు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ .. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనే తెలుగు మాట్లాడడం తక్కువైందని ఈ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగును అభివృద్ధి చేసేందుకు ఇట్‌క్లా గత 30 ఏళ్లుగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తెలుగుపై మక్కువ ఉండి తెలుగును ప్రోత్సహించే వారిని సత్కరించుకుంటే వారికి మరింత ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.

ఎస్ఎస్‌సీలో గ్రేడింగ్ వ్యవస్థను కొనసాగించాలి



హిమాయత్‌నగర్ : 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం మూల్యాంకన విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలను సంప్రదించకుండా ఏకపక్షంగా మార్పులు చేయడం తగదని తెలంగాణ రికగ్నైడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.అనిల్ కుమార్, కోశాధికారి కె.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. దీనిపై పునఃసమీక్షించాలని ఎస్ఎస్‌సీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గతంలో మాదిరిగానే ఇంటర్నల్ మార్కులు, జీపీఏ గ్రేడింగ్ వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె.కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కుల విధానం తిరిగి ప్రవేశపెట్టడంతో, విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ఫలితాలపై ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఈ మార్కుల కేంద్రీకృత విధానం కొన్ని కార్పొరేట్ సంస్థల పోటీ, దోపిడీకి దారితీసే అవకాశం ఉందన్నారు. వారు అడ్మిషన్ ప్రయోజనాల కోసం పరిస్థితిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందన్నారు.

తవ్వి వదిలేశారు..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1/12 విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి శివాలయం, సర్వీ హోటల్ మీదుగా రోడ్ నెం. 1/10 సిటీ సెంటర్ మాల్ చౌరస్తా వరకు కేబుల్ పనుల నిమిత్తం ఇటీవల రోడ్డు పక్కన భారీగా తవ్వకాలు చేపట్టారు. పనులు పూర్తయిన వెంటనే తవ్విన రోడ్డుకు బీటీతో మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే రోజులు గడుస్తున్నా రమ్మతులు చేపట్టకపోవడంతో పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు అదుపు తప్పి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. కేబుల్ పనులు పూర్తయిన తర్వాత వెంటనే తవ్విన ప్రాంతంలో సిమెంటు, లేదా బీటీతో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా సంబంధిత ఇంజనీర్లు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. నిత్యం వేలాది వాహనాలతో కిటకిటలాడే ఈ రోడ్డులో సంబంధిత శాఖల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నౌహీరా షేక్ ఇంటి వద్ద హైడ్రామా

బంజారాహిల్స్: చెక్ బౌన్స్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయడానికి వచ్చిన కర్ణాటక పోలీసుల హడావుడితో హీరా గ్రూప్ సీఈవో నౌహీరా షేక్ నివాసం వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. సోమవారం ఉదయం కర్ణాటక శివమొగ్గ పోలీసులు బంజారాహిల్స్ రోడ్ నెం .12లోని నౌహీరా షేక్ నివాసం వద్దకు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయడానికి బంజారాహిల్స్ పోలీసుల సహకారంతో వచ్చారు. ఆమె మీద 15 చెక్ బౌన్స్ కేసులతో పాటు అయిదు ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వ్యవహారంలోనే ఆమెకు నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఇచ్చేందుకు శివమొగ్గ పోలీసులు వచ్చారు. ఆమెను అరెస్ట్ చేసేందుకు వెళ్లగా ఆమె రెండో అంతస్తులోకి వెళ్లి లోపలి నుంచి తాళం బిగించుకున్నారు. సుమారు 10 గంటల పాటు ఆమె ఫీయరింగ్ అరెస్ట్ అయ్యారు. కర్ణాటక, తెలంగాణ పోలీసులు సహకరించాలంటూ ఆమెను కోరుతూ సోమవారం రాత్రి వరకు అక్కడే ఉన్నారు. నౌహీరాషేక్ అడ్వొకేట్లు కూడా అక్కడికి చేరుకున్నారు. శివమొగ్గ అదనపు సివిల్ జడ్జి ఎదుట రెండు రోజుల్లో హాజరవుతారని, ఆరోగ్య పరిస్థితి బాగా లేదంటూ ఆమె తరపు న్యాయవాదులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. సుమారు 10 గంటల పాటు నౌహీరా షేక్ ఇంటి వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. ఎట్టకేలకు పోలీసులు వెళ్లిపోవడంతో ఆమె తాళం వేసిన గది నుంచి బయటికి వచ్చారు.

బొట్టు పెట్టి... సభకు పిలిచి..

వెంకటేశ్వరకాలనీ: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకకు ప్రతి ఒక్కరు తరలి రావాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని దోబీఘాట్ బస్తీతో పాటు సింగాడికుంట, నాయుడు నగర్ బస్తీల్లో ఇంటింటికి తిరుగుతూ కార్యకర్తలకు, నేతలకు బొట్టు పెట్టి పార్టీ ఆవిర్భావ వేడుకకు రావాల్సిందిగా కోరారు. డివిజన్ నుంచి పెద్ద ఎత్తున సభకు హాజరై సత్తా చాటాలని ఆమె కోరారు.



దోబీఘాట్ బస్తీలో బొట్టు పెట్టి బీఆర్ఎస్ సభకు ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి...

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

హిమాయత్‌నగర్ : ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ చీఫ్ ప్యాట్రన్, డెక్కన్ హెరిటేజ్ అకడమిక్ ట్రస్ట్(డీహెచ్‌ఏటీ) చైర్మన్ మణికొండ వేదకుమార్ పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పు, వ్యర్థాల తగ్గింపు, మొక్కల సంరక్షణపై దృష్టి సారించడం అవసరం అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజులు, సీబీఎస్‌ఈ ప్రిన్సిపాల్ రేఖా రావు, ప్రీ-ప్రైమరీ ప్రిన్సిపాల్ ఫాతిమా ఖాజిమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సరస్వతీ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

బంజారాహిల్స్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీ సరస్వతీ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కళాశాల చైర్మన్ రామ సుబ్బయ్య ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జాస్మిత అనే విద్యార్థిని 990 మార్కులు సాధించగా బైపీసీలో రుషి 989 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో సత్యజిత్ 462, ఫస్టియర్ బైపీసీలో రోహిత్ 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 99 శాతం ఉత్తీర్ణతతో పాటు జూనియర్ ఎంఈసీలో 96 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. మొత్తంగా ఇంటర్మీడియట్‌లో 97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ సునీల్, అకడమిక్ హెడ్ నరేందర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్‌హోం సిబ్బంది పనితీరు అభినందనీయం



వంటగదిని పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు...

వెంగళరావునగర్: శిశువిహార్ అధికారులు, సిబ్బంది చిన్నారులను కన్నబిడ్డల్లా కాపాడుతున్నారని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ సభ్యులు (ఎస్‌సీపీసీఆర్) అన్నారు. మధురానగర్‌కాలనీలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్టేట్‌హోంను మంగళవారం కమిషన్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని గదులను కలియతిరిగారు.పిల్లలు ఉన్న గదులను తనిఖీ చేశారు. కిచెన్‌లో పిల్లలకు అందించే ఆహారాన్ని రుచి చూశారు. డైనింగ్‌హాల్‌లో పిల్లలు తినే విధానాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టోర్ నిర్వహణ, నిబంధనలను పరిశీలించి ప్రశంసించారు. పాక్షికంగా పక్షపాతం ఉన్న చిన్నారులను కేసుల వారీగా అందరి వివరాలు సేకరించారు. ప్రీస్కూల్ పిల్లలతో అధిక సమయం గడిపి వారితో సంభాషించారు. పిల్లల పట్ల శ్రద్ధ, ప్రేమ, ఆప్యాయత చూపుతున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి, సభ్యులు కె.వందన గౌడ్, ఎం.చందన, బి.అపర్ణ, ప్రేమలత అగర్వాల్, బి.వచన్ కుమార్, స్టేట్‌హోం, శిశువిహార్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ హితమే జేఎస్‌పీ హ్యుందాయ్ ధ్యేయం



సూర్య ట్రావెల్స్ ఎండీకి సీఎన్‌జీ ఆరా వాహనాలను అందజేస్తున్న హ్యుందాయ్ సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: పర్యావరణ హిత భవిత దిశగా జేఎస్‌పీ హ్యుందాయ్ సూర్య ట్రావెల్స్, సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంది. మంగళవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని హుండాయ్ షోరూంలో 35 హ్యుందాయ్ ఆరా సీఎన్‌జీ వాహనాల పత్రాలు, తాళాలను హుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ జి రామ్‌కుమార్, సంస్థ ఎండీ పృథ్వీ రెడ్డి సమక్షంలో సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్ మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా హ్యుందాయ్ ఆర్‌ఎం శ్రీరామ్ మాట్లాడుతూ సీఎన్‌జీ వాహనాల వల్ల ఇంధన పొదుపుతో పాటు తక్కువ కాలుష్యాన్ని కలిగించే విధంగా ఉంటాయన్నారు. కార్పొరేట్ లాజిస్టిక్స్ రంగాలకు సీఎన్‌జీ వాహనాలు అందించడం ద్వారా తక్కువ వ్యయంతో పర్యావరణ హిత పరిష్కారాన్ని అందిస్తున్నామన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ.. స్విమ్మింగ్ పూల్



అధికారులు కూల్చివేసిన స్విమ్మింగ్ పూల్...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలోని 102/1 సర్వే నెంబర్‌లో 12 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులు సదరు స్థలంలో ఉన్న ఆక్రమణలను కూలిచ్చివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాలనీ వైపు ఓ వ్యక్తి ఏకంగా 500 గజాలకు పైగా స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించడమేగాక అందులో స్టోర్ రూమ్‌లతో పాటు ఓ అందమైన స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసుకున్నాడు. దీనిని గుర్తించిన అధికారులు సదరు నిర్మాణాలతో పాటు స్విమ్మింగ్‌పూల్‌ను కూల్చివేశారు. ఇదే దారిలో సుమారు 10 మందికి పైగా నివాసితులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లుగా గుర్తించారు. సొసైటీ లే అవుట్‌ను పరిశీలించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ప్రహరీని కూలుస్తున్న దృశ్యం..

‘ప్రజావాణి’లో 371 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 371 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 75, విద్యుత్ శాఖ 24, రెవెన్యూ శాఖ 71, మున్సిపల్ శాఖ 24, ఇందిరమ్మ ఇండ్ల కోసం 96 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 81 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.


ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణి పనితీరు భేష్

నాగాలాండ్ అధికారుల బృందం కితాబు

లక్డీకాపూల్: సీఎం ప్రజావాణి పనితీరు అద్భుతంగా ఉందని నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కితాబు ఇచ్చారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్శించి దాని తీరుతెన్నులను పరిశీలించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ నాగాలాండ్ ప్రభుత్వ అధికార బృందానికి పలు విషయాలు వివరించారు. ఫిర్యాదులు స్వీకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో సంబంధిత శాఖలకు పంపడం, డెస్క్ ఆఫీసర్స్ విధులు, హెల్ప్ డెస్క్, ఫిర్యాదుల ట్రాకింగ్ పనితీరు, తాగునీటి సౌకర్యం, ప్రభుత్వం అందించే ఐదు రూపాయల భోజనం కేంద్రాన్ని నాగాలాండ్ అధికారులు పరిశీలించారు. ప్రజావాణి పనితీరు చాలా బాగుందని కితాబునిచ్చారు. ఈ విధానాన్ని నాగాలాండ్ రాష్ట్రంలో అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని అధికారులు తెలిపారు. నాగాలాండ్ రాష్ట్ర ఉన్నత అధికారుల బృందంలో కుశ ఫితూ, విక్ వెనో చాలే, అవేలు రుహో, అత్ సంగ్లా, తదితరులు ఉన్నారు. వీరి వెంట ఎంసీఆర్ హెచ్ఆర్ డీ ప్రొఫెసర్ మాధవి రావులపాటి కూడా ఉన్నారు.

సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతులు

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ఔదార్యం


రోడ్లపై మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతులు చేయించారు. కొంపల్లి సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, స్మార్ట్ బజార్ ప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రతి నిత్యం ఈ రహదారుల గుండా వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలకిష్టారెడ్డి స్పందించి సిమెంట్, ఇతర సామగ్రిని తెప్పించి రోడ్లకు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి

ప్రభుత్వాలను కోరిన పౌర, ప్రజా సంఘాలు

హిమాయత్‌నగర్: ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు, కర్రెగుట్టలను పోలీసులు చుట్టుముట్టి నిర్వహిస్తున్న మరణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని పలు పౌర, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలు జరపాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ 10 వేల మంది పోలీసు బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టి హత్యాకాండ చేస్తూ ఎన్‌కౌంటర్‌గా ప్రకటించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. గత ఏడాది జనవరి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో 51 బూటకపు ఎన్‌కౌంటర్‌లు జరిపి 470 మందిని అత్యంత కిరాతకంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారని ఆరోపించారు. శాంతి చర్చలకు మావోయిస్టులు ముందుకు వచ్చినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారణకాండ సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఎదురు కాల్పులు హత్యాకాండను నిలుపుదల చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావాలని, రాహుల్ గాంధీ కూడా అనుకూల చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భారత్ బచావో అధ్యకుడు గాదె ఇన్నయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు నాగభూషణం, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, అమరుల బంధుమిత్రుల సంఘం కార్యదర్శి పద్మకుమారి, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ అధ్యక్షుడు బల్ల రవి, దేశభక్త తంత్ర అధ్యక్షుడు చంద్రకుమార్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, విరసం కార్యవర్గ సభ్యులు రాములు, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి షేక్ షా వలి పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి..

హామీలు గాలికి..!


సమస్యలపై అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు(ఫైల్)

- ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు సమ్మెబాట
- యూనివర్సిటీల్లో కుంటుపడిన బోధన
- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విస్మరించిందని ఆవేదన

ఉస్మానియా యూనివర్సిటీ: తరగతి గదుల్లో ఉండాల్సిన అధ్యాపకులు రోడ్డెక్కారు. ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలంటూ ఆందోళనబాట పట్టారు. హామీల అమలు చేయాలని నేతలను వేడుకుంటున్నారు. ఇటీవల వర్సిటీల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. తమను పర్మనెంట్ చేశాకే అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరవధిక సమ్మెకు దిగారు. యూనివర్సిటీలలో బోధన అవసరాలకు కోసం ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణలోని వివిధ వర్సిటీల్లో 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులను 2014 వరకు నియమించారు. తెలంగాణ రాష్ట్రం అవతరణ అనంతరం 2014 నుంచి కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలను రద్దు చేస్తూ నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తెలంగాణ ఉద్యమానికి ముందు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీతో కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యమంలో భాగస్వాములయ్యారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం 10 ఏళ్లు పాలించిన నాటి సీఎం కేసీఆర్ జూనియర్, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీల అధ్యాపకులను పర్మనెంట్ చేశారు. అనంతరం కేయూ కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం వరంగల్‌లో కేసీఆర్‌ను కలవగా ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్‌కు బాధ్యతలను అప్పగించారు.

తప్పుదోవ పట్టించిన ఉన్నతాధికారులు

నాటి ఉన్నత విద్య మండలి, విద్యాశాఖ, వర్సిటీల అధికారులు, అధికార పార్టీలో కొనసాగుతున్న ప్రైవేటు యూనివర్సిటీల నిర్వహకులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని కాంట్రాక్టు అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. దేశంలో హరియాణా, పంజాబ్, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌లో కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేశారు. తక్కువ వేతనానికి 25 ఏళ్లుగా పని చేస్తున్న అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ఓయూతోపాటు 12 వర్సిటీలకు కాంట్రాక్టు అధ్యాపకులు తొలిసారిగా ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెబాట పట్టారు. దీంతో వర్సిటీలలో బోధన, పరీక్షల నిర్వహణ, ప్రయోగాలు, జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర విధులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. అధ్యాపకుల ఆందోళన విద్యార్థుల పరీక్షలు, ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. కానీ, కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళనలపై వర్సిటీల వీసీలు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం.


అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు(ఫైల్)

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారు



కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంది. అందుకే ఆ పార్టీ గెలుపునకు కృషి చేశాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత 16 నెలలుగా కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను పట్టించుకోకపోగా వర్సిటీలలో నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిరవధిక సమ్మె చేస్తున్నాం. –విజేందర్ రెడ్డి

ఐదు ఏండ్లు పని చేస్తే చాలు



కాంట్రాక్టు అధ్యాపకులుగా ఐదు సంవత్సరాలు పని చేస్తు చాలు యూజీసీ నిబంధనల ప్రకారం ఉద్యోగాలను పర్మనెంట్ చేయవచ్చు. ఓయూలో 1994 నవంబరు 19న విడుదలైన జీవో నంబర్.212, 2/1994 యాక్టు ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేశారు. ప్రభుత్వం తలచుకుంటే మాకు మేలు జరుగుతుంది. –డా.పరుశరామ్–ఓయూ

ఉద్యోగ భద్రత కల్పించాలి



వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి బెసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, 3 శాతం ఇంక్రిమెంట్‌తో కూడిన వేతనం చెల్లించాలి. తద్వారా పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌షిప్ అవకాశం లభిస్తుంది. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బోధిస్తున్న అధ్యాపకులను కూడా పర్మనెంట్ చేయాలని. –డాక్టర్ తాళ్లపల్లి వెంకట్

కరివేపాకులా వాడుకుంటున్నారు



కాంట్రాక్టు అధ్యాపకులను కరివేపాకులా వాడుకుంటున్నారు. యూజీసీ న్యాక్ గుర్తింపునకు సంఖ్యాపరంగా కాంట్రాక్టు అధ్యాపకుల పేర్లను వాడుకుంటున్నారు. పర్మనెంట్ అధ్యాపకులతో పాటు సమానంగా పని చేసినా వేతనాల చెల్లింపులో తీవ్ర వ్యత్యాసం ఉంది. యూజీసీ పే స్కేల్ చెల్లించడం లేదు. ద్వితీ శ్రేణి అధ్యాపకులుగా చూస్తున్నారు. –డా.ఉపేందర్

ఆర్థిక భారం ఉండదు



వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదు. అధ్యాపకులు అధికంగా 50 ఏళ్ల వయస్సుకు పైబడినవారే అధికంగా ఉన్నారు. వర్సిటీ ప్రొఫెసర్లుగా పని చేయాలని ఆశయం కోసం, ఆత్మగౌరం కోసం పని చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలి. –డా.రేష్మారెడ్డి

పోప్ ఎన్నికల్లో | తొలిసారిగా తెలుగు కార్డినల్‌కు ఓటు హక్కు

పూల ఆంథోనికి దక్కిన అవకాశం

రాంగోపాల్‌పేట్: ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మత గురువైన పోప్ ఎన్నికల్లో ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఒకరు మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. క్యాథలిక్‌ల అత్యున్నత గురువైన పోప్ ఫ్రాన్సిస్ ఈ నెల 21వ తేదీన కన్నుమూసిన సంగతి విదితమే. ఈ ఎన్నికల్లో ప్రపంచవ్యాప్తంగా ఉండే కార్డినల్స్ ఓటు హక్కు వినియోగించుకుని కొత్త పోప్‌ను ఎన్నుకోనున్నారు. వాటికన్ సిటీలో జరిగే చరిత్రాత్మకమైన ఈ ఎన్నికలో ఓటు వేసే అవకాశం తొలిసారిగా హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్‌కు చెందిన కార్డినల్ పూల ఆంథోనీకి దక్కనుంది. భారత్ నుంచి మొత్తం ఆరుగురు కార్డినల్ క్యాథలిక్ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిలో నలుగురు మాత్ర మే ఎన్నికల్లో పాల్గొంటున్నారు. వారిలో ఆంథోనీ ఒకరు కావడం గమనార్హం. నిరుపేద దళిత కుటుంబం నుంచి వచ్చిన ఆంథోనీ కార్డినల్ స్థాయికి చేరుకున్నా రు. ఆయన 1961లో కర్నూలు జిల్లా పోలూరి ప్యారిస్ పరిధిలోని చిందుకూరులో జన్మించారు. పేదరికం కారణంగా 7వ తరగతితో చదువుకు స్వస్తి చెప్పగా, మిషనరీల సహకారంతో ఉన్నత విద్యనభ్యసించి మత గురువుగా ప్రవేశం పొందారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయనను 29 మే 2022లో కార్డినల్‌గా పోప్ ఫ్రాన్సిస్ నియమించారు.


పూల ఆంథోనీ

పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ చేపట్టాలి

ప్రొ.బాలకిష్టారెడ్డికి టీపీటీఎల్ఎఫ్ వినతి

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని టీపీటీఎల్ఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌డీ సీట్లు అమ్ముకున్న వైస్ చాన్స్‌లర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ తెలుగు (రెగ్యులర్) కోసం జనవరి 30న విడుదల చేసిన నోటిఫికేషన్‌ను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పెట్టకుండా దొంగదారిన విడుదల చేశారని ఆరోపించారు. పరీక్ష నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా సాగిందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలన్నీ ప్రహసనంగా సాగాయని ఆరోపించారు. ప్రాస్పెక్టస్ ప్రకారం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలకు ఎంపికైనవారు, యూజీసీ నెట్, ఎం.ఫిల్ ఉన్నవారిని మొదటి కేటగిరీలో ఎంపిక చేసిన తర్వాతనే ఇతరులను ఎంపిక చేయాల్సి ఉంటుందన్నారు. కానీ, ఆ నిబంధనను వీసీ తుంగలో తొక్కారని ఆరోపించారు.

ఆ చిన్నారిని ఆదుకోండి...

- ఆడుకుంటూ వెళ్లి యాసిడ్ తాగిన బాలుడు
- వైద్యానికి డబ్బుల్లేక తల్లిదండ్రుల అవస్థలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గుడిమల్కాపూర్‌లో ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి యాసిడ్ తాగేశాడు. నిరుపేద కుటుంబానికి చెందిన తల్లి దండ్రులు తమ కుమారుడి శస్త్రచికిత్సకు ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేక అల్లాడిపోతున్నారు. గుడిమల్కాపూర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన క్యాసా ఆదర్శ్, మానస దంపతుల ఏడాదిన్నర వయసున్న చిన్న కుమారుడు శ్రీవిన్ సోమవారం ఇంట్లో ఆడుకుంటున్నాడు. తల్లి యాసిడ్‌తో బాత్రూమ్ క్లీన్ చేస్తోంది. అదే సమయంలో పొయ్యి మీద పాలు పొంగడంతో వంటగదిలోకి వెళ్లింది. ఈ లోగా అక్కడే ఆడుకుంటున్న శ్రీవిన్ యాసిడ్ సీసాను తీసుకుని తాగేశాడు. తల్లి గమనించి వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షలు చేశారు. బాబు గొంతు నుంచి కడుపు లోపలి వరకు కాలిందని, రెండు శస్త్రచికిత్సలు చేయాలని, రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో దాతల సహాయం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.సాయం చేయాలనుకునేవారు మానస బేగ, అకౌంట్ నంబర్ 80980100001131, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ 500012099, బ్యాంక్ ఆఫ్ బరోడా, బండ్లగూడకుగానీ, 9885416725కు ఫోన్ పేగానీ చేయవచ్చు.

హజ్‌యాత్రకు 11 వేల మంది

- సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష



సాక్షి, సిటీబ్యూరో: హజ్‌యాత్ర–2025కు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన సుమారు 11 వేల మంది హైదరాబాద్ హజ్‌హౌస్ నుంచి బయలుదేరేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష వెల్లడించారు. యాత్రికులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. యాత్రికుల కోసం హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ నెల 29 నుంచి మే 29 వరకు విమానాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మదీనాకు ఏప్రిల్ 29 నుంచి మే 13 వరకు, జిద్దాకు మే 16 నుంచి మే 29 వరకు విమానాలు నడుస్తాయని తెలిపారు. జిద్దా నుంచి తిరిగి వచ్చే విమానాలు జూన్ 12 నుంచి జూలై 9 వరకు నడుస్తాయని పేర్కొన్నారు. 31 విమానాలు యాత్రికులకు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. హజ్ హౌస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు బస్సులను సమకూర్చాలని, అత్యవసర పరిస్థితుల కోసం మరి కొన్ని వాహనాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్‌బీఐ బ్యాంక్ రేట్లతో యాత్రికుల కరెన్సీ మార్పిడి సౌకర్యం కల్పించాలని, 10 లక్షల రూపాయల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ఉంటుందని తెలిపారు.

నగరంలో నేడు

- రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో డిజైన్ సింక్ పేరిట ప్రదర్శన ఉదయం 10 నుంచి అందుబాటులో ఉంటుంది.
- ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి నల్లగండ్లలోని జీఎన్‌వీ రంగారెడ్డి క్యాంపస్‌లో ఉదయం 11.15 గంటలకు జవహర్ నవోదయ విద్యాలయ సమిట్ జరుగుతుంది.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు యత్నిస్తే క్రిమినల్ చర్యలు

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ ఏసీబీ ఆఫీస్ ఎదురుగా ఉన్న 102/1లో రూ. 1,200 కోట్ల విలువ చేసే సుమారు 12 ఎకరాల స్థలానికి ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులను ఆయన పరిశీలించారు. రాత్రింబవళ్లు పని చేసి ఫెన్సింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఎవరైనా కబ్జాకు యతిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, డీఈ సంజీవ్, ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ‘రెసోనెన్స్’కు అత్యుత్తమ ఫలితాలు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

మాదాపూర్: తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు మంగళవారం మాదాపూర్ రెసోనెన్స్ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించిన టాప్‌ఫైవ్‌లో 119 మంది, టాప్ టెన్‌లో 507 మంది తమ కళాశాల విద్యార్థులు నిలిచారని ఆయన పేర్కొన్నారు. అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. రెసోనెన్స్ దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ప్రీమియర్ ఇనిస్టిట్యూట్‌గా పేరు పొందిందని పేర్కొన్నారు. ఐఐటీ, నీట్, ఎన్ఐటీ వంటి ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకులను సాధించే విద్యార్థులను తయారు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు

మూత్రనాళం స్థానంలో అపెండిక్స్ అమరిక

- వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ఏఐఎన్‌యూ వైద్యులు
- పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తికి రోబోటిక్ శస్త్రచికిత్స సక్సెస్

లక్డీకాపూల్: ఏఐఎన్‌యూ వైద్యులు అసాధారణ శస్త్రచికిత్సతో ఓ వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. అతడి సొంత మూత్రపిండాన్నే శరీరంలో ఒకచోటు నుంచి మరో చోటుకు మార్చడంతో పాటు పూర్తిగా పాడైపోయిన మూత్రనాళం స్థానంలో ఆపెండిక్స్ ఉపయోగించి వృద్ధుడి కిడ్నీల పనితీరును సాధారణ స్థితికి తీసుకొచ్చారు ఏఐఎన్‌యూ(ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ) వైద్యులు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వృద్ధుడికి మూత్రపిండాల్లో ఏర్పడిన రాళ్లను 2023లో తీశారు. అయితే శస్త్రచికిత్స తర్వాత అతడి మూత్రనాళాలు పూర్తిగా పూడుకుపోయాయి. దాంతో క్రియాటినైన్ ప్రమాదకరంగా పెరిగిపోయి, విపరీతమైన నొప్పి, తరచూ జ్వరంతో ప్రాణపాయ పరిస్థితి ఏర్పడింది. కిడ్నీలు రెండూ పాడైపోవడంతో వృద్ధుడికి తాత్కాలికంగా ట్యూబులు (నెఫ్రోస్టమీలు) అమర్చి బయటి నుంచి మూత్రం పంపేవారు. ఆ పరిస్థితుల్లో ఉన్న వృద్ధుడ్ని ఎక్కడికి వెళ్లినా ఆస్పత్రిలో చేర్చుకోవడానికి నిరాకరించారు. దాంతో నగరంలోని ఏఐఎన్‌యూ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. సమగ్ర పరీక్షలు చేసిన తర్వాత కుడివైపు కిడ్నీ కోసం వైద్యులు ముందుగా అతడి సొంత అపెండిక్స్ తీసుకుని, పూడుకుపోయిన మూత్రనాళానికి బదులు దాన్ని అమర్చారు. అపెండిక్స్ కూడా మూత్రనాళం పరిమాణంలోనే ఉంటుంది. రోబోటిక్ శస్త్రచికిత్సతో దీన్ని మార్చారు. సాధారణంగా ఇలా చేయరు. కానీ, ఈ వృద్ధుడి విషయంలో ఇదే సరైన పరిష్కారమని ఏఐఎన్‌యూలోని సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ సర్జన్, యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్ తెలిపారు. క్రియాటినిన్ స్థాయి సాధారణ స్థితికి చేరడంతోపాటు నొప్పి, ఇతర సమస్యలూ తగ్గిపోయాయన్నారు. ఈ విధంగా రెండు కిడ్నీలను కాపాడేందుకు రెండు విభిన్న రకాల, అత్యాధునిక శస్త్రచికిత్సలు చేశామన్నారు. వాస్తవానికి ఈ తరహా చికిత్సలు విజయవంతం అయినవే చాలా తక్కువని ఏఐఎన్‌యూ ఎండీ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో డాక్టర్ తైఫ్ బెండెగెరి, రెసిడెంట్ వైద్యులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ ఆసిత్ పాల్గొన్నట్టు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ సిబ్బందికి జీతాల్లేవు

3 నెలలుగా జీతాలు చెల్లించని హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న ఎల్ఆర్ఎస్ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో ఈ విభాగంలో పనిచేస్తున్న 55 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండీఏ కమిషనర్‌తో పాటు ప్లానింగ్ డైరెక్టర్లు, హెచ్ఎండీఏ సెక్రెటరీ, తదితర ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత దృష్ట్యా సాంకేతిక సేవలను అందజేసేందుకు న్యాక్ సంస్థ సహకారంతో 55 మందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. దరఖాస్తుల పరిశీలన నుంచి ప్రొసీడింగ్స్ అందజేసేవరకు ప్లానింగ్ అధికారులకు వారు టెక్నికల్ సపోర్ట్‌గా నిలుస్తున్నారు. మరోవైపు ఎల్ఆర్ఎస్‌ల పరిశీలన కోసం హెచ్ఎండీఏలో ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సహాయ కేంద్రం కూడా పని చేస్తుంది. అన్ని విధాలుగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు దోహదం చేస్తున్నప్పటికీ 3 నెలలుగా జీతాల్లేవని తెలిపారు.

ఫ్రంట్‌లైన్ రన్నింగ్ సిబ్బందికి ప్రాధాన్యం

హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్



కాచిగూడ: దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో రైలు కార్యకలాపాల్లో పాల్గొంటున్న ఫ్రంట్‌లైన్ రన్నింగ్ సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ తెలిపారు. మంగళవారం రైల్వే అధికారులతో కలిసి డీఆర్ఎం కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని క్రూ బుకింగ్ లాబీ, రన్నింగ్ స్టాఫ్ క్రూ రెస్ట్ రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ ఫ్రంట్‌లైన్ సిబ్బంది రైళ్లను సురక్షితంగా నడపడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్ రన్నింగ్ రూమ్‌లలో వసతి, అల్పాహారం, సబ్సిడీపై లంచ్, డిన్నర్ సదుపాయం కలిప్తున్నట్లు తెలిపారు. లాంజ్, రీడింగ్ రూమ్, ధ్యానం, యోగా గది అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ డాక్టర్ అనిరుధ్ పామర్, సినియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పిటివి దుర్గాప్రసాద్, రైల్వే అధికారులు వి.విద్యాధర్, కె.కిరణ్ కుమార్, టి.నీలా పావని, విష్ణు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

శిల్పా లేఔట్ రెండో దశ ఫ్లై ఓవర్ పనుల్లో వేగం పెంచండి

సాక్షి, సిటీబ్యూరో: శిల్పా లే ఔట్ రెండో దశ (గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు)ఫ్లైఓవర్ పనులు వచ్చేనెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, భూసేకరణ విభాగం అధికారులతో సమీక్ష జరిపిన ఆయన మే 15 లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. సర్వీస్ రోడ్ల పనులకు అవసరమైన ఐదు ఆస్తుల్ని సత్వరమే సేకరించాల్సిందిగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి సూచించారు.

పోలీసుల అదుపులో అఘోరీ!

శంకర్‌పల్లి: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అఘోరీ (శ్రీనివాస్)ని మంగళవారం మోకిల పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. అఘోరీ తనకు మాయమాటలు చెప్పి రూ.9.80 లక్షలు తీసుకుని, మోసం చేసిందంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఓ మహిళ మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉత్తరప్రదేశ్‌లో అఘోరీని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 23, ఏప్రిల్, 2025

కాన్సర్ట్ హాట్ స్పాట్..



భాగ్యనగరం తన గొప్ప సాంస్కృతిక వైభవంతో లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లకు హాట్‌స్పాట్‌గా మారింది. నగరంలోని సాంస్కృతిక వైవిధ్యం, ఆధునిక వేదికలు, యువతలో పెరుగుతున్న సంగీత అభిరుచి, కల్చరల్ డైవర్సిటీలో భాగంగా విభిన్న భాషలకు చెందిన సంగీత ప్రియులు హైదరాబాద్ నగరాన్ని లైవ్ కాన్సర్ట్‌లు సంగీత సాగరంలో ముంచెత్తుతున్నాయి. బాలీవుడ్, హాలీవుడ్ సినీ బ్యాండ్స్ మాత్రమే కాదు గ్లోబల్ వేదికగా మంచి ఫ్యాన్ బేస్ ఉన్నటువంటి పాపులర్ ప్రైవేట్ బ్యాండ్స్ సైతం నగరానికి చేరుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ నెల్లోనే గ్లోబల్ సింగర్ ఎలన్ వాకర్ 'వాకర్ వరల్డ్ ఇండియా టూర్'లో భాగంగా నగరంలో తన స్వరంతో హోరెత్తించాడు. రానున్న రోజుల్లో మరి కొన్ని ప్రముఖ బ్యాండ్స్ తన లైవ్ ప్రదర్శనల కోసం సిద్ధంగా ఉన్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



- ఇటీవలే నగరంలో సందడి చేసిన అలెన్ వాకర్
- పలు వేదికలు సమ్మర్ కాన్సర్ట్స్ కి ముస్తాబు
- ఇప్పటికే డేట్స్ ఫిక్స్, క్యూలో మరికొన్ని టాప్ బ్యాండ్స్
- కల్చరల్ డైవర్సిటీలో భాగంగా పెరుగుతున్న ఆదరణ

నగర వేదికగా ఎన్‌హెచ్-7 వీకెండర్ మొదలు సన్ బర్న్ వరకూ





హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ సంస్కృతి అనేక దశాబ్దాలుగా అభివృద్ధి చెందుతోంది. సంప్రదాయ కర్ణాటక సంగీతం నుంచి ఆధునిక పాప్, రాక్, జాజ్ వంటి శైలి వరకూ విస్తరించింది. నగరంలోని సంగీత ప్రియుల కోసం వివిధ వేదికలు సైతం ముందుకు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం అనేక సంగీత ఉత్సవాలు, ఫెస్టివల్స్, కాన్సర్ట్‌లు నగరంలో జరుగుతున్నాయి.. ఇదొక సంస్కృతిగా స్థానిక, అంతర్జాతీయ కళాకారుల ప్రదర్శనలకు అవకాశాలను అందించే వేదికగా మారింది. నగరంలో ఎన్ 7 వీకెండర్ మొదలు సన్ బర్న్, ఎకోస్ ఆఫ్ ఎర్త్ వంటి ప్రముఖ మ్యూజికల్ ఫెస్టివల్స్ జరిగాయి. దీనికి తోడు నగరంలోని యువతలో సంగీతానికి పెరుగుతున్న ఆసక్తి, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లకు అధిక డిమాండ్ ఏర్పడింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ ఈవెంట్స్‌కు సంబంధించిన సమాచారం త్వరగా వ్యాపిస్తుండటంతో యువత ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

లైవ్ ఫెస్ట్ డేట్స్ ఫిక్స్..

ఈ ఏడాదిలో నగర వేదికగా పలు ప్రతిష్టాత్మక లైవ్ మ్యూజిక్ ఫెస్ట్‌లు జరగనున్నాయి. అంతేకాకుండా ప్రత్యేకంగా ఈ వేసవి కూడా సంగీత సమ్మోహనంలో మునిగిపోనుంది. ఇప్పటికే గ్లోబల్ స్టార్ అలన్ వాకర్, ఇండియన్ ఆస్కార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్, శివమెహన్, బాలీవుడ్ ఫేమ్ ఆయుష్ వంటి సింగింగ్ స్పెషలిస్టులు తమ ప్రదర్శనలతో హోరెత్తించారు. వైబ్స్ మ్యూజిక్ ఫెస్టివల్, వరల్డ్ జాజ్ ఫెస్టివల్ వంటి ప్రసిద్ధ కార్యక్రమాలు సంగీత ప్రియులను అలరించాయి. అంతేకాకుండా ఈ ఏప్రిల్ 30 నుంచి మే 4వ తేదీ వరకూ క్యాండిల్ లైట్ కాన్సర్ట్ సిరీస్ పేరుతో బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా వేదికగా ఆర్‌డీ బర్మన్, ఏఆర్ రెహ్మాన్ కోల్డ్ ప్లేతో హుషారెత్తించనున్నారు. ఈ వేదిక ప్రముఖ గాయకుడు అర్జిత్ సింగ్‌కు ఘన నివాళిని అందించనుంది. గాన గంధర్వి కేఎస్ చిత్ర గాత్రయాత్రలో 45 ఏళ్ల ప్రత్యేకానుభూతిని జరుపుకునేందుకు నిర్వహించే సంగీత మహోత్సవం 'చిత్రామృతం 2.0' జూన్ 14న నిర్వహించనున్నారు. వీటితోపాటు పలు గ్లోబల్ బ్యాండ్స్ నగరంలో మ్యూజిక్ టెస్టులు నిర్వహించడానికి డేట్స్ ఫిక్స్ చేసుకుంటున్నాయి.

మల్టీకల్చరల్ సిటీ..

హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్ సంస్కృతి గత కొన్ని సంవత్సరాలుగా బాగా పెరిగింది. దీనికి యూత్ కల్చర్ ప్రధాన కారణం. హైదరాబాద్‌లో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్స్‌కి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. మల్టికల్చరల్ సిటీ కావడంతో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళ్ మ్యూజిక్‌కు అభిమానులు ఉన్నారు. ఈ కలయిక లైవ్ మ్యూజిక్ ఈవెంట్స్‌ని ప్రత్యేకంగా మార్చింది. మరోవైపు ఇండిపెండెంట్ ఆర్టిస్టుల బ్యాండ్ సంఖ్య భారీగా పెరిగిపోయింది. తెలుగు ఇండిపెండెంట్ మ్యూజిక్ ఇప్పుడు పాపులర్ అవుతోంది. రాక్ బ్యాండ్స్, ఫ్యూజన్ మ్యూజిక్ బ్యాండ్స్ కూడా పెరిగాయి.



అధునాతన వేదికలు..

నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, శిల్పకళా వేదిక, నోవోటెల్, హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వంటి వేదికలు అంతర్జాతీయ స్థాయి మ్యూజిక్ కాన్సర్ట్‌లకు అనుకూలంగా మారాయి. అంతేకాకుండా ఓడీయమ్ బై ప్రిసమ్, హార్డ్ రాక్ కెఫే, తబలా రాసా, ఏయిర్ లైవ్ వంటి వేదికలు సైతం ఈ లైవ్ కాన్సర్ట్‌లను నిర్వహిస్తున్నాయి. భారీ స్థాయిలో నిర్వహించే ఈవెంట్స్‌కు ఎల్‌బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియం వంటివి కూడా అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా నగర శివార్లలోని పలు యూనివర్సిటీల్లో, కాలేజీ క్యాంపస్‌లలో ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లు విరివిగా జరుతున్నాయి.

నెహ్రూ జూలాజికల్ పార్కులో సమ్మర్ క్యాంప్





చార్మినార్: వేసవి సెలవులను పురస్కరించుకుని మే నుండి జూన్ వరకూ నెహ్రూ జూలజికల్ పార్కులో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనడానికి ఔత్సాహికులైన విద్యార్థులు రూ.1000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. హైదరాబాద్ వన్యప్రాణుల జూ ఉత్సాహవంతులైన పిల్లలను వేసవి శిబిరంలో పాల్గొనేందుకు ఆహ్వానిస్తోందన్నారు. ప్రతి రోజూ బ్యాచ్‌ల వారీగా నిర్వహించే ఈ వేసవి క్యాంపులో ప్రతి బ్యాచ్‌కూ 15 నుండి 20 మంది విద్యార్థులు ఉంటారన్నారు. ఈ వేసవి శిబిరంలో జూ పార్కుకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు జూ టూర్, జూ పార్కులోని జంతువుల చరిత్ర, సమాచారం తెలుసుకోవడం, సరీసృపాలపై అవగాహన సెషన్, రాత్రి గుహ సందర్శన, ఇతర సరదా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన వన్యప్రాణుల విద్యావేత్తల నేతృత్వంలో ప్రతి బ్యాచ్‌కూ ప్రతి రోజూ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద చెల్లించే రూ.1000లో స్నాక్స్, శాఖాహార భోజనంతో పాటు అభ్యర్థులకు క్యాప్, క్యాప్, నోట్ ప్యాడ్, జూ బ్యాడ్జ్, హైదరాబాద్ జూ లోగోతో కూడిన కిట్ అందిస్తారన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకూ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లైన ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌తో పాటు అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు. 040-2447 7355లో గానీ, 92810 07836 వాట్సాప్ నెంబర్‌లో గానీ సంప్రదించాలన్నారు.

అవర్ పవర్.. ప్లానెట్..



- రీసైక్లింగ్ ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన
- బొటానికల్ గార్డెన్‌లో వరల్డ్ ఎర్త్ డే వేడుకలు
- అనంతరం సందర్శకుల బర్డ్స్ వాక్

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులపై అవగాహన కల్పించారు. ప్రకృతిని చూసి ఆనందించడమే కాదు, దాని సంరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వరల్డ్ ఎర్త్ డే (ప్రపంచ ధరిత్రీ దినోత్సవం) నిర్వహించారు. స్విచ్ ఎకో సంస్థకు చెందిన అక్షయ్ పాండే, టీజీఎఫ్‌డీసీ బృందం పర్యావరణ హితం కోసం జీవన శైలిని మార్చుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ బాటిళ్లతో టీ షర్టులు, సిగరెట్ ఫిల్టర్‌లో ఉండే దూదిలో చేసిన కాగితం, నీటిలో పెరిగే గడ్డి(వాటర్ హైసింత్)తో చేసిన చీరలను సందర్శకులకు చూపించారు. వ్యర్థాలతో భూమి కలుషితమవుతుందని, సాధ్యమైనంత వరకూ వ్యర్థాలను తగ్గించాలని సూచించారు. టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అవర్ పవర్, అవర్ ప్లానెట్ అనే థీమ్ ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు. మన దినచర్యే భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌లో సందర్శకులతో బర్డ్స్ వాక్ నిర్వహించారు. టీజీఎఫ్‌డీసీ ఏడీ తనూజ, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్, నేచరలిస్ట్ అఖిల్, అపరంజని, అశితోష్ పాల్గొన్నారు.



వేగలో అక్షయ తృతీయ సందడి..

రానున్న అక్షయ తృతీయకు ఇప్పటి నుంచే నగరంలో సందడి మొదలైంది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని వేగ జ్యువెలర్స్‌లోనూ సందడి మొదలైంది. సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో పలువురు మోడల్స్ అక్షయ తృతీయ కలెక్షన్ ధరించి ర్యాంప్ వాక్ చేశారు. బంగారం, డైమండ్‌తో పాటు పోల్కీ ఆభరణాలను ఈ అక్షయ తృతీయకు ప్రత్యేక డిజైన్లలో అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– బంజారాహిల్స్

సినీతారల సందడి



తాజ్ కృష్ణాలో బ్రిల్లేర్ క్లినిక్ వార్షికోత్సవం

బంజారాహిల్స్: డాక్టర్ అఫ్రీన్ బాను స్థాపించిన బ్రిల్లేర్ క్లినిక్ వార్షికోత్సవం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు సినీ తారలు ముమైత్‌ఖాన్, నటి పాయల్ రాజ్‌పుత్, గాయకుడు, కంపోజర్ రఘు కుంచె, ర్యాపర్ రోల్‌రైడా, పలువురు బిగ్ బాస్ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్మ సంరక్షణలో వచ్చిన అధునాతన పద్ధతుల గురించి సినీ తారలకు డాక్టర్ షేక్ అఫ్రీన్ భాను వివరించారు.

కలర్‌ఫుల్.. సిబ్లింగ్స్ వాక్..



తోబుట్టువుల ఫ్యాషన్ వాక్‌లో అలరించిన చిన్నారులు


అశోక వన్ మాల్ వేదికగా వినూత్న కార్యక్రమం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్ని బంధాలున్నా తోబుట్టువుల అనుబంధం, ప్రేమ ప్రత్యేకమైనవి. జన్మతో సహా కలిసొచ్చే బంధం ఇది. ఇంతటి గొప్ప అనుబంధాన్ని, ఆప్యాయతను అంతే చక్కగా ప్రదర్శించింది కూకట్‌పల్లి అశోక వన్ మాల్ వేదికగా నిర్వహించిన ది సిబ్లింగ్స్ కిడ్స్ ఫ్యాషన్ వాక్. అశోక డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమంలో ఆత్మవిశ్వాసంతో, అందమైన నడకతో, ఆకర్షణీయమైన దుస్తులను ధరించి తమ విశిష్టతను ప్రదర్శించారు పలువురు చిన్నారులు. ఈ కార్యక్రమం ఫ్యాషన్ భాగస్వామి అయిన రిలయన్స్ ట్రెండ్స్.. ఫ్యాషన్ వాక్‌లో పాల్గొన్న పిల్లలందరికీ ఆకర్షణీయమైన దుస్తులను అందించింది. అదనంగా మేక్ మై హోమ్, డెకథ్లాన్ సంస్థతో కలిసి ఈ చిన్నారులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా అశోక డెవలపర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. తమ పరిసరాల్లోని కుటుంబాలతో బంధం ఏర్పరచుకోడానికి, షాపింగ్ చేయడానికి, ఆనందించడానికి అవకాశాలను సృష్టించడానికి అశోక వన్ మాల్ సిబ్లింగ్స్ కిడ్స్ ఫ్యాషన్ వాక్ నిర్వహించామని, ఈ కార్యక్రమం తోబుట్టువుల సంబంధాల గొప్పతనాన్ని ప్రదర్శించిందని అన్నారు.



రివర్స్ వాకింగ్..





- విభిన్నంగా వివేకానందనగర్ వాసి నడక
- ఆరుపదుల వయసులోనూ ఆరోగ్యంగా

కూకట్‌పల్లి: ప్రతి రోజూ అందరూ వాకింగ్ చేస్తారు.. అతడు కూడా అందరిలానే వాకింగ్ చేస్తాడు.. అయితే అందరికన్నా భిన్నంగా వెనక్కి నడుస్తాడు.. అదే రివర్స్ వాకింగ్ అండి. అతడే కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లో నివాసముండే అన్య శ్రీధర్. నగరంలోని ఓ ఫార్మాకంపెనీలో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి రోజూ 5 గంటలకే వాకింగ్ మొదలుపెడతాడు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలో అందరూ ముందుకు నడుస్తుంటారు.. ఆయన మాత్రం వెనుకవైపు నడుస్తూ.. వేగంగా పరుగెత్తటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. పక్కనుంచి నడవడానికి కష్టంగా ఉన్న ఈ రోజుల్లో శ్రీధర్ మాత్రం వెనుక వైపు పరుగెత్తటం విశేషం. ప్రతి రోజూ వివేకానందనగర్ కాలనీలోని వాకర్స్ రూట్‌లో యువకులతో సహా అందరూ ముందుకు నడుస్తుంటారు. అంతేకాకుండా వాకింగ్ చేసేవారు ఒకటిన్నర కిలోమీటర్లను సుమారు 15 నిమిషాలు నడుస్తుండగా.. శ్రీధర్ వెనుకవైపు 10 నిమిషాల్లోపు పరుగెత్తటం విశేషం. దాదాపు 17 నుంచి 20 నిమిషాల్లో రెండు రౌండ్లను రివర్స్‌లో పూర్తిచేస్తాడు. వ్యాయామం విషయంలో కూడా అందరూ నిలబడి కాళ్లను సైక్లింగ్‌లాగా వ్యాయామం చేసారు. తను మాత్రం తల కిందికి పెట్టి కాళ్ళను దాదాపు 5 నిమిషాల సేపు వాకింగ్ సైక్లింగ్ చేయటం విశేషం. అంతేకాకుండా తల కిందికి పెట్టి కాళ్లు పైకి పెట్టి 3 నిమిషాల సేపు ఉంటారు. ఈ విధంగా శ్రీధర్ ఆరు పదుల వయసులో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసే విధంగా వ్యాయమం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. 'తాను గతంలో సాధారణ వాకింగ్‌తో పాటు వ్యాయామం చేసేవాడినని, తాను ఒక ఆర్టికల్ చదివి హృదయ సంబంధిత వ్యాధులకు చెక్ పెట్టే విధంగా ఈ వ్యాయామం పనిచేస్తుందని గ్రహించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఈ వ్యాయామంపై ప్రత్యేక దృష్టి సారించి వాకింగ్ చేయటం మొదలు పెట్టానని, దాదాపు మూడు సంవత్సరాలుగా రివర్స్ వాకింగ్ చేస్తూ.. తనలాంటి మరికొందరికి శిక్షణ కూడా ఇస్తున్నట్లు 'సాక్షి'తో తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూత్రాన్ని తాను పాటిస్తానని, తన వ్యాయామం వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే తనను మన్నించాలని కోరారు.



క్లుప్తంగా...

సమగ్ర విత్తన చట్టం రావాలి
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం రావలసిన అవశ్యకత ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అభిప్రాయపడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో.. సమగ్ర విత్తన చట్టం, ఆవశ్యకత, చట్టంలో అదనంగా చేర్చాల్సిన అంశాలపై రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ఇతర సభ్యులు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారిన పరిస్థితులు, స్థానిక అవసరాల దృష్ట్యా 1966లో తీసుకొచ్చిన విత్తన చట్టంలో కొన్ని అదనపు నిబంధనలను కలపాల్సి ఉంటుందన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సంస్థలపై నిరంతర నిఘా అవసరమని స్పష్టం చేశారు. ఎవరైనా కల్తీ విత్తనాలు సరఫరా చేస్తే.. తీసుకొనే చర్యలను కఠినంగా రూపొందించాలన్నారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విత్తన చట్టంలో మార్పుల కోసం కొన్ని ప్రయత్నాలు చేసిందని, అందులో భాగంగానే బీటీ కాటన్ విత్తనం ధర రూ.1800 నుండి రూ.650కి తగ్గిందని వివరించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ, తెలంగాణ విత్తనోత్పత్తి రాష్ట్రంగా ఉందన్నారు.

‘చెన్నమనేని’పై సీఐడీ కేసు
ఆది శ్రీనివాస్ ఫిర్యాదుపై విచారణ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌పై తెలంగాణ సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. భారత పౌరసత్వం లేకున్నా.. తప్పుడు పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈనెల 17న సీఐడీ డీజీకి ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ అంశంపై ంకోర్టు ఉత్తర్వుల ప్రతి అందిన తర్వాత.. తన లీగల్ టీమ్‌తో చర్చించిన అనంతరం ఫిర్యాదు చేస్తున్నట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మొత్తం అంశాలను పరిశీలించిన అనంతరం ఐపీసీతోపాటు ఇండియన్ పాస్‌పోర్ట్ యాక్ట్, ది ఫారినర్స్ యాక్ట్, ఇండియన్ సిటిజన్‌షిప్ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద సీఐడీ అధికారులు చెన్నమనేని రమేశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కేసు వివరాలు అందజేసేందుకు బుధవారం సీఐడీ కార్యాలయానికి రావాలని ఆది శ్రీనివాస్‌కు సీఐడీ అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఐడీ కార్యాలయానికి హాజరుకానున్నట్లు తెలిసింది.

ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్రపై విచారణ జరపాలి
డీజీపీకి ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: దేవరకద్ర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్ర వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీ జితేందర్‌ను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. దేవరకద్ర, మహబూబ్‌నగర్ పరిసరాల్లో ప్రశాంత్‌రెడ్డి మూమెంట్స్‌పై కొన్ని రోజులుగా రెక్కీ జరుగుతున్నట్టు, రెండున్నర కోట్లకు సుపారీ ఇచ్చి హత్యకు కుట్ర పన్నినట్టు అనుమానం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం డోకూర్ పవన్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి డీజీపీకి అరుణ ఫిర్యాదు చేశారు. ఈ హత్యకు సంబంధించి భూత్పూర్ పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులున్నారని వారు తెలిపారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఎవరు పంపారు? ఈ కుట్ర వెనుక ఎవరి హస్తం ఉంది అన్న కోణాల్లో దర్యాప్తు సాగుతోందన్నారు. కొండా ప్రశాంత్ ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు అనుమానాలున్నాయని, ఈ కుట్ర వెనుక ఎవరున్నది తేల్చాలని డీజీపీని అరుణ కోరారు.

జగ్గారెడ్డి ఔదార్యం
కేన్సర్ బాధితురాలికి రూ.10 లక్షల సాయం




ఆమనికి ఆర్థిక సాయం అందజేస్తున్న జగ్గారెడ్డి

సదాశివపేట (సంగారెడ్డి): కేన్సర్ చికిత్స కోసం నిరుపేద రోగులు పడుతున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. కేన్సర్ బాధితురాలు ఆమని ఇంటికి సోమవారం జగ్గారెడ్డి వెళ్లి పరామర్శించి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. సదాశివపేట పట్టణంలోని గొల్లకేరికి చెందిన ఆమని కేన్సర్‌తో బాధపడుతూ ఇద్దరు పిల్లలతో దయనీయ జీవితం గడుపుతోంది. ఈ విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి.. ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు.

సమష్టితత్వంతో ఏదైనా సాధ్యమని హిరోషిమా చాటింది

హిరోషిమా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఆ నగరం మాదిరే పోరాటానికి చిహ్నం తెలంగాణ అని వెల్లడి
- అక్కడి పీస్ మెమోరియల్ పార్క్ వద్ద నివాళి
- ముగిసిన సీఎం బృందం జపాన్ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు రాక



జపాన్‌లోని హిరోషిమా నగరంలో అణుబాంబు దాడి తర్వాత మిగిలిన ఏకైక భవనం ఆటం బాంబ్ డోమ్‌ను సందర్శించిన సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ‘ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి చూపించిన నగరం హిరోషిమా. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం తెలంగాణ. హిరోషిమా నగరానికి రావడం ఎంతో ఆనందంగా ఉంది’అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిరోషిమా అసెంబ్లీలో మాట్లాడుతూ పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో చివరి రోజైన మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో కూడిన తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీగా గడిపింది. రెండో ప్రపంచ యుద్ధంలో భాగంగా 1945 ఆగస్టు 6న అమెరికా జరిపిన అణు బాంబు దాడిలో నామరూపాల్లేకుండా ధ్వంసమైన హిరోషిమా నగరంలో సీఎం రేవంత్ బృందం పర్యటించింది. వివిధ ప్రాంతాలను సందర్శించడంతోపాటు పలువురు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. తొలుత హిరోషిమా ప్రిఫెక్చురల్ (రాష్ట్ర ప్రభుత్వం) అసెంబ్లీకి రేవంత్ బృందం విచ్చేయగా వారికి స్పీకర్ తకాషి నకమోటో, శాసనసభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ‘శాంతి, స్థిరత్వం, సమృద్ధి లాంటి విలువలను పంచుకుందాం. పెట్టుబడులకు పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చాం. కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దాం’అని అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 50కిపైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో పనిచేస్తున్నాయని.. మరిన్ని కంపెనీలను ఏర్పాటు చేయాలని అక్కడి పారిశ్రామికవేత్తలను కోరారు. తెలంగాణను సందర్శించి రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. అలాగే హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఆ తర్వాత హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నివాళులర్పించారు. ఆపై అక్కడి గాంధీ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించారు. జపాన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ బుధవారం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

పెట్టుబడులు రూ. 12,062 కోట్లు.. 30,500 ఉద్యోగాలు

జపాన్ పర్యటనలో రూ. 12,062 కోట్ల పెట్టుబడులు, 30,500 ఉద్యోగాల సృష్టికి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో అత్యధికంగా ఎన్‌టీటీ డేటా–నెయిసా నెట్‌వర్క్స్ హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందని పేర్కొంది. అలాగే మారుబెని కంపెనీ రూ. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడి ద్వారా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుందని.. మొత్తంగా రూ. 5,000 కోట్ల పెట్టుబడుల అంచనాతో 30 వేల ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చిందని ప్రభుత్వం వెల్లడించింది. తోషిబా అనుబంధ కంపెనీ టీటీడీఐ హైదరాబాద్ శివార్లలో మూడో విద్యుత్ పరికరాల ప్లాంట్ ఏర్పాటు కోసం రూ. 562 కోట్ల పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుందని వివరించింది. టామ్‌కాతో కుదిరిన ఒప్పందం ద్వారా 500 ఉద్యోగాలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది.

తెలంగాణ – రాజస్తాన్ ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనం

- వచ్చే నెల 2వ వారంలో సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాజస్తాన్ మంత్రి హీరాలాల్‌నగర్‌తో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, రాజస్తాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ మధ్య ఇటీవల జరిగిన 3,100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ఒప్పందమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. తెలంగాణ–రాజస్తాన్ మధ్య జరిగిన సోలార్, థర్మల్ విద్యుత్ ఒప్పందాలపై మంగళవారం ఆయన సచివాలయంలో రాజస్తాన్ విద్యుత్‌శాఖ మంత్రి హీరాలాల్‌నగర్‌తో భేటీ అయ్యారు. ఈ ఒప్పందాల అమలుకు పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ఒప్పందంలో భాగంగా తెలంగాణలో నెలకొల్పనున్న 1,600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లలో ఒకటైన సింగరేణి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ పనులకు వచ్చే నెల రెండో వారంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. రాజస్తాన్‌లో ఏర్పాటు చేయనున్న 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల కోసం భూ పరిశీలన ఒకసారి పూర్తయిందని, మరోసారి అధికారుల బృందం అక్కడకు వెళ్లి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో హరిత ఇంధన ఉత్పత్తి దిశగా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటోందని, 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు పురోగతి పట్ల రాజస్తాన్ విద్యుత్‌శాఖ మంత్రి హీరాలాల్‌నగర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం అమలులో భాగంగా ఆర్వీయూఎన్ఎల్ నుంచి కూడా సమన్వయ అధికారులను నియమించినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి కేసులో తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ‘మీకు దండం పెడతా.. ఒక్క చాన్స్ ఇవ్వండి.. నేను చేయాల్సిన ప్రచారం చేశా. నన్ను సాదుకుంటారో.. సంపుకుంటారో మీ ఇష్టం’అంటూ ఓటర్లను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారనేది ఆరోపణ. ఓట్లు వేసి గెలిపిస్తే డిసెంబర్ 4న విజయ యాత్రకు వస్తానని, లేకపోతే తన శవయాత్రకు రావాలని.. ఏ యాత్ర చేయాలనేది ఓటర్లే నిర్ణయించాలని పాడి ఉద్వేగంగా మాట్లాడారని ఫిర్యాదు అందింది. కమలాపూర్ ఎంపీడీవో ఫిర్యాదు మేరకు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ కేసు నమోదు చేశారు. అయితే, తాను ప్రసంగించినట్టు ఉన్న వీడియో ఆధారంగా కేసు నమోదు చెల్లదని పాడి పేర్కొన్నారు. ఎలాంటి నేరం చేయలేదని, అయినా అన్యాయంగా కేసు నమోదు చేశారన్నారు. రాజకీయ కక్షతోనే కేసును పెట్టారని చెప్పారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులోని కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టును విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం తీర్పు రిజర్వు చేశారు.

సౌరవిద్యుత్‌కు దేవాదాయ భూములు: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు దేవాదాయ శాఖ భూములు వినియోగిస్తామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం ‘ఎర్త్ డే–స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్’ను సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సురేఖ సూచించారు.

మే 10 నాటికి గ్రామ రెవెన్యూ వ్యవస్థ

ప్రజల సూచనలతో అవసరమైతే భూభారతిలో మార్పులు: పొంగులేటి

సాక్షి, యాదాద్రి: రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీలోగా గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారులు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏ పార్టీ కార్యకర్త అనే పక్షపాతం లేకుండా పేదలకు చట్టం ఒక చుట్టంలా ఉపయోగపడేలా చూడాలని మంత్రి పొంగులేటి కోరారు. తప్పుచేసే అధికారులపై చర్యలకు వెనుకాడబోమన్నారు. భూభారతి చట్టంపై ప్రజల నుంచి వచ్చే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరించి ఈ చట్టాన్ని భూయజమానులకు ఆమోదయోగ్యంగా తీర్చిదిద్దుతామని, అందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూ యజమానులకు న్యాయం జరిగేలా తహసీల్దార్ మొదలుకొని సీసీఎల్ఏ వరకు ఐదంచెల వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనిచేయాలి

- జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం
- భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- మే మొదటి వారంలో మరో 28 మండలాల్లో భూభారతి పైలట్ అమలు
- ‘ఇందిరమ్మ’లబ్ధిదారులను యుద్ధప్రాతిపదికన ఎంపిక చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి.. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లాల కలెక్టర్లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మంగళవారం సచివాలయం నుంచి భూభారతి చట్టం అమలు, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఆర్ఎస్‌లపై సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర రైతాంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని మంత్రి అన్నారు. ఈ చట్టం గురించి పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈనెల 30వ తేదీలోగా నాలుగు జిల్లాల్లోని నాలుగు పైలట్ మండలాల్లో జరుగుతున్న సదస్సులు పూర్తి చేయాలని, ఆయా మండలాల్లో వచ్చిన అనుభవాలను పరిగణనలోని తీసుకుని మే మొదటి వారంలో హైదరాబాద్ మినహా మిగతా 28 జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని పైలట్‌గా తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం పైలట్ అమలవుతున్న మండలాల్లోని తహసీల్దార్ల నేతృత్వంలోని బృందం 28 మండలాల్లోని బృందాలకు వర్క్‌షాప్ ద్వారా అవగాహన కల్పిస్తుందని వివరించారు.

200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారి

వర్షాకాలం రానున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలని పొంగులేటి సూచించారు. మే మొదటి వారంలోగా ఎంపిక పూర్తి కావాలని, ప్రతి 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి పారదర్శకంగా ఎంపిక చేపట్టాలని చెప్పారు. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, అనర్హులను ఎంపిక చేస్తే ఆ బాధ్యత గెజిటెడ్ అధికారిదేనని చెప్పారు. 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే డబ్బులు విడుదల చేయాలని, ప్రతి సోమవారం నేరుగా లబ్ధిదారుల ఖాతాలో చెల్లింపులు జరపాలని సూచించారు. లబ్ధిదారులకు తక్కువ ధరకు స్టీల్, సిమెంట్ ఇచ్చే విధంగా త్వరలో పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

ఎల్ఆర్ఎస్‌కు ఇంకో వారమే..!

లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును మరోమారు పొడిగించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 30వ తేదీన గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ వారం రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం ఇస్తున్న 25 శాతం రాయితీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, సీసీఎల్ఏ డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ 4 మండలాల్లో 5,905 దరఖాస్తులు

భూభారతి పైలట్ అమలవుతున్న నాలుగు మండలాల్లో మొత్తం 5,905 దరఖాస్తులు వచ్చాయని ఆయా జిల్లాల కలెక్టర్లు వివరించారు. నాలుగు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలకు గాను 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, నేలకొండపల్లిలో 1,076, మద్దూరులో 233, లింగంపేటలో 810, వెంకటాపురంలో 3,786 దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, జయసుధ, దిల్‌రాజు, హరీశ్

గద్దర్ అవార్డుల గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకోవాలి

- జూన్ 14న హెచ్ఐసీసీ వేదికగా ఫిల్మ్ అవార్డుల పంపిణీ
- కాంగ్రెస్ హయాంలోనే సినీ పరిశ్రమకు ప్రోత్సాహం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ‘గత పదేళ్లుగా తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమ నిరాదరణకు గురైంది. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోవడంతో ప్రోత్సాహం కరువైంది. కాంగ్రెస్ హయాంలోనే సినీ పరిశ్రమకు ప్రోత్సాహం లభించింది. జూన్ 14న హైదరాబాద్‌లో నిర్వహించబోయే ‘గద్దర్ చలనచిత్ర అవార్డుల’వేడుక గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకునేలా ఉండాలి’అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ గద్దర్ అవార్డ్స్ కర్టెన్ రైజర్ ప్రెస్‌మీట్‌లో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ‘తెలంగాణలో గద్దర్ పుట్టడం మన అదృష్టం. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు ఆయన. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్‌తో గద్దర్ పాదయాత్ర చేసి..ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారు. అలాంటి వ్యక్తి పేరు మీద అవార్డులు ఇస్తున్నాం. ఎక్కడో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు తరలించి, ప్రోత్సహించింది. ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు అందించడమే కాక, సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలను సైతం కేటాయించాం. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు బలమైన సినిమా రంగం ద్వారానే సమాజానికి సందేశం ఇవ్వాలని, ప్రోత్సాహకానికి నోచుకోని సినీ రంగానికి చేయూతనివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. సినిమా అవార్డులతోపాటు సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వ్యక్తుల పేరిట అవార్డులు ఇస్తున్నాం. ఇవి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. రాగద్వేషాలకు అతీతంగా అవార్డులు ఎంపిక చేయాలి’ అని భట్టి తెలిపారు.

- సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ‘కళలకు పుట్టినిల్లు హైదరాబాద్. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల పట్ల ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉంది. చలన చిత్ర అవార్డులతోపాటు వ్యక్తిగత అవార్డులను కూడా ఇస్తాం. ఈ అవార్డుల గురించి అందరూ మాట్లాడుకునేలా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండేలా అవార్డులు ప్రదానం చేస్తాం. గద్దర్ పేరుతో ఇచ్చే అవార్డులపై ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన పేరుతోనే అవార్డులు ఇస్తాం’అన్నారు.
- తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ ‘గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు’ల ప్రదానోత్సవాన్ని జూన్ 14న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా నిర్వహిస్తున్నాం’అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ జ్యూరీ చైర్‌పర్సన్‌జయసుధ, ఐ అండ్ పీఆర్ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ‘స్థానిక’ ఎమ్మెల్సీకి నేడే పోలింగ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికకు పోలింగ్‌లో బ్యాలెట్ పత్రాన్ని వినియోగించడం తప్ప.. మిగతా అన్ని నిబంధనలు సాధారణ ఎన్నికల మాదిరిగానే ఉంటాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఒక పోలింగ్ కేంద్రం, కార్పొరేటర్లకు మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలున్నందున ఉద్యోగులకు సెలవు ప్రకటించామని, బదులుగా వారు జూన్ 14 రెండో శనివారం పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఎన్నికలో ఎంఐఎం నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ నుంచి ఎన్.గౌతంరావు పోటీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంపై దృష్టి

- క్షేత్రస్థాయి నుంచే కాంగ్రెస్ అధిష్ఠానం ఫోకస్
- నేడు గాంధీభవన్ వేదికగా సమావేశం

సాక్షి, హైదరాబాద్: సంస్థాగత నిర్మాణంపై అధికార కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టింది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీ) నియామకాలను పకడ్బందీగా చేపట్టాలన్న అధిష్ఠాన నిర్ణయం మేరకు రాష్ట్రంలోనూ కసరత్తు ప్రారంభమవుతోంది. అందులో భాగంగా బుధవారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో కీలక సమావేశం జరగనుంది. గాంధీభవన్ వేదికగా జరిగే ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ జరుగుతుందని, వచ్చేనెల రెండోవారం కల్లా రాష్ట్రంలోని అన్ని జిల్లా పార్టీలకు కొత్త సారథులను నియమిస్తారనే చర్చ గాంధీభవన్‌లో జరుగుతోంది.

70 మంది పరిశీలకులు

డీసీసీల నియామకానికి టీపీసీసీ మొత్తం 70 మంది పరిశీలకులను నియమించింది. 35 జిల్లా యూనిట్లకుగాను ఇద్దరు చొప్పున వేరే జిల్లాల నేతలను ఈ పరిశీలకులుగా నియమించింది. వీరితో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి, ఏఐసీసీ కార్యదర్శులు బుధవారం సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో భాగంగా ఏ జిల్లాకు ఎవరిని అధ్యక్షులుగా ఎందుకు నియమించాలన్న దానిపై పరిశీలకుల అభిప్రాయాలను సేకరిస్తారు.



స్టార్టప్ కాంక్లేవ్‌లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ఎంపీ ఈటల, వినయ్ నందుకూరి

దేశాభివృద్ధిలో సీఎస్ఐఆర్ కీలకం

- ఔషధాలు, జన్యు నిర్ధారణకు సీఎస్ఐఆర్ ల్యాబ్‌ల కృషి
- పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్
- కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్రసింగ్

సాక్షి, హైదరాబాద్: మానవాళికి మేలు చేసే ఔషధాల ఆవిష్కరణ, జన్యు నిర్ధారణల్లో సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) ప్రయోగశాలలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ – ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐలు సంయుక్తంగా ఐఐసీటీ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన ‘స్టార్టప్ కాంక్లేవ్, హైదరాబాద్ – 2025’ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ ల్యాబ్‌లు ఖర్చు తక్కువగా ఉండే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్ సంస్థలు ఎంతో పురోగతి సాధించాయని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, కార్బన్ క్యాప్చర్, సౌరశక్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్, చౌకైన ఎనర్జీ స్టోరేజ్ వంటి రంగాల్లో ఆవిష్కరణలను సీఐఎస్ఆర్ ల్యాబ్‌లు ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. ఈ ఆవిష్కరణలు భారతదేశాన్ని స్వయం సమృద్ధి గల ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

హైదరాబాద్ నగరం శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదిగిందని, ఇక్కడి సీఎస్ఐఆర్ సంస్థలు ఈ ప్రక్రియలో ముఖ్య భూమిక పోషిస్తున్నాయని మంత్రి జితేంద్రసింగ్ ప్రశంసించారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ–సీసీఎంబీ) ద్వారా 170 బయోటెక్ స్టార్టప్‌లకు సుమారు రూ.350 కోట్ల నిధులు సమకూరినట్లు తెలిపారు. మంగళ, బుధవారాల్లో సాగే స్టార్టప్ కాంక్లేవ్‌లో 75 నుంచి 80 స్టార్టప్‌లు తమ ఉత్పత్తులు, ఆలోచనలను ప్రదర్శిస్తున్నాయని, వీటిలో ఎక్కువ భాగం సీఎస్ఐఆర్ ల్యాబ్‌లలో ఇంక్యుబేట్ అయినవేనని చెప్పారు. ఈ స్టార్టప్‌లు ఆరోగ్య సంరక్షణ, రసాయన, భౌగోళిక రంగాల్లో లోతైన సాంకేతిక పరిష్కారాలను అందిస్తున్నాయని ప్రశంసించారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయడానికి అవసరమైన వనరులన్నీ హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. రక్షణ, పరిశోధన సంస్థలు, యువ శక్తి అధికంగా ఉన్న హైదరాబాద్ నగరం నుంచే ప్రపంచానికి కరోనా ఔషధాలు ఎగుమతి కావడం గర్వకారణమని పేర్కొన్నారు. సీఎస్ఐఆర్ ల్యాబ్‌ల డైరెక్టర్లు డి. శ్రీనివాస్‌రెడ్డి (ఐఐసీటీ), వినయ్ నందికూరి (సీసీఎంబీ), ప్రకాష్ కుమార్ (ఎన్‌జీఆర్ఐ) తమ సంస్థలు ఆయా రంగాల్లో చేస్తున్న కృషిని వివరించారు. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.కలైసెల్వి ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.

సాక్షి ఫ్యామిలీ
15
హైదరాబాద్
బుధవారం ॥ 23-4-2025

పాలకులు ఎవరైనా పరిపాలన అధికారుల చేతుల్లో ఉంటుంది. సమర్థులైన అధికారులే దేశాన్ని ముందుకు నడిపించగలరు. అందుకే ఎన్నో వడపోతలతో యు.పి.ఎస్.సి (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సి.ఎస్.ఇ) ఫలితాలు అభ్యర్థుల ప్రతిభకు అత్యున్నత ఆనవాలుగా నిలుస్తాయి. ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ పోస్టులతో పాటు ఐ.ఎఫ్.ఎస్. తదితర పౌర సేవల ఉన్నత స్థానాల భర్తీ ఈ పరీక్ష ద్వారానే జరుగుతుంది.

2024 సంవత్సరానికి ప్రభుత్వం 1129 సివిల్ సర్వీసెస్ పోస్టుల ఖాళీని గుర్తించగా వాటికోసం 5,83,599 మంది జూన్ 16, 2024న ప్రిలిమనరీ పరీక్ష రాశారు. వీరిలో14,627 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వీరిలో 2,845 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా మొన్నటి జనవరి నుంచి ఈ నెల మొదటి వారం వరకూ సాగిన ఇంటర్వ్యూలలో 1009 మంది నియామకాలు పొందారు. వీరిలో 725 మంది పురుషులైతే 284 మంది స్త్రీలు. విశేషం ఏమిటంటే టాప్ 10 ర్యాంకుల్లో ఐదుమంది స్త్రీలు ఉండటం.... మొదటి ర్యాంకు మహిళా అభ్యర్థి సాధించడం. అందుకే ఇది అన్నివిధాలా స్త్రీలకు స్ఫూర్తినిచ్చే అంశం. వీరిలో టాప్‌టెన్‌లో నిలిచిన మహిళా ర్యాంకర్ల వివరాలు...

యు.పి.ఎస్.సి. నిర్వహించిన సివిల్స్ ఫలితాలు వెలువడ్డాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ పోటీ పరీక్షలో మహిళా అభ్యర్థులు 5 మంది టాప్ టెన్ లిస్ట్‌లో నిలిచారు. శక్తి దూబె (1), హర్షిత గోయల్ (2), షామార్గి చిరాగ్ (4), కోమల్ పునియా (6) ఆయుషి బన్సాల్ (7) ర్యాంకులు సాధించారు.

సివిల్స్‌లో ఆమె టాప్



శక్తి దూబె 1వ ర్యాంక్



ప్రయాగ్‌రాజ్‌లో పుట్టి పెరిగిన శక్తి దూబె టెన్త్ క్లాస్‌లో టాపర్. అలహాబాద్‌లో బీఎస్సీ చదివితే అందులోనూ టాపర్‌గా నిలిచింది. తండ్రి ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తుంటే తల్లి గృహిణి. సివిల్స్ సాధించాలన్న కలతో కోచింగ్ కోసం ఢిల్లీ చేరినా కోవిడ్ వల్ల తిరిగి ఇంటికి వచ్చేయాల్సొచ్చింది. దాంతో ఇంట్లోనే ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యింది శక్తి దూబె. పొలిటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌ను ప్రధానంగా ఎంచుకుని పరీక్ష రాసింది. దేశంలోనే మొదటి ర్యాంకు సాధించింది. 'గత సంవత్సరం ఇంటర్వ్యూ వరకూ వెళ్లి వెనక్కు వచ్చాను. అప్పుడు నా సోదరుడు... ఏం బాధ పడకు.. ఇంకోసారి ప్రయత్నించు... మొదటి ర్యాంకు నీ కోసం వేచి చూస్తోంది అన్నాడు. అతని మాట నిజమైంది. కాని నేను ఇంత పెద్ద ర్యాంక్ వస్తుందని అనుకోలేదు' అంది శక్తి దూబె. 'సివిల్స్ కోసం అందరూ కృషి చేస్తారు. ఏ లోపాలు ఉన్నాయో వాటిని సవరించుకుని కృషి చేస్తే గెలుస్తారు' అందామె.

హర్షిత గోయల్ 2వ ర్యాంక్



హర్షిత గోయల్ స్వరాష్ట్రం హర్యాణ అయినా ఆమె ప్రస్తుతం వడోదరాలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీసు చేస్తోంది. తల్లి మరణించడంతో తండ్రి, సోదరుడితో కలిసి జీవిస్తున్న హర్షిత 'నేను ఐ.ఎ.ఎస్ చేయాలనేది మా నాన్న కల. ఇవాళ ఆ కల నెరవేర్చాను. మా అమ్మ కూడా మబ్బుల్లో నుంచి సంతోషంగా ఉండే ఉంటుంది. ఇది నా మూడో అటెంప్ట్. నిరాశలో ఉండిపోకుండా ప్రయత్నించి సాధించాను. ఈ ర్యాంక్ సాధించడానికి రోజుకు కొన్ని గంటలు పెట్టుకొని చదవడం తప్ప వేరే ఏమీ చేయలేదు నేను. ఒక్కోసారి చదవాలనిపించదు. ఆ రోజు బ్రేక్ తీసుకున్నాను తప్ప బలవంతంగా చదవలేదు. నేను ఇన్‌స్టాలో ఉన్నాను. అయితే అది నా దృష్టి మరల్చలేదు. సోషల్ మీడియాను మీ చదువుకు ఉపయోగించుకుంటున్నారా కాలక్షేపానికా అనేది మీకు తెలిసి, కంట్రోల్‌లో ఉండగలిగితే సోషల్ మీడియా వాడండి' అంది.

మార్గి చిరాగ్ షా 4వ ర్యాంక్



'నాలుగుసార్లు విఫలమయ్యాను. ఐదోసారి నాల్గవ ర్యాంకు సాధించాను' అంది మార్గి చిరాగ్ షా. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన మార్గి కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లకుండా 2017 నుంచి సివిల్స్ కోసం పోరాడుతోంది. మధ్యలో తండ్రి మరణించినా ఆ దుఃఖాన్ని అధిగమించి లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించింది. ఈ ప్రిపరేషన్ వల్ల గుజరాత్ గ్రూప్ 1 పరీక్షల్లో ర్యాంక్ సాధించి ట్యాక్స్ ఆఫీసర్ అయ్యింది. అయితే ఐ.ఎ.ఎస్. కలను వదల్లేదు. ఇప్పటికి సాధించింది. 'కొన్ని కోచింగ్ క్లాసెస్ విన్నాక సెల్ఫ్ స్టడీ బెటర్ అనుకున్నాను' అందామె. 'మీరు ఎంత బాగా ప్రిపేర్ అయినా పరీక్ష రాసే సమయంలో ప్రశాంత చిత్తం ముఖ్యం. అది లేకపోతే కష్టం' అని తెలిపిందామె.

కోమల్ పునియా 6వ ర్యాంక్



32 ఏళ్ల కోమల్ పునియా ఐ.ఐ.టి. రూర్కీలో బి.టెక్ చేసింది. ఫిజిక్స్ అంటే చాలా ఇష్టం. ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌కు చెందిన కోమల్ చిన్నప్పట్నుంచి కూడా అమ్మాయిలు విజయం సాధించగలరు అని నిరూపించాలనుకుంది. తండ్రి రైతు కావడం వల్ల తన లక్ష్యానికి తానే మార్గనిర్దేశనం చేసుకుంది. గత సంవత్సరం ఆమెకు 474 ర్యాంకు వచ్చి ఐ.పి.ఎస్.కు ఎంపికైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రయినింగ్‌లో ఉంది. అయితే ఐ.ఎ.ఎస్. లక్ష్యంతో మళ్లీ పరీక్ష రాసి ఈసారి ఏకంగా 6వ ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ఆమె ఇంట్లోనే కాదు ఊళ్లో కూడా సంతోషాలు వెల్లువెత్తుతున్నాయి.

ఆయుషీ బన్సాల్ 7వ ర్యాంక్



ఆయుషీ బన్సాల్ ఐ.ఐ.టి. కాన్పూర్‌లోబీటెక్ చేసింది. సాఫ్ట్‌వేర్ రంగంలో వెంటనే ఉద్యోగం వచ్చింది. అయితే సివిల్స్‌పై ఉన్న ఆసక్తితో ఆ ఉద్యోగాన్ని వదిలి 2022 నుంచి ప్రిపరేషన్ మొదలుపెట్టింది. మొదటి అటెంప్ట్‌లోనే ఆమెకు 188వ ర్యాంకు వచ్చి ఐ.పి.ఎస్.కు ఎంపికై కర్నాటక కేడర్‌కు వెళ్లింది. 2023లో ఆమెకు 97వ ర్యాంక్ వచ్చింది. మూడోసారి ఇప్పుడు 7వ ర్యాంక్ సాధించి తన ఐ.ఎ.ఎస్ కలను నెరవేర్చింది.

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే...

- సివిల్స్‌లో మెరిసిన వరంగల్ వాసి
- 11వ ర్యాంక్‌తో తెలుగు రాష్ట్రాల్లో టాపర్
- రెండో ప్రయత్నంలోనే సత్తాచాటిన సాయి శివాని
- గ్రూప్ వన్ లోనూ 21వ ర్యాంక్!



సాయి శివాని

వరంగల్ నగరానికి చెందిన ఇట్టబోయిన సాయి శివాని యూపీఎస్సీ సివిల్స్‌లో సత్తా చాటారు. ఇప్పటికే ప్రిలిమ్స్ క్లియర్ చేసిన శివాని మెయిన్స్‌లోనూ మెరిసి 11వ ర్యాంక్‌తో తెలుగు రాష్ట్రాల నుంచి టాపర్‌గా నిలిచారు. కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో రెండో ప్రయత్నంలో మెరుగైన ర్యాంక్ సాధించి కలను సాకారం చేసుకుకుంది 22 ఏళ్ల యువతి. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ పరీక్షలోనూ జోనల్ స్థాయిలో 11వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ హోదా లేదా డీఎస్పీ ఉద్యోగం వచ్చే అవకాశం దక్కించుకున్నారు. అంతలోనే ఇప్పుడూ సివిల్స్ లో ఏకంగా 11వ ర్యాంక్ సాధించి... రోజుల వ్యవధిలోనే రెండు ఉన్నత ఉద్యోగాలకు అర్హత సాధించగలిగారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...



తల్లి రజిత, తండ్రి రాజులతో శివాని

'నాన్న రాజు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తారు. అమ్మ రజిత గృహిణి. మా చెల్లి సరయూ సఖి హైదరాబాద్ లో సీఏ, తమ్ముడు సాయి శివ బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నేను ఖమ్మంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు, ఆ తర్వాత వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయలో ఐఐటీ ఇంటర్మీడియట్, బీటెక్ (ఈసీఈ) కలిపి ఆరేళ్ల పాటు చదివా. ఆ తర్వాత నా తల్లిదండ్రులు ఐఏఎస్ కావాలన్న నా కలను వారి కలగా మార్చుకొని నాకు అండగా నిలిచారు. చదువుకునేటప్పుడు నాకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నాకు కావలసిన ప్రతిదీ సమకూర్చారు. కుటుంబపోషణ కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా చదువు కోసం చిన్నప్పటి నుంచి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారు. కుటుంబ ప్రోద్బలంతోనే నేను ఈరోజు సివిల్స్‌లో ర్యాంక్ సాధించగలిగా. 2023లో ఐదు మార్కులతో ప్రిలిమ్స్ మిస్ అయ్యింది. అయినా అకుంఠిత దీక్ష, ఆత్మవిశ్వాసంతో ఈ విజయం సాధించగలిగా. ప్రజల జీవితాల్లో మరీ ముఖ్యంగా మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఐఏఎస్ కావాలనుకున్నా'ని శివాని తెలిపారు.

కఠోర సాధన చేసింది

తమ కుమార్తె సాయి శివాని కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో ఇంట్లోనే ఉండి సివిల్స్‌కు సంబంధించిన పుస్తకాలతో పాటు ఢిల్లీలో ఉండే సత్యం జైన్ అనే వ్యక్తి నిర్వహించే అండర్ స్టాండింగ్ యూపీఎస్సీ ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరై కఠోర సాధనతో కలెక్టర్ కావాలన్న లక్ష్యాన్ని సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు తల్లిదండ్రులు ఇట్టబోయిన రాజు, రజితలు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేది. ఒత్తిడిని జయించేందుకు యోగా చేసేది. భగవద్గీత చదివేది. మా కలకు శ్రేయోభిలాషుల ఆశీస్సులు, దేవుడి దయ తోడు కావడం వల్లే మా కుమార్తె తన కలను సాకారం చేసుకునే దిశగా ముందుకెళ్లింది'' అని సంతృప్తి వ్యక్తం చేశారు.

– వాంకె శ్రీనివాస్, సాక్షి, వరంగల్

లీగల్

మీకు మెయింటెనెన్స్ కచ్చితంగా వస్తుంది

నేను ఒక ప్రైవేట్ స్కూల్లో 14 వేల జీతానికి పని చేస్తున్నాను. నాకు ఒక పాప. నా భర్తకి నెలకు 70 వేల జీతం. నాకు నయం చేయలేని వ్యాధి ఉంది. కొన్ని కారణాల వల్ల మేం గత రెండు సంవత్సరాలుగా విడి విడిగా ఉంటున్నాము. భర్తనుంచి మనోవర్తి రాలేదు. మెయింటెనెన్స్ కేసు వేయాలి అనుకుంటున్నాను. ఐతే, నా వ్యాధి – ఉద్యోగ రీత్యా నేను మెయింటెనెన్స్‌కు అర్హురాలిని కాదు అంటున్నారు. ఇది నిజమేనా?

– సాధన (పేరు మార్చాం), హైదరాబాద్

హెచ్.ఐ.వి. లాంటి నయం చేయలేని వ్యాధి ఉన్నాగానీ మెయింటెనెన్స్‌కు మీరు అర్హులే! మీకే కాదు, మీ పాపకి కూడా మెయింటెనెన్స్ వస్తుంది. భార్యను, పిల్లలను పోషించటం భర్త బాధ్యత. ఐతే మీ ఉద్యోగం రీత్యా మీ వరకు కొంత మెయింటెనెన్స్ తగ్గవచ్చు తప్ప, మీ కూతురికి తనకి సరిపడేంత మెయింటెనెన్స్ వస్తుంది. సెక్షన్ 144 బీఎన్ఎస్ (పాత సీ.ఆర్.పీ. సీ 125) ప్రకారం కేసు వేయండి.

•••

నాకు, నా మూడేళ్ల కొడుకుకి మెయింటెనెన్స్ కోరుతూ నా భర్త పై కేసు వేశాను. అతనికి నామీద అనుమానం చాలా ఎక్కువ. కాన్పుకి వచ్చిన తర్వాత తిరిగి తీసుకుని వెళ్లలేదు. "కొడుకు కూడా నాకు పుట్టలేదు, నేను మెయింటెనెన్స్ కట్టను'' అంటూ వాదిస్తున్నాడు. నా కొడుకు అతడికే పుట్టాడు అని రుజువు చేసుకోవాలి అని అంటున్నారు. నాకు ఏంటి ఈ పరీక్ష? పరిష్కారం చెప్పగలరు.

– ఒక సోదరి, కర్నూలు

మీరు ఎటువంటి పరీక్షలు చేయించుకోవలసిన అవసరం లేదు. బాబును అనవసర పరీక్షలకు తీసుకువెళ్లాల్సిన అవసరం కూడా లేదు. అభియోగం అతను మోపుతున్నాడు కదా. అతనిని రుజువు చేసుకోమని చెప్పాలి. వివాహ బంధంలో, కాపురం చేస్తున్న సమయంలో పుట్టిన పిల్లలకి తండ్రి ఆ భర్తే అని ఎవిడెన్స్ చట్టం లోని సెక్షన్ 112 కచ్చితంగా చెప్తుంది. మీరు గర్భం దాల్చిన సమయానికి మీకు, మీ భర్తకు వివాహ సంబంధం ఉన్నది అంటే చాలు. ఇదే విషయాన్ని ఇటీవలే సుప్రీంకోర్టు కూడా తేల్చి చెప్పింది. ఇలాంటి ఉపయోగాలు చేసిన భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలను చేసింది. కాబట్టి మీరు భయపడవలసిన అవసరం ఏమీ లేదు. కోర్టు వారికి మధ్యంతర మెయింటెనెన్స్ కావాలి అని దరఖాస్తు పెట్టి కేసు వాదించండి. మీకు ఉచితమైన న్యాయం దొరుకుతుంది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం


సెలబ్రిటీ రైటర్స్

మూవీ సెలబ్రిటీల ఆట, మాట, పాట మనకు తెలుసు. మరి అక్షరం?... ఈ పుస్తకాలే సాక్ష్యం. మూవీ సెలబ్రిటీలు రాసిన ఈ పుస్తకాల్లో మచ్చుకు కూడా కాలక్షేప కథనాలు లేవు. స్త్రీ సాధికారత నుంచి మానసిక ఆరోగ్యం వరకు విలువైన విషయాలు ఎన్నో ఉన్నాయి.



ప్రయాణంలో ప్రతి అడుగు పాఠమే

ప్రియాంక చోప్రా



'అన్‌ఫినిష్డ్: ఏ మెమోయిర్' పుస్తకంతో రచయిత్రిగా ఆరంగేట్రం చేసింది ప్రియాంకచోప్రా. ఈ పుస్తకం తన జ్ఞాపకాల సమాహారం. తాను నడిచొచ్చిన దారి.

'నేను ఎప్పటినుంచో పుస్తకం రాయాలనుకుంటున్నాను. అయితే ఎప్పుడు రాయాలనేదే సమస్య. నా జీవితం గురించి రాయడానికి ఇది సరియైన సమయం కాదు. ఇంకా ప్రయాణం పూర్తి కాలేదు అనుకుంటాం. అయితే జీవితంలో గొప్ప పాఠాలు ప్రయాణంలోనే బోధించబడతాయి. వాటి గురించి పంచుకోవడం అవసరం. నా జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే నాకు చాలా గర్వంగా ఉంది. అందుకే కలం పట్టుకున్నాను. నా జ్ఞాపకాలను అన్‌ఫినిష్డ్ ద్వారా పాఠకులతో పంచుకున్నాను' అంటుంది ప్రియాంక చోప్రా.

డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం

■ సోనాలి బింద్రే

'బంగారు కళ్ల బుచ్చమ్మ'గా 'మురారి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన సోనాలి బింద్రే 'బర్డ్స్ అండ్ బీస్ట్స్: ఎన్‌చాంటింగ్ టేల్స్ ఆఫ్ ఇండియా' 'ది మోడ్రన్ గురుకుల్' పుస్తకాలు రాసింది. ఆమె తాజా పుస్తకం 'ఏ బుక్ ఆఫ్ బుక్స్' నేడు విడుదల అవుతోంది. 'బర్డ్స్ అండ్ బీస్ట్స్' పుస్తకంలో భారతీయ జానపద కథలను తన దైన శైలిలో తిరిగి చెప్పింది సోనాలి. లడఖ్, అస్సాం, తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాఖండ్‌లలో తాను విన్న మౌఖిక జానపద కథలకు అక్షర రూపం ఇచ్చింది. పిల్లలను మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లే పుస్తకం ఇది.

ఒకప్పుడు సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు న్యూక్లియర్ కుటుంబాలే కనిపిస్తున్నాయి. 'ఈ డిజిటల్ యుగంలో పిల్లలను ఎలా పెంచాలి?' అనే ప్రశ్నకు సమాధానంగా 'ది మోడ్రన్ గురుకుల్' పుస్తకం రాసింది సోనాలీ. పిల్లల పెంపకానికి సంబంధించి మన మూలాల్లోకి వెళ్లాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం నొక్కి చెబుతుంది. ఇక తాజా పుస్తకం 'ఏ బుక్ ఆఫ్ బుక్స్' పుస్తకాలకు సంబంధించి సమస్త విషయాల గురించి మాట్లాడుతుంది. పుస్తకాలు ఎందుకు చదవాలి? ఉపయోగం ఏమిటి? ఎలాంటి పుస్తకాలు చదవాలి?... మొదలైన విషయాలతో 'జీవితాంతం రీడర్‌గా ఉండాలి' అని చెబుతుంది ఏ బుక్ ఆఫ్ బుక్స్.

తరాల మధ్య అంతరం

■ ట్వింకిల్ ఖన్నా




'మిసెస్ ఫన్నీ బోన్స్' 'పైజామాస్ ఆర్ ఫర్ గివింగ్' 'ది లెజెండ్ ఆఫ్ లక్ష్మీ ప్రసాద్' 'వెల్‌కమ్ పారడైజ్' పుస్తకాలతో రచయిత్రిగా మంచి పేరు తెచ్చుకుంది ట్వింకిల్ ఖన్నా. 'పాఠకులకు హితబోధ చేయడం నా ఉద్దేశం కాదు. ఇలా జరిగింది తెలుసా? అంటూ నాకు తెలిసిన విషయాలను పాఠకులతో పంచుకుంటాను' అంటున్న ట్వింకిల్ దయాదక్షిణ్యాలు, ఒంటరితనం, తరాల మధ్య అంతరాలు వంటి ఇతివృత్తాలతో రచనలు చేసింది.

'నేను రాయడానికి కూర్చున్నప్పుడు ఇతివృత్తం గురించి ఆలోచించను. నా కథలు హితబోధ చేస్తున్నట్లు ఉండకుండా జాగ్రత్త పడతాను. ఐడియా మదిలో మెరవగానే కథ పూర్తికాదు. కథ ఎక్కడ మొదలవుతుందో చెప్పలేము. అది మైండ్‌లో తనకు ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటుంది. కొన్నిసార్లు మనల్ని వదిలిపెట్టి ఎక్కడికో వెళుతుంది' అంటుంది ట్వింకిల్, 'జెల్లీ స్వీట్స్' అనే కథ రాయడానికి ఆమెకు ఎనిమిది సంవత్సరాలు పట్టింది!

జెండర్ ఈక్వాలిటీ... దయా గుణం... పర్యావరణం

■ అలియా భట్



'ఎడ్ ఫైండ్స్ ఎ హోమ్' పుస్తకంతో రచయిత్రిగా మంచి మార్కులు తెచ్చుకుంది అలియా భట్. పిల్లల కోసం రాసిన పుస్తకం ఇది. పర్యావరణం, దయాగుణం, లింగ సమానత్వం... ఇలాంటి ఎన్నో విషయాల గురించి పుస్తకంలో రాసింది. బాల పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ పుస్తకాన్ని రాసింది.

'పిల్లలకు ప్రకృతిపై ప్రేమ కలిగేలా చేయడానికి, పర్యావరణ పరిరక్షణ బాధ్యత గురించి తెలియజెప్పడానికి ఈ పుస్తకం రాశాను. ఇంట్లో కంటే ఆరుబయట ఎక్కువ సమయం గడపడానికి, సహజ ప్రపంచంలోని అద్భుతాలను అన్వేషించడానికి పిల్లలను ప్రోత్సహించడానికి మొదటి అడుగుగా ఈ పుస్తకం రాశాను' అంటుంది అలియా భట్.

తల్లులు, కాబోయే తల్లుల కోసం...

■ కరీనా కపూర్



ప్రెగ్నెన్సీ సమయంలో తన శారీరక, భావోద్వేగ అనుభవాలకు 'ప్రెగ్నెన్సీ బైబిల్' పుస్తకంతో అక్షర రూపం ఇచ్చింది కరీనా కపూర్. ఐవీఎఫ్ మదర్స్, ప్రెగ్నెన్సీ డిప్రెషన్, వికారం, మార్నింగ్ సిక్‌నెస్, పిల్లలకు పాలు ఇవ్వడం... ఇలా ఎన్నో విషయాల గురించి తన పుస్తకంలో రాసింది. ఈ పుస్తకం తన వ్యక్తిగత జ్ఞాపకాలు మాత్రమే అనలేము. ఎక్స్‌పెక్టింగ్ మదర్స్‌కు ఎంతో ఉపయోగపడే పుస్తకం.

'ఈ పుస్తకం నా మూడవ సంతానం' అని నవ్వుతూ అంటుంది కరీనా.

రోషెల్ పింటోతో కలిసి 'ది స్టైల్ డైరీ ఆఫ్ ఎ బాలీవుడ్ దివా' అనే పుస్తకం కూడా రాసింది కరీనా కపూర్.

'ఆటోబయోగ్రఫీ రాయాలనుకుంటున్నాను. అయితే ఇప్పుడు కాదు' అని పుస్తక ఆవిష్కరణ సభలో చెప్పింది. ఆటోబయోగ్రఫీకి ముందు ఆమె నుంచి మరిన్ని పుస్తకాలను ఆశించవచ్చు.

పింపుల్స్ నుండి పీరియడ్స్ వరకు...

■ టిస్కా చోప్రా



యాక్టర్, డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న టిస్కా చోప్రా రైటర్ కూడా. తమ శరీరంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడాని 9 నుంచి 13 ఏళ్ల బాలికల కోసం 'వాట్స్ అప్ విత్ మీ?' పుస్తకం రాసింది. యుక్త వయస్సు సమస్యలు, పీరియడ్స్, మొటిమలు... ఎన్నో అంశాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. యుక్తవయసులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి యువతకు సహాయపడే పుస్తకం ఇది. 'తొమ్మిదేళ్ల నుంచి 13, 14 ఏళ్ల వయస్సున్న అమ్మాయిలను దృష్టిలో పెట్టుకొని వాట్స్ అప్ విత్ మీ రాశాను. తల్లులే కాదు తండ్రులు కూడా నా పుస్తకంలో భాగం కావాలని కోరుకున్నాను. మార్కెట్లో లభించే ఎకో ఫ్రెండ్లీ ప్యాడ్‌ల గురించి తెలియజేశాం. పాఠం చెబుతున్నట్లుగా కాకుండా వినోదాత్మకంగా ఉండేలా పుస్తకం రాశాను' అంటుంది టిస్కా చోప్రా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	187	42
	79,596	24,167

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,200	▲ 332
డోజోన్స్	38,893	▲ 772
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,329	▲ 53
డాక్స్	21,294	▲ 88
షాంఘై	3,300	▲ 8
నికాయ్	34,221	▼ 59

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	98,484	▲ 1814
బంగారం (99.5 స్వచ్ఛత)	98,090	▲ 1808
వెండి (కిలో)	95,607	▼ 635

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.70	85.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.45	112.50
€	యూరో	ఎస్‌బీఐ	97.00	99.72
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.74	61.32
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.76	55.95
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.99	67.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.80	23.31
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.29	24.07
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.82	12.64



పసిడి లక్ష కాంతులు!

ఈ సారి 'లక్ష'య తృతీయ!

- మరో రూ.1,800 పెరుగుదల
- ఢిల్లీలో ధర రూ.1,01,600
- అంతర్జాతీయ మార్కెట్లో 3,500 డాలర్లు

న్యూఢిల్లీ: బంగారం చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఘట్టం నమోదైంది. అక్షయ తృతీయకు వారం రోజుల ముందే కీలకమైన రూ.లక్ష మార్క్‌ను పసిడి దాటేసింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ మొదటిసారి 3,500 డాలర్లను అధిగమించింది. అక్షయ తృతీయ సందర్భంగా బంగారం కొనుగోలు చేస్తే కలిసొస్తుందన్నది హిందువుల విశ్వాసం. అందుకే ఏటా ఆ రోజున (ఈ నెల 30) కొనుగోళ్లు అధికంగా నమోదవుతుంటాయి. దీనికితోడు మే చివరి వరకు కొనసాగే పెళ్లిళ్ల సీజన్‌లో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని.. స్టాకిస్టులు, ఆభరణాల వర్తకులు బంగారం కొనుగోళ్లకు ఆసక్తి చూపించడం ధరలు ఎగిసేలా చేసినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. 99.9 శాతం స్వచ్ఛత బంగారం ఢిల్లీ మార్కెట్లో రూ.1,800 పెరిగి రూ.1,01,600 ఆల్‌టైమ్ గరిష్టాన్ని నమోదు చేసింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.2,800 ఎగసి రూ.1,02,100కు చేరుకోవడం విశేషం. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేకుండా కిలోకి రూ.98,500వద్దే ఉంది.

తాజా పరిణామాలు..

వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన సైతం తాజా పసిడి ధరల ఆజ్యానికి కారణమన్నది కామా జ్యుయలరీ ఎండీ కొలిన్‌షా అభిప్రాయంగా ఉంది. డాలర్ బలహీనత కొనసాగితే అప్పుడు ఇతర కరెన్సీల్లో బంగారం ధరలు దిగిరావచ్చన్నారు. బంగారాన్ని డాలర్ మారకంలోనే మనం కొనుగోలు చేస్తుంటామన్నది తెలిసిందే. మరోవైపు చైనా ప్రయోజనాలను పణంగా పెట్టి అమెరికాతో ట్రేడ్ డీల్ చేసుకునే దేశాలపై ప్రతిచర్యలు ఉంటాయన్న చైనా హెచ్చరిక సైతం సురక్షిత సాధనమైన బంగారానికి డిమాండ్‌ను పెంచినట్టు కోటక్ సెక్యూరిటీస్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (కమోడిటీస్) కేనత్ చెయిన్‌వాలా తెలిపారు.

100 రోజుల్లోనే... 28 శాతం ర్యాలీ

ఈ ఏడాది ఆరంభం నుంచి చూస్తే బంగారం ధర 28 శాతం ర్యాలీ చేసింది. జనవరి 1న రూ.79,390గా ఉండగా, అక్కడి నుంచి చూస్తే 10 గ్రాములకు రూ.22,210 లాభపడడం గమనార్హం. పసిడి గమనం విశ్లేషకుల అంచనాలకూ అంతుచిక్కడం లేదు. ఈ ఏడాది చివరికి బంగారం ఔన్స్‌కు 3,500 డాలర్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ 10 రోజుల క్రితమే (11న) అంచనా వేసింది. అంత కాలం పాటు నేను ఆగుతానా? అన్నట్టు మంగళవారమే పసిడి అంతర్జాతీయ మార్కెట్లో 3,509 డాలర్ల రికార్డు స్థాయిని నమోదు చేసింది. ఈ ఏడాది బంగారం 3,700 డాలర్లకు చేరుకోవచ్చన్నది మరో అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్‌స్టాన్లీ అంచనా. ప్రస్తుత వేగాన్ని చూస్తుంటే ఈ రికార్డు కూడా త్వరలోనే నమోదవుతుందేమో? చూడాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం కొనసాగినంత కాలం బంగారం ధరలు శాంతించకపోవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. లేదంటే డాలర్ అయినా ప్రస్తుత స్థాయి నుంచి మరింత బలహీనపడాల్సి ఉంటుంది. అలా జరిగినా పసిడి ధరలు దిగివచ్చే అవకాశాలు ఉంటాయి.

స్వర్ణ యుగం

బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరగడం చూస్తున్నాం. ఇది స్వర్ణయుగం. బంగారానికి ఈ ఏడాది ఎంతో ముఖ్యమైనది. జనవరి నుంచి చూస్తే అంతర్జాతీయంగా బంగారం ధరలు 25% పెరిగి ఔన్స్‌కు 3,500 డాలర్లకు చేరాయి. భారత్‌లోనూ చారిత్రక గరిష్టం రూ.లక్ష మార్క్‌నకు (10 గ్రాములు) చేరడం ద్వారా పసిడిపై ఉన్న నమ్మకాన్ని బలోపేతం చేసింది. సురక్షిత సాధనంగా బంగారానికి ఉన్న గుర్తింపు సైతం ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. ధరల్లో ఆటుపోట్లతో సంబంధం లేకుండా ఈ ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా భారత్‌లో బంగారం కొనుగోళ్లు కొనసాగుతాయని అంచనా వేస్తున్నాం.



– సచిన్ జైన్, ప్రపంచ స్వర్ణ మండలి భారత్ సీఈవో

లాభాల 'సిక్సర్'

- ఆరో రోజూ కొనసాగిన ర్యాలీ
- బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్



ముంబై: బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల ర్యాలీ ఆరో రోజూ కొనసాగింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 187 పాయింట్లు పెరిగి 79,596 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు లాభపడి 24,167 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 416 పాయింట్లు ఎగసి 79,824 వద్ద, నిఫ్టీ 117 పాయింట్లు దూసుకెళ్లి 24,243 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి. అయితే అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో సగానికి పైగా లాభాలు హరించుకుపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించడంలో చైర్మన్ పావెల్ విఫలమయ్యాడంటూ అధ్యక్షుడు ట్రంప్ బహిరంగ విమర్శలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ.33.55 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.427.37 లక్షల కోట్ల(5.02 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. ఈ ఏప్రిల్ 9 నుంచి(6 రోజుల్లో) సెన్సెక్స్ 5,748 పాయింట్లు, నిఫ్టీ 1,768 పాయింట్లు ఎగిశాయి.
- బీఎస్ఈ సూచీల్లో రియల్టీ 2.50%, ఎఫ్ఎంసీజీ 2%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.5% లాభపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్‌లు 1% రాణించాయి.
- షేరు వరుస ర్యాలీతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారి రూ.15 లక్షల కోట్లకు చేరింది. తద్వారా రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో దేశీయ సంస్థగా అవతరించింది. ఈ ప్రైవేటు రంగ బ్యాంకు షేరు బీఎస్ఈలో 2% పెరిగి రూ.1,962 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో రూ.1,971 రికార్డు గరిష్టాన్ని తాకింది.
- మైక్రోఫైనాన్స్ విభాగంలో రూ.600 కోట్ల వ్యత్యాసంపై ఫోర్సెనిక్ ఆడిట్ కోసం ఎర్నెస్ట్–యంగ్ నియమించుకుందనే వార్తలతో ఇండస్‌ఇండ్ బ్యాంకు షేరు 5% నష్టపోయి రూ.788 వద్ద ముగిసింది.
- దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష దాటడంతో బంగారం ఆభరణాల షేర్లు మెరిశాయి. త్రిభువన్ దాస్ భీంజీ ఝువేరీ(టీజీజెడ్) 6%, స్కై గోల్డ్ 5%, సెన్కో గోల్డ్ 3 శాతం లాభపడ్డాయి.

భారత్‌కు మారనున్న ఫ్లిప్‌కార్ట్ హెడ్‌క్వార్టర్స్



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తన ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కి మార్చుకోనుంది. భారత్‌లో పుట్టి, పెరిగిన సంస్థగా ఇక్కడి కస్టమర్లు, విక్రేతలు, భాగస్వాములకు మరింత మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టేందుకు ఇది దోహదపడగలదని కంపెనీ పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ భారత్‌లో పబ్లిక్ ఇష్యూకి వచ్చే ప్రయత్నాల్లో ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
భారత్‌లో పెట్టుబడులు పెట్టండి	ఏథర్ ఎనర్జీ ఐపీవో 28న

హెచ్‌సీఎల్ టెక్ లాభం అప్

- క్యూ4లో రూ. 4,307 కోట్లు
- ఆదాయ అంచనా 2–5 శాతం ప్లస్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 4,307 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,986 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 6 శాతం పుంజుకుని రూ. 30,246 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 28,499 కోట్ల టర్నోవర్ సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 11 శాతం ఎగసి రూ. 17,390 కోట్లను తాకింది. 2023–24లో రూ. 15,710 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం 7 శాతం బలపడి రూ. 1,17,055 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఆదాయం 2–5 శాతం పురోగతి అందుకోగలదని కంపెనీ తాజాగా అంచనా వేసింది. గతేడాది 2,665 మంది జత కలవడంతో మార్చికల్లా కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 2,23,420కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 1,480 వద్ద ముగిసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

ఏఎఫ్ఎంఎస్, ఢిల్లీలో 400 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఢిల్లీలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్).. మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400.
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్(మేల్)–300, మెడికల్ ఆఫీసర్(ఫీమేల్)–100.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో అభ్యర్థులు జాతీయ వైద్య కమిషన్ చట్టం–2019 ప్రకారం వైద్య అర్హతను కలిగి ఉండాలి.ఏదైనా రాష్ట్ర వైద్య మండలి/ఎంసీఐ/ఎన్‌బీఈ/ఎన్ఎంసీ నుంచి శాశ్వత రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. రాష్ట్ర వైద్య మండలి ఎంసీఐ/ఎన్‌బీఈ/ఎన్ఎంసీ ద్వారా గుర్తింపు పొందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ హోల్డర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2025
» **వెబ్‌సైట్:** https://join.afms.gov.in

బీఐఎస్, న్యూఢిల్లీలో 160 కన్సల్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 160.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, బీఎస్‌వైఎస్, మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 65 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.75,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2025
» **వెబ్‌సైట్:** https://www.bis.gov.in

డీఆర్‌డీవో, ఢిల్లీలో 21 సైంటిస్ట్ పోస్టులు

ఢిల్లీలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21.
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ ఎఫ్–01, సైంటిస్ట్ ఈ–04, సైంటిస్ట్ డి–04, సైంటిస్ట్ సి–12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సైంటిస్ట్–సి పోస్టులకు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 50 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2025
» **వెబ్‌సైట్:** https://rac.gov.in

హెచ్‌యూఆర్ఎల్‌లో 108 పోస్టులు

హిందూస్తాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్(హెచ్‌యూఆర్ఎల్).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 108.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్–03, ఇంజనీర్/సీనియర్ ఇంజనీర్–35, అసిస్టెంట్ మేనేజర్/డిప్యూటీ మేనేజర్–21, అడిషనల్ చీఫ్ మేనేజర్–01, సీనియర్ మేనేజర్–01, జూనియర్ ఇంజనీర్ అసిస్టెంట్2 గ్రేడ్2–47.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, బీఈ, డిప్లొమా, ఎంబీఏ, పీజీడీఎం, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ ఇంజనీర్ అసిస్టెంట్2 గ్రేడ్2 పోస్టుకు 30 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, అడిషనల్ చీఫ్ మేనేజర్‌కు 44 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 37 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.05.2025
» **వెబ్‌సైట్:** https://jobse2.hurl.net.in

రివిజన్ + ప్రాక్టీస్‌తోనే సక్సెస్

» మే 4న నీట్ యూజీ పరీక్ష
» దేశ వ్యాప్తంగా 16లక్షల మందికిపైగా పోటీ
» తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్షన్నర మంది

నీట్-యూజీ.. ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షకు.. పోటీ లక్షల సంఖ్యలోనే! తీవ్రమైన పోటీ నెలకొన్న నీట్-యూజీ పరీక్ష తేదీ సమీపిస్తోంది. దేశవ్యాప్తంగా మే 4న ఈ పరీక్ష జరుగనుంది. ఇన్ని రోజులుగా సాగించిన ప్రిపరేషన్ ఒక ఎత్తయితే.. ప్రస్తుతం అందుబాటులో ఈ పది రోజుల్లో అనుసరించే వ్యూహాలే విజయంలో కీలకంగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో.. మే 4న జరగనున్న నీట్ యూజీకి లాస్ట్ మినిట్ ప్రిపరేషన్‌తోపాటు పరీక్ష హాల్లో ఎగ్జామ్ డే టిప్స్..



నీట్ యూజీ 2025

ప్రతిరోజు పునశ్చరణ

ఇప్పటికే అన్ని సబ్జెక్ట్‌ల సిలబస్‌ను పూర్తి చేసుకున్న అభ్యర్థులు.. ప్రస్తుత సమయంలో ప్రతిరోజు పునశ్చరణకు తప్పనిసరిగా సమయం కేటాయించుకోవాలి. ఈ రివిజన్ కోసం తాము ఇప్పటికే రాసుకున్న షార్ట్ నోట్స్ లేదా రెడీ రెకనర్స్‌ను వినియోగించుకోవాలి. ఈ పునశ్చరణ కూడా సిలబస్ వెయిటేజీకి అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశాలకు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి.

డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్స్‌లు

ప్రస్తుత సమయంలో పేరాలకొద్దీ సమాచారం అధ్యయనం చేయడం కంటే.. వాటికి సంబంధించిన డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఫలితంగా తక్కువ సమయంలో ఎక్కువ రివిజన్ పూర్తవుతుంది. అంతేకాకుండా అప్పటికే సదరు టాపిక్స్ సంబంధిత డయాగ్రమ్స్, ఫ్లోచార్ట్స్‌ను మనసులో ముద్రించుకున్న అభ్యర్థులకు పరీక్ష హాల్లో వాటిని చూడగానే మొత్తం సమాచారం గుర్తుకు వస్తుంది. ఫలితంగా సరైన సమాధానం గుర్తించడం సులువవుతుంది. ముఖ్యంగా బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్ట్‌ల విషయంలో ఈ విధానం మేలు చేస్తుంది.

మోడల్ టెస్ట్‌లు

ప్రస్తుత సమయంలో నీట్ యూజీ విద్యార్థులు మోడల్ టెస్ట్‌లు రాయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షకు రెండు రోజుల ముందు వరకు ప్రతి రోజు.. వాస్తవ పరీక్షను తలపించేలా నమూనా పరీక్షలు రాయాలి. ఒక రోజు రాసిన పరీక్ష ఫలితాలను విశ్లేషించుకుని.. లభించిన మార్కులు, ఏఏ అంశాలకు సంబంధించి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయారు, నెగెటివ్ మార్కులు ఎన్ని వచ్చాయి? ఇలాంటి వాటిపై స్పష్టత తెచ్చుకోవాలి. వాటికి అనుగుణంగా మరుసటి రోజు మోడల్ టెస్ట్‌కు మరింత సన్నద్ధతతో ముందుకు సాగాలి.

రెండు రోజుల ముందుగానే

మోడల్ టెస్ట్‌లలో తప్పుగా సమాధానాలు రాసిన అంశాలు తమకు ఇంకా క్లిష్టంగా ఉన్నాయని భావిస్తే.. వాటిలో పట్టు సాధించకపోతే ఎలా అనే ఆందోళన వీడాలి. దీనికి బదులు తమకు బాగా వచ్చిన అంశాలపై మరింత పట్టు సాధించాలి. పూర్తి స్థాయి ప్రిపరేషన్‌ను పరీక్షకు రెండు రోజుల ముందు పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. పరీక్షకు రెండు రోజుల ముందు నుంచి పరీక్ష హాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దృష్టిపెట్టాలి.

అవసరమైన పత్రాలు

పరీక్షకు రెండు రోజుల ముందుగానే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన అన్ని పత్రాలను సిద్ధం చేసుకోవాలి. అడ్మిట్ కార్డ్, పరీక్ష హాల్లోకి అడుగుపెట్టేందుకు అవసరమైన గుర్తింపు కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తదితర నిర్దేశిత డాక్యుమెంట్లు, పత్రాలను సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా వీలైనంత ముందుగా అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

పరీక్ష కేంద్రంపై స్పష్టత

అడ్మిట్ కార్డ్ సదుపాయం అందుబాటులోకి రాగానే దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని.. కేటాయించిన పరీక్ష కేంద్రం వివరాలు, చిరునామాను తెలుసుకోవాలి. పరీక్షకు రెండు రోజుల ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకుని వస్తే.. పరీక్ష రోజున ఏ సమయానికి బయలుదేరాలి అనే విషయంలో స్పష్టత లభిస్తుంది. ఇప్పటికే ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వివరాలను తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. కాబట్టి అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలను పొందుపరిచి తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవచ్చు.

ఓఎంఆర్ షీట్

అభ్యర్థులు పరీక్ష హాల్లో ఓఎంఆర్ షీట్‌ను నింపే విషయంలో అనుసరించాల్సిన నియమ, నిబంధనలను కూడా నీట్ నిర్వాహక సంస్థ ఎన్‌టీఏ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అభ్యర్థులు వాటిని పరీక్షకు ఒకట్రెండు రోజుల ముందే చదివి స్పష్టత తెచ్చుకోవాలి. ఓఎంఆర్ షీట్ నింపేందుకు అవసరమైన పెన్, పెన్సిల్ వంటి వాటిని సిద్ధంగా ఉంచుకోవాలి.

పరీక్ష ముందు రోజు

పరీక్షకు ముందు రోజు పూర్తిగా పరీక్ష హాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన అంశాలపైనే దృష్టి పెట్టాలి. అంతేతప్ప ఆ రోజు కూడా ప్రిపరేషన్ సాగిద్దాం లేదా మోడల్ టెస్ట్‌కు హాజరవుదాం అని ఆలోచిస్తే మానసికంగా ఆందోళన, ఒత్తిడి పెరుగుతాయి. కాబట్టి పరీక్ష ముందు రోజు అన్ని అంశాల్లోని టాపిక్స్‌ను ఒకసారి పునరావలోకనం చేసుకునేలా రెడీ రెకనర్స్‌ను వినియోగించుకోవచ్చు.

ఒత్తిడి లేకుండా.. ప్రశాంతంగా

పరీక్షకు ముందు రోజు ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదు. తేలికైన ఆహారం తీసుకోవాలి. అదే విధంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా కనీసం 8గంటలు నిద్ర పోవాలి. పరీక్ష ముందు రోజు నిద్ర లేకుండా ఉంటే.. అది పరీక్ష హాల్లో ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాసేలా మసలుకోవాలి.

పరీక్ష రోజున

పరీక్ష రోజున వీలైనంత త్వరగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష హాల్లోకి అనుమతించే సమయానికి కనీసం గంట ముందుగానే అక్కడకు చేరుకోవాలి. ఒకవేళ పరీక్ష కేంద్రం ఇంటికి బాగా దూరంగానో లేదా వేరే ప్రాంతంలోనో ఉంటే ఒక రోజు ముందుగానే అక్కడికి చేరుకోవడం మేలు. డ్రెస్ కోడ్, ఇతర నిషేధిత వస్తువుల విషయంలో ఎన్‌టీఏ సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలి.

పరీక్ష హాల్లో.. ఇలా

- పరీక్ష హాల్లోకి ప్రవేశించాక.. అభ్యర్థులు సమాధానాలు ఇచ్చేందుకు తొందరపాటుతో వ్యవహరించకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకుసాగాలి.
- ఆన్సర్ బుక్‌లెట్‌పై ముద్రించిన నియమ నిబంధనలను క్షుణ్నంగా చదవాలి.
- ముందుగా ప్రశ్న పత్రం ఆసాంతం చదివేందుకు కనీసం పది, పదిహేను నిమిషాలు కేటాయించాలి.
- ఆ తర్వాత తమకు సులువుగా అనిపించిన విభాగంతో సమాధానాలు ఇవ్వడం ప్రారంభించాలి.
- ముందుగా సులభంగా భావించిన ప్రశ్నలకు, ఆ తర్వాత దశలో ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు, చివరగా క్లిష్టంగా భావించే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వ్యూహాన్ని పాటించాలి.
- ఓఎంఆర్ షీట్‌లో బ్లూ లేదా బ్లాక్ పెన్‌తో ఆప్షన్‌ను బబుల్ చేయాల్సి ఉంటుంది. తర్వాత దాన్ని మార్చుకోవడం కుదరదు. కాబట్టి ఒక ఆప్షన్‌ను నింపే ముందు.. ప్రశ్న సంఖ్య, మీరు సమాధానంగా భావిస్తున్న ఆప్షన్‌ను సరిచూసుకోవడం ఎంతో ముఖ్యం.
- సమాధానాలు అన్నీ పూర్తి చేశాక.. ఒకసారి వాటిని సమీక్షించుకోవాలి.

'నెగెటివ్' తక్కువగా ఉండేలా

ఎన్‌టీఏ ఈసారి నీట్ ర్యాంకుల కేటాయింపు విషయంలో కీలకమైన మార్పులు చేసింది. ముఖ్యంగా ఇద్దరు అభ్యర్థులకు సమాన మార్కులు వస్తే..నెగెటివ్ మార్కులు తక్కువగా ఉన్న వారికి ర్యాంకు కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనుంది. కాబట్టి తెలియని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి.

అదే విధంగా ర్యాంకుల కేటాయింపులో.. టై బ్రేకింగ్ సమయంలో తొలుత బయాలజీ విభాగంలో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని, తర్వాత ఫిజిక్స్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని.. చివరగా కెమిస్ట్రీలో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి.. ర్యాంకు కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తారు. ఒక వేళ ఇలా అన్ని సబ్జెక్ట్‌లలోనూ ఇద్దరు అభ్యర్థులకు సమాన మార్కులు వస్తే.. తాజా నిబంధనల ప్రకారం నెగెటివ్ మార్కులు తక్కువగా ఉన్న వారికి ముందుగా ర్యాంకు కేటాయిస్తారు.

నీట్-2025 సమాచారం

- పరీక్ష తేదీ: 2025, మే 4 (మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు)
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2025, మే 1 నుంచి
- వివరాలకు వెబ్‌సైట్: https://neet.nta.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్



నందిని, జ్యోతి యర్రాజీలకు స్వర్ణ పతకాలు

జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. కొచ్చిలో జరుగుతున్న ఈ మీట్‌లో మంగళవారం మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో నందిని మొత్తం 5813 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. పూజ (హరియాణా : 5401 పాయింట్లు) రజతం, మౌమిత మండల్ (రిలయన్స్ : 5373 పాయింట్లు) కాంస్యం సాధించారు. మరోవైపు మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ బంగారు పతకాన్ని దక్కించుకుంది. రిలయన్స్ జట్టు తరఫున బరిలోకి దిగిన జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 13.23 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. విజేతగా నిలిచే క్రమంలో జ్యోతి ఆసియా చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణ సమయాన్ని (13.26 సెకన్లు) కూడా అధిగమించింది.



జ్యోతి

ఢిల్లీ మళ్లీ...



పంత్

కేఎల్ రాహుల్

దాదాపు నెల రోజుల క్రితం... వైజాగ్‌లో ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించింది... ఇప్పుడు ప్రత్యర్థి వేదికపై సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ మళ్లీ ఆధిక్యం ప్రదర్శిస్తూ లక్నోపై ఏకపక్ష విజయాన్ని అందుకుంది. క్యాపిటల్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు సూపర్ జెయింట్స్ తక్కువ స్కోరుకే పరిమితం కాగా, ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందీ లేకుండా క్యాపిటల్స్ అలవోకగా మరో 13 బంతుల ముందే విజయాన్ని అందుకుంది. ఇరు జట్ల మధ్య జరిగిన గత మ్యాచ్‌లో ఆడని రాహుల్... ఈసారి హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌కు ఇరుసుగా నిలిచాడు. తనను గత ఏడాది అవమానించిన పాత జట్టు లక్నో వేదికపై సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించి సంతృప్తిగా నిలబడ్డాడు.

లక్నోపై క్యాపిటల్స్ ఏకపక్ష విజయం

- 8 వికెట్లతో సూపర్ జెయింట్స్ చిత్తు
- రాహుల్, పొరేల్ హాఫ్ సెంచరీలు
- ముకేశ్ కుమార్‌కు 4 వికెట్లు

లక్నో: తొలి ఐపీఎల్ టైటిల్ వేటలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ మరో కీలక విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 8 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (33 బంతుల్లో 52; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్), ఆయుష్ బదోని (21 బంతుల్లో 36; 6 ఫోర్లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముకేశ్ కుమార్ (4/33) లక్నోను పడగొట్టాడు. అనంతరం ఢిల్లీ 17.5 ఓవర్లలో 2 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 57 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అభిషేక్ పొరేల్ (36 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... కెప్టెన్ అక్షర్ పటేల్ (20 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.



ముకేశ్‌కు అక్షర్ అభినందన

ఓపెనర్ల శుభారంభం...

తొలి వికెట్‌కు 59 బంతుల్లో 87 పరుగులు భాగస్వామ్యం... ఈ సమయంలో లక్నో స్థితి చూస్తే భారీ స్కోరు ఖాయమనిపించింది. అయితే ఓపెనర్లు మార్క్‌రమ్, మార్ష్ ఇచ్చిన ఈ ఘనారంభాన్ని ఆ తర్వాత జట్టు వృథా చేసుకుంది. పవర్‌ప్లేలో కొన్ని చక్కటి షాట్లు ఆడిన ఓపెనర్లు 6 ఓవర్లు ముగిసేసరికి 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో స్కోరును 51 పరుగులకు చేర్చారు. ఆ తర్వాత చమీరా ఈ భాగస్వామ్యాన్ని విడదీయగా, స్టార్క్ చక్కటి బంతితో పూరన్ (9)ను బౌల్డ్ చేశాడు.



పొరేల్

అనంతరం ముకేశ్ ఒకే ఓవర్లో సమద్ (2), మార్ష్‌లను అవుట్ చేయడంతో లక్నో కష్టాలు పెరిగాయి. 11 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయాక పరుగులు రావడం కూడా కష్టంగా మారిపోయింది. అయితే 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన బదోని కాస్త ప్రభావం చూపించాడు. ముకేశ్ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను తర్వాతి బంతికి బౌల్డ య్యాడు. వరుసగా వికెట్లు పడుతున్నా... సమద్, మిల్లర్ (14 నాటౌట్), బదోని తర్వాత ఇన్నింగ్స్‌లో మరో రెండు బంతులు ఉండగా ఏడో స్థానంలో రిషభ్ పంత్ (0) బ్యాటింగ్‌కు రావడం ఆశ్చర్యం కలిగించింది. టాస్ సమయంలో కుడి చేతికి కట్టుతో కనిపించిన పంత్ సమస్యేమీ లేదని చెప్పాడు.

కీలక భాగస్వామ్యం...

శార్దుల్ వేసిన తొలి ఓవర్లో 3 ఫోర్లతో 15 పరుగులు రాబట్టడంతో ఢిల్లీ ఛేదన మొదలైంది. కరుణ్ నాయర్ (15) తొందరగానే అవుటైనా... పొరేల్, రాహుల్ కలిసి చక్కటి సమన్వయంతో ఇన్నింగ్స్‌ను నడిపించడంతో పవర్‌ప్లేలో జట్టు 54 పరుగులు సాధించింది. రవి బిష్ణోయ్ ఓవర్లో 2 సిక్స్‌లతో 16 పరుగులు రాబట్టి ఢిల్లీ ధాటిని పెంచింది. 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత పొరేల్ వెనుదిరిగాడు. పొరేల్, రాహుల్ రెండో వికెట్‌కు 49 బంతుల్లో 69 పరుగులు జత చేశారు. అయితే ఆ తర్వాత రాహుల్, అక్షర్ కలిసి సునాయాసంగా జట్టును గెలుపు దిశగా నడిపించారు. రాహుల్, అక్షర్ మూడో వికెట్‌కు 36 బంతుల్లో అభేద్యంగా 56 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) స్టబ్స్ (బి) చమీరా 52; మార్ష్ (బి) ముకేశ్ 45; పూరన్ (బి) స్టార్క్ 9; సమద్ (సి) అండ్ (బి) ముకేశ్ 2; మిల్లర్ (నాటౌట్) 14; బదోని (బి) ముకేశ్ 36; పంత్ (బి) ముకేశ్ 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1–87, 2–99, 3–107, 4–110, 5–159, 6–159. **బౌలింగ్:** అక్షర్ 4–0–29–0, స్టార్క్ 4–0–25–1, ముకేశ్ 4–0–33–4, చమీరా 3–0–25–1, విప్‌రాజ్ 1–0–14–0, కుల్దీప్ 4–0–33–0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పొరేల్ (సి) మిల్లర్ (బి) మార్క్‌రమ్ 51; కరుణ్ నాయర్ (బి) మార్క్‌రమ్ 15; రాహుల్ (నాటౌట్) 57; అక్షర్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.5 ఓవర్లలో 2 వికెట్లకు) 161. వికెట్ల పతనం:** 1–36, 2–105. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 2–0–28–0, దిగ్వేశ్ రాఠీ 4–0–24–0, ప్రిన్స్ 2.5–0–23–0, మార్క్‌రమ్ 3–0–30–2, అవేశ్ ఖాన్ 3–0–19–0, రవి బిష్ణోయ్ 3–0–36–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	12	1.104
ఢిల్లీ	8	6	2	12	0.657
బెంగళూరు	8	5	3	10	0.472
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	9	5	4	10	-0.054
ముంబై	8	4	4	8	0.483
కోల్‌కతా	8	3	5	6	0.212
రాజస్తాన్	8	2	6	4	-0.633
హైదరాబాద్	7	2	5	4	-1.217
చెన్నై	8	2	6	4	-1.392

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ముంబై
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్లేటర్‌కు నాలుగేళ్ల జైలు

- అయినా వెంటనే విడుదల
- గతంలో ఏడాది శిక్ష అనుభవించిన క్రికెటర్



సిడ్నీ: గృహ హింస తదితర కేసుల్లో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకేల్ స్లేటర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. అయితే అతను జైలుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జడ్జి తీర్పునిచ్చారు. గతంలో ఈ కేసులో స్లేటర్ ఏడాది పాటు పోలీసుల నిర్బంధంలోనే ఉన్నాడు. తాజా తీర్పు ప్రకారం అతని మిగిలిన మూడేళ్ల శిక్షను కూడా రద్దు చేశారు. దాదాపు ఏడాదిన్నర క్రితం ఒక మహిళను వెంటపడి వేధించడంతో పాటు స్లేటర్ అసభ్యకర సందేశాలు కూడా పంపించాడు. పోలీసు విచారణలో ఇవన్నీ వాస్తవమని తేలడంతో అతడిని జైలుకు పంపించారు. అయితే స్లేటర్ సుదీర్ఘ కాలం పాటు మద్యానికి బానిసై మానసిక సమస్యలతో బాధపడ్డాడని, ఇదే కారణంగా ఇలాంటి తప్పుడు పనికి పాల్పడ్డాడని అతని లాయర్లు వాదించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి కూడా అతనిపై వేర్వేరు కేసులు ఉన్నాయి. జైలులో ఉన్న 375 రోజుల పాటు అతను సత్ప్రవర్తనతో మెలిగాడని వారు వివరించారు. దాంతో అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుంటూ న్యాయమూర్తి 55 ఏళ్ల స్లేటర్ శిక్షను కుదించారు. అయితే స్లేటర్ వచ్చే ఐదేళ్లపాటు 'సస్పెండెడ్ పీరియడ్'లో ఉంటాడు. ఈ సమయంలో మళ్లీ ఏదైనా తప్పు చేస్తే మాత్రం తీవ్ర శిక్షకు గురవుతాడు. స్లేటర్ 1993–2001 మధ్య కాలంలో ఆస్ట్రేలియాకు 74 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించి 42.83 సగటుతో 5312 పరుగులు సాధించాడు. 14 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలతో అతను ఆసీస్ అప్రతిహత విజయాల్లో ఓపెనర్‌గా కీలకపాత్ర పోషించాడు. 42 వన్డేలు కూడా ఆడిన స్లేటర్ ప్రస్తుతం కామెంటేటర్‌గా స్థిరపడ్డాడు.

సాక్షి సినిమా

ఎవరూ ఎవరి టాలెంట్‌నీ ఆపేయలేరు - గాయని సునీత



"చంద్రబోస్‌గారు ఆయనకు టైమ్ లేదని ముందుగా వెళ్లిపోయారు. కీరవాణిగారు నేను చూడలేనని వెళ్లిపోయారు. సునీతగారు నా ఎలిమినేషన్ చూడటానికే కూర్చున్నారు అని చాలా తప్పు మాట్లాడావమ్మా (సింగర్ ప్రవస్తిని ఉద్దేశించి) ఎవరు ఎలిమినేట్ అయితేనో, ఎవరన్నా జీవితంలో ఓడిపోతేనో సంతోషించేంత నీచమైన క్యారెక్టర్ నాది కాదు. జీవితంలో నేను చాలా కష్టాలు పడ్డాను. అలాంటి నేను ఒకరి ఓటమిని, ఒకరు ఏడుస్తుంటే చూసి సంతోషించే రకాన్ని కాదు" అని ప్రముఖ గాయని సునీత పేర్కొన్నారు. ఈటీవీలో ప్రసారం అవుతున్న రియాలిటీ షో 'పాడుతా తీయగా' 'సిల్వర్ జూబ్లీ సిరీస్'కు సంగీత దర్శకుడు కీరవాణి, గాయని సునీత, పాటల రచయిత చంద్రబోస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. గాయకుడు ఎస్పీ చరణ్ హోస్ట్‌గా ఉన్నారు. కాగా ఈ షోలో తన ఎలిమినేషన్ అన్యాయంగా జరిగిందని గాయని ప్రవస్తి ఆరాధ్య ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సింగర్ సునీత స్పందించారు. మంగళవారం ఫేస్‌బుక్‌లో ఓ సుదీర్ఘ వీడియోను సునీత షేర్ చేశారు. ఈ వీడియోలో సింగర్ ప్రవస్తిని ఉద్దేశించి పలు అంశాలను సునీత ఈ విధంగా ప్రస్తావించారు.

- ప్రవస్తీ... నీకు ఒక విషయం చెప్పాలమ్మా... పాడుతా తీయగా కాంపిటీషన్‌లో మాత్రమే కాదు... డిఫరెంట్ చానెల్స్ కాంపిటీషన్స్‌లోనూ పార్టిసిపేట్ చేశావ్ కదా. నీకు ప్రాసెస్ తెలియదా అమ్మా... సింగర్స్ పంపించే సాంగ్స్ సెలక్షన్‌లో రైట్స్ అనేవి కూడా ఉంటాయి. ప్రతి చానల్‌కు కొన్ని సాంగ్స్‌కు రైట్స్ ఉంటాయి. వాటిల్లో నుంచి కూడా సెలెక్ట్ చేయాలి. ఈ ప్రాసెస్‌లో చానల్‌కు ఉన్న రిస్ట్రిక్షన్స్ గురించి కూడా నువ్వు మాట్లాడమ్మా.
- నేను నిన్ను కొర కొర చూశానని అంటున్నావ్ కదా. నేను నిన్ను కొర కొర ఎందుకు చూడాలో, చూడాల్సిన అవసరం నాకేంటో అర్థం కాలేదు. నేను, కీరవాణి గారు, చంద్రబోస్‌గారు నిన్నే ఎందుకు టార్గెట్ చేశాం? అన్న విషయం నాకిప్పటికీ కనీసం ఆలోచించడానికి... ఆ థాట్ కూడా రావడం లేదు బేసిగ్గా. గాయత్రి, శ్రీ లలిత, ఇంకొకరు... ఫేవరటిజమ్ అంటూ రక రకాల పేర్లు తీస్తున్నావ్... నాకు అర్థం కావడం లేదు. వీళ్లెవరూ మ్యాంగో మ్యూజిక్‌లో పాడలేదమ్మా.. నువ్వు తప్ప.
- ప్రవస్తీ... మీ అమ్మగారిని నువ్వు అని సంబోధించి నేను మాట్లాడటం అసలు సంస్కారమా? అని నువ్వు మాట్లాడావ్ కదమ్మా... ఎలిమినేషన్ జరిగిన వెంటనే, ఇద్దరి పేర్లు అనౌన్స్ చేసిన తర్వాత... ఆవిడ (ప్రవస్తీ తల్లి) స్టేజ్ దగ్గరకు వచ్చి, నువ్వే మోసగత్తెవి అని నా ముఖం మీద మాట్లాడినప్పుడు... అది కరెక్ట్ అనిపించిందామ్మా నీకు. అదంతా కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. ఓటమిని అంగీకరించలేకపోతున్నారు. నువ్వు, మీ అమ్మగారు విసురుగా బయటకు వెళ్లిపోయారు. నేను టెక్నీషియన్స్‌ని అవమానపరుస్తాను, అగౌరవపరుస్తాను అని ఆరోపించావు. ఒక్క వీడియో బైట్ అయినా చూపించు.
- గెలిచినప్పుడు కాళ్లకు దండం పెట్టారు. ఓడిపోయినప్పుడు ఇలా బయటకు వెళ్లి మా గురించి మీకు ఏది నచ్చితే అది మాట్లాడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ప్రవస్తీ... ఇప్పటికీ మేం అందరం నీ మంచినే కోరుకుంటాం. ఎవరైనా ఆపేంత కెపాసిటీ ఇక్కడ ఎవరికీ లేదమ్మా. ఎవరూ ఎవరి టాలెంట్‌నీ ఆపేయలేరు.

అస్సలు యాక్టర్ కాలేవన్నారు



"'సారంగపాణి జాతకం'లో నేను చేసిన పాత్ర, ఈ చిత్రం అందరికీ నచ్చుతాయని భావిస్తున్నాను. నేను నటించిన 'మల్లేశం', 'బలగం', 'కోర్ట్' సినిమాల తరహా భావోద్వేగాలతో సాగే ఓ సాధారణ వ్యక్తి కథే 'సారంగపాణి జాతకం'" అన్నారు ప్రియదర్శి. ఇంద్రగంటి మోహన కృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ కానున్న నేపథ్యంలో ప్రియదర్శి పంచుకున్న విశేషాలు.

- ప్రియదర్శి

- ఇంద్రగంటిగారితో ఒక ఫొటో దిగితే చాలనుకునేవాణ్ణి. అలాంటిది ఆయనే నన్ను పిలిచి, 'సారంగపాణి జాతకం' కథ చెప్పారు. ఆయనతో నా ఫస్ట్ డే షూటింగ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ చిత్రం కోసం ఇంద్రగంటిగారే ఎక్కువగా కష్టపడ్డారు. నేను ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆయన చెప్పింది చెప్పినట్టుగా చేశానంతే. ఇంతవరకు నేనెక్కువగా తెలంగాణ మాండలికం మాట్లాడాను. కానీ, ఈ సినిమాలో ఆంధ్ర యాసలో మాట్లాడాను.
- జాతకాలని నమ్మాలని కానీ, నమ్మకూడదని కానీ మా సినిమాలో చెప్పడం లేదు. ఒకరి నమ్మకాల్ని ఇంకొకరి మీద రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపిస్తున్నాం. ఇండస్ట్రీలోకి రాకముందు నా జాతకాలు చూపిస్తే.. 'అస్సలు యాక్టర్ కాలేవు' అని చెప్పారు. కానీ నేను అవన్నీ పట్టించుకోలేదు. నా పైన, చేసే పని మీద నమ్మకం పెట్టుకుని ఇండస్ట్రీకి వచ్చాను.
- శివలెంక కృష్ణ ప్రసాద్‌గారు గొప్ప నిర్మాత. అప్పట్లోనే 'ఆదిత్య 369' లాంటి గొప్ప చిత్రాన్ని నిర్మించారాయన. ఇప్పటికీ నాలాంటి కొత్త యాక్టర్లని కూడా సార్ అని పిలుస్తుంటారు. ఆయన బ్యానర్‌లో పని చేసే చాన్స్ రావడం నా అదృష్టం. ప్రస్తుతం ఆడియన్స్ ఏ సినిమా చూడాలో... చూడకూడదో ఫుల్ క్లారిటీతో ఉన్నారు. సినిమాలో విషయం ఉంటేనే థియేటర్లకు వస్తున్నారు. కామన్ మేన్ పాత్రల్ని పోషిస్తే ఎక్కువమందికి రీచ్ అవుతుందని నా నమ్మకం. ప్రస్తుతం 'ప్రేమంటే, మిత్ర మండలి' సినిమాలు చేస్తున్నాను. మరికొన్ని కథలు వింటున్నాను.

మొదట్నుంచీ నా ట్రాక్ సెపరేట్ - విజయశాంతి



"'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. మా సినిమా రిలీజ్ నుంచి ఈరోజు వరకు ఎంతో మంది మహిళలు ఫోన్ చేసి, సినిమా చాలా బాగుందని, తల్లీ కొడుకు మధ్య భావోద్వేగాలు కట్టిపడేశాయని చెబుతుంటే ఆనందంగా అనిపించింది. ఓ మంచి చిత్రం చేశాననే సంతృప్తి నాకు, మా యూనిట్‌కి కలిగింది" అని నటి విజయశాంతి చెప్పారు. కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి కీలక పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం విజయశాంతి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

- 'సరిలేరు నీకెవ్వరు' సినిమా తర్వాత కొన్ని తెలుగు, తమిళ కథలు విన్నాను. కానీ, ఎగ్జయిటింగ్‌గా అనిపించలేదు. ఆ తర్వాత రాజకీయాలతో బిజీ అయిపోవడం వల్ల గ్యాప్ వచ్చింది. ప్రదీప్ చిలుకూరిగారు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కథ చెప్పినప్పుడు తల్లి, కొడుకు మధ్య భావోద్వేగాలు నన్ను బాగా ఎగ్జయిట్ చేయడంతో వెంటనే ఓకే చెప్పాను. పోలీస్‌గా, తల్లిగా చాలా విరామం తర్వాత ఒక పవర్‌ఫుల్ పాత్ర చేశాను. ప్రజలు రాములమ్మని (విజయశాంతి) ఎలాంటి పాత్రలో చూడాలనుకున్నారో ఈ సినిమాతో అది ఫుల్‌ఫిల్ అయ్యింది. ఈ సినిమాలో బురద సన్నివేశం చేయడం సవాల్‌గా అనిపించింది. ఈ సినిమా కోసం ఏడాది పాటు డైట్ పాటించాను. అలాగే పాత్ర కోసం నిరంతరం వ్యాయామం చేశాను. ఇప్పుడు యాక్షన్ చేయడం అనేది ఒక రకంగా నాకు సవాల్‌తో కూడుకున్నదైనా చేశాను. యాక్షన్, పెర్ఫార్మెన్స్‌ని ప్రేక్షకులతో పాటు ఇండస్ట్రీ వారు అభినందిస్తుండటం హ్యాపీగా ఉంది. ఈ సినిమాతో తల్లి, కొడుకుగా నాకు, కల్యాణ్ రామ్‌కి మంచి అనుబంధం ఏర్పడింది.
- నా కెరీర్ మొదట్నుంచీ నా ట్రాక్ సెపరేట్. 'ప్రతిఘటన, నేటి భారతం, కర్తవ్యం, ఒసేయ్ రాములమ్మ, మొండి మొగుడు పెంకి పెళ్లాం'... ఇలా ఎన్నో వైవిధ్యమైన చిత్రాలు చేశాను. ఇన్ని రక రకాల పాత్రలు చేయడం నాకు కుదిరింది. అది దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తా. ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వడానికి ప్రయత్నించాను... ఆశీర్వదించి సింహాసనంపై కూర్చోబెట్టారు. 'ప్రతిఘటన' సినిమా తర్వాత లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ ప్రజల నుంచే వచ్చింది. అలాగే 'లేడీ జాకీ చాన్, లేడీ అమితాబ్' ఇలా పిలిచారు. నేటి తరం యువత కూడా నన్ను రాములమ్మ అని పిలుస్తుంటే ఆశ్చర్యపోతుంటాను. మీ డేరింగ్ అండ్ డాషింగ్ నేచర్‌ని మేం స్ఫూర్తిగా తీసుకుంటున్నామని వారు చెప్పినప్పుడు హ్యాపీగా అనిపిస్తుంది.

హీరోయిన్లను మీరు అనండి: ఇటీవల కొన్ని ఇంటర్వ్యూలు, వీడియోలు చూశాను. కొంతమంది మీడియా మిత్రులు హీరోలను మీరు అని, హీరోయిన్లను మాత్రం నువ్వు అని సంబోధిస్తున్నారు. అలా అగౌరవంగా మాట్లాడటం ఎంతవరకూ కరెక్ట్? నందమూరి తారక రామారావుగారి లాంటి స్టార్ హీరో ఆయన మనవరాలి వయసున్న నన్ను సెట్స్‌లో మీరు అని మాట్లాడేవారు. అది మన సంస్కారం. తెలుగు వారు కానీ, ఏ ప్రాంతం నుంచి వచ్చిన హీరోయిన్లను అయినా కానీ మీరు అని సంబోధించండి.

మార్పులు... చేర్పులు

➡ 98వ ఆస్కార్ అవార్డ్స్‌కు కొత్త నియమ-నిబంధనలు

ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం గురించి ఆసక్తికరంగా ఎదురు చూస్తుంటారు. ఈ ఏడాది మార్చి 2న 97వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజిల్స్‌లో ఘనంగా జరిగింది. కాగా 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన కీలక తేదీలు, కొన్ని కొత్త నియమ–నిబంధనలను అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సంస్థ ప్రకటించింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15 (ఆదివారం)న నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16 ఉదయం). ఇంకా ఆస్కార్ గవర్నర్ అవార్డ్స్ ప్రదానోత్సవాన్ని ఈ ఏడాది నవంబరు 16న నిర్వహించనున్నామని, డిసెంబరు 16న షార్ట్ లిస్ట్ జాబితాను వెల్లడిస్తామని, 2026 జనవరి 22న నామినేషన్స్‌ను ప్రకటిస్తామని అకాడమీ ప్రతినిధులు తెలిపారు. 2026 ఫిబ్రవరి 26న మొదలయ్యే ఫైనల్ ఓటింగ్ మార్చి 5న ముగుస్తుందని, 'అచీవ్‌మెంట్ ఇన్ క్యాస్టింగ్' అనే కొత్త విభాగాన్ని చేర్చామనీ, ఇంకా పలు విషయాలను అకాడమీ ప్రతినిధులు ఈ విధంగా పేర్కొన్నారు.

అన్ని సినిమాలు చూడాల్సిందే!

ఆస్కార్ అవార్డ్స్ కోసం ఫైనల్ ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులు ఏ విభాగానికి అయితే ఓటింగ్ చేస్తున్నారో ఆ విభాగంలోని అన్ని చిత్రాలను చూసినట్లుగా అధికారికంగా ధ్రువీకరించేలా ఆస్కార్ కమిటీకి ఆధారాలు చూపాలి. అన్ని విభాగాలకు ఓటింగ్ చేయాలనుకుంటే, అన్ని విభాగాల్లోని చిత్రాలను ఫైనల్ రౌండ్‌లో పాల్గొనే ఆస్కార్ ఓటర్స్ కచ్చితంగా చూడాలి. ఫైనల్ రౌండ్‌లో ఓటింగ్ చేసే ఓటర్స్ సినిమాలను చూస్తున్నారో? లేదో ఆస్కార్ అకాడమీ స్క్రీనింగ్ రూమ్ ప్రతినిధులు గమనిస్తారు. ఒకవేళ ఓటర్స్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లేదా మరేదైనా సందర్భంలో ఆస్కార్ నామినేషన్ చిత్రాలను చూసినట్లయితే ఆ ఆధారాలను కమిటీకి అందజేయాలి. ఆస్కార్ ఓటర్స్ దాదాపు పదివేల మంది ఉన్న విషయం తెలిసిందే.



ఏఐ చిత్రాలకూ అవార్డ్స్

'ఏఐ' (కృత్రిమ మేధ), డిజిటల్ సాధనాలతో రూపొందించబడిన చిత్రాలను కూడా ఆస్కార్ అర్హతకు పరిగణిస్తామని, అయితే మానవ నిర్మిత చిత్రాలకు ప్రాముఖ్యత ఇస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. 2025లో జనవరి 1 నుంచి డిసెంబరు 30 వరకూ విడుదలైన సినిమాలు ఆస్కార్ అవార్డుల కోసం పరిగణిస్తారు. కాకపోతే మ్యూజిక్ విభాగంలో మాత్రం ఈసారి నామినేషన్ల సమయాన్ని కాస్త తగ్గించారు. ఇక దేశ పౌరుడు ఏ కారణాల చేతనైనా మరో దేశానికి వలస వెళ్లినా లేదా శరణార్థిగా వెళ్లినా ప్రస్తుతం అతను నివసిస్తున్న దేశం తరఫున ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి అవార్డు కోసం దరఖాస్తు చేయవచ్చు. సినిమాటోగ్రఫీ విభాగంలో గత ఏడాది వరకూ డైరెక్ట్‌గా నామినేషన్స్ ప్రకటించేవారు. అయితే తొలిసారిగా షార్ట్ లిస్ట్ విధానాన్ని తీసుకువచ్చారు. ఇంకా యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలోనూ చిన్నపాటి మార్పు జరిగింది.



'రింగు'లో 8 వరుసల వంతెనలు

ట్రిపుల్ ఆర్ 6 వరుసలతో నిర్మించనున్నందున డిజైన్లలో మార్పు

టెండర్ డాక్యుమెంట్ వివరాల్లో కూడా మార్పులు.. అవసరమైతే కొత్త టెండర్

రింగు రోడ్డులో 11 ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు, 3 పెద్ద వంతెనలు, 190 చిన్న వంతెనలు

అన్నీ ఎనిమిది వరుసలుగానే నిర్మాణం


సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)ను నాలుగు వరుసలకు బదులు ఒకేసారి ఆరు వరుసలుగా నిర్మించాలని భావిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ.. ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు, వంతెనలు, అండర్‌పాస్‌లున్న చోట మాత్రం 8 లేన్లతో రోడ్డును నిర్మించాలని నిర్ణయించింది. ప్రధాన క్యారేజ్‌వే (రోడ్డు) ఆరు వరుసలుగా నిర్మించటం ఖరారైతే, వంతెనలుండే చోట 8 వరసలుగానే నిర్మించనున్నారు. ఈ మేరకు అన్ని డిజైన్లు మారుస్తున్నారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లు పిలిచి ఉన్నందున, టెండర్ డాక్యుమెంటులో కూడా వివరాలను మారుస్తున్నారు. టెండర్ పిలిచేనాటికి నాలుగు వరసలుగా మాత్రమే రోడ్డును నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పుడు ఆలోచన మారినందున, అదే టెండర్‌ను కొనసాగించాలా, కొత్త టెండర్ పిలవాలా అన్న విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

55 మీటర్ల వెడల్పుతో ఇంటర్‌ఛేంజ్‌లు, వంతెనలు

- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో 11 చోట్ల ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు నిర్మిస్తారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను క్రాస్ చేసే చోట ఈ నిర్మాణాలుంటాయి. ఆయా రోడ్ల నుంచి రింగురోడ్డు మీదకు, రింగురోడ్డు నుంచి ఆయా రోడ్లకు వాహనాలు మారేందుకు వీలుగా లూప్ రోడ్లను అనుసంధానిస్తారు.
- ఇవి కాకుండా 3 నదులపై భారీ ఫ్లైఓవర్లు ఉంటాయి. మూసీ నది మీద వలిగొండ మండలం పొద్దుటూరు వద్ద కి.మీ. నిడివితో, మంజీరా నది మీద పుల్కల్ మండలం శివ్వంపేట వద్ద 600 మీటర్ల నిడివితో, తూప్రాన్ వద్ద హరిద్రా నది(హల్దీవాగు) మీద 500 మీటర్ల పొడవుతో వంతెనలు నిర్మిస్తారు.
- చిన్న రోడ్లు, నీటి కాలువలు క్రాస్ అయ్యే 105 ప్రాంతాల్లో వంతెనలు నిర్మించేందుకు ప్లాన్ చేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు 5.5 మీటర్ల ఎత్తుతో ఉంటుంది.
- చెక్‌డ్యామ్స్, చెరువు కాలువలు, గుట్టల నుంచి జాలువారే కాలువలను క్రాస్ చేసే చోట్ల 85 కల్వర్టులుంటాయి. ఈ ప్రదేశాలన్నిటి వద్ద ప్రధాన రోడ్డు 8 వరుసలతో, 55 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు.

ఒక్కో లేన్ 5.31 మీటర్ల వెడల్పు

ఒక్కోవైపు నాలుగు వరుసలతో మొత్తం ఎనిమిది వరుసలుగా ట్రిపుల్ ఆర్ ఉంటుంది. ఒకవైపు నాలుగు వరసలు కలిపి 21.25 మీటర్ల వెడల్పు ఉంటుంది. అంటే ఒక్కో లేన్ 5.31 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. ఈ రెంటి మధ్య సెంట్రల్ మీడియన్ 12.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఆర్‌ఆర్‌ఆర్ కింద ఉండే రాష్ట్ర, జాతీయ రోడ్లను అనుసంధానించే లూప్‌లు ఒక్కోవైపు 7.5 మీటర్ల వెడల్పుతో ప్రారంభమవుతాయి. రెండు వైపులా కలిపి 15 మీటర్ల వెడల్పు ఉంటాయి. ఈ లూప్‌లు ఉండే చోట మొత్తం రోడ్డు వెడల్పు ఏకంగా 70 మీటర్లు ఉండనుండటం విశేషం.



150 ఎకరాల వైశాల్యంలో ఇంటర్‌ఛేంజ్ కూడలి

ఉత్తర రింగులో 11 చోట్ల జాతీయ, రాష్ట్ర రహదారులను ట్రిపుల్ ఆర్ క్రాస్ చేస్తుంది. ఆయా ప్రాంతాల్లో ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు నిర్మిస్తారు. ఎనిమిది వరుసలతో నిర్మాణం చేపట్టాలని తాజాగా నిర్ణయించినందున ఈ స్ట్రక్చర్లు అతి భారీగా ఉండబోతున్నాయి. ఔటర్ రింగురోడ్డును కూడా 8 వరుసలతో నిర్మించినా, దానిమీద ఉండే ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు ఇంత భారీగా లేవు. ఓఆర్‌ఆర్‌ను సాధారణ జాతీయ రహదారి ప్రమాణాలతోనే నిర్మించారు. అయితే రీజినల్ రింగురోడ్డును ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. దీనిపై 120 కి.మీ.కు మించి వేగానికి అనుమతి ఉంటుంది. ప్రధాన క్యారేజ్‌వే నుంచి దిగువ రోడ్లలోకి మారేప్పుడు ఉండే లూప్‌ల మీద వాటి వేగం 60 కి.మీ. నుంచి 80 కి.మీ. వరకు ఉంటుంది. ఓఆర్‌ఆర్ లూప్స్‌లో వేగ పరిమితి 30 కి.మీ. మాత్రమే కావడం గమనార్హం. కాగా 60–80 కి.మీ వేగంలో మలుపు తిరగాలన్నప్పుడు లూప్ వ్యాసార్థం ఎక్కువగా ఉండాలి. దీంతో ఈ లూప్‌లు కిలోమీటరున్నర దూరం నుంచే ప్రారంభమై వంపు తిరుగుతాయి. ఇందుకోసం ఒక్కో ఇంటర్‌ఛేంజ్ కూడలిని 120–150 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించనున్నారు.

---

45 ఏళ్లు పైబడితే 'కొలనోస్కోపీ' తప్పనిసరి

కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ గురు ఎన్ రెడ్డి



రాయదుర్గం: నలభై ఐదేళ్లు పైబడిన వారంతా తప్పనిసరిగా కొలనోస్కోపీ స్క్రీనింగ్ చేయించుకోవాలని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ గురు ఎన్ రెడ్డి సూచించారు. నానక్‌రాంగూడలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో మంగళవారం 'రివీలింగ్ ఆఫ్ కొలోరెక్టల్ కేన్సర్ డాటా ఫర్ ది ఫస్ట్ టైమ్ ఇన్ ఇండియా– న్యూ స్టడీ ఇన్ ఇండియా ఫైండ్స్ హైరిస్క్ ఆఫ్ కొలోరెక్టల్ కేన్సర్ ఇన్ ఇండియన్ పేషెంట్స్'అనే అధ్యయనంపై వివరాల ను వెల్లడించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో కాంటినెంటల్ ఆస్పత్రిలో సుమారు 2 వేల మందికి కొలనోస్కోపీ స్క్రీనింగ్ నిర్వహించామన్నా రు. భారత దేశంలో సాధారణంగా కోలన్ కేన్సర్ చికిత్స పొందేందుకు సుమారు రూ. 10 లక్షల ఖర్చు అవుతుందన్నారు. కొలనోస్కోపీ ద్వారా చికిత్స ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన చెప్పారు.

గురువును ఎడ్లబండిపై ఊరేగిస్తూ వీడ్కోలు



శ్రీనివాస్ దంపతులను ఎడ్లబండిపై ఊరేగిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

పర్వతగిరి: తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు ఆ గ్రామస్తులు అపూర్వ వీడ్కోలు పలికారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం బూరుగుమడ్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడత శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కలిసి బూరుగుమడ్ల చౌరస్తా నుంచి ఎడ్లబండిపై కూర్చోబెట్టి విద్యార్థులు స్వయంగా లాగుతూ పాఠశాల వరకు తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడి సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి హాజరయ్యారు.



ఎడ్లబండ్లతో ర్యాలీగా వరంగల్ సభకు వెళ్తున్న రైతులు.
(ఇన్‌సెట్లో) ఎడ్లబండ్ల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

ఎడ్లబండ్లపై రజతోత్సవ సభకు..

- జెండా ఊపి ప్రారంభించిన మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా వరంగల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రజతోత్సవ సభకు సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నుంచి బయలుదేరిన ఎడ్ల బండ్ల ర్యాలీని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బండెనక బండి కట్టి.. 16 బండ్లు కట్టి అన్న పాటను సూర్యాపేట రైతులు మళ్లీ గుర్తు చేస్తున్నారని, రైతాంగంతోపాటు అన్ని రంగాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని తెలుసుకున్నారన్నారు. నీడలో ఉన్న వాళ్లం ఎండనబడ్డామన్న బాధతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారని చెప్పారు. దండగ అనుకున్న వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని, అలాంటి దేవుడు కేసీఆర్‌ను వదులుకున్నామన్న బాధలో ప్రజలంతా ఉన్నారన్నారు. కేసీఆర్ మీద అభిమానంతో రజతోత్సవ సభకు రైతాంగం ఎడ్లబండ్లపై బయలుదేరారని చెప్పారు. ఈ ఎడ్లబండ్ల ర్యాలీని 5 కి.మీ. మేర జగదీశ్ రెడ్డి నడిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


టుడేస్ గ్రాఫిక్



(నోట్: జన్మస్థలం ఆధారంగా పోప్‌ల సంఖ్య)

అనారోగ్యంతో సోమవారం కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనా నుంచి ఎంపికైన తొలి, ఏకైక పోప్. వెయ్యేళ్లకుపైగా గల పోప్‌ల నియామక చరిత్రలో యూరోపేతర దేశాల నుంచి నియమితులైన తొలి పోప్ కూడా ఆయనే కావడం విశేషం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



పిల్లలమర్రి శ్రీ ఎరకేశ్వర స్వామి దేవాలయం

పురాతన ఆలయాలకు నిలయం..
పిల్లలమర్రి

చరిత్రకు సజీవ సాక్ష్యం

ఆదరణలేక శిథిలమవుతున్న శిల్పకళా సంపద

పట్టించుకోని ప్రభుత్వం


తాళ్లగడ్డ (సూర్యాపేట): పిల్లలమర్రి ఆ పేరు వింటేనే చారిత్రక కట్టడాలు గుర్తుకువస్తాయి. ఆధ్యాత్మిక భావం ఉప్పొంగుతుంది. ఇక్కడ కాకతీయుల కాలంలో నిర్మించిన నామేశ్వర, ఎరకేశ్వర దేవాలయాలు దశాబ్దాలు దాటినా నేటికీ శిల్పకళా సంపద చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచాయి. గొప్ప కళాకృతుల సౌందర్యం ఉట్టిపడే ఈ ఆలయాలకు నేడు ఆదరణ కరువైంది. పాలకులు పట్టించుకోకపోవడంతో భావితరాలకు అందించాల్సిన ఆధ్యాత్మిక సంపదకు రక్షణ లేకుండాపోయింది. ప్రభుత్వం చొరవ చూపి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని భక్తులు కోరుతున్నారు.

నామేశ్వర ఆలయ నిర్మాణ వృత్తాంతం

కాకతీయ రాజు గణపతిదేవుడి పరిపాలనా కాలంలో రేచర్ల నామిరెడ్డి ప్రస్తుతం పిల్లలమర్రి గ్రామం ఉన్న ప్రాంతానికి సామంతరాజుగా ఉండేవారు. వీరు శైవారాధికులు కావడంతో 11వ శతాబ్దంలో మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఆయన పేరు మీద పార్వతీ మహాదేవ నామేశ్వర దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడి శివలింగాలు బ్రహ్మసూత్రం కలిగి ఉండటం విశేషం. కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయాలకు మాత్రమే ఈ బ్రహ్మసూత్రం ఉంటుంది.

12వ శతాబ్దంలో రేచర్ల బేతిరెడ్డి నామేశ్వర ఆలయంలో పూజలు చేసి పరిసర ప్రాంతంలో సంచరిస్తుండగా.. వేటకు వచ్చిన ఎరుకల వ్యక్తి అక్కడ ఉన్న ఒక పెద్ద ఊడల మర్రిచెట్టు కింద సేద తీరుతున్నాడు. ఆ సమయంలో ఆ చెట్టు పైన ఉన్న పిట్టలు.. మరి కొన్నాళ్లకు ఈ చెట్టు కూలుతుందని దీని కింద అనంత నిధి నిక్షిప్తమై ఉందని మాట్లాడుకోవడాన్ని విన్నాడు. వీరు అడవిలో ఉండటం పక్షులతో సావాసం కారణంగా ఆ మాటలు ఎరుకల వ్యక్తికి అర్థం కావడంతో వేటగాడు స్పందించాడు. దీంతో ఆ పక్షులు ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే తల పగిలి చస్తావ్ అని శపిస్తాయి. ఇది గమనించిన బేతిరెడ్డి రాజు ఎరుకల వారిని విషయం చెప్పాల్సిందిగా కోరగా శాప భయంతో వేటగాడు సంకోచిస్తుండగా చెప్పకుంటే మరణ శిక్ష విధిస్తానన్నాడు. చెప్పినా చెప్పకపోయినా ప్రాణం పోతుందని భావించిన వేటగాడు రాజును ఓ కోరిక కోరతాడు. తన పేరున ఆలయం నిర్మిస్తే పక్షులు మాట్లాడుకున్న విషయం చెబుతానని రాజుతో అంటాడు. అప్పుడు రాజు అందుకు అంగీకరిస్తాడు. దీంతో పక్షులు ఏం మాట్లాడుకున్నాయో రాజుకు వివరించి ఆ ఎరుకలివాడు మరణిస్తాడు. కొంతకాలానికి ఆ మర్రి చెట్టు కూలి అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులో 7 కొప్పెర్ల నిధి (ఆనాటి కొలతల ప్రకారం) బయటపడుతుంది. ఆ ధనంతో ఎరకేశ్వర ఆలయం నిర్మించారు. దానికి ఎరుకల వాని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే దీనికి మరో వృత్తాంతం కూడా ప్రచారంలో ఉంది. రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ ఆలయం నిర్మించిందని ఆమె పేరు మీద ఎరకేశ్వరాలయం పేరు వచ్చిందని కొందరి విశ్వాసం. ఆలయ నిర్మాణానికి ముందు ఇక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్టు ఊడలు పోసుకొని పెద్దగా విస్తరించడంతో ఈ గ్రామానికి పిల్లలమర్రి అని పేరు వచ్చింది.

ఎరకేశ్వర ఆలయ వృత్తాంతం





ఆలయ ముఖద్వారం

ఆలయ నిర్మాణ శైలి.. శిల్పకళా సౌందర్యం

నామేశ్వర ఆలయాన్ని చతురస్రాకారంలో, ఎరకేశ్వరాలయాన్ని శ్రీచక్రం ఆకారంలో రాతితో నిర్మించారు. ఇవి కాకతీయుల కాలం నాటి సంస్కృతిని, శిల్పసంపదను ప్రతిబింబిస్తున్నాయి. గర్భాలయం, అంతరాలయం తోరణాలు నల్లని (క్రిష్ణశిల) ఏకశిలతో నిర్మించడం విశేషం. ఈ ఆలయాల్లో శివలింగం ఎదురుగా నందీశ్వరుడు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కడా లేని విధంగా నందిని ఆలయంపైన గోపురం ముందు ప్రతిష్ఠించారు. రేచర్ల రాజులు నాట్య కళాప్రియులు కావడంతో ఆలయాల్లో గర్భగుడి ఎదురుగా నందీశ్వరునికి బదులుగా నాట్యమండపం నిర్మించారు. నాట్యమండపం నిర్మాణానికి ఏర్పాటు చేసిన స్తంభాలపై చెక్కిన నాట్య శిల్ప కళా రూపాలు సౌందర్యవంతంగా దర్శనమిస్తున్నాయి. ఈ స్తంభాల నుంచి సప్తస్వరాలు వినిపించేలా నిర్మించడం విశేషం.




ఆలయ స్తంభాలపై కనువిందు చేసే కళాకృతులు

బ్రహ్మసూత్రంతో శివలింగం

సాధారణంగా అన్ని శివలింగాల మీద గీత ఉండదు కేవలం కాకతీయుల కాలంలో నిర్మించిన కొన్ని శివలింగాలకు మాత్రమే బ్రహ్మసూత్రం అనే గీత ఉంటుంది. బ్రహ్మసూత్రం ఉన్న ఆలయంలో ఒక్కసారి రుద్రాభిషేకం, జపం, ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహిస్తే కోటి సార్లు చేసిన పుణ్యఫలం లభిస్తుందని, ఇలాంటి శివలింగాన్ని దర్శిస్తే జన్మ ధన్యమవుతుందని భక్తుల నమ్మకం.

ధ్వంసమైన కళారూపాలు

వందల ఏళ్ల కిందట వచ్చిన అతిపెద్ద భూకంపం వల్ల శివలింగాలు ఉత్తరం వైపుగా ఒరిగాయి. ఆలయాలు కదలడంలో ఆలయ ప్రాకారాలు పైకప్పు జరిగిన ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయి. నామేశ్వరాలయం నుంచి సూర్యాపేట బర్లపెంట బజార్‌లోని శ్రీఅన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయం వరకు సొరంగ మార్గం ఉంది. భూకంపం ప్రభావంతో కాలక్రమేణా పూర్తిగా పూడిపోయింది. పిల్లలమర్రి గ్రామంలో ఉన్న విఘ్నేశ్వరాలయం కాలగర్భంలో కలిసిపోయింది.



గర్భాలయం, అంతరాలయంలో కాకతీయ కళానైపుణ్యాన్ని ప్రతిబింబించే నల్లని ఏకశిలా తోరణాలు, భూకంపం కారణంగా... ఉత్తరం వైపు ఒరిగినట్లుగా కనిపిస్తున్న శివలింగం

ఏటా శివరాత్రికి జాతర

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పిల్లలమర్రిలో 5 రోజుల జాతర.. శివరాత్రికి ఒకరోజు ముందు ప్రారంభం అవుతుంది. మొదటి రోజు గణపతి పూజతో మొదలుకొని రెండోరోజు శివరాత్రి లింగోద్భవకాలంలో కల్యాణం, మూడోరోజు రథోత్సవం, నాలుగవరోజు అగ్నిగుండాలు, చివరి రోజున సాయంత్రం త్రిశూల స్నానం, ఏకాంత సేవ నిర్వహణతో జాతర ముగుస్తుంది.

భారీగా భక్తుల రాక

సూర్యాపేటకు ఆనుకుని ఉండటం, విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారికి చేరువలో ఉండటంతో జాతర సమయంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. చుట్టుపక్కల జిల్లాలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుంచి కూడా భక్తులు రావటం విశేషం.

పట్టించుకోని ప్రభుత్వం

ఈ ఆలయాలకు ఆదరణ కరువైంది. వర్షాకాలంలో నీళ్లు కారుతూ పాకురుపట్టింది. శిథిలావస్థకు చేరువలో ఉంది. ఆదాయం తక్కువగా ఉందని ఆర్థిక మిగులుబాటు లేదని ప్రభుత్వం దేవాదాయశాఖ పట్టించుకోకపోవడం శోచనీయం.

ఆలయ ప్రాంగణంలో మంచినీటి బావులు..

ఇక్కడ మంచినీటి బావులకు ప్రత్యేక స్థానం ఉంది. 11వ శతాబ్దంలో రేచర్ల రాజులు బావులు తవ్వించారు. నాటి నుంచి నేటి వరకు అదే నీటితో అభిషేకాలు చేస్తున్నారు. కరువులోనూ ఈ బావులు ఎండకపోగా.. గ్రామస్తులు, రైతులు ఈ నీటిని తోడినా మళ్లీ అదే స్థాయిలోకి నీరు ఉండటం విశేషం. కరువు కాలంలో పక్కన ఉన్న మూసీ నది, చెరువులు అడుగంటినా ఈ బావి నీటిమట్టం తగ్గకపోవటం విశేషం.



800 ఏళ్లనాటి బావి

త్రికూటేశ్వరాలయం..

త్రికూటేశ్వరాలయం, సరస్వతీదేవి సమేత బ్రహ్మ దేవాలయాలను రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ నామేశ్వర దేవాలయం ప్రాంగణంలోనే నిర్మించారు. త్రికుటేశ్వరాలయంలో మూడు శివలింగాలు ఒకే నందీశ్వరునితో ప్రతిష్ఠించారు. ఇక్కడి నంది ఉత్తరం వైపుగా తలతిప్పి ఉంటుంది. ఎడమ కన్నుతో దక్షిణ, పడమర ఆలయంవైపు కుడి కన్నుతో ఉత్తరం వైపు ఉన్న ఆలయాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. అన్ని శివాలయాలలో ప్రాణమట్టాలు ఉత్తరంవైపుగా ఉంటాయి. కానీ ఈ త్రికుటేశ్వరాలయంలో మాత్రం ఎదురుగా ఉన్న ఆలయంలో ఉత్తరం వైపు, ఉత్తరం, దక్షిణం వైపు ఉన్న ఆలయాల్లో మాత్రం తూర్పువైపుగా ప్రాణమట్టాలు ఉన్నాయి.

ప్రపంచంలో ఈ విగ్రహం ఒక్కటే..


సరస్వతీదేవి సమేత బ్రహ్మ ఆలయంలో నెమలి వాహనంపై బ్రహ్మ సరస్వతీదేవి ఏకశిలపై ఒకే విగ్రహంగా దర్శనమిస్తారు. ప్రపంచంలో ఇలాంటి విగ్రహం ఇది ఒక్కటి మాత్రమే ఉండటం విశేషం. కవి పిల్లలమర్రి పినవీరభద్రుడు అమ్మవారిని దర్శించి కటాక్షం పొంది కవిగా ప్రసిద్ధి చెందాడని నానుడి. పిల్లలమర్రి గ్రామంలో పురాతన శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, హనుమ ఆలయాలు కూడా ఉన్నాయి.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

పిల్లల మర్రి ఆలయాలకు 12 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిపై వచ్చే ధనాన్ని వెచ్చించి ధూపదీప నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విజయవాడ–హైదరాబాద్ రహదారికి ఖమ్మం బైపాస్‌కి పిల్లలమర్రి గ్రామం మీదుగా లింక్ రోడ్డు వేస్తే భక్తుల రాకపోకలకు, ఆలయాభివృద్ధికి దోహదపడుతుంది. భక్తుల కోసం వసతి గృహాలు కట్టిస్తే బాగుంటుంది. వర్షాకాలంలో నీరు కారి ఆలయ పైకప్పు ప్రాకారాలు పాకురు పడుతున్నాయి. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి.

– మునగలేటి సంతోష్ శర్మ, ప్రధాన అర్చకుడు





త్రికూటేశ్వరాలయం



గర్భాలయం, అంతరాలయంలో కాకతీయ కళానైపుణ్యాన్ని ప్రతిబింబించే నల్లని ఏకశిలా తోరణాలు



స్తంభంపై చెక్కిన.... కాకతీయుల కళా నైపుణ్యానికి అద్దం పట్టే కళాకృతులు



టిఫిన్ బండి.. బతుకు నిండి

రోజూ ఉదయమే అల్పాహారం కోసం హోటళ్లను ఆశ్రయించేవారు.. రహదారుల వెంట నిర్వహించే మొబైల్ టిఫిన్ సెంటర్లపైనా ఆసక్తి చూపేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇలాంటి వారికోసం నిర్వాహకులు ఇడ్లీ, దోశ, వడ, పూరీ వెనువెంటనే తయారు చేసి వేడివేడిగా వడ్డిస్తున్నారు. వీటితో వందలాది కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోంది. పెద్దపల్లి శివారులోని రాజీవ్ రహదారికి ఇరువైపులా ఏర్పాటైన మొబైల్ టిఫిన్ సెంటర్లు ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





చలువ పందిళ్లు

మొక్కలను మనం పెంచితే.. అవి మనకు ప్రాణవాయువు పంచుతాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు నుంచి ధర్మారం వెళ్లే దారిలో ఈ చెట్లు ప్రకృతి ప్రేమికులను మురిపిస్తున్నాయి. ఈ మండు వేసవిలో చలువ పందిళ్లుగా ఆహ్లాదం పంచుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



వంద కిలోమీటర్ల దూరానికి హెలికాప్టర్లా?

బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులివ్వని ప్రభుత్వం.. వంద కిలోమీటర్ల దూరానికి మాత్రం మంత్రులు హెలికాప్టర్లు వాడుతున్నారని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం, మంత్రుల జల్సాలకు డబ్బులు ఖర్చు పెడుతున్నారు తప్ప.. విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఢిల్లీ టూర్ల ఖర్చు రూ.300 కోట్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తీర్చవచ్చన్నారు. రాష్ట్రంలో 2 వేల పాఠశాలలు మూసేసి విద్యార్థుల జీవితాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. విద్యాశాఖమంత్రిగా సీఎం ఉన్నా.. విద్యా వ్యవస్థ దారుణంగా ఉందన్నారు. యూనివర్సిటీలను అమ్మేస్తున్నారని, గురుకులాల్లో పరిస్థితి దారుణంగా ఉందని రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తారా? పథకాన్నే రద్దు చేస్తారా? అనే విషయాన్ని చెప్పాలని డిమాండ్ చేశారు.

సంయమనంతో వ్యవహరించాలి: క్రాంతి కిరణ్

సాక్షి, హైదరాబాద్: శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్రిగుట్ట ప్రాంతాన్ని సాయుధ బలగాలు చుట్టుముట్టాయని టీవీల్లో వార్తలు ప్రసారం అవుతున్నాయని...ఈ పరిణామాలు శాంతి చర్చల ప్రక్రియకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి మారణహోమాన్ని ఆపాలని కోరారు.

అది తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ సింకింగ్

బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'తెలంగాణ రైజింగ్' అంటూ గొప్పగా చెబుతున్నారు కానీ, అది నిజానికి 'తెలంగాణ సింకింగ్', 'తెలంగాణ రేసింగ్ ఫర్ ఫండ్స్' మాత్రమేనని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో పెట్టుబడుల కోసం వివిధ దేశాలకు వెళ్లినా ఇప్పటిదాకా పెట్టుబడులు రాలేదు, ఉద్యోగాలు కల్పించలేదని విమర్శించారు. మంగళవారం అధికార ప్రతినిధులు సోలంకి శ్రీనివాస్, జి.వెంకటరెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల ఒప్పందాలపై రాష్ట్ర ప్రజల ముందు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దావోస్ పర్యటన తర్వాత రూ.1,78,950 కోట్ల మేర ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా 50 వేల ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. ఆ కంపెనీలు ఎక్కడ ఏర్పాటయ్యాయి? అవి నిజమైనవేనా? ఫేక్ కంపెనీలా స్పష్టత ఇవ్వాలని సుభాష్ డిమాండ్ చేశారు.

'బేళ్ల'చూపులు



గిట్టుబాటు ధర లేక పొగాకు రైతులు దిగాలు చెందుతున్నారు. ఎన్నో ఆశలతో వేలం కేంద్రానికి తరలించిన పొగాకు బేళ్లకు సరైన ధర పలకకపోవడంతో బేలచూపులు చూస్తున్నారు. కొందరు సరుకును ఇళ్లకు తిరిగి తీసుకుపోతున్నారు. ప్రకాశం జిల్లాలోని పొగాకు వేలం కేంద్రంలో రైతుల దుస్థితికి ఈ దృశ్యం అద్దం పడుతోంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

సీజ్ ఓవర్... మీరే ఓనర్



విశాఖలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను వాటి యజమానులకు పోలీసులు మంగళవారం అందజేశారు. వెహికల్ హ్యాండోవర్ మేళా పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 320 వాహనాలను తిరిగి అప్పగించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

'సుక్క'దుఃఖాలు



కూటమి సర్కారు వచ్చాక రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. కూలినాలి చేసుకుని జీవించే శ్రామికులే కాదు.. సంచార జీవులూ మద్యానికి బానిసలై బతుకులను బలిపీఠం ఎక్కిస్తున్నారు. అనంతపురంలో భిక్షాటన చేసుకుని జీవించే ఓ వ్యక్తి మంగళవారం పూటుగా తాగి భార్యను చితకబాదుతుంటే అక్కడే ఉన్న చిన్నారులు బేలచూపులు చూస్తున్న దృశ్యం చూపరుల హృదయాలను కలచివేసింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పోప్ మృతిపై వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సంతాపం

సాక్షి, అమరావతి: పోప్ ఫ్రాన్సిస్ మృతిపై వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మంగళవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ప్రపంచ దేశాల్లో కేథలిక్ సమాజాన్ని ప్రభావితం చేసిన అధిపతిగా పోప్ ఫ్రాన్సిస్ మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. ప్రపంచమంతా శాంతి, కరుణ, దయ, జాలి పరిఢవిల్లాలని పరితపించిన గొప్ప మానవతావాది అని కొనియాడారు.

వేసవి తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోండి: ఏబీవీపీ

సాక్షి, అమరావతి: వేసవి సెలవుల్లో కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో శిక్షణ తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ డాక్టర్ కృతిక శుక్లాకు వినతి పత్రం అందజేసింది.

గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం తక్షణం జీవో నంబర్–3పై ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి గిరిజన స్పెషల్ డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీకి ముందే ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి అమలు చేస్తున్నట్లుగానే జీవో నంబర్–3పై కూడా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు.

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

సాక్షి, అమరావతి: జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులపై ప్రభుత్వం సవతి ప్రేమ కనబరుస్తోందని ఆ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తమ సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో 22 వేల మంది పలు హోదాల్లో సేవలందిస్తున్నారన్నారు. ఈ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్‌ను అమలు చేయడం లేదన్నారు.

వేసవి సెలవుల తర్వాత వ్యాక్సినేషన్‌పై మెగా క్యాంపెయిన్

సాక్షి, అమరావతి: పిల్లలకు రోగ నిరోధక టీకాలు అందించడంపై వేసవి సెలవుల అనంతరం మెగా క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయించినట్టు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. మంగళవారం సచివాలయంలో రోగ నిరోధక టీకాలపై స్టేట్ టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ, డబ్ల్యూహెచ్‌ఓ, మున్సిపల్, పంచాయతీ రాజ్, విద్యా, మహిళా శిశు సంక్షేమశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేట నిషేధ భృతి నిబంధనలు మార్పు

- ఉత్తర్వులు జారీ చేసిన మత్స్య శాఖ
- వేటకు వెళ్లే మత్స్యకారులకు సంక్షేమ పథకాలన్నీ కట్ చేస్తూ ఇటీవల మార్గదర్శకాలు
- గంగపుత్రులకు అన్యాయంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ 'సాక్షి' కథనం
- దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం
- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందే వారే అనర్హులంటూ తాజాగా నిబంధనల్లో మార్పులు



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: 'గంగపుత్రులకు తీరని అన్యాయం.. వేటకు వెళ్లే మత్స్యకారులకు సంక్షేమ పథకాలు కట్' పేరుతో 'సాక్షి' ప్రచురించిన కథనంతో కూటమి ప్రభుత్వం దిగివచ్చింది. 'వేట నిషేధ భృతి'కి అర్హుల గుర్తింపు కోసం జారీ చేసిన నిబంధనలను మారుస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. భృతికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్(మత్స్యకార పెన్షన్) పొందే వారు మాత్రమే అనర్హులని.. మిగిలిన సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆంక్షలు ఉండబోవని స్పష్టం చేసింది. ఇతర నిబంధనలను కొంతమేర సడలించింది.

కలకలం రేపిన ఉత్తర్వులు..

సముద్రంలో మత్స్యసంపద వృద్ధి కోసం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలవుతుంటుంది. ఈ దృష్ట్యా జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాల పోషణ కోసం ప్రభుత్వం పరిహారం ఇచ్చేది. గతంలో రూ.4 వేలు ఉన్న వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచిన వైఎస్ జగన్ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఐదేళ్ల పాటు మత్స్యకారులకు అందించింది. ఎలాంటి ఆంక్షలు లేకుండా 5.38 లక్షల మందికి రూ.538 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. అలాగే వేట నిషేధ భృతి పొందిన వారికి సైతం అన్ని సంక్షేమ పథకాలనూ వర్తింపజేశారు. అధికారంలోకి వస్తే భృతిని రూ.20 వేలకు పెంచి ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. తొలి ఏడాది ఎగ్గొట్టింది. 2025–26 సంవత్సరానికి సంబంధించి వారం రోజుల క్రితం మార్గదర్శకాలు జారీ చేసింది. కుటుంబంలో ఒకరికి మాత్రమే వేట నిషేధ భృతి ఇస్తామని.. ఈ భృతి పొందే వారు ఇతర సంక్షేమ పథకాలకు అనర్హులని ప్రకటించింది. ఈ నిబంధనలను ప్రశ్నిస్తూ 'సాక్షి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. నిబంధనలు మార్చాలంటూ మత్స్యకారులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం నిబంధనలను మారుస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మారిన నిబంధనలు..

వేటకు వెళ్లే బోట్లన్నీ ఏప్రిల్ 14కు ముందు ఎంఎస్ యాక్టు 1958 కింద రిజిస్టరై ఉండాలని.. ఎఫ్ఎంఎఫ్ఆర్ యాక్టు 1995 కింద లైసెన్స్ సర్టిఫికెట్ పొంది ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. సబ్సిడీ ఆయిల్ ఎంత వినియోగించుకున్నా అర్హులేనని స్పష్టం చేసింది. కాగా, వేట నిషేధ భృతి పొందేవారు ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, చంద్రన్న పెళ్లి కానుక, ఎన్టీఆర్ విద్యోన్నతి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందేందుకు అనర్హులని ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం.. ప్రస్తుతం ఒక్క ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్(మత్స్యకార పింఛన్) పొందే వారు మాత్రమే అనర్హులంటూ నిబంధనల్లో మార్పులు చేసింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 1.20 లక్షలు, అర్బన్ ప్రాంతంలో 1.44 లక్షల ఆదాయానికి మించి ఉండకూడదని.. 3 ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట లేదా 10 ఎకరాల్లోపు మెట్ట, మాగాణి కలిసిన భూములు, 4 చక్రాల వాహనాలు, ఏడాదిలో గరిష్టంగా నెలకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగం, కుటుంబంలో ఎవరైనా ఆదాయ పన్ను చెల్లింపుదారులు, పట్టణ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సొంత ఇల్లు కలిగిన వారు అనర్హులని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ప్రస్తుతం ఆ నిబంధనల స్థానంలో గతంలో మాదిరిగా 6 దశల వెరిఫికేషన్ ద్వారా అర్హులను గుర్తిస్తామని స్పష్టం చేసింది.

రూ.40 వేలు జమ చేయాలి..

తాజా నిబంధనల ప్రకారం బుధవారం (23వ తేదీ) సాయంత్రంలోగా అర్హుల జాబితాలు సిద్ధం చేయాలని మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 26న శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జరిగే కార్యక్రమంలో ఈ ఏడాది వేట నిషేధ భృతి జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది ఎగ్గొట్టిన రూ.20 వేలు కూడా కలిపి రూ.40 వేలు జమ చేయాలని మత్స్యకార సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్ సవాళ్లకు సిద్ధమవ్వాలి

- అప్పిలేట్ ట్రిబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఏపీటీఈఎల్) పటిష్టం కావాలి
- డిస్కంల ఆర్థిక పరిస్థితులను సరిదిద్దడానికి చర్యలు చేపట్టాలి
- మంత్రుల బృందం సమావేశంలో కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్ సూచన

సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్ సవాళ్లకు సిద్ధమవ్వాలని కేంద్ర విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ సూచించారు. విద్యుత్ రంగ సంస్కరణలపై మంత్రుల బృందం 4వ సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. దీనికి నాయక్‌తో పాటు ఉత్తర ప్రదేశ్ మంత్రి అరవింద్ కుమార్ శర్మ, రాజస్థాన్ మంత్రి హీరాలాల్ నగర్, మహారాష్ట్ర సహాయ మంత్రి మేఘన సకోర్ బోర్డికర్, ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఇంధన శాఖ సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సో నాయక్ మాట్లాడారు. డిస్కంల సమస్యలను అధిగమించడానికి సమన్వయంతో సంస్కరణలు చేపట్టాలన్నారు. రెగ్యులేటరీ సంస్కరణలు, రుణ రూపకల్పన, పునరుత్పాదక విద్యుత్, విద్యుత్ నిల్వ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. టారిఫ్ సమీక్షతో పాటు అప్పిలేట్ ట్రిబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఏపీటీఈఎల్) వంటి సంస్థలను శక్తిమంతం చేయడం, టారిఫ్ ఆర్డర్లు, నెట్ మీటరింగ్ విధానాలను సరళీకృతం చేయాలని సూచించారు. ఈ విధానాలతో డిస్కంలను నష్టాల బారినుంచి గట్టెక్కించవచ్చునన్నారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పంపిణీ నెట్‌వర్క్‌లను ఆధునీకరించడం, మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్) అమలును వేగవంతం చేయాలని మంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ, విద్యుత్ రంగానికి అవసరమైన ఆర్థిక స్థిరత్వం కోసం వ్యయాధారిత టారిఫ్ విధానం అనివార్యమని స్పష్టం చేశారు. ఆర్థిక భారం తగ్గించేందుకు డిస్కంలు చేసిన అప్పులపై వడ్డీ రేట్లు తగ్గించాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

మా పంచాయతీ.. మా గౌరవం

- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రేపు ప్రత్యేక గ్రామసభలు
- మంగళగిరిలో రాష్ట్రస్థాయి సదస్సు

సాక్షి, అమరావతి : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం 'పాలనా వికేంద్రీకరణకు గుర్తు గా మా పంచాయతీ–మా గౌరవం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేక వేడుకలు నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. ఈమేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో వందేళ్ల నాటి కట్టడాలతో పాటు ఇప్పటికి కొనసాగుతున్న సంస్కృతి సంప్రదాయల ఫొటోలతో విలేజీ సైనేజ్ (గ్రామ స్థాయి) బోర్డులను ఏర్పాటుకు చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ వేడుకల నిర్వహణకు గ్రామ పంచాయతీలు రూ. 1000, మండల పరిషత్ రూ. 10 వేలు, జిల్లా పరిషత్ రూ. 25 వేల మేర సొంత నిధులను ఖర్చు పెట్టుకునేందుకు అనుమతి ఇస్తున్నట్టు వివరించారు.

మంగళగిరిలో రాష్ట్ర స్థాయి సదస్సు

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి సదస్సు జరగనుంది. ఇందులో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక సంస్థలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొనే అవకాశం ఉందని వారు తెలిపారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి

ఏపీ ఎస్టీయూ, ఏపీఎంఎస్ ఎస్టీయూ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 55 మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు,, ఉపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), ఏపీ మోడల్ స్కూళ్ల స్టేట్ టీచర్స్ యూనియన్ (ఏపీఎంఎస్ ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 75 శాతం కంటే తక్కువ ఫలితాలు వచ్చాయనే కారణంతో సిబ్బందికి నోటీసులు ఇవ్వడం సరికాదని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఏపీఎంఎస్ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మోహన్‌రెడ్డి, టి.వి.మార్కండేయ అన్నారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి తమిళనాడు చర్యలు భేష్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: చెన్నైలోని తమిళనాడు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. సూక్ష్మ, చిన్న సంస్థలకు వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమాలను అందించడంలో ఇన్‌స్టిట్యూట్ అవలంబించిన ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించిన ఇంక్యుబేషన్ కేంద్రాలను అభివృద్ధి చేయడంలో ఇన్‌స్టిట్యూట్ ఇన్ ఇన్నోవేషన్ వోచర్ ప్రోగ్రామ్ తీసుకున్న చొరవలను తెలుసుకోవడానికి తమిళనాడు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ..తమిళనాడు ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను బాగా ప్రోత్సహిస్తుందన్నారు.

'తల్లీ బిడ్డ' డ్రైవర్ల వేతనాన్ని రూ.18,550కి పెంచాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ×తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్׳ విభాగంలో పనిచేస్తున్న 500 మంది కెప్టెన్లకు(డ్రైవర్లు) రూ.18,500 వేతనం చెల్లించేలా కొత్త యాజమాన్యానికి ఆదేశాలివ్వాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్‌కు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అరబిందో యాజమాన్యం ప్రస్తుతం నెలకు రూ.8,800 వేతనం మాత్రమే చెల్లిస్తోందని తెలిపారు. వేతన పెంపుతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కొత్త యాజమాన్యం సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీక్లీ ఆఫ్‌లు, పండుగ సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాల్లో చనిపోయిన వారికి బీమాతో పాటు కనీసం రూ.7లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సంఘం గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అధ్యక్షుడు బసవరాజు విజ్ఞప్తి చేశారు.


ఏడీసీఎల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) లో ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు అధికారుల పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు ప్రాతిపదికపై ఏడాదిపాటు వారి సేవలను వినియోగించుకోనున్నట్టు పేర్కొన్నారు. ఏడాదిపాటు పదవీకాలం పొడిగింపు పొందిన వారు ఏడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ టి.మోజెస్ కుమార్, పశుసంవర్థక శాఖకు చెందిన జీవీ రామకృష్ణ (అకౌంట్స్), తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్యం విభాగ ఎస్ఈ ఎ.ఉదయ్ కుమార్, ఆర్అండ్‌బీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీ ప్రకాశ్‌రావు, వీఎంసీలో ప్రజారోగ్య విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నారాయణ మూర్తి ఉన్నారు.

పోలీసులు, మేజిస్ట్రేట్లు సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు

వీరిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేర తగిన చర్యలు తీసుకోండి

- ఏడేళ్ల లోపు శిక్షపడే కేసుల్లో కూడా యాంత్రికంగా రిమాండ్ విధిస్తున్నారు
- మేజిస్ట్రేట్లు తగిన కారణాలను కూడా వెల్లడించడం లేదు
- ఇది అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించడమే
- ఇలా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులకు సుప్రీం చెప్పింది
- తమ ఆదేశాల అమలును పర్యవేక్షించాలని కూడా సూచించింది
- లోపభూయిష్ట ఉత్తర్వులను తమ దృష్టికి తీసుకొస్తే హైకోర్టుపై చర్యలు తీసుకుంటామంది
- అందుకే ఏయే కేసుల్లో నిబంధనలు పాటించలేదో మీ దృష్టికి తీసుకొస్తున్నా
- దాని ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోండి–హైకోర్టుకు ఫిర్యాదు చేసిన
- సోషల్ మీడియా యాక్టివిస్ట్ హరీశ్వర్‌రెడ్డి
- ఈ ఫిర్యాదును సీజే ముందుంచుతామన్న రిజిస్ట్రీ



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు, మేజిస్ట్రేట్లు సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ సోషల్ మీడియా యాక్టివిస్ట్ మునగాల హరీశ్వర్‌రెడ్డి మంగళవారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు ఫిర్యాదు చేశారు. వీరిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేర చర్యలు తీసుకోవాలని కోరారు. హరీశ్వర్‌రెడ్డి తరఫున ఆయన న్యాయవాదులు కాసా జగన్‌మోహన్‌రెడ్డి, కె.జానకిరామిరెడ్డి, యర్రంరెడ్డి నాగిరెడ్డి, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, పొన్నపురెడ్డి శశివర్ధన్‌రెడ్డి, పాపుడిప్పు శశిధర్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు కాపీని రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందజేశారు. పోలీస్ అధికారులు, అలాగే మేజిస్ట్రేట్‌లు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ధిక్కరించి, ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాలలోనూ నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపుతున్నారని హరీశ్వర్‌రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై కూడా తిరుపతి తూర్పు పోలీసులు పలు సెక్షన్ల కింద తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారని, ఈ సెక్షన్లన్నీ ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష పడేవేనన్నారు. అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా పోలీసులు తనను అరెస్ట్ చేశారని తెలిపారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మేజిస్ట్రేట్ తగిన కారణాలను వెల్లడించకుండా యాంత్రికంగా తనను రిమాండ్‌కు పంపారని హరీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కనీస స్థాయిలో కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

తమ ఆదేశాల అమలును హైకోర్టులు పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు చెప్పింది

తాను కేంద్ర కారాగారంలో ఉన్నప్పుడు ఇలాంటి కేసులు ఎన్నో జరిగినట్లు తెలిసిందని హరీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సుప్రీం ఆదేశాలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా పోలీసులు పలువురిని అరెస్ట్ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. తమ మార్గదర్శకాల అమలును దేశంలోని అన్నీ హైకోర్టులు పర్యవేక్షించాలని, వాటిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంతేందర్ కుమార్ అన్టిల్ వర్సెస్ సీబీఐ కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హైకోర్టు సైతం చెప్పింది..

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సైతం బొల్లినేని రాజగోపాల్ నాయుడు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొందన్నారు. 'సీఆర్‌పీసీ సెక్షన్ 167 ప్రకారం రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసే ముందు మేజిస్ట్రేట్లు తమ సంతృప్తిని రికార్డ్ చేయాలి. వాస్తవాల విషయంలో నిష్పాక్షికంగా ఆలోచించి, కారణాలతో కూడిన ఉత్తర్వు ఇవ్వాలి. దీనికి విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా తీవ్రంగా పరిగణిస్తాం. మేజిస్ట్రేట్లు లోపభూయిష్టమైన రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని నిందితులు కానీ, వారి తరఫున ఇతరులు గానీ హైకోర్టు దృష్టికి తీసుకొస్తే ఆ మేజిస్ట్రేట్లపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం' అని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఆదేశాలను ఉల్లంఘించిన విచారణాధికారులు, మేజిస్ట్రేట్ల వివరాలను కేసుల వివరాలతో సహా ఈ ఫిర్యాదుకు జత చేస్తున్నానని, వాటిని పరిశీలించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన రిజిస్ట్రీ దీనిని ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచుతామని హరీశ్వర్‌రెడ్డి న్యాయవాదులకు చెప్పినట్లు తెలిసింది. మొత్తం 149 కేసులకు సంబంధించిన వివరాలను, ఆయా మేజిస్ట్రేట్ కోర్టుల వివరాలను హరీశ్వర్‌రెడ్డి తన ఫిర్యాదుతో జత చేశారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 72,937 మంది స్వామివారిని దర్శించుకోగా 24,157 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ స్పష్టం చేసింది.

తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ ప్రారంభం

తిరుపతి కల్చరల్: మంత్ర పీఠ పీఠాధిపతి స్వామి నరసింహ సింహాయజులు ఆధ్వర్యంలో మంగళవారం భారతీయ విద్యా భవన్ ప్రాంగణం నుంచి అలిపిరి వద్దకు చేరుకుని అక్కడ నుంచి తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్‌సింగ్ కులస్తే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి తిరుమల సప్తగిరుల ప్రదక్షిణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్ర పీఠ పీఠాధిపతి స్వామి నరసింహ సింహాయజులు మాట్లాడుతూ అలిపిరి వద్ద ఆరంభమైన ఈ ప్రదక్షిణ భాకరాపేట, రాయచోటి, రాజంపేట మీదుగా తిరుపతిలోని కపిలతీర్థంకు చేరుకొని కపిలేశ్వరుని దర్శనానంతరం కొండ హారతి చేపట్టడంతో ఈ ఆధ్యాత్మిక తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ పరిసమాప్తమవుతుందని తెలిపారు.

ఏఐతో భావి తరాలకు సంస్కృత జ్ఞానం

తిరుపతి సిటీ: కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మెషిన్ లెర్నింగ్‌తో భావితరాలకు సంస్కృత జ్ఞానాన్ని అందించవచ్చని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సీ-డాక్ సంస్థ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే అంశంపై మంగళవారం రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ ఎన్ఈపీ-2020 ప్రకారం నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

తిరుపతి సిటీ: భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి పిలుపునిచ్చారు. మహిళా వర్సిటీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో జీవరాశులన్నీ భూమిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నాయని, బాధ్యతగా భూమిని కాపాడుకోవాలన్నారు. వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుతూ భూమికి పునర్జీవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రీన్ ఆంధ్ర చాలెంజ్–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సాగుబడి

అశ్వని కార్తె: ఏప్రిల్ 26 వరకు
భరణి కార్తె: 27 నుంచి





ఎడారిపై ఆకుపచ్చని సంతకం!

'సెకెమ్' కథ తెలుసుకోవటం అంటే.. ఎడారిలో ఒయాసిస్సు వంటి పచ్చని సేంద్రియ పంట పొలాలను సృష్టించటం ద్వారా జీవితేచ్ఛకు కొత్త ఊపిర్లూదటమే. ఈజిప్టులో బయోడైనమిక్ అనే ఓ రకం సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా ఇసుక రేణువులకు తిరిగి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న ఓ ప్రైవేటు సంస్థ 'సెకెమ్'. సెకెమ్ అంటే స్థానిక భాషలో 'సూర్యుని తేజస్సు' అని అర్థం. ఇది 47 ఏళ్ల క్రితం ఏర్పడింది. రసాయనిక వ్యవసాయం వల్ల ఏటేటా పంట భూములు పూర్తి స్థాయి ఎడారి ఇసుక దిబ్బలుగా నిర్జీవమవుతూ ఆ నేలలో ఆహారోత్పత్తి భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చుతున్న సంక్షోభ దశలో సెకెమ్ పుట్టింది. తాను సేంద్రియ సాగు చేస్తూ రైతులకు నేర్పిస్తోంది. వారు పండించిన పంటను రూపం మార్చి విక్రయిస్తూ విలువలతో కూడిన సేంద్రియ ఆహారోత్పత్తి, సరఫరా వ్యవస్థలకు చిరునామాగా మారింది. పారిశ్రామిక వ్యవసాయ పద్ధతుల వల్ల ఎడారిగా మారిన భూమిని బయోడైనమిక్ వ్యవసాయం ద్వారా పునరుజ్జీవింపజేస్తోంది. ఏప్రిల్ 22న ధరిత్రీ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా నేలతల్లికి ప్రణమిల్లి గుణాత్మకమైన మార్పు తెస్తున్న సెకెమ్ కృషి గురించి తెలుసుకోవటానికి మించిన స్ఫూర్తిదాయకమైన కథ, రైతులకే కాదు సమాజంలో ప్రతి ఒక్కరికీ, మరొకటి ఉండదంటే అతిశయోక్తి కాదు!

● మనసుంటే మార్గం ఉంటుంది: ఈజిప్టు ఎడారిలో అద్భుతంగా సాగుతున్న బయోడైనమిక్ / సేంద్రియ సేద్యం...







సెకెమ్ కథ ఈజిప్టు ఎడారిలో ఒక టెంట్, ట్రాక్టర్, పియానోతో ప్రారంభమవుతుంది. 1977లో ఇబ్రహీం అబౌలీష్ ఈ సామాజిక స్పృహ ఉన్న సంస్థను ప్రారంభించారు. 20 సంవత్సరాలు విదేశాల్లో రసాయన శాస్త్రం, ఔషధ శాస్త్ర రంగంలో పనిచేసిన తర్వాత ఆయన ఈజిప్టుకు తిరిగి వచ్చారు. ఆ సమయంలో, ఈజిప్ట్ సంక్షోభ స్థితిలో ఎదుర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న జనాభాకు మరింత ఆహారోత్పత్తి చేయాల్సిన పరిస్థితుల్లో వ్యవసాయ రంగం కునారిల్లుతోంది.

వ్యవసాయ భూములు ఎడారిగా మారిపోతున్నాయి. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వినియోగం నేలలను విషపూరితం చేసింది. కాబట్టి, రాజధాని కైరోకు ఈశాన్యంగా ఉన్న ఎడారి ప్రాంతంలో అబౌలీష్ ఒక టెంట్‌లో సెకెమ్‌ను స్థాపించారు. ప్రకృతి, మానవ అభివృద్ధి, ఆధ్యాత్మికతల మధ్య సామరస్యాన్ని నొక్కి చెబుతూ.. సేంద్రియ వ్యవసాయం ద్వారా దాన్ని సాధించాలని సెకెమ్ బలంగా నమ్మింది.

బయోడైనమిక్ సేద్యం దిశగా 40 వేల మంది రైతులు

అబౌలీష్ మొదటి రెండు పెట్టుబడులు ట్రాక్టర్, పియానో! 2017లో ఇబ్రహీం అబౌలీష్ మరణించిన తర్వాత అతని కుమారుడు హెల్మీయే సంస్థను నడిపిస్తున్నారు. మానవాళిని ప్రకృతితో తిరిగి అనుసంధానించడంలో 'భావోద్వేగాలు, భావాల' ప్రాముఖ్యతకు పియానో ఓ ప్రతీక అంటారు సెకెమ్ ప్రస్తుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న హెల్మీ. స్థాపితమైన 47 సంవత్సరాల తర్వాత సెకెమ్ ఒక బహుముఖ అభివృద్ధి సంస్థగా వికసించింది. ఇది ఎడారీకరణను ఎదుర్కోవడానికి, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించడానికి, గ్రామీణ పేదరికాన్ని పరిష్కరించడానికి, వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించడానికి సహాయపడుతోందని యుఎన్‌ఇపి ప్రశంసించింది. 15,000 మంది రైతులు 19,000 హెక్టార్ల వ్యవసాయ భూములను 2022 నాటికే బయోడైనమిక్ వ్యవసాయంలోకి మార్చడానికి తోడ్పడింది.

ఈజిప్షియన్ బయోడైనమిక్ అసోసియేషన్ భాగస్వామ్యంతో 2025 చివరి నాటికి 40,000 మంది రైతులు బయోడైనమిక్ వ్యవసాయంలోకి మారడానికి సహాయం చేయాలని సెకెమ్ లక్ష్యంగా పెట్టుకుంది. 2028 నాటికి 2,50,000 మంది రైతులకు చెందిన 16 లక్షల ఎకరాలను బయోడైనమిక్ వ్యవసాయంలోకి మార్చే దిశగా కృషి చేస్తోంది.

అంతేకాదు, 1,000 హెక్టార్ల ఎడారిని తీసుకొని, అందులో ఆహార స్వయం సమృద్ధిగల సమాజాన్ని స్థాపించే ప్రయత్నంలో సెకెమ్ ఉంది. ఈజిప్ట్ భూమిలో 96 శాతం ఎడారిగా ఉంది. అందుకే ఎడారిని తిరిగి పచ్చని పంట భూమిగా మార్చే ఈ కార్యక్రమానికి 'గ్రీనింగ్ ది డెజర్ట్' అని పేరు పెట్టింది. వాతావరణాన్ని అతిగా వేడెక్కిస్తున్న కర్బనాన్ని గాలిలో నుంచి భూమిలో స్థిరీకరింపజేయటం ద్వారా పది వేల మంది ప్రజలకు రసాయన రహిత ఆహారం ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుంది.

గుడారం నుంచి విశ్వవిద్యాలయం వరకు...

ఎడారిలో ఒక గుడారంలో ప్రారంభమైన సెకెమ్ ప్రయాణం ప్రముఖ అభివృద్ధి సంస్థగా పురోభివృద్ధి సాధించింది. పాఠశాలలు, శిక్షణా కేంద్రాలతో పాటు ఏకంగా సొంతంగా ఓ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. ఎడారీకరణను, భూముల రసాయనీకరణను ఎదుర్కోవడానికి రైతులను, యువతను శిక్షణతో, మార్గదర్శకత్వంతో సమాయత్తం చేస్తోంది.

సెకెమ్ సేంద్రియ ఉత్పత్తులకు 'ఎకానమీ ఆఫ్ లవ్' పేరిట ప్రత్యేక సర్టిఫికేషన్ వ్యవస్థను నెలకొల్పింది.

ఈ ఉత్పత్తులను దేశ విదేశాల్లో విక్రయిస్తుంది. యూరోపియన్ బ్యాంకులు, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో ఈజిప్టులో బయోడైనమిక్ వ్యవసాయ పద్ధతి విస్తరణకు అవసరమైన నిధులను సేకరిస్తూ ఉంటుంది. సేంద్రియ వ్యవసాయంతో పాటు సహజ ఔషధాలు, వస్త్రాలు, ప్రకృతికి అనుగుణమైన జీవనశైలిని వ్యాపింపజేయటం కోసం సెకెమ్ ప్రత్యేక సంస్థలను నెలకొల్పటం విశేషం.

2017లో ఇబ్రహీం అబౌలీష్ మరణించిన తర్వాత సంస్థ సారధ్య బాధ్యతలు చేపట్టిన హెల్మీ అబౌలీష్ సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. 2057 నాటికి ఈజిప్టులోని 70 లక్షల రైతుల పొలాలను బయోడైనమిక్ వ్యవసాయంలోకి మార్చాలన్నది అందులో ముఖ్యమైనది.

పురస్కారాల వరద

వజ్రసంకల్పంతో ఇసుకలో పచ్చని పంటలు పెంచుతున్న సెకెమ్‌కు అంతర్జాతీయంగా పేరెన్నికగన్న ప్రతిష్టాత్మక అవార్డులెన్నో వచ్చాయి. గతంలోనే రైట్ లైవ్‌లీహుడ్ అవార్డు వచ్చింది. 2024లో గుల్బెంకియన్ హ్యూమానిటీ పురస్కారం వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేస్తున్న రైతు సాధికార సంస్థతో కలసి సెకెమ్ ఈ పురస్కారాన్ని పంచుకోవటం విశేషం. ఐక్యరాజ్యసమితికి చెందిన పర్యావరణ విభాగం (యుఎన్‌ఇపి) ప్రతిష్టాత్మక పురస్కారం 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్–2024' ఇటీవల లభించింది. ప్రతి సంవత్సరం 2 కోట్ల టన్నుల ఆహారా ధాన్యాలను ఉత్పత్తి చేయగల 1.2 కోట్ల హెక్టార్ల భూమి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కరువు, ఎడారీకరణ కారణంగా నష్టపోతున్నట్లు యుఎన్‌ఇపి తెలిపింది. నిస్సారమైన భూములను, ఎడారులను సేంద్రియ పర్యావరణ వ్యవస్థలుగా పునరుజ్జీవింప చేయడానికి సెకెమ్ పాటుపడుతున్నదని ఈ సంస్థ పేర్కొంది.

ఎడారిలో జీవాన్ని సృష్టిస్తున్నాం.. 'మిషన్ ఇంపాసిబుల్'నే ఇష్టపడతాం!



'ఈజిప్ట్ భూమిలో 96 శాతం ఎడారి. 50 ఏళ్ల క్రితం తలసరి సాగు భూమి విస్తీర్ణం 600 క్యూబిక్ మీటర్లు ఉండేది. ఇప్పుడది 300 క్యూటిక్ మీటర్లకు తగ్గిపోయింది. ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయాన్ని సమూలంగా మార్చగలమని నిరూపించాలని మా నాన్న సంకల్పించారు. ప్రేమతో కూడిన ఆర్థిక వ్యవస్థ'ను నిర్మించాలని మా నాన్న కలగన్నారు. ఇది శూన్యమైన ఎడారిలో జీవాన్ని సృష్టించటం లాంటిదే. అత్యంత అరుదైన నీటిని పొదుపుగా వాడుతున్నాం. కంపోస్టు సహాయంతో ఇసుకలో పంటలు పండిస్తున్నాం. సోలార్ విద్యుత్తును వాడుతున్నాం. ఎడారిని ఆకుపచ్చగా మార్చుతున్నాం. కార్బన్ క్రెడిట్స్ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుతున్నాం. 2057 నాటికి దేశంలో 70 లక్షల మంది రైతులను బయోడైనమిక్ సేద్యంలోకి మార్చాలన్నది లక్ష్యం. మేం ఈ మైలురాయిని చేరుకోకపోతే మా పరమ లక్ష్యం నెరవేరదు. ఇది అసాధ్యమని చాలా మంది అన్నారు. కానీ, అసాధ్యమైన దాన్ని సుసాధ్యం చేయటంలో మేం నిపుణులం. మిషన్ ఇంపాసిబుల్‌నే మేం ఇష్టపడతాం..'

– హెల్మీ అబౌలీష్,
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సెకెమ్, ఈజిప్టు

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్

ఆస్మోటిక్ డీహైడ్రేషన్ బెస్ట్



బొప్పాయి, జామ, ఉసిరి వంటి పండ్లకు మార్కెట్ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు తెగనమ్ముకోకుండా లేదా వృథాగా పారేయకుండా వాటిని ఎండబెట్టి నిల్వ ఉండే వివిధ ఉత్పత్తులుగా మార్చితే రైతులకు మంచి అదనపు ఆదాయం చేకూరుతుంది. ఎండబెట్టే క్రమంలో ఆస్మోటిక్ డీహైడ్రేషన్ ప్రక్రియ మేలైనదని, తద్వారా అనేక విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చని బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా స్థానం (ఐఐహెచ్ఆర్) చెబుతోంది.

బొప్పాయి ఫ్రూట్ బార్ తయారీ విధానం

బొప్పాయి మన దేశంలో ఒక ముఖ్యమైన పంట. అద్భుతమైన వాసన, రుచి, విటమిన్ ఎ, సిలకు ఇది పెట్టింది పేరు. బొప్పాయికి మార్కెట్‌లో గిరాకీ లేనప్పుడు దూరప్రాంతాలకు ఖర్చులు భరించి రవాణా చేయటం కష్టం. అందువల్ల కోత అనంతర నష్టం బొప్పాయిలో చాలా ఎక్కువ. కొన్నిసార్లు చిన్న కాయలు లేదా బాగా పెద్ద కాయలను మార్కెట్‌లో అమ్మటం కష్టమవుతుంది. అటువంటప్పుడు రైతులు బొప్పాయి ఫ్రూట్ బార్ (బొప్పాయి తాండ్ర)ను తయారు చేసి అమ్ముకోవచ్చు. ఫ్రూట్ బార్‌లు పోషకవంతమైనవి. చూపులకు నచ్చుతాయి. రుచిగా ఉంటాయి. రవాణా చేయటం సులభం. ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. అయితే, బొప్పాయి గుజ్జుతో తాండ్రను తయారు చేయటం మామిడి అంత తేలిక కాదు. దీన్ని తయారు చేసే క్రమంలో పగుళ్లు వస్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు ఒక ప్రాసెస్‌ను కనిపెట్టారు. నీటి శాతం తగ్గించి, తాండ్రగా మార్చడానికి ఇది ఉపయోగపడుతుంది. బొప్పాయి ఫ్రూట్ బార్ చక్కటి తాజా పండు మాదిరిగానే వాసన వస్తుంది. రూపం, రుచి కూడా బాగుంటాయి. దీన్ని చిరుతిండిగా తినొచ్చు. పిల్లలకు, పర్వతారోహకులకు, రక్షణ సిబ్బంది, సైనికులకు ఇది ఉపయోగకరం. ఈ డీహైడ్రేటెడ్ ప్రొడక్ట్‌ను చిన్న, సన్నకారు పరిశ్రమలతో పాటు మధ్యతరహా పరిశ్రమల్లోనూ తయారు చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా ప్రాసెసింగ్ యూనిట్లకు ఉపయోగపడేలా ఈ సాంకేతికతను రూపొందించినట్లు ఐఐహెచ్ఆర్ పేర్కొంది. కిలో ఫ్రూట్ బార్ తయారు చేయడానికి 7–8 కిలోల బొప్పాయి కాయలు అవసరమవుతాయి. ఇది సాధారణ పరిస్థితుల్లో ఆరు నెలలు నిల్వ ఉంటుంది.

జామ ముక్కల వొరుగుల తయారీ టెక్నాలజీ

జామ పండ్లలో గుజ్జు ఎక్కువ నీటితో కూడి తియ్యగా ఉంటుంది కాబట్టి తాజా పండ్లు తినటమే బాగుంటుంది. జామ పండు చక్కటి సువాసనతో పాటు విటమిన్ సిని కలిగి ఉంటుంది. అయితే, పండు చాలా త్వరగా పాడైపోతుంది. కాబట్టి, ప్రాసెస్ చేస్తే మంచి లాభదాయకం. జెల్లీ, జ్యూస్, ఫ్రూట్ బార్ వంటి ఉత్పత్తులను జామపండుతో తయారు చేయటం మనకు తెలుసు. అయితే, ఆస్మోటిక్ డైహైడ్రేసన్ పద్ధతిలో తొలుత నీటి శాతాన్ని తగ్గిస్తే.. పూర్తిస్థాయి ప్రాసెసింగ్, ఎయిర్ డ్రయ్యింగ్ చప్పున పూర్తవుతుంది. ఈ సాంకేతికత ద్వారా తెలుపు, గులాబీ రంగు గుజ్జు ఉండే జామ పండ్ల ముక్కలను డీహైడ్రేట్ చెయ్యొచ్చు. ఆస్మో–ఎయిర్ డ్రైడ్ ఫ్రూట్స్‌ను ఉత్పత్తి చేసే ప్రక్రియ చాలా వినూత్నమైన పద్ధతి. జామ ముక్కలకు తొలుత పంచదార పాకం కలపటం ఆస్మోటిక్ డీహైడ్రేషన్‌లో తొలి దశ. ఆ తర్వాత పాక్షికంగా నీరు తగ్గిన ముక్కలను హాట్ ఎయిర్ డ్రయ్యర్ ద్వారా తేమ శాతాన్ని 15% కన్నా తక్కువ తేమ ఉండేలా తయారు చేయాలి. ఇలా తయారైన జామ ఎండు ముక్కలను చిరుతిండిగా తినొచ్చు. లేదా ఇతర డ్రైఫ్రూట్స్‌తో కలిపి తినొచ్చు. దీన్ని ఐస్‌క్రీమ్ పరిశ్రమలో, ఫ్రూట్ సలాడ్లలో, ఖీర్‌లో, కేకులు, బేకరీ ఉత్పత్తుల్లో ఉపయోగించవచ్చు. పిల్లలకు, బరువైన వస్తువులు తీసుకెళ్లలేని పర్వతారోహకులకు, సైనికులకు ఎక్కువ ఉపయోగకరం. ఈ ప్రాసెస్ చాలా సులభం. పెద్ద యంత్ర పరికరాలేమీ అక్కర్లేదు. దీన్ని చిన్నసన్నకారు ప్రాసెసర్లు, మహిళా సంఘాలు, ఇతర స్వయం ఉపాధి పొందే వర్గాల వారు ఈ పద్ధతిని ఉపయోగించుకోవచ్చు. కిలో ఆస్మో–ఎయిర్ డ్రైడ్ జామ ఒరుగులు తయారు చేయటానికి 7–8 కిలోల జామ పండ్లు కావాలి. 6 నెలల నుంచి ఏడాది వరకు నిల్వ ఉంటాయి.



సహజ రంగుతో కూడిన వుసిరి ఒరుగులు

ఔషధ గుణాల పుట్ట అయిన ఉసిరికి ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంటుంది. అస్కార్బిక్ ఆసిడ్ అధిక పాళ్లలో కలిగిఉండటంతో పాటు యాంటీబయోటిక్, లాక్జేటివ్‌గా పనిచేసే గుణాలు దీనికి ఉన్నాయి. కోకుమ్ / మాంగోస్టీన్‌లో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి జీర్ణశక్తిని, ఆకలిని పెంచుతాయి. దీని రంగును ఉసిరి ఒరుగులకు పట్టిస్తే ఆకర్షణీయంగా ఉంటాయి. ఇటు ఉసిరి, అటు మాంగోస్టీన్‌లలో ఔషధగుణాలు ఎక్కువే గానీ అవి త్వరగా పాడైపోతాయి. వీటిని నేరుగా పండ్లను తినటం కష్టం. ప్రాసెస్ చేయాల్సిందే. కోకుమ్ జ్యూస్‌ను తీసి వుసిరి తొనలకు కలిపితే.. వుసిరి ఒరుగులకు మంచి ఎరుపు రంగుతోపాటు సువాసన వస్తాయి. ఆస్మోటిక్ పద్ధతిలో ఎండబెట్టిన వుసిరి తక్కువ అసిడిక్‌గా ఉంటాయి. రుచి బాగుంటుంది. ఎర్రటి ఈ ఒరుగులను విడిగా చిరుతిండిగా తినొచ్చు లేదా ఇతర డ్రై ఫ్రూట్స్‌తో కలిపి తినొచ్చు. పిల్లలకు, పర్వతారోహకులకు, సైనికులకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. కోకుమ్ రంగు కలిపిన ఉత్పత్తులు మార్కెట్‌లో లేవు. చిన్న తరహా ప్రాసెసింగ్ సదుపాయాలున్న వారు వీటిని తయారు చేసుకోవచ్చు. ఆస్మోటిక్ పద్ధతిలో ఎండబెట్టిన ఉసిరి ఉత్పత్తులు తాజా పండ్ల మాదిరిగానే ఉంటాయి. 4–5 కిలోల ఉసిరి పండ్లు, 2 కిలోల కోకుమ్ పండ్లు కలిపి తయారు చేస్తే ఓస్మో–ఎయిర్ డ్రైడ్ స్లైసెస్ తయారవుతాయి. జాగ్రత్తగా నిల్వ చేస్తే ఒక ఏడాది పాటు నిల్వ ఉంటాయి.



బిజినెస్ రీల్

360 వన్ చేతికి యూబీఎస్ వెల్త్

360 వన్‌లో యూబీఎస్‌కు 5% వాటా



న్యూఢిల్లీ: గ్లోబల్ సంస్థ యూబీఎస్‌కు చెందిన దేశీ వెల్త్‌మేనేజ్‌మెంట్ బిజినెస్‌ను ప్రయివేట్ రంగ కంపెనీ 360 వన్ కొనుగోలు చేయనుంది. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం స్విస్ దిగ్గజం యూబీఎస్ ఇండియా వారంట్ల కొనుగోలు ద్వారా 360 వన్‌లో 4.95 శాతం వాటా సొంతం చేసుకోనుంది. తాజా భాగస్వామ్యంతో రెండు సంస్థల క్లయింట్లు ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ వెల్త్ మేజేన్‌మెంట్ సొల్యూషన్లు పొందేందుకు వీలు చిక్కనున్నట్లు వన్ వెల్త్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్(360 వన్) ఒక ప్రకటనలో పేర్కొంది. రెండు సంస్థలు చేతులు కలపడం ద్వారా అసెట్ మేనేజ్‌మెంట్ ప్రొడక్టులు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీసులలో మరిన్ని అవకాశాలను అన్వేషించనున్నట్లు తెలియజేసింది.

అదానీ నుంచి ఎయిర్‌టెల్‌కు స్పెక్ట్రమ్

400 మెగాహెర్ట్జ్‌లో వినియోగ హక్కులు



న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్‌తో కలిసి అదానీ డేటా నెట్‌వర్క్స్(ఏడీఎన్ఎల్) నుంచి 400 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ వినియోగ హక్కులను కొనుగోలు చేయనున్నట్లు మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. 2022లో నిర్వహించిన వేలం ద్వారా 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్‌లో 400 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ ఏడీఎన్ఎల్ సొంతం చేసుకుంది. ఇందుకు రూ. 212 కోట్లు వెచ్చించింది. కాగా.. ఈ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు వీలుగా ఏడీఎన్ఎల్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఎయిర్‌టెల్ పేర్కొంది. దీనిలో భాగంగా గుజరాత్(100 ఎంహెచ్‌జెడ్), ముంబై(100 ఎంహెచ్‌జెడ్), ఆంధ్రప్రదేశ్(50 ఎంహెచ్‌జెడ్), రాజస్తాన్(50 ఎంహెచ్‌జెడ్), కర్ణాటక(50 ఎంహెచ్‌జెడ్), తమిళనాడు(100 ఎంహెచ్‌జెడ్)లో స్పెక్ట్రమ్‌ను వినియోగించుకోనున్నట్లు తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-4-2025

విశాఖ	425-00
చిత్తూరు	440-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

బోర్డు సమావేశాలు

ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, బయోకాన్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, టాటా కన్జూమర్, టాటా టెలీ సర్వీసెస్, ర్యాలీస్ ఇండియా, హడ్కో, కెన్ ఫిన్ హోమ్స్, సుప్రీం పెట్రో కెమికల్స్, ఖైతాన్ కెమికల్స్, ఎన్‌హెచ్‌పీసీ, 360 వన్, ఏఎన్ఎస్ ఇండస్ట్రీస్, ఆస్టెక్ లైఫ్‌సైన్సెస్, దాల్మియా భారత్, గుజరాత్ హోటల్స్, కోహినూర్ ఫుడ్స్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	432.85	2.36
HINDUNILVR	2,403.00	2.21
HDFCBANK	1,960.00	1.71
JIOFIN	250.6	1.71
M&M	2,811.10	1.7

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	788.55	-4.79
POWERGRID	313.25	-2.11
HEROMOTOCO	3,837.90	-2.02
INFY	1,423.00	-1.93
WIPRO	234	-1.87

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,028
ఎన్ఎస్ఈ	1,09,084
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,07,126
ఎఫ్ఐఐ	+ 1290
డీఐఐ	- 886

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.94 (రాత్రి 11.30కు)	$ 62.41 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.55 (రాత్రి 11.30కు)	$ 66.26 (క్రితం ముగింపు)

భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

- సాంకేతిక సహకార అవకాశాలు అందిపుచ్చుకోండి
- ఐటీ దిగ్గజాలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపు



శాన్‌ఫ్రాన్సిస్కో: భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు భారీ అవకాశాలు ఉన్నాయని ఐటీ దిగ్గజాలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సాంకేతిక సహకారం, ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, ట్యూరింగ్ సీఈవో జొనాథన్ సిద్ధార్థ్, డేటా రోబో సీఈవో దేబాంజన్ సాహా తదితరులతో మంత్రి సమావేశమయ్యారు. మేకిన్ ఇండియా నినాదం కింద భారత్‌తో పాటు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఇక్కడ టెక్నాలజీని అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని థామస్ కురియన్ బృందాన్ని ఆమె కోరారు. భారత ఏఐ మిషన్‌ను ఈ సందర్భంగా కురియన్ ప్రశంసించారు. మరోవైపు, సిద్ధార్థ్‌తో సమావేశంలో కృత్రిమ మేథకు సంబంధించి భారత్ పాలసీలను మంత్రి వివరించారు. ఏఐ విభాగంలో భారతీయ సంస్థలతో కలిసి పనిచేయడంపై సిద్ధార్థ్ ఆసక్తి వ్యక్తం చేసినట్లు ఎక్స్‌లో ఆర్థిక శాఖ పోస్ట్ చేసింది. కృత్రిమ మేథలో సూపర్‌పవర్‌గా ఎదిగే సత్తా భారత్‌కి ఉందని, ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తాము కూడా భాగం కావాలని భావిస్తున్నట్లు నిర్మలా సీతారామన్‌కి దేబాంజన్ సాహా తెలిపారు. అటు వివిధ పెన్షన్ ఫండ్ మేనేజర్లు, ఇతర్రా సంస్థాగత ఇన్వెస్టర్లతో రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొన్నారు. ఇంధన రంగం, పర్యావరణహిత ప్రాజెక్టులు, గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ మొదలైన వాటిల్లో పెట్టుబడులు, భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలను ఆమె వివరించారు.

సంస్కరణల దన్ను..

వచ్చే రెండు దశాబ్దాల పాటు నిలకడగా వృద్ధి సాధించడమనేది సాహసోపేత సంస్కరణలతో పాటు దేశీయంగా సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై ఆధారపడి ఉంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితులను దీటుగా ఎదుర్కొనే విధంగా సంస్థల మధ్య భాగస్వామ్య ఒప్పందాలు ఉండటం కూడా కీలకమని హూవర్ ఇనిస్టిట్యూషన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె తెలిపారు. గత దశాబ్దకాలంగా ప్రభుత్వం పలు నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని, 20,000 పైగా నిబంధనలను సరళీకరించడంతో పాటు వ్యాపార చట్టాల్లో క్రిమినల్ సెక్షన్లను తగ్గించిందని, ప్రభుత్వ సర్వీసులను డిజిటలీకరించిందని మంత్రి పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేయడంతో పాటు ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంపొందించడం ద్వారా తయారీ రంగ ఆధారిత వృద్ధికి బాటలు వేసినట్లు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లయ్యే 2047 నాటికి సంపన్న దేశంగా ఎదగాలని భారత్ నిర్దేశించుకుందని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను విస్మరించకుండా దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

భారత్ వృద్ధి అంచనాలు డౌన్

6.2 శాతానికి కుదించిన ఐఎంఎఫ్



న్యూయార్క్: అంతర్జాతీయంగా అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాలను 6.5 శాతం నుంచి 6.2 శాతానికి కుదించింది. ప్రైవేట్ వినియోగం దన్నుతో భారత వృద్ధి అంచనాలు కాస్త స్థిరంగా ఉండగలవని వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్ (డబ్ల్యూఈవో)లో పేర్కొంది. 2025లో గ్లోబల్ వృద్ధి గత అంచనాల కన్నా 0.5 పర్సంటేజీ పాయింట్లు తక్కువగా 2.8 శాతంగా ఉండనుంది. 2026లో ఇది 3 శాతంగా ఉండొచ్చు. కెనడా, జపాన్, బ్రిటన్, అమెరికా అంచనాలను ఐఎంఎఫ్ కుదించింది. అమెరికా వృద్ధి గతంలో ఊహించిన దానికన్నా 2.7 శాతం కన్నా చాలా తక్కువగా 1.8% స్థాయిలో ఉంటుందని పేర్కొంది. విధానాలపరమైన అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, బలహీన డిమాండ్, ఊహించిన దానికన్నా వినియోగ వృద్ధి నెమ్మదిగా ఉండటం వంటి అంశాలు ఇందుకు కారణమని తెలిపింది.

ఐపీవో స్ట్రీట్

ఏథర్ ఎనర్జీ ఐపీవో 28న

- లిస్టింగ్‌కు ద్విచక్ర ఈవీ రెడీ
- ఓలా తదుపరి రెండో కంపెనీ



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 2,626 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.1 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి కొత్త ఆర్థిక సంవత్సరం(2025-26)లో తొలి పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 25న షేర్లను ఆఫర్ చేయనుంది. ఐపీవో ద్వారా మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులను సమీకరించాలని ఆశిస్తోంది. అంతేకాకుండా రుణ చెల్లింపులకూ నిధులను వెచ్చించనుంది. ఐపీవో ద్వారా దేశీ స్టాక్ ఎక్స్చేంజీలలో గతేడాది ఆగస్ట్‌లో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ద్విచక్ర ఈవీ కంపెనీగా ఏథర్ నిలవనుంది. ఓలా ఎలక్ట్రిక్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 6,145 కోట్లు అందుకున్న విషయం విదితమే.

మూన్ బెవరేజెస్ ఐపీవో యోచన

విస్తరణకు రూ. 4,000 కోట్లు



న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం కోక కోలా బాట్లర్ మూన్ బెవరేజెస్ పబ్లిక్ ఇష్యూ యోచనలో ఉంది. దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న సాఫ్ట్ డ్రింక్స్ మార్కెట్లో భారీగా విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఎంఎంజీ గ్రూప్ కంపెనీ వైస్‌చైర్మన్ అనంత్ అగర్వాల్ తెలియజేశారు. రానున్న మూడు, నాలుగేళ్లలో ఆదాయాన్ని రెట్టింపునకు పెంచుకోవాలని చూస్తున్నట్లు తెలియజేశారు. ఇందుకు వీలుగా ఇప్పటికే రూ. 4,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వెరసి కొత్త ప్లాంట్లు, సామర్థ్య విస్తరణ, కొత్త మార్కెట్లలో ప్రవేశం తదితరాలను చేపట్టనున్నట్లు వివరించారు. మరోవైపు పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో సైతం ఉన్నట్లు పేర్కొన్నారు. అస్సామ్‌లోని గువాహటి, ఒడిషాలోని రూర్కెలాలో ఏర్పాటవుతున్న ప్లాంట్లపై మరిన్ని పెట్టుబడులు వెచ్చించేందుకు ప్రణాళికలు వేసినట్లు తెలియజేశారు. దీంతో నిమిషానికి 7,000 బాటిళ్ల సామర్థ్యం జత కలవనున్నట్లు తెలియజేశారు.

ఐపీవోకు కాంటినుమ్ గ్రీన్

సెబీ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా కాంటినుమ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి అనుమతించింది. ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 1,250 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్ సంస్థ కాంటినుమ్ గ్రీన్ ఎనర్జీ హోల్డింగ్స్ రూ. 2,400 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. వెరసి కంపెనీ లిస్టింగ్ ద్వారా రూ. 3,650 కోట్లు సమీకరించనుంది. 2024 డిసెంబర్‌లో కంపెనీ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 1,100 కోట్లు అనుబంధ సంస్థలు తీసుకున్న కొన్ని రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2007లో ఏర్పాటైన కంపెనీ దేశీయంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో కార్యకలాపాలు కలిగి ఉంది. వీటి అభివృద్ధి, నిర్మాణం, నిర్వహణ తదితరాలను చేపడుతోంది. 2023-24లో కంపెనీ ఆదాయం 33 శాతం ఎగసి రూ. 1,294 కోట్లను తాకింది.

ఓవర్‌నైట్ ఫండ్స్ కటాఫ్‌టైమ్‌లో మార్పు



న్యూఢిల్లీ: ఓవర్‌నైట్ ఫండ్స్ (డెట్ మ్యూచువల్ ఫండ్స్)కు సంబంధించి కటాఫ్‌టైమ్‌లో సెబీ మార్పులు చేసింది. పనిదినంలో మధ్యాహ్నం 3 గంటల వరకు (కటాఫ్ టైమ్) వచ్చిన పెట్టుబడి అభ్యర్థనలకు అదే రోజు ముగింపు ఎన్ఏవీ (తదుపరి వ్యాపార దినం ముందు నాటి) వర్తిస్తుంది. 3 గంటల తర్వాత వచ్చిన దరఖాస్తులకు తదుపరి వ్యాపార దినం ఎన్ఏవీ ప్రకారం యూనిట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులకు సాయంత్రం 7 గంటలను కటాఫ్ టైమ్‌గా సెబీ నిర్ణయించింది. అంటే ఆలోపు వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులకు అదే రోజు ఎన్ఏవీ ప్రకారం యూనిట్లు కేటాయిస్తారు. ఈ కొత్త వేళలు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ ఓవర్‌నైట్ పథకాల యూనిట్లను తనఖా నుంచి విడిపించుకునేందుకు స్టాక్ బ్రోకర్లు, క్లియరింగ్ సభ్యులకు కొత్త మార్పులు అనుకూలించనున్నాయి. వీరు తమవద్దనున్న క్లయింట్ల నిధులను ఓవర్‌నైట్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటారు. తద్వారా ఇన్వెస్టర్ల నిధులకు రిస్క్ ఉండకపోగా, స్టాక్ బ్రోకర్లకు కొంత ఆదాయం కూడా లభిస్తుంటుంది.

ఓఎన్‌డీసీపై యూటీఐ మ్యూచువల్ ఫండ్స్



ముంబై: ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) నెట్‌వర్క్‌పై యూటీఐ మ్యూచువల్ ఫండ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫైనాన్షియల్ టెక్నాలజీ భాగస్వామి 'సైబ్రిల్లా' సహకారంతో ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌తో అనుసంధానమైనట్లు యూటీఐ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. ఆర్థిక సేవల విస్తృతి, పెట్టుబడుల సాధనాల అందుబాటును పెంచడానికి ఇది తోడ్పడుతుందని పేర్కొంది. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌తో అనుసంధానం కావడం ద్వారా మరింత మంది ఇన్వెస్టర్లకు తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు యూటీఐ ఎంఎఫ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వినయ్ లకోటియా తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ, ముఖ్యంగా టైర్-2, 3 పట్టణ వాసులకు ఓఎన్‌డీసీ ద్వారా తన మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల సేవలను చేరువ చేయాలన్న లక్ష్యంతో యూటీఐ మ్యూచువల్ ఫండ్స్ ఉంది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

టాటా కమ్యూనికేషన్స్ లాభం రెట్టింపు

క్యూ4లో రూ. 761 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపుపైగా వృద్ధితో రూ. 761 కోట్లను అధిగమించింది. సహచర కంపెనీకి చెన్నైలోని భూమిని విక్రయించడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 346 కోట్లు ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో 30 కోట్ల డాలర్ల(సుమారు రూ. 2,550 కోట్లు) పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది 27 కోట్ల డాలర్లు కేటాయించినట్లు తెలియజేసింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 6 శాతంపైగా పుంజుకుని రూ. 6,059 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 6 శాతం పెరిగి రూ. 5,723 కోట్లకు చేరాయి. చెన్నైలోని భూమి అమ్మడంతో రూ. 577 కోట్లమేర అదనపు లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్స్ సొల్యూషన్స్‌లో వాటా విక్రయం ద్వారా రూ. 311 కోట్లు అందుకున్నట్లు తెలియజేసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 23,238 కోట్ల ఆదాయం సాధించింది. మార్చికల్లా రూ. 9,377 కోట్ల రుణ భారం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టాటా కామ్ షేరు బీఎస్ఈలో 1.5 % బలపడి రూ. 1,598 వద్ద ముగిసింది.

మహీంద్రా లాజిస్టిక్స్ లాభం జూమ్

క్యూ4లో రూ. 13 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ కంపెనీ మహీంద్రా లాజిస్టిక్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 67 శాతం జంప్‌చేసి రూ. 13 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో దాదాపు రూ. 8 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,183 కోట్ల నుంచి రూ. 1,293 కోట్లకు బలపడింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 30 శాతం క్షీణించి దాదాపు రూ. 44 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 62 కోట్లు ఆర్జించింది. కాగా.. టర్నోవర్ 10 శాతం వృద్ధితో రూ. 5,013 కోట్లను తాకింది. 2023-24లో రూ. 4,530 కోట్ల ఆదాయం అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్ఎస్ఈలో 4 శాతం ఎగసి రూ. 310 వద్ద ముగిసింది.

ఏయూ ఎస్ఎఫ్‌బీ లాభం జూమ్

క్యూ4లో రూ. 504 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(ఎస్ఎఫ్‌బీ) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 504 కోట్లను తాకింది. ఇందుకు ఇతర ఆదాయం దోహదపడింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,385 కోట్ల నుంచి రూ. 5,031 కోట్లకు జంప్‌చేసింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) 57 శాతం దూసుకెళ్లి రూ. 2,094 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7 శాతం మెరుగుపడి 5.8 శాతానికి చేరాయి. పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 32 శాతం ఎగసి రూ. 2,106 కోట్లయ్యింది. 2023-24లో రూ. 1,591 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.67 శాతం నుంచి 2.28 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.55 శాతం నుంచి 0.74 శాతానికి పెరిగాయి. వెరసి ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 118 కోట్ల నుంచి రూ. 635 కోట్లకు భారీగా పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఏయూ స్మాల్ షేరు బీఎస్ఈలో 2.2 % క్షీణించి రూ. 613 వద్ద ముగిసింది.

హావెల్స్ రూ. 6 డివిడెండ్

క్యూ4 లాభం రూ. 517 కోట్లు



న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం వృద్ధితో రూ. 517 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 447 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం ఎగసి రూ. 6,544 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 5,442 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు షేరుకి రూ. 6 తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 16 శాతం పుంజుకుని రూ. 1,470 కోట్లను తాకింది. 2023-24లో రూ. 1,271 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం 17 శాతంపైగా బలపడి రూ. 22,081 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో హావెల్స్ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 1,665 వద్ద ముగిసింది.

రియల్టీలోకి ఏఐఎఫ్ పెట్టుబడుల వెల్లువ

- 2024 డిసెంబర్ నాటికి రూ.74వేల కోట్లు
- 15 శాతం రియల్ ఎస్టేట్‌లోకే
- అనరాక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలో ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్‌లు) పెట్టుబడులు 2024 డిసెంబర్ నాటికి రూ.73,903 కోట్లకు చేరాయి. రియల్ ఎస్టేట్ రంగ కన్సల్టెంట్ సంస్థ 'అనరాక్' ఏఐఎఫ్‌లకు సంబంధించి డేటాను విశ్లేషించి ఒక నివేదిక విడుదల చేసింది. గత డిసెంబర్ నాటికి ఏఐఎఫ్‌లు అన్ని రంగాల్లోనూ కలిపి రూ.5,06,196 కోట్లను ఇన్వెస్ట్ చేసినట్టు తెలిపింది. ఇందులో 15 శాతం మేర (రూ.73,903 కోట్లు) రియల్ ఎస్టేట్‌లోకి వచ్చాయని.. రంగాల వారీగా అత్యధిక పెట్టుబడులు రియల్టీకే దక్కినట్టు ఈ నివేదిక తెలిపింది. ''ఏఐఎఫ్‌లతో దేశ రియల్ ఎస్టేట్ ఫైనాన్సింగ్ (రుణ సదుపాయం) గణీయమైన మార్పునకు గురైంది. నిధుల్లేమితో ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్టులకు ఏఐఎఫ్ పెట్టుబడులు జీవాన్నిస్తున్నాయి. డెవలపర్లకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి''అని అనరాక్ తెలిపింది.

ఏ రంగంలోకి ఎంత మేర..

రియల్ ఎస్టేట్ తర్వాత అత్యధికంగా ఐటీ/ఐటీఈఎస్ రంగంలోకి రూ.30,279 కోట్ల ఏఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి. ఆ తర్వాత ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.26,807 కోట్లు, ఎన్‌బీఎఫ్‌సీ రూ.21,929 కోట్లు, బ్యాంకులు రూ.21,273 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్ఎంసీజీ రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఏఐఎఫ్ పెట్టుబడులను 2024 డిసెంబర్ నాటికి ఆకర్షించినట్టు అనరాక్ నివేదిక ఆధారంగా తెలుస్తోంది. ఇతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్ల ఏఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి. రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరంగా వివిధ దశల్లో ఉన్న నిధుల సమస్యకు ఏఐఎఫ్ రూపంలో పరిష్కారం లభించినట్టు అనరాక్ గ్రూప్ రీజినల్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ పేర్కొన్నారు. సంప్రదాయ నిధుల సమీకరణ మార్గాల్లో ఇబ్బందులకు ఈ రూపంలో పరిష్కారం లభించినట్టు చెప్పారు. ఏఐఎఫ్‌లు ప్రైవేటు ఈక్విటీ, హెడ్జ్ ఫండ్స్, రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇవి ఇన్వెస్టర్లకు అధిక రిస్క్‌తో కూడిన రాబడులను ఆఫర్ చేస్తుంటాయి. దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించి, తమ ప్రణాళికలకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతుంటాయి. గడిచిన దశాబ్ద కాలంలో సెబీ వద్ద నమోదైన ఏఐఎఫ్‌లు 36 రెట్లు పెరిగాయి. 2013 మార్చి నాటికి 42గా ఉన్నవి 2025 మార్చి 5 నాటికి 1,524కు పెరిగినట్టు డేటా తెలియజేస్తోంది.



సాక్షి ప్లస్
బుధవారం। 23-4-2025


షమీ, కమిన్స్


ముంబై జట్టు

ఉప్పల్‌లో సన్‌'రైజ్‌' అయ్యేనా?

- నేడు ముంబై ఇండియన్స్‌తో సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్‌ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్‌: ఐపీఎల్‌ 18వ సీజన్‌లో నిలకడ కనబర్చలేకపోతున్న సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ (ఎస్‌ఆర్‌హెచ్‌) మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఏడు మ్యాచ్‌లాడి 2 విజయాలు 5 పరాజయాలతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్‌... బుధవారం మరో మారు ముంబై ఇండియన్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. గత గురువారం వాంఖడే వేదికగా ముంబైతోనే తమ చివరి మ్యాచ్‌ ఆడిన ఎస్‌ఆర్‌హెచ్‌... స్వల్ప విరామం అనంతరం మరోసారి ముంబైతోనే తలపడుతోంది. ఈ సీజన్‌లో ఆడితే బ్రహ్మాండం... లేదంటే శూన్యం అన్నట్లు సాగుతున్న హైదరాబాద్‌... ప్లే ఆఫ్స్‌ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. జట్టులో లెక్కకు మిక్కిలి హిట్టర్లు ఉన్నా... వారంతా కలిసి కట్టుగా కదం తొక్కలేకపోతుండటమే ఎస్‌ఆర్‌హెచ్‌ను ఇబ్బంది పెడుతోంది. సొంతగడ్డపై బీభత్సం సృష్టించే ఆరెంజ్‌ ఆర్మీ... ఉప్పల్‌లో అయినా తిరిగి విజయాల బాట పట్టాలని చూస్తోంది. మరోవైపు గత మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ఫామ్‌లోకి వచ్చిన ముంబై ఇండియన్స్‌... అదే జోరు కొనసాగిస్తూ పాయింట్ల పట్టికలో పైపైకి దూసుకెళ్లాలని భావిస్తోంది. తాజా సీజన్‌లో ఆడిన తొలి 5 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయమే సాధించిన ముంబై ఇండియన్స్‌... ఆ తర్వాత గాడిన పడింది. స్టార్‌ పేసర్‌ బుమ్రా వచ్చాక బౌలింగ్‌ మరింత రాటుదేలగా... గత మ్యాచ్‌తో హిట్‌మ్యాన్‌ రోహిత్‌ శర్మ లయ అందుకున్నాడు. ఈ నేపథ్యంలో ఉప్పల్‌లో సన్‌రైజర్స్‌ పరుగుల ఉప్పెన సృష్టిస్తుందా లేక ముంబై గెలుపు జోరు కొనసాగుతుందా చూడాలి!

టాపార్డర్‌ రాణిస్తేనే...

గతేడాది నిలకడైన ప్రదర్శనతో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్‌ జట్టు... ఈసారి అదే తీవ్రత కొనసాగించలేకపోతోంది. తొలి పోరులో భారీ స్కోరు చేసి ప్రత్యర్థులను బెదరగొట్టిన రైజర్స్‌... ఆ తర్వాత మాత్రం పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటోంది. ఎస్‌ఆర్‌హెచ్‌ తరఫున ఆడిన తొలి పోరులోనే సెంచరీతో చెలరేగిన ఇషాన్‌ కిషన్‌ ఆ తర్వాత ఆకట్టుకోలేకపోతుండగా... గత సీజన్‌లో 'ఎమర్జింగ్‌ ప్లేయర్‌ అవార్డు' దక్కించుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్‌ నితీశ్‌ కుమార్‌ రెడ్డి పూర్తిగా విఫలమవుతూ ఉన్నాడు. ఓపెనర్లు అభిషేక్‌ శర్మ, ట్రావిస్‌ హెడ్‌పై జట్టు ఎక్కువగా ఆధారపడుతోంది. దానికి తగ్గట్లు వీరిద్దరు ఆడిన రోజు టీమ్‌ మొత్తం చెలరేగుతుండగా... ఓపెనర్లు విఫలమైన సందర్భంలో మాత్రం ఓ మాదిరి స్కోరు చేసేందుకు కూడా తడబడుతోంది. మిడిలార్డర్‌లో క్లాసెన్, అనికేత్‌ వర్మ మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ఇషాన్, నితీశ్‌ కూడా గాడిన పడాలని మేనేజ్‌మెంట్‌ ఆశిస్తోంది. అటు బౌలింగ్‌లోనూ రైజర్స్‌ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. కెప్టెన్‌ కమిన్స్‌తో పాటు టీమిండియా సీనియర్‌ పేసర్‌ మొహమ్మద్‌ షమీ, హర్షల్‌ పటేల్‌ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతుండగా... ఇషాన్‌ మలింగ, జీషన్‌ అన్సారీపై అధిక భారం పడుతోంది. ఇరు జట్ల మధ్య జరిగిన గత మ్యాచ్‌లో రైజర్స్‌ నిర్దేశించిన లక్ష్యాన్ని ముంబై అలవోకగా ఛేదించింది. అయితే అది వాంఖడేలోని కాస్త టర్నింగ్‌ పిచ్‌కాగా... ఉప్పల్‌ ఫ్లాట్‌ పిచ్‌పై ఎలాంటి ఫలితం వస్తుందనేది ఆసక్తికరం.

'హ్యాట్రిక్‌'తో జోరుమీదున్న ముంబై

ఎప్పట్లాగే ఈసారి కూడా పరాజయాలతోనే సీజన్‌ను ప్రారంభించిన ముంబై ఇండియన్స్‌... ఆ తర్వాత పుంజుకుంది. గత మూడు మ్యాచ్‌లను పరిశీలిస్తే.. ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్‌ హైదరాబాద్, చెన్నై సూపర్‌ కింగ్స్‌ (సీఎస్‌కే)పై హార్దిక్‌ పాండ్యా సారథ్యంలోని ముంబై విజయాలు సాధించింది. చెన్నైతో పోరు ద్వారా రోహిత్‌ శర్మ ఫామ్‌లోకి రావడం ఆ జట్టుకు అదనపు బలాన్నిస్తోంది. రోహిత్, సూర్యకుమార్‌ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో సీఎస్‌కే నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని ముంబై జట్టు 15.4 ఓవర్లలోనే అధిగమించింది. హైదరాబాదీ తిలక్‌ వర్మ, హార్దిక్‌ పాండ్యా, విల్‌ జాక్స్, నమన్‌ ధీర్‌తో మిడిలార్డర్‌ కూడా బలంగా ఉంది. బౌలింగ్‌లోనూ ముంబైకి పెద్దగా ఇబ్బందులు లేవు. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన స్టార్‌ పేసర్‌ బుమ్రా మునుపటి వేగం అందిపుచ్చుకోగా... బౌల్ట్, దీపక్‌ చహర్‌ అతడికి సహకరిస్తున్నారు. సాంట్నర్, అశ్వని కుమార్‌ మరోసారి కీలకం కానున్నారు. అయితే సొంతగడ్డపై ఎంతటి బౌలింగ్‌ బృందాన్ని అయినా చిత్తు చేయగల ఆరెంజ్‌ ఆర్మీ హిట్టర్లను ముంబై బౌలర్లు ఏమేరకు అడ్డుకుంటారనే దానిపైనే మ్యాచ్‌ ఫలితం ఆధారపడి ఉంది.

తుదిజట్లు (అంచనా)

సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌: కమిన్స్‌ (కెప్టెన్‌), అభిషేక్‌ శర్మ, హెడ్, ఇషాన్‌ కిషన్, నితీశ్‌ రెడ్డి, క్లాసెన్, అనికేత్‌ వర్మ, హర్షల్‌ పటేల్, షమీ, జీషాన్‌ అన్సారీ, ఇషాన్‌ మలింగ, రాహుల్‌ చహర్‌.

ముంబై ఇండియన్స్‌: హార్దిక్‌ పాండ్యా (కెప్టెన్‌), రోహిత్, రికెల్టన్, విల్‌ జాక్స్, సూర్యకుమార్, తిలక్‌ వర్మ, నమన్‌ ధీర్, సాంట్నర్, దీపక్‌ చహర్, కరణ్‌ శర్మ, బౌల్ట్, బుమ్రా.

10 సన్‌రైజర్స్‌ హైదరాబాద్, ముంబై ఇండియన్స్‌ మధ్య ఇప్పటి వరకు 24 మ్యాచ్‌లు జరగగా... అందులో హైదరాబాద్‌ జట్టు 10 విజయాలు సాధించింది. మరో 14 మ్యాచ్‌ల్లో ముంబై గెలుపొందింది.

వర్ధమాన క్రీడాకారులకు శివమ్‌ దూబే చేయూత

రూ. 70 వేల చొప్పున 10 మందికి ఆర్థిక సాయం

చెన్నై: భారత క్రికెట్‌ జట్టు ఆల్‌రౌండర్‌ శివమ్‌ దూబే ప్రతిభావంతులైన అథ్లెట్లు తమ ప్రదర్శన మెరుగు పరుచుకునేందుకు చేయూతనిచ్చారు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌ (సీఎస్‌కే) తరఫున కీలకపాత్ర పోషిస్తున్న దూబే తమిళనాడుకు చెందిన పది మంది క్రీడాకారులకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. తమిళనాడు క్రీడా జర్నలిస్టుల సంఘం (టీఎన్‌ఎస్‌జేఏ) ఆధ్వర్యంలో జరిగిన స్కాలర్‌షిప్, అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న దూబే ఒక్కొక్కరికి రూ. 70 వేల చొప్పున అందజేస్తానని ప్రకటించారు. 'ఆయా క్రీడల్లో సత్తా చాటుతున్న కుర్రాళ్లకు ఆర్థిక భరోసా కల్పించాలని తమిళనాడు క్రికెట్‌ సంఘం కార్యదర్శి డాక్టర్‌ బాబా సూచించారు. నిజంగానే క్రీడల్లో రాణించాలంటే అధునాతన కిట్స్, నాణ్యమైన కోచింగ్‌ ఎంతో అవసరమని గుర్తించే ఈ సాయం ప్రకటిస్తున్నా' అని దూబే చెప్పారు. మిగతా రాష్ట్ర సంఘాలు కూడా ఇలాంటి ప్రయోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అతను అభిలషించారు. తమిళనాడు క్రీడా జర్నలిస్టుల సంఘం కూడా ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. ఒక్కొక్కరు రూ.లక్ష సాయం పొందే జాబితాలో పీబీ అభినంద్‌ (టేబుల్‌ టెన్నిస్‌), కేఎస్‌ వెనిసా శ్రీ (ఆర్చరీ), ముత్తుమీనా వెళ్లసామి (పారా అథ్లెటిక్స్‌), షమీనా రియాజ్‌ (స్క్వాష్‌), ఆర్‌కే జయంత్, నంధన (క్రికెట్‌), కమలి (సర్ఫింగ్‌), అభినయ, ఆర్‌సీ జితిన్‌ అర్జునన్‌ (అథ్లెటిక్స్‌), తక్షంత్‌ (చెస్‌) ఉన్నారు.


శివమ్‌ దూబే

మహిళా చెస్‌ ప్లేయర్లకు రూ. కోటి ఫెలోషిప్‌

జాబితాలో సరయు, సాహితి వర్షిణి


సరయు


సాహితి వర్షిణి


వంతిక

హైదరాబాద్‌: అంతర్జాతీయ మాస్టర్‌ (ఐఎం) వంతిక అగర్వాల్‌ సహా ఐదుగురు భారత మహిళా చెస్‌ ప్లేయర్లు రూ. కోటి ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ప్రవాహ ఫౌండేషన్, చెస్‌ స్టార్టప్‌ ఎంజీడీవన్‌ సంస్థలు కలిసి '64 స్క్వేర్స్‌'ను స్థాపించాయి. ఈ 64 స్క్వేర్స్‌ భారత్‌లో మహిళల చెస్‌ అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తుంది. ఇందులో భాగంగా చెస్‌లో రాణిస్తున్న వంతిక (ఢిల్లీ), శుభి గుప్తా (ఢిల్లీ), చార్వి అనిల్‌కుమార్‌ (కర్ణాటక), వేల్పుల సరయు (తెలంగాణ), సాహితి వర్షిణి (ఆంధ్రప్రదేశ్‌)లను భారీ ఫెలోషిప్‌నకు ఎంపిక చేసింది. పెద్ద మొత్తంలో లభించే ఈ ప్రోత్సాహంతో క్రీడాకారిణిలు టోర్నమెంట్ల కోసం ప్రత్యేక శిక్షణ తీసుకునేందుకు, నిష్ణాతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో ఆటకు మరింత మెరుగులు దిద్దుకునేందుకు ఉపయోగపడనుంది. గతంలో ఇలాంటి ప్రోత్సాహకానికి 'అర్జున అవార్డీ' వంతిక ఎంపికైంది. 2023లో ఆమెకు ఈ విధమైన ఆర్థిక చేయూతవల్లే ఆమె అంతర్జాతీయ మాస్టర్‌గా ఎదిగింది. గతేడాది చెస్‌ ఒలింపియాడ్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది. ఇప్పుడు తాజా ఫెలోషిప్‌ అండతో ఆమె గ్రాండ్‌మాస్టర్‌గా ఎదిగేందుకు దోహదపడనుంది.

టైటిల్‌కు చేరువలో హంపి

పుణే: అంతర్జాతీయ చెస్‌ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌ ఐదో అంచె టోర్నమెంట్‌లో భారత స్టార్‌ గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్‌ క్రీడాకారిణి కోనేరు హంపి టైటిల్‌కు చేరువైంది. అలీనా కష్లిన్‌స్కాయ (పోలాండ్‌)తో మంగళవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌ గేమ్‌ను హంపి 61 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మరోవైపు చైనా గ్రాండ్‌మాస్టర్‌ జు జినెర్‌ 50 ఎత్తుల్లో భారత్‌కే చెందిన జూనియర్‌ ప్రపంచ చాంపియన్‌ దివ్య దేశ్‌ముఖ్‌ను ఓడించింది. ఎనిమిదో రౌండ్‌ తర్వాత హంపి, జు జినెర్‌ ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అయితే మెరుగైన టైబ్రేక్‌ స్కోరులో జు జినెర్‌పై హంపి పైచేయిగా ఉంది. నేడు జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో నుర్గుల్‌ సలీమోవా (బల్గేరియా)తో హంపి; పొలీనా షువలోవా (రష్యా)తో జు జినెర్‌ తలపడతారు. భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబు తమ ఎనిమిదో రౌండ్‌ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మెలియా సలోమి (జార్జియా)తో గేమ్‌ను హారిక 116 ఎత్తుల్లో... సలీమోవాతో గేమ్‌ను వైశాలి 47 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. బత్ఖుయాగ్‌ మున్‌గున్‌తుల్‌ (మంగోలియా), పొలీనా షువలోవా మధ్య జరిగిన మరో గేమ్‌ 91 ఎత్తుల్లో 'డ్రా' అయింది. ఎనిమిదో రౌండ్‌ తర్వాత దివ్య దేశ్‌ముఖ్‌ ఐదు పాయింట్లతో మూడో స్థానంలో, నాలుగు పాయింట్లతో హారిక ఐదో స్థానంలో, 3.5 పాయింట్లతో వైశాలి ఆరో స్థానంలో ఉన్నారు.



పోరాడుతున్న బంగ్లాదేశ్‌

- రెండో ఇన్నింగ్స్‌లో 194/4
- జింబాబ్వేతో తొలి టెస్టు

సిల్హెట్‌ (బంగ్లాదేశ్‌): సొంతగడ్డపై జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ పోరాడుతోంది. ఓవర్‌నైట్‌ స్కోరు 52/1తో మూడోరోజు మంగళవారం రెండో ఇన్నింగ్స్‌ కొనసాగించిన బంగ్లాదేశ్‌... చివరకు 57 ఓవర్లలో 4 వికెట్లకు 194 పరుగులు చేసింది. వర్షం కారణంగా అవుట్‌ ఫీల్డ్‌ చిత్తడిగా మారడంతో తొలి సెషన్‌ ఆట తుడిచిపెట్టుకుపోగా... ఆ తర్వాత బంగ్లా బ్యాటర్లు పట్టుదల కనబర్చారు. కెప్టెన్‌ నజ్ముల్‌ హుస్సేన్‌ షాంటో (103 బంతుల్లో 60 బ్యాటింగ్‌; 7 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... మహ్ముదుల్‌ హసన్‌ జాయ్‌ (33), మోమినుల్‌ హక్‌ (47) తలా కొన్ని పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్‌ ముజరబానీ 3 వికెట్లు పడగొట్టాడు. చేతిలో 6 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్‌... ప్రస్తుతం 112 పరుగుల ఆధిక్యంలో ఉంది. షాంటోతో పాటు వికెట్‌ కీపర్‌ జాకీర్‌ అలీ (60 బంతుల్లో 21 బ్యాటింగ్‌; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

అమన్‌ సివాచ్‌ ముందంజ

అమ్మాన్‌ (జోర్డాన్‌): ఆసియా అండర్‌–15, అండర్‌–17 బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పోటీల మూడో రోజు మంగళవారం బరిలోకి దిగిన ఇద్దరు బాక్సర్లలో అమన్‌ సివాచ్‌ విజయంతో ముందంజ వేయగా... అన్షుల్‌ ఖాసా పరాజయం పాలయ్యాడు. బాలుర అండర్‌–15 విభాగంలో 63 కేజీల పోరులో అమన్‌ సివాచ్‌ 4–1 పాయింట్ల తేడాతో అబూబకర్‌ దుషీవ్‌ (కిర్గిస్తాన్‌)పై విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన పోరులో భారత బాక్సర్‌ కీలక పాయింట్లు సాధించి రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఇక బాలుర అండర్‌–17 70 కేజీల పోరులో అన్షుల్‌ 0–5 పాయింట్లతో కున్యాశ్‌ ఉరుమ్‌బసార్‌ (కిర్గిస్తాన్‌) చేతిలో ఓడాడు.



ఢిల్లీలో 25 నుంచి ఆసియా యోగాసన

న్యూఢిల్లీ: ఆసియా యోగాసన స్పోర్ట్స్‌ చాంపియన్‌షిప్‌కు భారత్‌ ఆతిథ్యమివ్వబోతోంది. ఈ నెల 25 నుంచి 27 వరకు ఈ పోటీలు ఢిల్లీలో జరుగనున్నాయి. యోగాసన భారత్, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, భారత స్పోర్ట్స్‌ అథారిటీ (సాయ్‌) సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్‌ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 21 ఆసియా దేశాలకు చెందిన 170 మంది యోగాసన క్రీడాకారులు పాల్గొంటారు. 10 ఏళ్ల నుంచి 18 ఏళ్లు, 18–28 ఏళ్లు, 28–35 ఏళ్లు, 35–45 ఏళ్ల వయో విభాగాల్లో పోటీలు జరుగుతాయి. మంగళవారం ఈవెంట్‌కు సంబంధించిన ప్రాచుర్య గీతాన్ని, మస్కట్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగాసన భారత్‌ అధ్యక్షుడు ఉదిత్‌ సేథ్‌ మాట్లాడుతూ 'భారత్‌ ఈ యోగాసన క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకురావడంతో రోజురోజుకి ఆదరణ పెరుగుతోంది. భారత జట్టుకు ఆల్‌ ద బెస్ట్‌' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసియా యోగాసన అధ్యక్షుడు సంజయ్‌ మల్పాని, ప్రపంచ యోగాసన కార్యదర్శి జైదీప్‌ ఆర్య తదితరులు పాల్గొన్నారు. తొలి ఆసియా యోగాసన పోటీలకు థాయ్‌లాండ్‌ ఆతిథ్యమిచ్చింది. 2022లో ఈ పోటీలు బ్యాంకాక్‌లో జరిగాయి.

మానస్‌ ఓటమి



న్యూఢిల్లీ: మాడ్రిడ్‌ ఓపెన్‌ మాస్టర్స్‌ సిరీస్‌–1000 టెన్నిస్‌ టోర్నీ క్వాలిఫయింగ్‌ విభాగంలో భారత రైజింగ్‌ స్టార్‌ మానస్‌ ధామ్నెకు నిరాశ ఎదురైంది. వైల్డ్‌ కార్డుతో బరిలోకి దిగిన 17 ఏళ్ల మానస్‌ క్వాలిఫయింగ్‌ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. ప్రపంచ 100వ ర్యాంకర్‌ లుకా నార్డీ (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 760వ ర్యాంకర్‌ మానస్‌ 4–6, 4–6తో పోరాడి ఓడిపోయాడు. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మానస్‌ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్‌ చేశాడు.

మాజీ షట్లర్లు ఇకపై కోచ్‌లుగా...

11 మందితో తుది జాబితా సిద్ధం చేసిన 'బాయ్‌'

న్యూఢిల్లీ: ప్రస్తుతం భారత బ్యాడ్మింటన్‌ రంగం ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. మెగా ఈవెంట్లే కాదు రెగ్యులర్‌ టోర్నీల్లో టైటిల్స్‌ గెలిచే షట్లర్లు కరువు అవుతున్నారు. దీంతో పాటు కోచ్‌ల వెలితి కూడా భారత బ్యాడ్మింటన్‌ సంఘాన్ని (బాయ్‌) వేధిస్తోంది. దీనిపై తర్జనభర్జన అనంతరం 'బాయ్‌' మాజీ మేటి షట్లర్లను కోచ్‌లుగా తయారు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగా కోచ్‌ల నియామకానికి ప్రకటన ఇవ్వగా 49 మంది మాజీలు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ఈ జాబితా నుంచి 10–11 మందితో తుది జాబితాను సిద్ధం చేసిన బాయ్‌... భారత స్పోర్ట్స్‌ అథారిటీ (సాయ్‌) ఆమోదానికి పంపించింది. 'సాయ్‌' ఆమోదముద్ర పడగానే నియామక ప్రక్రియ పూర్తవుతుందని 'బాయ్‌ కార్యదర్శి సంజయ్‌ మిశ్రా తెలిపారు. కొన్నేళ్లుగా విదేశీ కోచ్‌ల ప్రభావం అంతకంతకూ పెరగడంతో భారతీయ సంప్రదాయ కోచింగ్‌ శైలి మసకబారుతోంది. ఈ నేపథ్యంలో మన శైలి కోచింగ్‌కు ప్రాముఖ్యత ఇస్తామని మిశ్రా చెప్పారు. 'బ్యాడ్మింటన్‌ దిగ్గజాలు ప్రకాశ్‌ పదుకోన్, పుల్లెల గోపీచంద్‌ల శైలిని కాపాడుకోవాల్సిన అవసరం వుంది. పూర్తిగా మలేసియా, ఇండోనేసియా శైలి కోచింగ్‌వైపే మరలకుండా భారత శైలి నైపుణ్య శిక్షణ కూడా ఉండాలని ఆశిస్తున్నాం' అని ఆయన అన్నారు. 'సాయ్‌' ఆమోదం తెలపగానే నియమితులైన భారత కోచ్‌లతో ముందుగా నేషనల్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ (బెంగళూరు)లోని జూనియర్‌ షట్లర్లకు శిక్షణ ఇప్పిస్తారు. అనంతరం రొటేషన్‌ పద్ధతిలో కోచ్‌లను వినియోగించుకుంటారు. బెంగళూరుతో పాటు హైదరాబాద్, గువాహటిల్లోని భారత షట్లర్లకు కోచింగ్‌ ఇప్పిస్తారు. జూనియర్‌ నుంచి ఎలైట్‌కు, తదనంతరం టాప్‌ షట్లర్లకు భారత కోచ్‌లు శిక్షణ ఇస్తారు. దీంతో పాటు ప్రతి టోర్నీకి ముందు నిర్వహించే శిబిరంలో కూడా ఒక విదేశీ కోచ్‌తో పాటు దేశీయ కోచ్‌లను అందుబాటులో ఉంచుతామని సంజయ్‌ మిశ్రా వివరించారు.

'రోస్టర్‌లో నా పేరు లేదు'

ఈడెన్‌ గార్డెన్స్‌ కామెంటరీ ఘటనపై హర్ష భోగ్లే వివరణ

న్యూఢిల్లీ: ఐపీఎల్‌ 18వ సీజన్‌లో భాగంగా సోమవారం కోల్‌కతాలోని ఈడెన్‌ గార్డెన్స్‌ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌ (కేకేఆర్‌), గుజరాత్‌ టైటాన్స్‌ మధ్య మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరించకపోవడంపై వస్తున్న వార్తలను ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే ఖండించాడు. ఇటీవల ఈడెన్‌ గార్డెన్స్‌ పిచ్‌పై భోగ్లే, సైమన్‌ డౌల్‌ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. ఈడెన్‌ గార్డెన్స్‌ పిచ్‌ స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటే మంచిదని... అప్పుడే సొంతగడ్డపై జరిగే మ్యాచ్‌ల్లో కేకేఆర్‌కు అదనపు ప్రయోజనం దక్కుతుందని వీరిద్దరూ కామెంటరీలో అన్నారు. దీనిపై స్పందించిన కేకేఆర్‌ ఫ్రాంచైజీ... తమకు అనుకూలంగా పిచ్‌లు సిద్ధం చేయకపోతే వేదిక మార్చుకుంటామని వెల్లడించింది. దీనిపై తీవ్రంగా స్పందించిన బెంగాల్‌ క్రికెట్‌ సంఘం (క్యాబ్‌)... కామెంటరీ ప్యానల్‌ నుంచి భోగ్లేతో పాటు డౌల్‌ను తొలగించాలని భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో సోమవారం కేకేఆర్, గుజరాత్‌ టైటాన్స్‌ మ్యాచ్‌కు భోగ్లే వ్యాఖ్యాతగా వ్యవహరించకపోవడంతో... క్యాబ్‌ ఆరోపణల నేపథ్యంలోనే ఇలా అయిందనే వార్తలు వ్యాపించాయి. దీనిపై భోగ్లే స్పష్టతనిచ్చాడు. 'సోమవారం మ్యాచ్‌లో కామెంటరీ చేయకపోవడంపై తప్పుడు వార్తలు వస్తున్నాయి. అందులో నిజం లేదు. ఆ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా నా పేరు లేదు. ఈ సీజన్‌లో కోల్‌కతాలో రెండు మ్యాచ్‌ల్లో విధులు నిర్వర్తించేందుకు నా పేరు రోస్టర్‌ అయింది. అందులో భాగంగా తొలి మ్యాచ్‌లో విధులు నిర్వర్తించా... రెండో మ్యాచ్‌ సమయంలో కుటుంబంలో అత్యవసర ఆరోగ్య పరిస్థితి నెలకొనడంతో హాజరు కాలేకపోయాను. లీగ్‌ ప్రారంభానికి ముందే ఏ మ్యాచ్‌లో వ్యాఖ్యాతగా వ్యవహరించాలో నిర్ణయం అయిపోతుంది' అని భోగ్లే వివరించాడు. కేకేఆర్‌ కెప్టెన్‌ రహానేతో పాటు హెడ్‌ కోచ్‌ చంద్రకాంత్‌ పండిట్‌ కూడా స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లు సిద్ధం చేయమని ఈడెన్‌ గార్డెన్స్‌ ప్రధాన క్యూరేటర్‌ సుజన్‌ ముఖర్జీకి సూచించారు. వరుణ్‌ చక్రవర్తి, సునీల్‌ నరైన్, మొయిన్‌ అలీ రూపంలో ముగ్గురు ప్రధాన స్పిన్నర్లు ఉండటంతో కోల్‌కతా యాజమాన్యం స్పిన్‌ ఫ్రెండ్లీ పిచ్‌లు ఆశిస్తోంది.



జమిలి ఎన్నికల బిల్లుకు న్యాయవర్గాల మద్దతు

మార్పులు సూచించిన మాజీ న్యాయమూర్తులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఒకే దేశం–ఒకే ఎన్నిక బిల్లుకు పలువురు మాజీ న్యాయమూర్తులు మద్దతు పలికారు. కానీ, బిల్లులో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ సింఘ్వీ మాత్రం జమిలి ఎన్నికల బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బీజేపీ ఎంపీ పి.పి.చౌదరి నేతృత్వంలో జాయింట్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ మంగళవారం న్యాయవర్గాలతో సమావేశమైంది. జమిలి ఎన్నికల బిల్లుపై మాజీ న్యాయమూర్తులు, లాయర్ల అభిప్రాయాలు సేకరించింది. జమిలి ఎన్నికలకు వీలుగా రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాన్ని కుదించాలన్న ప్రతిపాదన సరైంది కాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ గుప్తా అన్నారు. కనీసం మూడేళ్లయినా పూర్తి కాని అసెంబ్లీల గడువును కుదించవద్దని చెప్పారు. దానికిబదులుగా అసెంబ్లీల గడువును పెంచింతే బాగుంటుందని చెప్పారు. జమిలి ఎన్నికలతో రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి ఎలాంటి విఘాతం వాటిల్లదని సుప్రీంకోర్టు మాజీ జడ్జి, లా కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ బి.ఎస్.చౌహాన్ తెలిపారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రముఖ లాయర్, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని తేల్చిచెప్పారు. రాష్ట్రాల అసెంబ్లీల గడువును కుదించడం ప్రజాతీర్పును అపహాస్యం చేయడమే అవుతుందని అన్నారు.ఒకే దేశం–ఒకే ఎన్నిక బిల్లును స్వాగతిస్తున్నానని జమ్మూకశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎస్.రూ స్పష్టంచేశారు. ఈ సమావేశానికి బీజేపీ ఎంపీ బాన్సూరి స్వరాజ్ 'నేషనల్ హెరాల్డ్ కీ లూట్'అని రాసి ఉన్న బ్యాగ్ ధరించి వచ్చారు.



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబసభ్యులతో మంగళవారం జైపూర్‌లోని అంబర్‌కోటను సందర్శించినప్పటి దృశ్యమిది


లక్నోలో బ్రిటన్ ఎంపీ నవేందు వివాహ వేడుక

లక్నో: బ్రిటన్ అధికార లేబర్ పార్టీ నేత, పార్లమెంట్ సభ్యుడు నవేందు మిశ్రా(36) వివాహం మంగళవారం లక్నోలో భారతీయ సంప్రదాయం ప్రకారం ఘనంగా జరిగింది. భారత సంతతికి చెందిన మిశ్రా భోపాల్‌కు చెందిన గరిమా తివారీ మెడలో మూడుముళ్లు వేశారు. హల్దీ వేడుక మొదలు మెహెందీ వరకు అన్నీ భారతీయ సనాతన సంప్రదాయాల ప్రకారమే జరిగాయి. ప్రతి కార్యక్రమంలోనూ మిశ్రా ఉత్సాహంతో పాల్గొని, హిందూ సంప్రదాయాల పట్ల తనకు గల అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి సందర్భంలోనూ పెద్దల పాదాలకు నమస్కరించి, వారి ఆశీర్వచనాలు పొందారు. కాన్పూర్‌లో 1989లో జన్మించిన మిశ్రా మొదటిసారిగా 2019లో, తిరిగి 2024లో స్టాక్‌పోర్ట్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఈయన తల్లి గోరఖ్‌పూర్ వాసి. నాలుగేళ్ల వయస్సులో తల్లిదండ్రులతో కలిసి యూకే వెళ్లారు. అక్కడే పెరిగినా మూలాలను మాత్రం మరవకపోవడం విశేషం. వీరి పెళ్లి వేడుక ఈ నెల 20న అన్సాల్ గోల్ఫ్ సిటీలోని ఓ హోటల్‌లో జరిగింది. రిసెప్షన్ సోమవారం జరిగింది. కాగా, వధువు గరిమా తివారీ స్కాట్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశారు.

పార్లమెంటే సుప్రీం

దాన్ని మించిన అథారిటీ లేదు: ధన్‌ఖడ్

- ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్లు
- సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు
- వ్యవస్థలు పరిధి మీరితే ఉపేక్షించొద్దు
- జాతి ప్రయోజనాల కోసమే మాట్లాడా
- విమర్శకులపై ఉపరాష్ట్రపతి ధ్వజం



న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో పార్లమెంటే సర్వోన్నతమని పునరుద్ఘాటించారు. ''దాన్ని మించిన అధికారాన్ని మన రాజ్యాంగం మరే అథారిటీకీ ఇవ్వలేదు. కనీసం అలాంటి భావనకు కూడా చోటివ్వలేదు. ఆ మాటకొస్తే దేశంలోని ప్రతి పౌరుడూ సుప్రీమే. 'దేశ ప్రజలమైన మేము' అంటూ రాజ్యాంగంలో రాసుకున్న మాట అణుబాంబు వంటిది. దానికున్న శక్తి ఎంతటిదో ప్రతి ఎన్నికల్లోనూ కనిపిస్తుంది'' అంటూ కుండబద్దలు కొట్టారు. ''రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కూడా వారిదే'' అని స్పష్టం చేశారు. ''రాష్ట్రపతి వంటి ఉన్నత రాజ్యాంగ పదవులు అలంకారప్రాయమైనవి మాత్రమేనని కొందరంటున్నారు. ఇది పూర్తి తప్పుడు అవగాహన. ప్రతి వ్యవస్థకూ తనవైన బాధ్యతలున్నాయి. ఇలా వాటి ప్రతిష్టను మసకబార్చజూస్తున్న దేశ వ్యతిరేక శక్తుల ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వరాదు'' అని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. సుప్రీంకోర్టు పరిధులు దాటి వ్యవహరిస్తోందన్న తన వ్యాఖ్యలను పూర్తిగా సమర్థించుకున్నారు. వాటిని తప్పుబట్టిన వారిపై విరుచుకుపడ్డారు. రాజ్యాంగ హోదాలో ఉండే వ్యక్తులు మాట్లాడే ప్రతి మాటకూ దేశ అత్యున్నత ప్రయోజనాలే పరమావధి అని గుర్తుంచుకోవాలన్నారు. ''సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. ప్రవేశిక రాజ్యాంగంలో భాగం కాదని ఒక కేసులో, భాగమేనని మరో కేసులో పేర్కొంది. వ్యవస్థలు తమ రాజ్యాంగ పరిధిని మీరినప్పుడు మౌనం వహించడం ప్రమాదకరం. వీటిపై మేధావులు స్పందించాలి. ఆస్తులను ధ్వంసం చేసే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులను ఏరిపారేయాలి. నయానాభయానా వినని వారికి చేదుమందు తినిపించక తప్పదు. భారతీయత పట్ల ప్రతి ఒక్కరూ గర్వించాలి'' అన్నారు.

రాజ్యాంగమే సుప్రీం: సిబల్

ధన్‌ఖడ్ తాజా వ్యాఖ్యలపై రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మరోసారి తీవ్రంగా తప్పు బట్టా రు. పార్లమెంటు, కార్య నిర్వాహక వ్యవస్థల్లో ఏదీ సుప్రీం కాదని, రాజ్యాంగమే సర్వోన్నతమని అన్నారు. రాష్ట్రపతికి గడువు విషయంలో జాతి ప్రయో జనార్థం రాజ్యాంగ విలువలకు అనుగుణంగానే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. 'చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు, రాజ్యాంగానికి సరైన భాష్యం చెప్పి పరిపూర్ణ న్యాయం అందించాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుకు ఉన్నాయి'' అని ఆర్టికల్ 142ను ఉటంకిస్తూ చెప్పారు. ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తి ఇలా రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఎన్నడూ చూడలేదంటూ ధన్‌ఖడ్ గత వ్యాఖ్యలపై కూడా సిబల్ మండిపడటం తెలిసిందే.

మాటల మంటలు

బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి ఇటీవల సుప్రీంకోర్టు మూడు నెలల గడువు విధించడం, దాన్ని ధన్‌ఖడ్ తీవ్రంగా తప్పుబట్టడం తెలిసిందే. ''న్యాయవ్యవస్థ సూపర్ పార్లమెంటుగా వ్యవహ రిస్తోంది. కార్యనిర్వాహక విధుల్లోకి చొరబడుతోంది. న్యాయమూర్తులకు మాత్రం ఎలాంటి జవాబుదారీతనమూ లేదు. భారత్ ప్రజాస్వామ్య తరహా పాలనను ఎంచుకున్నది ఇలా న్యాయ మూర్తులే చట్టాలు చేసి కార్యనిర్వాహక విధులు కూడా నిర్వర్తించడానికి కాదు'' అంటూ ఆక్షేపించారు. ధన్‌ఖడ్ వ్యాఖ్యలు రాజ్యాంగవిరుద్ధమంటూ విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా వాటిపై పరోక్షంగా స్పందించింది. కార్య నిర్వాహక విధుల్లో తలదూరుస్తున్నామంటూ తమపై అభియోగాలు మోపుతున్నారంటూ కాబోయే ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ సోమవారం ఓ కేసు విచారణ సందర్భంగా ఆవేదన వెలిబుచ్చారు.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ప్రజలకూ తెలుసు: ప్రియాంక

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి సలహాదారులు తప్పుడు సలహాలిస్తున్నారని, దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం అవుతున్న విషయం దేశ ప్రజలకు తెలుసునని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో తన తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్‌లకు ఈడీ నోటీసులివ్వడంపై ఆమె ఈ మేరకు స్పందించారు. మంగళవారం ప్రియాంక మీడియాతో మాట్లాడారు. ఈడీ నుంచి వచ్చే ఆహ్వానం కోసం ఎదురుచూస్తున్నానంటూ చమత్కరించారు. ఈ కేసులో తనకు ఇప్పటి వరకు సమన్లు పంపకపోవడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోనియా, రాహుల్‌లు నేషనల్ హెరాల్డ్‌కు చెందిన రూ.2 వేల కోట్ల ఆస్తులపై కన్నేశారంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలపై ఆమె స్పందిస్తూ.. 'ఆ ఆస్తులను విక్రయించేందుకు, ఇతరులకు వారసత్వంగా అందజేసేందుకు అవకాశమే లేదు. ఇప్పుడవి వారిద్దరి పేర్లతో కూడా లేవు. అలాంటప్పుడు దీన్ని కాజేయడమని ఎలా అంటారు?' అని ప్రియాంక ప్రశ్నించారు. బీజేపీ ఆరోపణలన్నీ శుద్ధ అబద్ధాలంటూ కొట్టిపారేశారు.

పెట్రో సెస్‌లో రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం: ఖర్గే

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా పెట్రోల్, డీజిల్‌పై సెస్ విధిస్తున్న మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. 2014 నుంచి ఇప్పటి వరకు రూ.38.89 లక్షల కోట్లను సెల్ రూపంలో వసూలు చేసిన కేంద్రం ఆ మొత్తంలో రాష్ట్రాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన వాటాను దూరం చేసిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం సహకార సమాఖ్య విధానానికి అర్థం సమాఖ్య విధానానికి ముగింపు అని ఆయన మంగళవారం 'ఎక్స్'లో అభివర్ణించారు. గత 47 నెలల్లోనే అతి తక్కువ స్థాయికి క్రూడ్ ఆయిల్ ధరలు దిగివచ్చినా పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.2 చొప్పున సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ మాత్రం మోదీ ప్రభుత్వం ఆపలేదన్నారు. ఈ ఏడాదిలో కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై సెస్‌ల రూపంలో మొత్తం రూ.1.47 లక్షల కోట్లు ఆర్జిస్తుండగా ఇందులో ఒక్క సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ వాటాయే రూ.28 వేల కోట్ల దాకా ఉంటుందని ఖర్గే వివరించారు. ఇందులో బీజేపీ పాలిత రాష్ట్రాలు సహా ఏ ఒక్క రాష్ట్రానికీ ఇందులో వాటా దక్కడం లేదని తెలిపారు. రాష్ట్రాలు నిధులు అడుగుతున్నా ఇవ్వకుండా..2019–20 నుంచి వివిధ సెస్సులు, సర్‌చార్జీల రూపంలో వసూలు చేసిన రూ.5.7 లక్షల కోట్లు ఖర్చు చేయకుండా ఉంచిందంటూ మోదీ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు.

ఢిల్లీ మాజీ సీఎం ఆతిశీ భద్రత కుదింపు

న్యూఢిల్లీ: ఆప్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆతిశీ భద్రతను కుదించాలని కేంద్ర హోం శాఖ ఢిల్లీ పోలీసులకు మంగళవారం ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ఆమెకున్న భద్రత కేటగిరీని జెడ్ నుంచి వైకి తగ్గించాలని పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఆతిశీ భద్రతపై సమీక్ష జరిపిన కేంద్ర భద్రతా విభాగాలు ఆమెకు జెడ్ కేటగిరీ కొనసాగించాల్సినంతటి ముప్పు లేదని తేల్చాయని ఒక అధికారి తెలిపారు. ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు కొనసాగుతున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతపైనా ఢిల్లీ పోలీసులు సమీక్ష జరిపారన్నారు. అయితే, కేజ్రీవాల్‌కు యథాప్రకారం భద్రతా ఏర్పాట్లను కొనసాగించేందుకు, ఆతిశీ భద్రతను కుదించేందుకు హోం శాఖ ఆదేశాలిచ్చిందన్నారు. వై కేటగిరీతో ఆతిశీకి 12 మంది భద్రతా సిబ్బంది సహా ఢిల్లీ పోలీసు విభాగంలోని ఇద్దరు కమాండోలు భద్రత కల్పిస్తారు. ఆమె కాన్వాయ్‌లో ఇకపై పైలట్ వెహికల్ ఉండదు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆతిశీకి జెడ్ కేటగిరీ భద్రత కల్పించారు. ప్రస్తుతం ఆమె అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.

బీడీ ఇవ్వలేదని పొడిచి చంపేశారు..!

న్యూఢిల్లీ: తమకు బీడీ ఇచ్చేందుకు నిరాకరించిన ఓ యువకుడిని ఇద్దరు వ్యక్తులు కలిసి పొడిచి చంపేశారు. ఢిల్లీలోని పుల్ ప్రహ్లాద్‌పూర్ ప్రాంతంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆ యువకుడి సోదరుడు, స్నేహితుడు సైతం గాయపడ్డారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానికంగా ఉన్న పార్కులో కూర్చున్న సోహెబ్‌ను ఫిరోజ్, అతడి బంధువు సన్నీ తమకు బీడీ ఇవ్వాలని బెదిరించారు. నిరాకరించిన సోహెబ్‌ను వారు కొట్టారు. ఇంటికి వెళ్లి తల్లి సబుక్త, సోదరుడు మొహ్సిన్, స్నేహితుడు అక్రమ్‌లను వెంటబెట్టుకుని సోహెబ్ ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఫిరోజ్, అతడి సోదరుడు ఇంతియాజ్, సన్నీ కలిసి సోహెబ్ బృందంపై కత్తులతో దాడి చేశారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సోహెబ్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మొహ్సిన్ పరిస్థితి విషమంగా మారడంతో సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్రమ్‌కు కొద్దిపాటి గాయాలయ్యాయి. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, రక్తంతో తడిచిన రెండు కత్తుల్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

142 ఆర్టికల్ విచక్షణాధికారాలను హైకోర్టులు వాడొద్దు: సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: రాజ్యాంగంలోని 142వ ఆర్టికల్ ద్వారా తమకు సంక్రమించిన విచక్షణాధికారాలను తాము మాత్రమే వినియోగిస్తామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 'న్యాయస్థానాలకు'అనే కోణంలో హైకోర్టులు సైతం ఇదే ఆర్టికల్‌ను ఉపయోగిస్తామంటే ఒప్పుకోబోమని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 142 ద్వారా సుప్రీంకోర్టుకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకునే హక్కును హైకోర్టులకు దఖలుపర్చాలంటూ అభినవ్ భారత్ కాంగ్రెస్ అనే ఎన్‌జీవో దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా ఎన్‌జీఓ తరఫు న్యాయవాదినుద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ''ఇలాంటి వాటిని మేమెలా అనుమతిస్తాం?. అలా చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి. మీరనుకున్నది సాధించాలంటే ముందుగా మీరు పార్లమెంట్‌కు వెళ్లండి. మీరు అభ్యర్థించే అంశాలు ఏమాత్రం సమర్థనీయంగా లేవు. రాజ్యాంగంలోని 142వ అధికరణం ద్వారా సంక్రమించే అధికారాలు సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంటాయి. మా అధికారాలను హైకోర్టులు వినియోగిస్తామంటే మేం అనుమతించబోం''అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ట్రంప్ ప్రభుత్వంపై హార్వర్డ్ దావా

వాషింగ్టన్: ట్రంప్ ప్రభుత్వంపై హార్వర్డ్ విశ్వవిద్యాలయం కోర్టుకెక్కింది. తనకు బిలియన్ల కొద్దీ డాలర్ల నిధులను నిలిపేయడాన్ని సవాలు చేసింది. అకడమిక్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడానికే ఇలా నిధుల బెదిరింపులను ప్రభుత్వం ఉపయోగిస్తోందని ఆరోపించింది. ''ప్రభుత్వ చర్యలు ఏకపక్షంగా, నిరంకుశంగా ఉన్నాయి. రాజ్యాంగ మొదటి సవరణకే గాక ఫెడరల్ చట్టాలకూ విరుద్ధం''అని ఫిర్యాదులో పేర్కొంది. యూనివర్సిటీలు క్యాంపస్‌లో యూదు వ్యతిరేకతను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించిన ట్రంప్, వాటి నిధులను నిలిపివేస్తామని, పన్ను మినహాయింపు హోదాను తొలగిస్తామని, విదేశీ విద్యార్థుల ప్రవేశాలను పరిమితం చేస్తామని హెచ్చరించారు. మాట వినని వర్సిటీలపై చర్యలు తీసుకున్నారు. హార్వర్డ్‌కు 3.2 బిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేశారు.

సత్యసాయి స్మారక రూ.100 నాణెం

సాక్షి, న్యూఢిల్లీ: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 35 గ్రాముల బరువు కలిగిన రూ.100 నాణెం విడుదల చేయనుంది. నాణెం ఒక వైపు రూ.100 గుర్తు, మరోవైపు 'బాబా'చిత్రం ఉంటాయి. చిత్రం ఎడమ వైపున '1926'అని, కుడి వైపున '2026'సంవత్సరం ఉంటుంది. నాణేనికి ఎగువ అంచున, 'భగవాన్ శ్రీ సత్యసాయి బాబాకి జన్మ శతాబ్ది'అనే శాసనం దేవ్‌నాగరి లిపిలో, నాణెం దిగువ అంచున ఆంగ్లంలో 'బర్త్ సెంటెనరీ ఆఫ్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా'అని ఉంటుంది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 1926 నవంబర్ 23న జన్మించిన బాబా, 2011 ఏప్రిల్ 24వ తేదీన పరమపదించారు.

ఒడెసాపై రష్యా డ్రోన్ దాడులు

కీవ్: ఉక్రెయిన్‌లోని తీరప్రాంత ఒడెసా నగరంపై మంగళవారం రష్యా డ్రోన్లు, గైడ్ బాంబులతో విరుచుకుపడింది. పలు మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతినడంతో పాటు దాడుల్లో ముగ్గురు గాయపడినట్లు ఆ ప్రాంత గవర్నర్ ఒలెహ్ కిపెర్ తెలిపారు. అదేవిధంగా, జపొరిఝియాపై రష్యా జరిపిన గైడ్ బాంబుల దాడిలో ఒక మహిళ చనిపోగా నలుగురు చిన్నారులు సహా 24 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

హర్‌ప్రీత్ అరెస్ట్‌తో న్యాయం జరుగుతుంది

ఎఫ్‌బీఐ చీఫ్ కాశ్ పటేల్ వ్యాఖ్య

న్యూయార్క్: గ్యాంగ్‌స్టర్‌గా మారిన పంజాబ్ ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పాసియా అలియాస్ జోరా అరెస్ట్‌తో న్యాయం జరుగుతుందని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) చీఫ్, భారతమూలాలున్న కాశ్ పటేల్ మంగళవారం వ్యాఖ్యానించారు. గత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ అధికారులు టక్సన్ సెక్టార్‌లో హర్‌ప్రీత్‌ను అరెస్ట్‌చేసినా తర్వాత వదిలేశారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్న వేళ కాశ్ పటేల్ స్పందించారు. 29 ఏళ్ల హర్‌ప్రీత్‌ను అమెరికా పోలీసులు ఏప్రిల్ 18వ తేదీన అరెస్ట్ చేయడం తెల్సిందే. పంజాబ్‌లో పలు ఉగ్రదాడులు, పాకిస్తాన్ ఐఎస్ఐ, ఖలిస్తానీ వేర్పాటువాద గ్రూప్ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో సంబంధాల కేసుల్లో హర్‌ప్రీత్ కోసం భారత్ చాన్నాళ్లుగా వెతుకుతోంది. ''భారత్, అమెరికా పోలీస్‌స్టేషన్లపై దాడులకు పథకరచన చేస్తున్న హర్‌ప్రీత్‌ను పట్టుకున్నాం. మా హయాంలో అధికారులు అద్భుతంగా పని చేశారు. తప్పకుండా న్యాయం జరుగుతుంది. హింసను వ్యాపింపజేసే వారు ఎక్కడ దాక్కున్నా సరే ఎఫ్‌బీఐ వదిలిపెట్టబోదు'' అని కాశ్ పటేల్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. 2022లో అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలోకి హర్‌ప్రీత్ ప్రవేశించగా నాడు అధికారులు అరెస్ట్‌చేసినా తర్వాత వదిలేశారని తెలుస్తోంది. దీనిపై తాజాగా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారి ట్రిసియా మెక్‌లాఫ్లిన్ నాటి బైడెన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ''ఒక ఉగ్రవాదిని బైడెన్ ప్రభుత్వం దేశంలోకి అనుమతించింది. కానీ, ట్రంప్ సర్కార్ ఇలాంటి ఉగ్రవాదులను దేశం నుంచి ఏరివేస్తోంది. గాలించి, వెంటాడి, వేటాడి కారాగారంలో పడేస్తాం'' అని అన్నారు. జాడ కనుక్కోవడం కష్టంగా ఉండే తాత్కాలిక ఫోన్‌నంబర్లుండే 'బర్నర్' ఫోన్లను వాడుతూ హర్‌ప్రీత్ తప్పించుకుని తిరిగాడని అరెస్ట్ సందర్భంగా ఎఫ్‌బీఐ ఆనాడు పేర్కొంది. గత ఏడాది చండీగఢ్‌లో ఒక ఇంటిపై గ్రనేడ్ దాడి కేసులోనూ హర్‌ప్రీత్ నిందితునిగా ఉన్నాడు. జాతీయ దర్యాప్తు సంస్థ జనవరిలో ఇతనిపై రూ.5 లక్షల రివార్డ్ ప్రకటించింది.

గాజాలో 14 మంది మృత్యువాత

డెయిర్ అల్–బలాహ్: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా దాడులు కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన దాడుల్లో 14 మంది చనిపోయారు. ఉదయం ఖాన్‌యూనిస్ నగరంపై జరిగిన దాడుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు సహా 9 మంది అసువులు బాశారు. జబాలియాలోని శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో దంపతులు, వారి ముగ్గురు చిన్నారులు చనిపోయారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. అంతేకాదు, గాజా ఉత్తరప్రాంతంలోని జబాలియాలో ఓ ప్రాంతంలో పార్కు చేసి ఉన్న 9 బుల్‌డోజర్లు, ఇతర భారీ యంత్ర సామగ్రి ధ్వంసమయ్యాయి. తమ దాడుల్లో కనీసం 40 భారీ యంత్రాలు నాశనమయ్యాయని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. హమాస్ వీటితోనే మందు పాతరలను అమర్చడం, సొరంగాలు నిర్మించడం చేస్తోందని ఆరోపించింది. అల్ నజ్లా మున్సిపాలిటీలోనే ఉన్న నీళ్ల ట్యాంకర్, జనరేటర్‌ను సైతం నాశనం చేశాయి. హమాస్, ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం కుదిర్చేందుకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్టు వీటన్నిటినీ గాజాకు సమకూర్చాయి.

నరాలు కట్ చేస్తే..!

- ఇంటర్నెట్‌లో శోధించిన మాజీ డీజీపీ భార్య
- ఓం ప్రకాశ్ హత్య కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

బనశంకరి: మనిషిని ఎలా చంపితే త్వరగా ప్రాణాలు పోతాయి?..నరాలు కట్ చేస్తే త్వరగా చచ్చిపోతారా? వంటి విషయాలపై కర్ణాటక విశ్రాంత డీజీపీ ఓం ప్రకాశ్ భార్య పల్లవి కొన్ని రోజులుగా ఇంటర్నెట్‌లో శోధించినట్లు తేలింది. మనిషి రక్తనాళాలను కత్తిరించడం గురించి ఆమె గూగుల్‌లో గాలించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆదివారం సాయంత్రం బెంగళూరులోని నివాసంలో ఓం ప్రకాశ్ కత్తిపోట్లకు గురై మరణించడ తెలిసిందే. భార్య పల్లవి, కూతురు కృతిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడుతున్నాయి.

కొన్ని వారాలుగా రీసెర్చ్

మూడు నెలల కిందటే భర్త ఓం ప్రకాశ్‌ను హత్య చేసేందుకు పల్లవి స్కెచ్ వేసింది. మనిషి రక్త నాళాలు కత్తిరిస్తే రక్తం సరఫరా నిలిచిపోతుంది.. దీంతో సులభంగా ప్రాణం తీయవచ్చునని ఆలోచించింది. గూగుల్‌లోనూ ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వెతికినట్లు పోలీసుల దర్యాప్తులో బహిర్గతమైంది. ఓం ప్రకాశ్ హత్యకు ఐదు రోజులు ముందు నుంచి యూట్యూబ్‌లో మనిషిని సులభంగా హత్య చేయడం, రక్తనాళాలను కట్ చేయడమెలా అనే దానిపైనే వీడియోలు చూస్తూ గడిపింది. ఛాతీభాగంలో పొడిస్తే తలెత్తే పరిణామాల శోధించింది. చివరికి ప్లాన్ ప్రకారం ఇంటికి కేజీ కారం పొడి తెప్పించుకుంది. డెలివరీ బాయ్ ద్వారా చేపల కూర తెచ్చుకుని భోజనం చేస్తున్న ఓం ప్రకాశ్ మీద పల్లవి విరుచుకుపడింది. ముఖంపై కారంపొడి చల్ల, వంట నూనెను పోసింది. భర్త తప్పించుకుని బయటికి వెళ్లకుండా ముందే అన్ని గదుల తలుపులు మూసేసింది. పగులగొట్టిన బీరు బాటిల్, కత్తితో విరుచుకుపడింది. తల్లి కిరాతకానికి కుమార్తె కృతి కూడా సాయం చేసినట్లు విచారణలో తేలింది. పోలీసులు పల్లవిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. కృతిని నిమ్హాన్స్ ఆసుపత్రిలో చేర్చారు.

టీడీపీ, జేడీయూ వెన్నుపోటు పొడిచాయి

- వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయండి
- లేదా ముస్లింల వ్యతిరేకతను చవిచూడాల్సి ఉంటుంది
- ఎన్‌డీఏలోని పార్టీలకు ఏఐఎంపీఎల్‌బీ హెచ్చరిక

న్యూఢిల్లీ: అధికార బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ, జేడీయూ వంటి ఎన్డీఏ పక్షాలు ముస్లింలను వెన్నుపోటు పొడిచాయని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) ధ్వజమెత్తింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉప సంహరించుకునేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, లేదంటే ముస్లిం తీవ్ర వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించింది. రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ, బిహార్‌లోని జేడీయూ, ఇంకా ఎల్‌జేపీ(రాం విలాస్), హెచ్‌ఏఎం (సెక్యులర్)పార్టీలకు అల్టిమేటం ఇచ్చింది. ఏఐఎంపీఎల్‌బీ సారథ్యంలో మంగళవారం తల్కటోరా స్టేడియంలో జరిగిన 'సేవ్ వక్ఫ్' సదస్సుకు ఎంపీలు, మత పెద్దలు, ముస్లిం సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..వక్ఫ్ సవరణ చట్టాన్ని నల్ల చట్టంగా అభివర్ణించారు. ఈ చట్టాన్ని తాము ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. వక్ఫ్ ఆస్తులను భూ ఆక్రమణదారులకు కట్టబెట్టేందుకే మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ఏఐఎంపీఎల్‌బీ ప్రధాన కార్యదర్శి ఫజలుర్ రహీం ముజాద్దిదీ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్ట రూపం దాల్చేందుకు బహిరంగంగా సహకరించడం ద్వారా తెలుగుదేశం పార్టీ చీఫ్ చంద్రబాబు, జేడీయూ సారథి నితీశ్, ఎల్‌జేపీకి చెందిన చిరాగ్ పాశ్వాన్, హెచ్‌ఏఎం అధ్యక్షుడు జితన్ రాం మాంఝీ ముస్లింలను వెన్నుపోటు పొడిచారన్నారు. వీరు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులు, అణచివేతకు మద్దతుదారులనే విషయాన్ని ముస్లింలు, న్యాయాన్ని కాంక్షించే వారు గుర్తించాలని ఆయన అభ్యర్థించారు. ఈ నేతలు వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి లేదా ప్రతిచోటా తమ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి సిద్ధపడాలని హెచ్చరించారు. చట్టానికి మద్దతు తెలిపే ముస్లింలను ఆయన ద్రోహులుగా అభివర్ణించారు.

వ్యాను లోయలో పడి.. 16 మంది దుర్మరణం

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రాంతంలో జరిగిన ఘోర ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని కొండ ప్రాంత జంపోరో జిల్లా లాపారికి చెందిన కొల్హి గిరిజనులు బలూచిస్తాన్‌లో వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. వేగంగా వెళ్తున్న వీరి వ్యాను సింధ్ ప్రావిన్స్‌లోని బడిన్ వద్ద అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఘటనలో అక్కడికక్కడే 16 మంది చనిపోగా 30 మంది గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి

దామోహ్: అదుపుతప్పిన ఎస్‌యూవీ వాహనం వంతెనపై నుంచి ఎండిపోయిన సునార్ నదిలో పడిన ఘటనలో అందులోని 8 మంది చనిపోగా ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం దామోహ్‌లోని నోహట వద్ద మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వీరు జబల్పూర్ జిల్లాకు చెందిన వారని పోలీసులు తెలిపారు.

మూడు హైకోర్టులకు బాంబు బూచి

తనిఖీల అనంతరం భద్రతను పెంచిన అధికారులు

ముంబై/ కొచ్చి/ గౌహతి: కేరళ హైకోర్టు, గౌహతి హైకోర్టుతోపాటు బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్‌కి మంగళవారం బాంబు బెదిరింపులు అందాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లతో ఆయా భవనాలను అణువణువూ శోధించారు. బెదిరింపులు మాత్రమే అని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిళ్ల కారణంగా కోర్టు కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. మంగళవారం ఉదయం ఛత్రపతి శంభాజీ నగర్‌లోని ఔరంగాబాద్ బెంచ్‌కు బాంబుతో పేల్చేస్తామంటూ బెదిరింపు అందింది. కోర్టు యంత్రాంగం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. దీంతో, రద్దీగా ఉండే జల్నా రోడ్డులోని ఆ భవనంలో స్పెషల్ బ్రాంచి అధికారులు, స్థానిక పోలీసులు కలిసి ఆ భవనం లోపల, ప్రాంగణంలో పూర్తి స్థాయిలో గాలింపు జరిపారు. అదేవిధంగా, బాంబు పెట్టామనే హెచ్చరిక ఈ మెయిల్ మంగళవారం ఉదయం కేరళ హైకోర్టుకు అందిందని పోలీసు వర్గాలు తెలిపాయి. పూర్తి స్థాయిలో తనిఖీల అనంతరం అది కేవలం బెదిరింపేనని ధ్రువీకరించుకున్న తర్వాతే తిరిగి కోర్టు కార్యకలాపాలు మొదలయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టు వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత పెంచినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. గత రెండు నెలలుగా వయనాడ్, పలక్కాడ్, తిరువనంతపురం, పథనంతిట్ట తదితర ప్రాంతాల్లో జిల్లా కలెక్టరేట్లు, రెవెన్యూ కార్యాలయాలకు ఈ మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు అందుతున్నాయని అధికారులు తెలిపారు. వీటిపై విచారణ జరుగుతోందన్నారు. దీంతోపాటు, గౌహతి హైకోర్టుకు సైతం 'మద్రాస్ టైగర్స్'పేరుతో బెదిరింపు మెయిల్ అందింది. కోర్టు భవనాన్ని పేల్చేస్తామంటూ అందులో హెచ్చరించారు. కోర్టు యంత్రాంగం అందించిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు ఆ భవనాన్ని, ప్రాంగణాన్ని క్షుణ్నంగా పరిశీలించారు. ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు కన్పించకపోవడంతో బెదిరింపేనని తేల్చినట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అయితే, కోర్టు కార్యకలాపాలు యథా ప్రకారం కొనసాగాయన్నారు.

ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్య సామ్రాజ్యం అంతమైన తర్వాత మళ్లీ ఉత్తర భారత దేశాన్ని ఏకం చేసి పాలించిన రాజులు గుప్తులు. కుషాణ రాజ్య శిథిలాలపై క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ రాజ్యం 6వ శతాబ్దం వరకూ కొనసాగింది.

గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

గుప్తుల రాజకీయ చరిత్ర

శ్రీగుప్తుడు

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

ఘటోత్కచ గుప్తుడు

ఇతడు క్రీ.శ.300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్ఠతకు కృషి చేశాడు.

మొదటి చంద్రగుప్తుడు

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరఫు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్థుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

సముద్ర గుప్తుడు

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు..'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్పరాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్ర గుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు,సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో పాటు,కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్ర గుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజోచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.



రెండో చంద్రగుప్తుడు

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహచంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

కుమార గుప్తుడు

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామంద్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

స్కంద గుప్తుడు

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్లపాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

బుధ గుప్తుడు

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
   సి) నరసింహ బాలాదిత్యుడు
   డి) విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
   ఎ) మొదటి చంద్రగుప్తుడు
   బి) రెండో చంద్రగుప్తుడు
   సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
   ఎ) పులి బి) గరుడ
   సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
   ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
   సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
   ఎ) కిదార బి) చిరాతదత్త
   సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
   ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
   సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
   ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
   బి) శ్రీ మేఘవర్మ సి) విజయబాహు
   డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
   ఎ) కుమార గుప్తుడు
   బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
   సి) సముద్ర గుప్తుడు డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు
   బి) నరసింహ గుప్తుడు
   సి) మొదటి చంద్రగుప్తుడు
   డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
    ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
    సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
    ఎ) సర్ విలియం జోన్స్
    బి) వి.ఎ.స్మిత్ సి) హెచ్.సి. రామచౌదరి
    డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
    ఎ) రెండో రుద్రసేనుడు
    బి) మూడో రుద్రసేనుడు
    సి) రెండో రుద్రసింహుడు
    డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
    ఎ) మొదటి చంద్రగుప్తుడు
    బి) రెండో చంద్రగుప్తుడు
    సి) సముద్ర గుప్తుడు డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
    ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
    సి) రెండో చంద్రగుప్తుడు డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
    ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
    సి) హుయాన్‌త్సాంగ్ డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
    ఎ) కుమార గుప్తుడు బి) 2వ చంద్రగుప్తుడు
    సి) సముద్రగుప్తుడు
    డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
    ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
    సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
    ఎ) సముద్ర గుప్తుడు బి) నరసింహ గుప్తుడు
    సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
    ఎ) స్కంద గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
    సి) మొదటి చంద్రగుప్తుడు
    డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
    ఎ) మహాదండ నాయకుడు
    బి) కుమారామాత్యుడు
    సి) సంధి విగ్రాహకుడు
    డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
    ఎ) విషయపతి బి) ఉపారిక
    సి) కుమారామాత్య
    డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
    ఎ) 1/6వ వంతు
    బి) 1/4వ వంతు
    సి) 1/4 నుంచి 1/6వ వంతు
    డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?
    A) టిలుపతి 1) గజదళ అధ్యక్షుడు
    B) పుస్తపాల 2) భూ విక్రయాల రికార్డులు
    C) దివిర 3) లేఖకుడు
    D) శౌల్కిక 4) సుంకాల వసూలు అధికారి

	A)	B)	C)	D)
ఎ)	1	2	3	4
బి)	2	1	4	3
సి)	4	3	2	1
డి)	3	4	1	2

24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
    ఎ) పన్నులు బి) అధికారులు
    సి) భూమి కొలబద్దలు డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాందసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
    ఎ) కుండల తయారీ
    బి) సిల్క్ తయారీ
    సి) దంతపు వస్తువుల తయారీ
    డి) ఇనుప వస్తువుల తయారీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.

సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?



భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు,ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:
- మధ్యప్రదేశ్ – కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ – అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ – కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. **అవి:**
1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబి మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:
- బిహార్ – గయ.
- జార్ఖండ్ – కోడెర్మా, హజారీబాగ్, సింగ్భమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ – నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ – ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:
- ఆంధ్రప్రదేశ్ – కడప. ❖ తెలంగాణ–ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ,ఖమ్మం),బిహార్,ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్,ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్(జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం,సహజవాయువు)ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. **అవి:**

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ (జార్ఖండ్-దామోదర్), సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా), గోదావరి (తెలంగాణ), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **అంథ్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90–95 శాతం కార్బన్ ఉం టుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:**ఇందులో 85–90శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30–40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ – జారియా, బొకారో, డాల్టన్‌గాంజ్.
పశ్చిమ బెంగాల్ – రాణిగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ – కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌దో– అరంధ్, తాతాపాని– రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ –సింగ్రౌలి,సాహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర – చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ – సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు – నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం – మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ – బికనీర్.
ఉత్తర ప్రదేశ్ – నామ్‌చిక్, నాంరూధ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:
యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర: మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది – HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:
1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కానియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ(నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కానియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రెయిన్
   3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్గరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1)1; 2) 2; 3) 3; 4) 4; 5) 1; 6)3; 7) 2; 8) 2

‘చార్మినార్’ను దేనికి గుర్తుగా నిర్మించారు?

కుతుబ్‌షాహీలు గోల్కొండను రాజధానిగా చేసుకొని సుమారు 171 ఏళ్లపాటు పరిపాలించారు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి ఆంధ్ర సంస్కృతిని పోషించారు. తెలుగు ప్రజల ఆదరాభిమానాలను పొందారు. గోల్కొండ రాజ్యంలోని ప్రజల్లో మూడో వంతు హిందువులేనని గుర్తించి, వారి హృదయాలను చూరగొంటే తప్ప సుస్థిర పాలన చేయలేమని భావించారు. జాతి, మత భేదాలను పాటించకుండా అర్హత, సామర్థ్యం ఉన్న వారికి ఉన్నత ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కుతుబ్‌షాహీల పాలనా వ్యవస్థ

కుతుబ్‌షాహీలు పరదేశీయులు, ఇతర మతస్థులు అనే భావన ప్రజల్లో రానీయకుండా పరిపాలన చేసినట్లు దక్కన్‌లో వెలువడిన సమకాలీన సాహిత్యం వల్ల తెలుస్తోంది. కుతుబ్ షాహీల పాలనా విధానం, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడానికి ఇండో-పారశీక చరిత్ర, అబ్దుల్లా కుతుబ్‌షా, ఔరంగజేబు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు లభిస్తున్న మొగలుల చరిత్ర, గోల్కొండ కవుల సాహిత్యం దోహదపడుతున్నాయి. వీటితో పాటు గోల్కొండను సందర్శించిన బౌరే, టవర్నియర్, తెవ్‌నాట్, బెర్నియర్, మెత్త వోల్డ్, మనుస్సీ, మూర్‌లాండ్ లాంటి విదేశీ యాత్రికుల కథనాలు, వారి యాత్రానుభవాలు వీరి పాలన గురించి తెలియజేస్తున్నాయి. మధ్యయుగ చరిత్రను తెలియజేసే క్రానికల్లు, మెకంజీస్ సేకరించిన కైఫీయతులు, సుల్తానులు జారీచేసిన ఫర్మానాలు కూడా ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనా విధానాన్నే అనుసరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తాన్ ప్రధానపాత్ర పోషించేవాడు. రాజ్యాధిపతిగా ఆయనే శాసనకర్త. సుల్తాన్ తనకు తాను దేవుని ప్రతిబింబం (జిలుల్లా)గా, దైవాంశ సంభూతుడిగా విశ్వసించి నిరంకుశంగా రాజ్యపాలన చేసేవాడు. రాజే సర్వాధికారి, సైన్యాధిపతి, ఉన్నత న్యాయాధిపతి. ప్రభుత్వ విధానాలను రూపొందించి ఫర్మానాలు జారీ చేయడంతోపాటు రాయబారులను, ఉన్నతోద్యోగులను సుల్తానే నియమించేవాడు. రాజ ఆస్థానం ఎల్లప్పుడూ ఆడంబర విలాసాలతో నిండి ఉండేదని సమకాలీన సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ దైవానికే సమాధానకర్తగా వ్యవహరించేవారు. ఖురాన్ గ్రంథం, సూఫీ మత ప్రభావం వల్ల ప్రజల యోగక్షేమాలు చూసేవారు. రాజధానిలో రాజ్య వ్యవహారాలు చర్చించి, విధాన నిర్ణయాలను అమలు చేయడానికి మజ్లిస్-దివాన్‌దారీ, మజ్లిస్-ఇ-కింగాష్ అనే పండిత పరిషత్తులు ఉండేవి. ఇందులో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిజ్ఞులు, ఉన్నత ఉద్యోగులు సభ్యులుగా ఉండి సుల్తాన్‌కు రాజ్య వ్యవహారాల్లో సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. సుల్తాన్ తర్వతి స్థానం ప్రధానమంత్రిది. కుతుబ్‌షాహీల కాలంలో ప్రధానమంత్రిని వకీల్-ఇ-ముకాలఖ్ (లేదా) పీష్వా అని పిలిచేవారు. ఇతడు రాజ్యంలో సాధారణ పరిపాలనతో పాటు బహిర్గత, అంతర్గత వ్యవహారాలు నిర్వహించేవాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ముస్తాఫాఖాన్ ఆర్దిస్థానీ, మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో మీర్ మెమిన్ అస్త్రాబాది, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో షేక్ మహమ్మద్ ఇబన్‌ఖాతున్ లాంటి వారు ప్రధాన మంత్రులుగా పేరు పొందారు. ప్రధానమంత్రి తర్వాతి స్థానం మీర్ జుమ్లా (మంత్రి)కు ఉండేది. ఇతడు ఆర్థిక, రెవెన్యూ శాఖలతోపాటు రాజ్యంలో రాబడి, ఖర్చులకు సంబంధించిన కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహించేవాడు. కొన్ని సందర్భాల్లో పీష్వా కంటే ఎక్కువ అధికారం చెలాయించేవాడు. హైదరాబాద్ నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో మీర్జామహమ్మద్ అమీన్, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మీర్ మహమ్మద్ సయీద్ లాంటి వారు ఆర్థికశాఖా మంత్రులుగా గొప్ప పేరు గడించారు. పీష్వా (లేదా) ప్రధానమంత్రి పేరును అబుల్ హసన్ తానీషా కాలంలో దివాన్‌గా మార్చారు. మాదన్న దివాన్‌గా పేరు గడించాడు. కోశాధికారిని 'ఖజాన్‌దార్'గా, గణాంక శాఖాధికారిని 'మజుందార్'గా, పోలీస్ కమిషనర్‌ను 'కొత్వాల్'గా, పౌర ఉద్యోగిని 'హవల్దార్'గా పిలిచేవారు. ప్రధాన రెవెన్యూ ఉద్యోగిని 'సర్‌ఖేల్' అని పిలిచేవారు. అన్ని రాష్ట్రాలపై ఇతడు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించేవాడు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలను పర్యవేక్షించడానికి డబీరులు అనే ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు. డబీర్ అంటే పండితుడు అని అర్థం. వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువు ఉండేవాడు. ఇతడు సుల్తాన్ జారీ చేసిన ఫర్మానాలను స్థానిక భాషల్లోకి అనువాదం చేసేవాడు. కొత్వాల్ రక్షక భటాధికారి. రాజ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతడి ప్రధాన విధి.

రాజ్యాన్ని తరఫ్‌లు (రాష్ట్రాలు)గా విభజించారు. అబుల్ హసన్ తానీషా కాలంలో ఆరు తరఫ్‌లు ఉండేవి. వీటిలో తెలంగాణా ప్రాంతం ఒకటి. రాష్ట్రాలను సర్కార్లు(జిల్లాలు)గా, సర్కార్లను పరగణాలు(తాలూకాలు)గా విభజించారు. రాష్ట్రానికి తరఫ్‌దార్ (గవర్నర్) అధిపతి. జిల్లా-తాలూకా అధికార్లను ఫౌజ్‌దార్లు అనేవారు. వీరికి సహాయంగా హవల్దార్లు ఉండేవారు. మచిలీపట్నం లాంటి రేవు పట్టణానికి హవల్‌దార్లు ఉండేవారు. ప్రధాన రేవు అధికారిని షా బందర్ అని పిలిచేవారు. సర్కార్లను సీమలు అని కూడా పిలిచేవారు. బెల్లంకొండ, వినుకొండ, నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైన 22 సీమలు ఉండేవి. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి.

రేవు పట్టణాల్లో షాబందర్, హవల్‌దార్లు సుంకాలు వసూలుచేసేవారు. రాజ్యంలో శిస్తు వసూళ్లను వేలంపాటల ద్వారా అమ్మేవారు. సర్కార్లను కొన్ని ప్రాంతాలుగా విభజించి ఇష్టమైన వారికి శిస్తు వసూలు అధికారాన్ని ఇచ్చేవారు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు లేదా ముగ్గురు మధ్యవర్తులు ఉండటంతో రైతుపై శిస్తుభారం విపరీతంగా పెరిగింది. దేశ్‌పాండే, ఠాణేదార్లు, దేశ్‌ముఖ్‌లు, మజుందార్లు, తలస్‌కర్లి లాంటి వారి పాత్ర నిరంకుశంగా ఉండేది. వీరు గ్రామీణ రైతులను దోచుకు తినేవారు. అబుల్ హసన్ పాలనా కాలంలో మజ్లిస్-ఇ-దివాన్ (ప్రివీ కౌన్సిల్) ఏర్పడింది. ఇది రోజూ క్రమం తప్పకుండా సమావేశం అయ్యేది. ఈ సంఘంలో 20 మంది సభ్యులు ఉండేవారు. వీరికి వేతనాల కింద జాగీర్లు ఇచ్చేవారు.

వాస్తు, స్మారక నిర్మాణాలు

వాస్తుపరంగా విశిష్టమైన కుతుబ్ షాహీ శైలి వెలుగులోకి వచ్చింది. వీరు బహమనీ సుల్తాన్ల వాస్తు విధానాన్నే అనుసరించారు. పెద్ద గుమ్మటాలు, విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఎత్తైన మినార్లు, అష్టకోణాకృతి నిర్మాణాలు ఈ శైలికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. చార్మినార్, చార్‌కమాన్, మక్కామసీదు, టోలీ మసీదు, గోల్కొండ కోట, గోల్కొండ సమాధులు తదితరాలను ముఖ్యమైన వాస్తు కట్టడాలుగా పేర్కొనవచ్చు.

కుతుబ్‌షాహీ మూడో సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మూసీ నదిపై పురానాపూల్ (పాత వంతెన)ను 1578లో నిర్మించారు. ఇతడి కాలంలోనే హుస్సేన్‌సాగర్, బద్వేల్, ఇబ్రహీంపట్నంతో పాటు గోల్కొండ కోటలో ఇబ్రహీం మసీదును నిర్మించారు.

మహమ్మద్ కులీకుతుబ్ షా 1591లో మూసీ నది ఒడ్డున 'చిచలం' గ్రామంలో ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా చార్మినార్‌ను నిర్మించాడు. 1594లో హైదరాబాద్‌లో జమామసీదు, బాదుషాహీ అసూర్ ఖానా (పత్తర్‌గట్టీ), దారుల్‌షిఫా, చార్‌కమాన్ లాంటివాటిని నిర్మించారు. వీటిని రాయి, సున్నంతో నిర్మించారు. మహమ్మద్ కుతుబ్‌షా(1612-26)కాలంలో 1617లో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మక్కామసీదును నిర్మించారు.

కుతుబ్‌షాహీల స్మారక నిర్మాణాలు, గోల్కొండ కోట అంతర్భాగంలో భక్త రామదాసు బందీఖానా, రాణీమహల్, సుల్తానుల మరణానంతరం ఖననానికి ముందు స్నానం చేయించే గదులు నేటికీ ఉన్నాయి. కుతుబ్‌షాహీల సమాధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాస్తు స్మారక నిర్మాణాలు. కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో అత్యంత విశాలమైన మైదానంలో నిర్మించినవి ఇవే. ఒకే రాజవంశానికి చెందిన సుల్తానుల సమాధులన్నీ ఒకే ప్రాంగణంలో నిర్మించడం ప్రపంచచరిత్రలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. సమాధి డోమ్ అంతర్భాగాన్ని కోణాకృతిలో ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో నిర్మించారు.



గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ తూర్పు ఇండియా వర్తక సంఘానికి మచిలీపట్నంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి అనుమతి ఇచ్చినవారెవరు? (గ్రూపు-2, 2008)
జవాబు: అబ్దుల్లా కుతుబ్ షా
2. బీరారు రాజ్యాన్ని స్థాపించిన వంశస్థులు? (గ్రూపు-2, 2005)
జవాబు: ఇమాద్ షాహీలు
3. ఆది మహాదేవుని దేవాలయం సమీపాన జన్మించిన నది ఏది? (గ్రూపు-2, 2005)
జవాబు: గోదావరి
4. భగవద్గీతను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసినవారెవరు? (గ్రూపు-1, 2003)
జవాబు: దారాషికో
5. ప్రాకృత భాషలో సంకలనం చేసిన 'గాథా సప్తశతి' వేటి గురించి వివరిస్తుంది? (సివిల్స్ ప్రిలిమ్స్-2002)
జవాబు: శృంగారగాథలు
6. భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు? (గ్రూపు-2, 2000)
జవాబు: మహమ్మద్‌బిన్ కాశిమ్
7. కిందివాటిలో సరికాని జత ఏది? (నాన్ గెజిటెడ్ జనరల్ స్టడీస్-2005)
ఎ) నిజాం షాహీ - అహమ్మద్‌నగర్
బి) ఆదిల్ షాహీ - బీజాపూర్
సి) కుతుబ్ షాహీ - గోల్కొండ
డి) ఇమాద్ షాహీ - బీదర్
జవాబు: డి
8. కిందివాటిలో మహమ్మద్ కులీకుతుబ్ షా నిర్మించని కట్టడం? (గ్రూప్-1, 2003)
ఎ) గోల్కొండ బి) హైదరాబాద్
సి) చార్మినార్ డి) జమా మసీద్
జవాబు: ఎ
9. 'చార్మినార్'ను దేనికి గుర్తుగా నిర్మించారు? (గెజిటెడ్-2005)
జవాబు: ప్లేగు వ్యాధి నిర్మూలనలో విజయం
10. ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం? (గెజిటెడ్-2005)
జవాబు: క్రీ.శ. 1687

What is the position of B with respect to F?

Bank Exams

REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 6): Study the following information carefully and answer the given questions.

Six persons - A, B, C, D, E and F stay on different floors of a six-storey building (ground floor is numbered as floor 1 and top floor is numbered as floor 6). Each of them is in a different profession, viz Doctor, Engineer, Lawyer, Architect, Journalist and Teacher. D is a lawyer but stays neither on floor 2 nor on floor 5. B is neither an Architect nor a Journalist but stays on floor 6. The Journalist doesn't stay below the floor of the Architect but stays below the floor of the Engineer. The Teacher stays either on floor 1 or on floor 4. E doesn't stay on an odd-numbered floor. A, who stays on floor 4, is either a Journalist or an Architect. Either C or F is an Engineer.

1. If F stays on floor 1, what is the profession of C?
1) Lawyer 2) Engineer 3) Teacher 4) Architect
5) Can't be determined
2. Who stays on floor 3?
1) Engineer 2) Lawyer
3) Doctor 4) Architect
5) Teacher
3. Which of the following combinations is definitely true?
1) C – Teacher – Floor 1
2) D – Lawyer – Floor 5
3) E – Architect – Floor 2
4) F – Engineer – Floor 5
5) None of these
4. Which of the following combinations is definitely false?
1) A – Journalist – Floor 2
2) B – Doctor – Floor 6
3) E – Architect – Floor 2
4) D – Lawyer – Floor 3
5) None of these
5. If the Journalist stays on Floor 2 (ignoring the position of Architect), which floor will the Engineer stay on?
1) 1 2) 5 3) 4 4) 6
5) Can't say exactly

Directions (Q. No. 6 -10): Study the following information carefully and answer the given questions.



Eight friends - A, B, C, D, E, F, G and H are sitting around a square table in such a way that four of them sit at four corners of the table while the other four sit in the middle of the four sides. Those who sit in the middle of the four sides face the centre while those who sit at the four corners face outside. A sits third to the left of C, who does not sit at any of the corners. E sits to the left but not on the immediate left of F, who is not an immediate neighbour of C. B and H are the immediate neighbours of neither each other nor of A and D respectively. D does not sit in the middle of any sides and at least two persons can sit between A and D. E and G sit opposite each other but do not face each other. F cannot sit opposite C.

6. Who among the following sits third to the left of H?
1) B 2) G 3) D 4) C
5) None of these
7. What is the position of B with respect to F?
1) Third to the left
2) Third to the right
3) Fourth to the left
4) Second to the right
5) None of these
8. Who among the following represent the immediate neighbours of F?
1) HG 2) GA 3) BE
4) AH 5) None of these
9. If they all are rearranged clockwise in alphabetical order starting from A (A retains his original position), which of the following would retain his original position?
1) H 2) G 3) D 4) E
5) None of these
10. Who among the following sits exactly between D and G?
1) B 2) H 3) F 4) C
5) None of these

Directions (Q. No. 11-15): Study the following information carefully and answer the given questions.

A word arrangement machine when given an input line of words rearranges them following a particular rule. The following is an illustration of input and rearrangement.

Input: cry arm lemon own wind ice under vague top earn
Step I: under cry arm lemon own ice vague top earn wind
Step II: under own cry arm lemon ice top earn vague wind
Step III: under own ice cry arm lemon earn top vague wind
Step IV: under own ice earn cry arm lemon top vague wind
Step V: under own ice earn arm cry lemon top vague wind
Step V: is the last step

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input for the questions:
Input: knife axe harm utility yellow orange sugar ice eat zone dip

11. Which of the following will be the last step of the rearrangement?
1) IV 2) V 3) VI 4) VII
5) None of these
12. In step IV, which of the following words would be at 6^{th} position from the right?
1) axe 2) dip 3) harm
4) knife 5) None of these
13. Which of the following is step III of the rearrangement?
1) utility orange ice eat axe harm dip knife sugar yellow zone
2) utility orange knife axe harm sugar ice eat dip yellow zone
3) utility orange ice knife axe harm eat dip sugar yellow zone
4) utility ice orange eat knife axe harm dip sugar yellow zone
5) None of these
14. In step IV of the rearrangement, if "dip" is related to "axe" and "knife" is related to "harm" in acertain way, which of the following would "axe" be related to, following the same pattern?
1) ice 2) eat 3) dip
4) sugar 5) None of these
15. Following pairs follow a certain relationship in step IV and step V. First element of the pair is from step IV and second element is from step V. Which of the following pairs is different from the others?
1) axe, eat 2) knife, harm
3) ice, orange 4) yellow, zone
5) All are same

Directions (Q. No. 16-20): Below in each question are given two statements (A) and (B). These statements may be either independent causes or may be effects of independent causes or a common cause. One of these statements may be the effect of the other statement. Read both the statements and decide which of the following answer choice correctly depicts the relationship between these two statements. Mark answer:
1) If statement A is the cause and statement B is its effect
2) If statement B is the cause and statement A is its effect
3) If both the statements A and B are independent causes
4) If both the statements A and B are effects of independent causes.
5) If both the statements A and B are effects of some common cause

16. **A:** The health department has advised people to drink boiled and filtered water and maintain hygiene during the monsoon.
B: The health department has instructed the civic hospital to equip themselves with adequate stock of medicines during monsoon.
17. **A:** The Sate Education Board has decided to do away with preparing merit lists for SSC and HSC examinations.
B: A large number of students scored very high marks in the recently held SSC examination.
18. **A:** The State Government decided to grant permission for opening more junior colleges in the state.
B: Percentage of qualified students in SSC examination was higher this year compared to the past few years.
19. **A:** Increase in rainfall and rising flood situations are frequent for the past few years.
B: Children like going out in heavy rains.
20. **A:** The Government has made it compulsory to wear a helmet for the riders of two-wheelers.
B: The number of cases of road accidents involving two-wheelers has been increasing every year.

Key & Solutions

(1- 5):


Person	Profession	Floor
B	Doctor	6
C/F	Engineer	5
A	Journalist	4
D	Lawyer	3
E	Architect	2
F/C	Teacher	1

1. If F stays on floor 1, C will stay on floor 5 and then he will be the Engineer by profession. **Ans: 2**

2. 2; **3.** 3; **4.** 1;

5. According to the given condition, the Journalist must stay below the floor of the Engineer. So, if the Journalist stays on floor 2, the condition is not violated. Therefore, the Engineer keeps on staying on floor 5, ie his original position. **Ans: 2**

(6 - 10):



6. 3; **7.** 3; **8.** 2;

9. Only G retains his original position. **Ans: 2**
10. C sits exactly between D and G. **Ans: 4**

(11 - 15): The machine rearranges the words starting with vowel in reverse alphabetical order and words starting with consonant also in reverse alphabetical order. In each step one word starting with vowel gets arranged in reverse alphabetical order from left end towards right end, whereas one word starting with consonant gets arranged from right end towards left end. This process is repeated till the final arrangement.

Input: knife axe harm utility yellow orange sugar ice eat zone dip
Step I: utility knife axe harm yellow orange sugar ice eat dip zone
Step II: utility orange knife axe harm sugar ice eat dip yellow zone
Step III: utility orange ice knife axe harm eat dip sugar yellow zone
Step IV: utility orange ice eat axe harm dip knife sugar yellow zone
Step V: utility orange ice eat axe dip harm knife sugar yellow zone

11. 2; **12.** 3; **13.** 3; **14.** 1;

15. Except option (4) in all other options, pairs are as (n + 1)[th] element of step IV and n[th] element of step V. **Ans: 4**
16. Clearly, both the statements are the effects of common cause: "the possibility of outbreak of diseases during monsoon". **Ans: 5**
17. As large number of students scored high marks, preparing merit lists has lost its relevance. **Ans: 2**
18. Large number of students qualifying in SSC exam has necessitated the opening of more junior colleges. **Ans: 2**
19. A is the effect of severe climatic changes. But B indicates regular happening since time immemorial. **Ans: 4**
20. The increase in accidents every year has led the government to make wearing the helmet mandatory. **Ans: 2**